www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

వేటు పడింది!



నిబంధనలు అతిక్రమించి బీఆర్ఎస్ సమావేశానికి హాజరు
106 మంది సెర్ప్, ఈజీఎస్ ఉద్యోగుల సస్పెన్షన్ 13
ఫ్లయింగ్ స్క్వాడ్ ఫిర్యాదుతో సిద్దిపేట కలెక్టర్ చర్య
సస్పెండైనవారిలో 14 మంది ఏపీఎంలు, 18 మంది సీసీలు
38 మంది టెక్నికల్ అసిస్టెంట్లు, 18 మంది సీవోలు

బుధవారం | 10-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 11
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: విదియ సా. 5.33 తదుపరి తదియ; నక్షత్రం: భరణి తె. 3.05 తదుపరి కృత్తిక; వర్జ్యం: మ. 1.53 -3.21; దుర్ముహూర్తం: ఉ. 11.51-12.41; అమృతఘడియలు: రా. 10.41-12.09; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.06; సూర్యాస్తమయం: 6.26
వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

తిరుగులేని రేవంత్!

సంవత్సరం దాకా ఆయనకు ఎదురు లేదు
లోక్‌సభ ఎన్నికల్లోనూ రేవంత్‌కు సత్ఫలితాలు
తెలుగు రాష్ట్రాల్లో గత ప్రభుత్వాల్లోని స్కాంలు
బయటపడతాయి.. కొందరికి శిక్షలు ఖాయం
ఎన్నికల నాటికి రాహుల్‌కు మంచి రోజులు!
2026 ఏప్రిల్-ఆగస్టు మధ్యలో ప్రధాని పదవిలో
ఆకస్మిక మార్పులు.. గాంధీభవన్‌లో పంచాంగం

14



కేంద్రంలో మళ్లీ మోదీనే!

ప్రస్తుత ప్రభుత్వానికి గురువు అనుగ్రహం
ఎన్నికల తర్వాత దేశంలో సుస్థిర సర్కారు
దేశీయ ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు
దానికి అనుగుణంగా వృద్ధి రేటు పెరుగుదల
పంటలకు తగిన వర్షాలు కురుస్తాయి 14
నిలకడగా ఆహార ధాన్యాల ధరలు
బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పంచాంగ శ్రవణం

మాటతో తంటాలు!

మృదువుగా.. ఆచితూచి మాట్లాడాలి
దెబ్బతీసే ఆలోచనలో సన్నిహితులు..
కొంత నష్టం.. జాగ్రత్తగా ఉండాలి
కేటీఆర్‌ను ఉద్దేశిస్తూ పంచాంగ పఠనం
జ్యోతిర్లింగ దర్శనంతో సమస్యలకు చెక్
లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు సత్ఫలితాలు
కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో ఉగాది వేడుకలు

14





ట్యాపింగ్ కేసులో 10 మంది పైగా
బీఆర్ఎస్ నేతలు!

విచారణలో రాధాకిషన్‌రావు వెల్లడి!!

ఎవరెవరు ఏయే ఆదేశాలిచ్చారో పూసగుచ్చినట్లు వివరణ
టాస్క్‌ఫోర్స్‌లో చేసిన అవకతవకలపైనా ప్రశ్నలు
న్యాయనిపుణులతో చర్చించి.. 200 ప్రశ్నల చిట్టా
కీలకమైన వాటికి జవాబులు రాబట్టిన దర్యాప్తు అధికారులు
నేటితో ముగియనున్న రాధాకిషన్ పోలీస్ కస్టడీ
ముందస్తు బెయిల్ ఆలోచనలో ప్రభాకర్‌రావు
న్యాయ నిపుణులతో ఎస్ఐబీ మాజీ చీఫ్ చర్చలు!
ప్రణీత్‌రావు ఉపయోగించిన ద్విచక్ర వాహనం సీజ్
ఈ కేసులో వచ్చేవారం కీలక మలుపులు!!

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఇంతకాలం పోలీసు అధికారుల చుట్టూ తిరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసు.. టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఎస్డీ) రాధాకిషన్‌రావు విచారణతో కీలక మలుపు తిరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో అప్పటి స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) చీఫ్ ప్రభాకర్‌రావు కీలక పాత్రధారిగా సాగిన ఈ వ్యవహారంలో సూత్రధారుల డొంక కదిలింది. బీఆర్ఎస్‌కు చెందిన 10 మందికి పైగా నేతలు ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించినట్లు రాధాకిషన్‌రావు విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది. కేసు దర్యాప్తు చేస్తున్న పంజాగుట్ట పోలీసులు నాంపల్లి కోర్టు అనుమతితో రాధాకిషన్‌రావును ఏడు రోజుల కస్టడీకి తీసుకున్న విషయం తెలిసిందే. బుధవారంతో రాధాకిషన్ కస్టడీ ముగియనుంది. మొదటి రెండ్రోజులు వ్యక్తిగత జీవితం, సర్వీస్, ఎస్ఐబీలో ప్రత్యేక టీంలలో ఎవరెవరు పనిచేసేవారు? ఫోన్‌ట్యాపింగ్ జట్టు ఎవరితో కలిసి పనిచేసేది? ఎస్ఐబీలో ఉన్న

మిగతా 3వ పేజీలో...

సీఎం అయితే.. అరెస్టు చేయొద్దా?



ముఖ్యమంత్రి అయినంత మాత్రాన కేజ్రీవాల్‌కు ప్రత్యేక హక్కులుండవు

ఎన్నికల బాండ్లు ఎవరు కొంటే మాకేంటి?
ఎవరికి టికెట్ వస్తే మాకు సంబంధమేంటి?
మేము న్యాయ సూత్రాలను పరిశీలిస్తాం
ఈ కేసు మీకు-కేంద్రానికి మధ్య కాదు
ఈడీకి మీకు మధ్య జరుగుతున్న కేసు
అప్రూవర్‌ను అనుమానిస్తే కోర్టు,
జడ్జిపై అనుమానం వ్యక్తం చేసినట్లే
ఆప్ కన్వీనర్ హోదాలోనూ కుట్రకు పాల్పడ్డారు!
ఈడీ అన్ని ఆధారాలను సమర్పించింది
గోవా ఎన్నికల్లో డబ్బుల చేరవేతను వివరించింది
కేజ్రీవాల్ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యలు
అరెస్టుపై పిటిషన్ కొట్టివేసిన న్యాయమూర్తి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో తన అరెస్టును సవాలు చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. దీనిపై మంగళవారం సుదీర్ఘంగా వాదోపవాదాలు జరిగాయి. ఈ సందర్భంగా కేజ్రీవాల్ తీరును హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ తీవ్రంగా తప్పుబడుతూ.. ఘాటైన వ్యాఖ్యలు చేశారు. 'కేజ్రీవాల్ ముఖ్యమంత్రి అయితే.. అరెస్టు చేయొద్దా? ముఖ్యమంత్రికి ప్రత్యేక హక్కులేమీ

మిగతా 2వ పేజీలో...



రౌజ్ ఎవెన్యూ కోర్టు వద్ద కవిత

3

నేను బాధితురాలిని

ఢిల్లీ మద్యం కేసుతో సంబంధం లేదు
నాకు ఎలాంటి ఆర్థిక లబ్ధి చేకూరలేదు
సాక్షులను బెదిరిస్తున్నాననడం అబద్ధం
బీజేపీలో చేరితే విచారణ ఆగుతోంది
తిహాడ్ జైలు నుంచి ఎమ్మెల్సీ కవిత లేఖ
మరో 14 రోజులు రిమాండ్ పొడిగింపు

విజిలెన్స్ డీజీ రాజీవ్ రతన్
ఆకస్మిక మృతి

ఛాతీ నొప్పితో ఆస్పత్రికి.. చికిత్స పొందుతూ మృతి

కొవిడ్ సమయంలోనే తీవ్ర అస్వస్థత.. గుండెకు స్టెంట్
1991 బ్యాచ్ ఐపీఎస్.. విశాఖ, కరీంనగర్‌లో ఎస్పీగా,
హైదరాబాద్ ఐజీగా, అగ్నిమాపక శాఖ డీజీగా సేవలు
కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక విజిలెన్స్ డీజీగా నియామకం
ఈయన నేతృత్వంలోనే మేడిగడ్డ బ్యారేజ్‌పై విచారణ
రాజీవ్ రతన్ మృతికి గవర్నర్, సీఎం సంతాపం



హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ రాజీవ్ రతన్ గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం ఉదయం ఆయనకు ఛాతీలో నొప్పిగా ఉండటంతో చికిత్స నిమిత్తం రాయదుర్గంలోని ఓ ప్రముఖ ఆస్పత్రికి తరలించారు. గుండెపోటుగా నిర్ధారించిన వైద్యులు చికిత్స చేస్తుండగా.. కొద్దిసేపటికి మృతిచెందారు. రాజీవ్‌రతన్ కొవిడ్ సమయంలోనే తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అప్పట్లోనే ఆయనకు గుండె సమస్య ఎదురవ్వగా.. వైద్యులు స్టెంట్ వేశారు. ఆ తర్వాత ఆయన ఆరోగ్యపరంగా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత రాజీవ్‌రతన్‌ను విజిలెన్స్ డీజీగా నియమించారు. ఆయన నేతృత్వంలోనే మేడిగడ్డ బ్యారేజ్‌పై విచారణ కొనసాగుతోంది. కాగా.. రాజీవ్‌రతన్ పంజాబ్‌కు చెందినవారు. డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ ఇండియన్ మిలటరీ కాలేజ్(ఆర్ఐఎంసీ)లో విద్యనభ్యసించారు. 1991 బ్యాచ్ ఐపీఎస్ అధికారిగా విధుల్లో చేరిన రాజీవ్ రతన్.. కామారెడ్డి ఏఎస్పీగా, విశాఖపట్నం

మిగతా 3వ పేజీలో...

కాళేశ్వరం విచారణలో జాప్యం!

రాజీవ్ రతన్ అకాల మరణంతో ప్రభావం 3
కొత్త డీజీ నియామకం తర్వాతే ప్రభుత్వానికి నివేదిక

67 పట్టణాలు, 2 కార్పొరేషన్లలో తీవ్ర నీటి సమస్య

13

వేసవి ముగిసే వరకూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టిసారించిన సర్కారు
పదిమంది ఐఏఎస్‌ల నియామకం
కలెక్టర్లకు రూ.100 కోట్ల నిధులు



నీరే బంగారమాయె..

కొన్నిచోట్ల 5 వేల లీటర్ల ట్యాంకర్ ధర రూ.3 వేలకు పైగానే!
జీహెచ్ఎంసీ, ఔటర్ పరిధిలో పాతాళానికి భూగర్భ జలాలు
నీటి ఎద్దడితో గ్రేటర్ హైదరాబాద్‌లో అక్రమ జల వ్యాపారం
చెరువుల పక్కన, ఖాళీ ప్లాట్లలో.. ఎక్కడపడితే అక్కడ బోర్లు
డిమాండ్‌ను బట్టి నీటి రేట్లు పెంచేసి.. వ్యాపారుల దోపిడీ
తక్కువ ధరకొచ్చే వాటర్‌బోర్డు ట్యాంకర్లకు భారీ బుకింగ్‌లు
రోజూ 10వేల బుకింగ్‌లు.. 7800కు పైగా ట్యాంకర్ల సరఫరా
బుక్ చేసిన 4-5 రోజుల దాకా.. ట్యాంకర్లు రాక ఆందోళన
త్వరలోనే.. బుక్ చేసిన 12 గంటల్లో సరఫరా: అధికారులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎండలు ఇంకా ముదరక ముందే.. భూగర్భ జలాలు పాతాళానికి పడిపోయి.. ఇళ్లల్లో బోరుబావులు అడుగంటిపోవడంతో రాష్ట్రం దాహం దాహం అంటోంది! గత ఏడాది వర్షపాతం తగినంతగా లేకపోవడంతో.. వేసవి తొలిదశలోనే చాలాచోట్ల బోర్లు చుక్క నీరు లేకుండా ఇంకిపోయాయి. మరీ ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ నగర పరిధిలో బకెట్ నీళ్లు దొరకడమే బంగారంగా మారడంతో.. ట్యాంకర్లకు గిరాకీ పెరిగింది. దీంతో.. పొద్దున, మధ్యాహ్నం, సాయంత్రం, అర్ధరాత్రి.. అన్న తేడా లేకుండా, అన్ని వేళలా ట్యాంకర్లు తిరుగుతూ కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితిని సొమ్ము చేసుకునేందుకు అక్రమార్కులు రంగంలోకి దిగారు. చెరువుల పక్కన, ఖాళీ ప్లాట్లలో.. ఇలా ఎక్కడ పడితే అక్కడ బోర్లు వేసేసి, కోట్ల కొద్దీ

మిగతా 13వ పేజీలో...

వాన వస్తుందోచ్!

రాష్ట్రానికి వర్ష సూచన
వచ్చే 5 రోజుల్లో అక్కడక్కడా
నేడు, రేపు 35-39 డిగ్రీలే
రైతాంగానికి తీపికబురు!
నైరుతిలో సాధారణ వర్షపాతం
ద్వితీయార్థంలో అధిక వర్షాలు
ప్రైవేటు సంస్థ స్కైమెట్ అంచనా

దొంగలు పోయి.. గజదొంగలు వచ్చారు

ప్రజలు, బిల్డర్లు, కాంట్రాక్టర్ల నుంచి ఆర్ ట్యాక్స్
ఖజానాలో నిధుల్లేవు.. హామీలపై కార్యాచరణ లేదు
6 గ్యారంటీలపై ప్రజలకు రాహుల్ వెన్నుపోటు
బీఆర్ఎస్, కాంగ్రెస్ డీఎన్ఏ ఒకటే: కిషన్‌రెడ్డి



కిషన్‌రెడ్డికి తిలకం దిద్దుతున్న పంచాగకర్త

హైదరాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కేసీఆర్ కుటుంబం వారి స్వార్థం కోసం తెలంగాణను వాడుకుందని, అలాంటి దొంగలు పోయి గజదొంగలు వచ్చినట్లుగా.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల నుంచి ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తోందని.. బిల్డర్లు, కాంట్రాక్టర్లు సహా ఎవరినీ వదలడం లేదని దుయ్యబట్టారు. దీంతో పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడినట్లు అయిందని పేర్కొన్నారు. రూ.2 లక్షల రుణ మాఫీ హామీకి దిక్కు లేదని, రైతు కూలీలు, కౌలు రైతులకు సీఎం రేవంత్ ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారో చెప్పకుండా తుక్కుగూడలో రాహుల్ కొత్త హామీలు ఇచ్చి వెళ్లారని విమర్శించారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాజీ మంత్రి ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే పండరి సహా నల్లగొండ, జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాలకు చెందిన పలువురు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ 6 గ్యారంటీలపై రాహుల్ గాంధీ తెలంగాణ ప్రజలకు వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లోనూ మోసం చేసేందుకు సిద్ధమయ్యారని.. ప్రజలు

మిగతా 12వ పేజీలో...



11

చార్జీలు విమానం మోత

20 నుంచి 25 శాతం వరకు పెరిగిన టికెట్ రేట్లు
విస్తారా సర్వీసులు రద్దు, వేసవి గిరాకీయే కారణం
గోఫస్ట్ దివాలా, ఇండిగో విమానాలు లేక ప్రభావం

అమెరికాలో కిడ్నాపైన.. హైదరాబాదీ విద్యార్థి మృతి

చదువుకోసం క్లీవ్‌ల్యాండ్‌కు అర్ఫాత్
మార్చి 7న అపహరించిన దుండగులు
1200 డాలర్లు డిమాండ్ చేస్తూ ఫోన్
సరిగ్గా నెల తర్వాత విగతజీవిగా..
క్లీవ్‌ల్యాండ్‌లోనే మృతదేహం గుర్తింపు
సమగ్ర దర్యాప్తు కోరతాం: ఎంబసీ
మృతదేహాన్ని తరలించడానికి సాయం



3

అబ్దుల్ అర్ఫాత్



నా పన్ను పరిధి ఆదాయం 680!

అఫిడవిట్‌లో కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్
ప్రకటించిన ఆస్తులకు, వాస్తవాలకు పొంతన లేదు
కేంద్ర ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు 2
అఫిడవిట్‌ను సమీక్షించండి: సీబీడీటీకి ఈసీ ఆదేశం

బందీల్లో 40 మంది మృతి

తొలిసారిగా అంగీకరించిన ఉగ్ర సంస్థ హమాస్
అక్టోబరులో 253 మంది ఇజ్రాయెలీల కిడ్నాప్
చెరలోనే 133 మంది.. వీరిలో పిల్లలు, మహిళలు
6 వారాల పాటు కాల్పుల విరమణకు సీఐఏ చొరవ



2

ఇజ్రాయెల్ దాడుల్లో దెబ్బతిన్న భవనం వద్ద గాజా మహిళలు

ఇజ్రాయెల్ బందీల్లో 40 మంది మృతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: ఇజ్రాయెల్-హమాస్‌ల మధ్య కాల్పుల విరమణ కోసం ప్రయత్నాలు చేస్తున్న అమెరికా గూఢచారి సంస్థ సీఐఏకు చేదు వార్త అందింది. తాము బందీలుగా తీసుకున్న వారిలో కనీసం 40 మంది ఇజ్రాయెల్ వాసులు మరణించారని తొలిసారిగా హమాస్ సమాచారం అందించింది. గత ఏడాది అక్టోబరు 7వ తేదీన హమాస్ 253 మంది ఇజ్రాయెల్ వాసులను అపహరించి బందీలుగా ఉంచుకొంది. ప్రస్తుతం 133 మంది బందీలుగా ఉండగా వారిలో మానవత దృక్పథకం కింద తొలివిడతగా 40 మందిని విడిపించాలని సీఐఏ ప్రతిపాదించింది. ప్రతిగా ఇజ్రాయెల్ జైలులో ఉన్న 700 మంది పాలస్తీనా ఖైదీలను విడిపించాలని, ఆరు వారాల పాటు కాల్పుల విరమణ కొనసాగేంచేలా చూసేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. సీఐఏ డైరెక్టర్ బిల్ బర్న్స్ ఆదివారం కైరోలో ఇజ్రాయెల్ నిఘా విభాగం మొస్సాద్ అధిపతి, ఈజిప్టు గూఢచారి సంస్థ చీఫ్, కతర్ ప్రధానిలతో భేటీ అయి కాల్పుల విరమణపై చర్చలు జరిపారు. అదే సమయంలో హమాస్ సంస్థ సీనియర్ ప్రతినిధులు ఈజిప్టు, ఖతార్‌లకు చెందిన మధ్యవర్తులతో సంప్రదింపులు జరిపారు.

పన్ను పరిధిలోకొచ్చే ఆదాయం రూ.680!

» కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ అఫిడవిట్‌పై దుమారం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ దాఖలు చేసిన అఫిడవిట్‌లో 2021-22 సంవత్సరానికి గాను పన్ను పరిధిలోకి వచ్చే తన ఆదాయం రూ.680 మాత్రమేనని ప్రకటించడంపై దుమారం రేగింది. తిరువనంతపురం బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన కేంద్ర మంత్రి తన ఆర్థిక స్థితిగతులపై ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చారని కాంగ్రెస్ ఈసీకి ఫిర్యాదు చేసింది. దీంతో మంత్రి సమర్పించిన అఫిడవిట్‌లోని వివరాలను సమీక్షించాలని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు(సీబీడీటీ)ను ఈసీ మంగళవారం ఆదేశించింది. ఎన్నికల అఫిడవిట్లలో అభ్యర్థులు తప్పుడు సమాచారాన్ని ఇవ్వడం ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 125ఏ ప్రకారం నేరం. దీనికి ఆరు నెలల వరకూ జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించవచ్చని ఈ చట్టం నిర్దేశిస్తోంది.

అభ్యర్థులు ప్రతి చరాస్తి వివరం చెప్పనక్కర్లేదు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ప్రైవసీ హక్కు ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వ్యక్తిగతంగా కలిగి ఉన్న చిన్నాచితకా ఆస్తుల వివరాలన్నింటినీ వెల్లడించాల్సిన పనిలేదని తెలిపింది. అభ్యర్థి ఆర్థిక స్థితిగతులు ఏమిటో ప్రజలకు తెలిసేలా ముఖ్యమైన ఆస్తుల వివరాలను వెల్లడిస్తే సరిపోతుందని తీర్పు చెప్పింది. 2019లో అరుణాచల్‌ప్రదేశ్‌లోని 44-తేజు నియోజకవర్గం నుంచి కరిఖో ఇండిపెండెంటుగా గెలిచారు. అయితే, ఆయన తన మూడు వాహనాల వివరాలను అఫిడవిట్‌లో పొందుపరచలేదని ప్రత్యర్థులు హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఆ మూడు వాహనాలను గతంలోనే అమ్మేశానని ఆయన కోర్టుకు తెలిపారు. కానీ, మొత్తం చరాస్తుల వివరాలను వెల్లడించలేదని గతేడాది జులైలో ఆయన ఎన్నిక చెల్లదంటూ తీర్పు ఇచ్చింది. దీనిపై కరిఖో సుప్రీంకోర్టుకు వెళ్లారు.

సుప్రీంకోర్టుకు 'పతంజలి' బేషరతు క్షమాపణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇవ్వొద్దన్న ఆదేశాలను అమలు చేయనందుకు 'పతంజలి' సంస్థ సుప్రీంకోర్టుకు బేషరతుగా క్షమాపణలు చెప్పింది. ఈ మేరకు పతంజలి సంస్థ వ్యవస్థాపకులు యోగా గురు బాబా రామ్‌దేవ్, మేనేజింగ్ డైరెక్టర్ ఆచార్య బాలకృష్ణలు శనివారం తగిన పద్ధతిలో సుప్రీంకోర్టుకు అఫిడవిట్లు సమర్పించారు. వీటిని బుధవారం ధర్మాసనం పరిశీలించనుంది. ఈ సందర్భంగా జరిగే విచారణకు వారిద్దరూ హాజరు కానున్నారు.

నెట్‌వర్క్ లేకున్నా ఫోన్ జాడ తెలుసుకోవచ్చు!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: ఫోన్ పోతే.. 'ఫైండ్ మై డివైజ్' అనే ఆప్షన్ సాయంతో అది ఎక్కడుందో కనుక్కునే అవకాశం ఉంది. కానీ, దాంట్లో ఓ చిక్కు కూడా ఉంది. మన ఫోన్‌లో ఇంటర్‌నెట్ కనెక్షన్ యాక్టివ్‌గా ఉండాలి. అలా ఇంటర్‌నెట్ లేకున్నా కూడా.. పోయిన మన ఫోన్ ఎక్కడుందో గుర్తించేలా గూగుల్ సంస్థ 'ఫైండ్ మై డివైస్ నెట్‌వర్క్'ను అప్‌గ్రేడ్ చేసింది. ఆండ్రాయిడ్ 9 ఆపై ఆపరేటింగ్ సిస్టమ్‌తో నడిచే ఫోన్లన్నింటిలో ఈ అప్‌గ్రేడెడ్ వెర్షన్ పనిచేస్తుంది. నిజానికి యాపిల్ గతంలోనే ఈ ఆప్షన్‌ను తన వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది. ఇంటర్‌నెట్ లేకున్నా.. ఫోన్లలో ఉండే బ్లూటూత్ ప్రాగ్జిమిటీ ఆధారంగా పోయిన ఫోన్ లొకేషన్‌ను గుర్తించే టెక్నాలజీ అది. గూగుల్ కూడా ఆ విధానాన్నే అందుబాటులోకి తెచ్చింది.

ఈద్ రేపు.. కేరళ, లద్దాఖ్‌లలో నేడే పండుగ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: షవ్వల్ నెలవంక దర్శనం కాకపోవడంతో దేశవ్యాప్తంగా ఈదుల్ ఫితర్ వేడుకలు గురువారం జరగనున్నాయి. ఈ మేరకు ఢిల్లీ ఫతేపూర్ మసీద్ ఇమామ్ ముఫ్తీ ముకర్రమ్ అహ్మద్ మంగళవారం వెల్లడించారు. దేశంలో ఎక్కడైనా నెలవంక కనిపించిందా అని తాము వివిధ రాష్ట్రాలను సంప్రదించామని అయితే ఎక్కడా చంద్రుడి జాడ కనిపించకపోవడంతో గురువారం ఈదుల్ ఫితర్ జరిపేందుకు నిశ్చయించామని తెలిపారు. బుధవారం యథావిధిగా 30వ రోజు ఉపవాస దీక్షలు కొనసాగుతాయని ఆయన చెప్పారు. అయితే కేరళ, లద్దాఖ్‌లలోని ముస్లిం పెద్దలు మంగళవారం నెలవంక కనిపించిందని చెప్పడంతో ఆయా ప్రాంతాల్లో బుధవారమే ఈదుల్ ఫితర్ వేడుకలు జరగనున్నాయి.

మన ఆయువు 8 ఏళ్లు పెరిగింది

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గడచిన మూడు దశాబ్దాల్లో భారతీయుల జీవితకాలం 8 ఏళ్లు పెరిగిందని ఓ అధ్యయనంలో వెల్లడైంది. 1990తో పోల్చితే 2021 నాటికి ప్రపంచ వ్యాప్తంగా మనుషుల ఆయుర్దాయం సగటున 6.2 ఏళ్లు పెరిగినట్లు పరిశోధనలో బయటపడింది. గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ చేసిన ఈ పరిశోధన వివరాలను లాన్సెట్ జర్నల్ వెల్లడించింది. డయేరియా, శ్వాసకోశ వ్యాధులు, గుండె పోటుల కారణంగా సంభవించే మరణాలు తగ్గడంతో పాటు కొవిడ్ సమయంలో తీసుకున్న జాగ్రత్త చర్యలు జీవిత కాలం పెరగడానికి కారణమని అధ్యయనంలో తేలింది. కరోనా వల్ల 2019-2021 మధ్య కాలంలో ప్రపంచ వ్యాప్తంగా 1.6 ఏళ్ల జీవితకాలం తగ్గినట్లు అధ్యయనం వెల్లడించింది.

ఈ నైరుతిలో సాధారణ వర్షపాతం: స్కైమెట్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: ఈ ఏడాది నైరుతి సీజన్‌లో సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నాయని, సీజన్ ద్వితీయార్థంలో అధిక వర్షపాతం నమోదవుతుందని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ అంచనా వేసింది. ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబరు వరకు దీర్ఘకాలిక సగటు(ఎల్‌పీఏ) 868.6 మిల్లీమీటర్లలో 102% (5 శాతం అటూఇటుగా) వర్షపాతం నమోదవుతుందని తెలిపింది. దక్షిణ, పశ్చిమ, వాయవ్య ప్రాంతాల్లో మంచి వర్షాలు కురుస్తాయని పేర్కొంది. అయితే తూర్పు రాష్ట్రాలైన బిహార్, జార్ఖండ్, ఒడిసా, పశ్చిమ బెంగాల్‌లో జులై, ఆగస్టు నెలల్లో లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఈ సీజన్ తొలి అర్ధభాగంలో ఈశాన్య రాష్ట్రాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని స్కైమెట్ ఎండీ జతిన్ సింగ్ వెల్లడించారు. ఎల్‌నినో పరిస్థితులు తగ్గుముఖం పట్టడం, యూరేసియాలో మంచు కురవడం తగ్గడంతో ఈ ఏడాది రుతుపవనాల సీజన్‌లో సానుకూలంగా ఉండొచ్చని భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) శాస్త్రవేత్తలు కూడా అంచనావేశారు. ఎల్‌నినో సంవత్సరమైన 2023 నైరుతి సీజన్‌లో భారత్‌లో సాధారణ వర్షపాతం 868.6 మిల్లీమీటర్లకు గానూ 820 మిల్లీమీటర్ల వర్షపాతమే నమోదైంది. అంతకుముందు కూడా వరుసగా నాలుగేళ్లపాటు దేశంలో నైరుతి సీజన్‌లో సాధారణం, సాధారణం కంటే లోటు వర్షపాతమే నమోదైంది.

ఔరా.. బాలికా!



చిత్రంలో కనిపిస్తున్న, హరియాణాకు చెందిన ఈ చిన్నారి పేరు అర్షియా గోస్వామి. వయస్సు 9ఏళ్లు. ఆమె 75 కేజీల బరువును ఎత్తి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. 2021లో ఆరేళ్ల వయసులోనే 45 కేజీలు ఎత్తిన అర్షియా.. 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకుంది. తాజాగా 75 కేజీల బరువును ఎత్తిన వీడియోను సోషల్ మీడియాలో పంచుకొంది.

సీఎం అయితే.. అరెస్టు చేయొద్దా?

(మొదటి పేజీ తరువాయి)

ఉండవు. లోక్‌సభ ఎన్నికల సమయాన్ని బట్టి.. ఆయన అరెస్టు గురించి కోర్టు పట్టించుకోదు. చట్టం, న్యాయం ప్రకారమే ఆయన రిమాండ్‌ను పరిశీలిస్తాం. న్యాయమూర్తులుగా మేము చట్టానికి కట్టుబడి ఉంటాం. మా తీర్పులు న్యాయ సూత్రాలకు అనుగుణంగా ఉంటాయి. అంతేతప్ప.. రాజకీయాలతో మాకు పనిలేదు. మా తీర్పులు రాజకీయ అవసరాలకు తగ్గట్లుగా ఉండవు" అని ఆమె వ్యాఖ్యానించారు. కింది కోర్టు కేజ్రీవాల్‌ను జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపడం.. ఆ తర్వాత ఈడీ కస్టడీకి ఇవ్వడం.. తిరిగి జైలుకు తరలించడం.. అందుకు సంబంధించిన ఆదేశాలు సరైనవేనని ఆమె స్పష్టం చేశారు. "లిక్కర్ స్కామ్‌లో కేజ్రీవాల్ కుట్రదారుడని ఈడీకి లభించిన సాక్ష్యాధారాలను బట్టి వెల్లడైంది. ఈ కుంభకోణంలో లభించిన మొత్తం(డబ్బు)ను ఉపయోగించడం, దాచడం ద్వారా.. కేజ్రీవాల్ తన నేరాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారు. ఢిల్లీ లిక్కర్ పాలసీని కేజ్రీవాల్ రూపొందించారు. ముడుపులు డిమాండ్ చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు" అని ఆమె గుర్తుచేశారు. దర్యాప్తు నుంచి తప్పించుకోవడానికి కేజ్రీవాల్ చేస్తున్న ప్రయత్నాల వల్ల.. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నవారి కేసుల విచారణపైనా ప్రభావం పడుతుందన్నారు. లోక్‌సభ ఎన్నికలు ఎప్పుడొస్తాయో కేజ్రీవాల్‌కు తెలియదా? అని ప్రశ్నించారు. ఈ కేసులో అప్రూవర్లు బీజేపీకి ఎన్నికల బాండ్లు సమర్పించడం, ఒకరికి టికెట్ దక్కడాన్ని కేజ్రీవాల్ తన పిటిషన్‌లో ప్రస్తావించారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో కేంద్రంలోని అధికార పార్టీ ఢిల్లీలో లబ్ధి పొందేందుకే తనను అరెస్టు చేయించిందని పేర్కొన్నారు. దీనిపైనా జస్టిస్ స్వర్ణకాంత శర్మ తీవ్రంగా స్పందించారు. "రాఘవ్ మాగుంట, శరత్ చంద్రారెడ్డి అప్రూవర్లుగా మారి.. మనీలాండరింగ్ చట్టం, సీఆర్‌పీసీలోని సెక్షన్ 164 కింద ప్రకటనలు చేశారు. అప్రూవర్లకు సంబంధించిన చట్టం వందేళ్లనాటిది. కేవలం కేజ్రీవాల్‌ను ఇరికించేందుకు చేసిన చట్టం కాదు. అప్రూవర్ల ప్రకటనలను అనుమానించడం అంటే.. న్యాయస్థానం, న్యాయమూర్తిపై అనుమానాలు వ్యక్తం చేసినట్లే. ఎన్నికల బాండ్లు ఎవరు కొన్నారు? ఎవరికి టికెట్ లభించింది? అన్నదానితో మాకు ప్రమేయం లేదు. చట్టం, న్యాయ సూత్రాల మేరకే మేం పనిచేస్తాం. రాజకీయాలతో మాకు సంబంధం లేదు. దర్యాప్తు ఎలా జరగాలనేదాన్ని నిర్ణయించాల్సింది నిందితుడు కాదు. ఆయన(కేజ్రీవాల్) సౌకర్యాలకు అనుగుణంగా దర్యాప్తు జరగదు. అప్రూవర్లపై అపనమ్మకం ఉంటే.. క్రాస్ ఎగ్జామినేషన్ చేసుకోవచ్చు. ఈ కేసు కేజ్రీవాల్‌కు-కేంద్రానికి మధ్య కాదు. కేజ్రీవాల్‌కు-ఈడీకి మధ్య సాగుతోంది" అని ఆమె స్పష్టం చేశారు.



'జైలుకు సమాధానం ఓటుతో ఇవ్వండి' అంటూ ఢిల్లీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆప్ నేతలు

సుప్రీం కోర్టుకు వెళ్తాం

హైకోర్టులో తమకు న్యాయం జరగలేదని, కేజ్రీవాల్ విడుదల కోసం సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని ఆప్ నేత, ఢిల్లీ మంత్రి సంజయ్ సింగ్ వెల్లడించారు. ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్‌కు కూడా సుప్రీంకోర్టులో బెయిల్ లభించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఎక్సైజ్ పాలసీపైన కేంద్రం 'అతిపెద్ద రాజకీయ కుట్ర'కు పాల్పడిందని ఆయన విమర్శించారు.

అంతకు ముందు ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు, కేజ్రీవాల్ న్యాయవాది అభిషేక్ మనూ సింఘ్వీ మధ్య తీవ్రస్థాయిలో వాదోపవాదాలు జరిగాయి. ఎస్.వి.రాజు తన వాదనలను వినిపిస్తూ.. "సామాన్యుడు నేరం చేస్తే జైలుకు వెళ్లక తప్పదు. సీఎం అయినంత మాత్రాన కేజ్రీవాల్‌ను అరెస్టు చేయకూడదా? మీరు(కేజ్రీవాల్) దేశాన్ని లూటీ చేస్తారు. అయితే.. ఎన్నికలు జరుగుతున్నప్పుడు మిమ్మల్ని ముట్టుకోవద్దా? ఒక ఉగ్రవాది రాజకీయ నాయకుడైతే.. అతను సైనిక వాహనాన్ని పేల్చివేసినా.. ఎన్నికలున్నాయన్న కారణంతో అతణ్ని అరెస్టు చేయకూడదా?" అని ప్రశ్నించారు. కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా సాక్షులు/అప్రూవర్లు చేసిన ప్రకటనలు దర్యాప్తులో తేలుతాయని, మద్యం విధానాన్ని రూపొందించడంలో బయటి వ్యక్తుల పాత్ర ఉన్నదనేది స్పష్టంగా తేలిందని వ్యాఖ్యానించారు. ఆప్ కార్యకలాపాలకు ఆ పార్టీ కన్వీనర్‌గా కేజ్రీవాల్ బాధ్యుడని, మనీలాండరింగ్ ద్వారా లబ్ధిపొందినందుకే ఆయనను ఈడీ అరెస్టు చేసిందని చెప్పారు. "ఈ స్కామ్‌లో డబ్బును చూపించనప్పుడు ఎలా అరెస్టు చేస్తారనే వాదనలో పసలేదు. డబ్బు ఎవరి నుంచి.. ఎక్కడి నుంచి.. ఎలా వచ్చిందో కనిపెట్టాం. డబ్బు ఖర్చయిపోయింది. అందుకే స్వాధీనం చేసుకోలేకపోయాం" అని ఆయన కోర్టుకు వివరించారు. కేజ్రీవాల్‌ను ఈడీ న్యాయవాది 'ఉగ్రవాది'తో పోల్చడాన్ని అభిషేక్ మనూ సింఘ్వీ తీవ్రంగా ఖండించారు. "సైనిక వాహనాన్ని పేల్చిన ఉగ్రవాదితో ముఖ్యమంత్రిని ఎలా పోలుస్తారు? డబ్బే లేనప్పుడు నేరం ఎక్కడ జరిగింది?" అని ఆయన ప్రశ్నించారు. ఒకవేళ ముడుపులు ఇచ్చారనే ఆరోపణలే ఉంటే.. అవినీతి నిరోధక చట్టం కిందో.. ఆదాయపన్ను చట్టం కిందో దర్యాప్తు చేయాలని.. మనీలాండరింగ్‌ను ఈ కేసులో దూర్చారని విమర్శించారు. ఇరువర్గాల వాదనలను నమోదు చేసుకున్న జస్టిస్ స్వర్ణకాంత శర్మ.. జ్యుడీషియల్ రిమాండ్ సబబేనని కేజ్రీవాల్ పిటిషన్‌ను కొట్టివేశారు.

కేజ్రీవాల్‌తో సునీత, వైభవ్ ములాఖత్

తిహాడ్ జైలులో ఉన్న కేజ్రీవాల్‌తో.. ఆయన భార్య సునీత కేజ్రీవాల్, వ్యక్తిగత కార్యదర్శి వైభవ్‌కుమార్ మంగళవారం ములాఖత్ అయ్యారు. జైలు నిబంధనల ప్రకారం.. అండర్ ట్రయల్ ఖైదీలకు వారంలో నేరుగా గానీ, టెలికాన్ఫరెన్స్ ద్వారాగానీ రెండుసార్లు ములాఖత్‌కు అవకాశం ఉంటుంది. కేజ్రీవాల్ అరెస్టయ్యాక.. ఆయన తన భార్యతో నేరుగా మాట్లాడడం ఇదే మొదటిసారి. ములాఖత్ జంగ్లా(ఇనుప జాలీలు అడ్డుగా ఉంటాయి) పద్ధతిలో కేజ్రీవాల్‌తో వీరిద్దరూ అరగంట పాటు మాట్లాడారని తిహాడ్ జైలు అధికారులు తెలిపారు.

మనీలాండరింగ్ కేసులో సోరెన్ అనుచరుని అరెస్టు

రాంచీ, ఏప్రిల్ 9: భూమి ఆక్రమణకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఝార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరేన్ అనుచరుడు ఒకర్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసింది. సోరేన్‌కు సన్నిహితుడైన మహమ్మద్ సద్దాం హుస్సేన్ (48)ను అరెస్టు చేసినట్టు మంగళవారం ఈడీ అధికారులు తెలిపారు. ఇంకో మనీలాండరింగ్ కేసులో ఇప్పటికే సద్దాం హుస్సేన్ జైలులో ఉన్నాడు. ఈ కేసులో ఇది మూడో అరెస్టు కావడం గమనార్హం. మాజీ ముఖ్యమంత్రి సోరేన్‌తో పాటు రెవెన్యూ శాఖ సబ్‌ఇన్‌స్పెక్టర్ భాను ప్రతాప్ ప్రసాద్ ఇప్పటికే జైలులో ఉన్నారు. ఫోర్జరీ పత్రాలు సృష్టించి 8.86 ఎకరాలను ఆక్రమించినట్టు ఈడీ కేసు నమోదు చేసింది. కోర్టు అనుమతి తీసుకొని కస్టడీలో ఉన్న సద్దాం హుస్సేన్‌ను మళ్లీ అదుపులోకి తీసుకొంది.

లోకం తీరు

అవినీతిపరులు అంతా జైలుకే: మోదీ



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
రంగారెడ్డి	39.9	21.1
నల్లగొండ	39.5	24.0
ఆదిలాబాద్	38.3	25.2
ఖమ్మం	38.0	24.0
వరంగల్	37.0	25.0

హెపటైటిస్ వైరస్‌తో రోజూ 3500 మంది మృతి

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): హెపటైటిస్ వైరస్‌తో ప్రపంచవ్యాప్తంగా ప్రతిరోజూ 3500 మంది చనిపోతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) వెల్లడించింది. దీని బారిన పడి 2019లో 11లక్షల మంది మృతి చెందగా 2022నాటికి ఆసంఖ్య 13 లక్షలకు పెరిగిందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వారం పోర్చుగల్‌లో వరల్డ్ హెపటైటిస్ సమ్మిట్‌ను నిర్వహిస్తోన్న నేపథ్యంలో మొత్తం 187 దేశాలకు చెందిన హెపటైటిస్ గణాంకాలను డబ్ల్యూహెచ్‌వో మంగళవారం విడుదల చేసింది. రోజువారీ హెపటైటిస్ వైరస్ మరణాల్లో హెపటైటిస్ బీతో 83 శాతం మంది, హెపటైటిస్ సీతో 17శాతం మంది ప్రాణాలు కోల్పోతున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం మరణాలకు కారణమయ్యే రెండో అతిపెద్ద అంటువ్యాధి ఇదేనని పేర్కొంది. తక్షణమే దీనిపై దృష్టిసారించాలని ప్రపంచ దేశాలను కోరింది. 2022 చివరి నాటికి దీర్ఘకాలిక హెపటైటిస్ బీ తో బాధపడే రోగుల్లో 3% మందే యాంటీవైరల్ చికిత్సను తీసుకుంటున్నారని, 20% మంది హెపటైటిస్ సీ కి చికిత్స తీసుకుంటున్నట్లు డబ్ల్యూహెచ్‌వో పేర్కొంది. హెపటైటిస్ బీ కేసుల్లో 63% ఒక్క ఆఫ్రికా దేశాల్లోనే వస్తున్నాయని వెల్లడించింది.

రాముడిని కొలిస్తే బహిష్కరిస్తారా?

'శక్తి'ని నాశనం చేస్తామంటారా?

» కాంగ్రెస్, విపక్షాలపై ప్రధాని మోదీ ఫైర్

» యూపీ, మధ్యప్రదేశ్‌లలో ఎన్నికల ప్రచారం



ఫిలిబిత్/భోపాల్, ఏప్రిల్ 9: శ్రీరాముడిని కొలిచేవారిని కాంగ్రెస్ బహిష్కరిస్తోందని ప్రధాని మోదీ ఆక్షేపించారు. ప్రజలంతా ఆరాధించే 'శక్తి'ని కూకటివేళ్లతో పెకలిస్తానంటోందని విమర్శించారు. మనసులో ఇంత విషం ఎందుకు పెట్టుకుందో తనకు అర్థం కావడం లేదన్నారు. మంగళవారం ఆయన మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్, యూపీలోని ఫిలిబిత్ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల సభల్లో ప్రసంగించారు. అయోధ్యలో రామాలయ నిర్మాణానికి కాంగ్రెస్ అనేక అడ్డంకులు సృష్టించిందని.. తీరా ప్రజలు సొంత సొమ్ముతో దానిని నిర్మించాక ఆలయ ప్రతిష్ఠకు ఆహ్వానిస్తే తిరస్కరించి శ్రీరాముడిని అవమానించిందని అన్నారు. పైగా రామ్‌లల్లా ప్రతిష్ఠాపనకు హాజరైన వారిని ఆరేళ్లు పార్టీ నుంచి బహిష్కరించిందని, ఇదేం పార్టీ అని ప్రశ్నించారు. బుజ్జగింపు రాజకీయాల బురదలో కాంగ్రెస్ కూరుకుపోయిందన్నారు. 'యావద్దేశం శక్తిని ఆరాధిస్తోంది. దాని ముందు అందరూ తలొంచుతారు. అలాంటి శక్తిని కూడా కాంగ్రెస్ అవమానించింది. దానిని కూకటివేళ్లతో పెకిలిస్తామని అంటున్నారు. శక్తి ఉపాసకులెవరూ ఈ అవమానానికి ఇండీ కూటమిని క్షమించరు' అని స్పష్టం చేశారు. ఇండీ కూటమిలోని కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ ఇప్పుడు పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) కూడా వ్యతిరేకిస్తున్నాయని అన్నారు. విదేశాల్లో తమపై జరుగుతున్న అత్యాచారాలను భరించలేక హిందువులు, సిక్కులు అక్కడి నుంచి పారిపోయి వచ్చారని.. వారికి పౌరసత్వాన్ని భారత్ ఇవ్వకపోతే ఇంకెవరు ఇస్తారని నిలదీశారు. ఈ పార్టీలు అవినీతిపరులను రక్షించాలని చూస్తున్నాయని.. దేశాభివృద్ధికి కృషిచేస్తున్న తనను దూషిస్తున్నాయని అన్నారు. అభివృద్ధిని ఆపాలని తనను బెదిరిస్తున్నాయని చెప్పారు. 'దేశ భద్రతకు మోదీ గ్యారెంటీ ఇస్తే నన్ను తిడుతున్నారు. 370 అధికరణను రద్దు చేస్తే పాకిస్థాన్ భాషలో మాట్లాడుతున్నారు. నేను మహాకాళుడి భక్తుడిని. ఎవరికీ భయపడను. మహాకాళుడికి, ప్రజలకు మాత్రమే శిరసు వంచుతాను. దేశాభివృద్ధి కోసం, దానికి సేవ చేయడం కోసం తిట్లు కూడా భరించడం నేర్చుకున్నాను' అని మోదీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

చెన్నైలో మోదీ రోడ్‌షో

చెన్నై, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): 'మోదీ.. మోదీ' నినాదాలతో మంగళవారం చెన్నై నగరం మార్మోగింది. బీజేపీ లోక్‌సభ అభ్యర్థులు తమిళిసై(దక్షిణ చెన్నై), వినోజ్ పి.సెల్వం(సెంట్రల్ చెన్నై), పాల్ కనకరాజ్(ఉత్తర చెన్నై)లకు మద్దతుగా మోదీ మంగళవారం సాయంత్రం చెన్నైలో రోడ్ షో నిర్వహించారు. కాషాయరంగు ఓపెన్‌టాప్ వాహనంపై మోదీతోపాటు తమిళిసై, వినోజ్ పి.సెల్వం, పాల్ కనకరాజ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ప్రదర్శనగా వెళ్లారు. తర్వాత రాజ్‌భవన్‌లో మోదీ బస చేశారు. బుధవారం వేలూరులో జరుగనున్న సభలో ఆయన పాల్గొననున్నారు.

తమిళనాడి విభిన్నం

అధికారంలో ఉన్న పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో చుక్కెదురు

» 1977 నుంచి నేటి వరకు ఇంతే

(చెన్నై-ఆంధ్రజ్యోతి)

దేశవ్యాప్తంగా రాజకీయాలు ఒక విధంగా నడిస్తే.. తమిళనాడులో రాజకీయాలు దీనికి భిన్నంగా ఉంటాయి. ముఖ్యంగా ఎన్నికల వేళ ఈ తేడా స్పష్టంగా కనిపిస్తుంది. గత ఐదు దశాబ్దాల చరిత్రను పరిశీలిస్తే ఇక్కడ ఏ ఎన్నిక జరిగినా ఏకపక్షంగా ఉండేది. అయితే గత కొన్నేళ్లుగా మాత్రం తమిళనాడులో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలు ఇందుకు కాస్త భిన్నంగా ఉంటున్నాయి. కానీ, లోక్‌సభ ఎన్నికల విషయానికి వస్తే మాత్రం ఏకపక్షంగానే ఫలితాలు వెల్లడవుతున్నాయి. 39 లోక్‌సభ స్థానాలున్న ఈ రాష్ట్రంలో గత 2019లో జరిగిన ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. 1977లో అన్నాడీఎంకే, కాంగ్రెస్‌ల నేతృత్వంలోని కూటమి పార్లమెంటు ఎన్నికల్లో ఏకంగా 36 స్థానాలను కైవసం చేసుకుంది. 1980లో జరిగిన ఎన్నికల్లో డీఎంకే, కాంగ్రెస్, ఐయూఎంఎల్‌లతో కూడిన కూటమి 37 స్థానాలను, 1984, 1989 ఎన్నికల్లో అన్నాడీఎంకే-కాంగ్రెస్‌ల కూటమి 38 స్థానాలను, 1991లో డీఎంకే-కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి 39 స్థానాలను, 1996లో జరిగిన ఎన్నికల్లో డీఎంకే-టీఎంసీ నేతృత్వంలోని కూటమి 38, 1998లో అన్నాడీఎంకే, పీఎంకే, బీజేపీ, ఎండీఎంకే, టీఆర్‌సీ పార్టీలతో కూడిన కూటమి 35 స్థానాలను సాధించింది. 1999 ఎన్నికల్లో మాత్రం పరిస్థితి దీనికి భిన్నంగా మారింది. డీఎంకే, పీఎంకే, బీజేపీ, ఎండీఎంకే నేతృత్వంలోని కూటమి 26 స్థానాలు గెలుచుకోగా, అన్నాడీంకే, కాంగ్రెస్, సీపీఎం నేతృత్వంలోని కూటమికి 13 సీట్లు వచ్చాయి. కానీ, తర్వాత దాదాపు అన్ని లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ తమిళ ఓటర్లు ఏదో ఒక పార్టీ వైపే మొగ్గు చూపారు.

అధికారం లేకుంటే..

తమిళనాట ఎంజీఆర్, కరుణానిధి హయాంలలో పాలకపక్షానికి పార్లమెంటు స్థానాలు తక్కువ రావడం ఆనవాయితీగా మారింది. 2008, 2014లో జరిగిన పార్లమెంటు ఎన్నికలు మినహా ఇప్పటి వరకు జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే ఆ విషయం స్పష్టమవుతుంది. తమిళనాట అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు వేర్వేరుగా జరుగుతుంటాయి. ఈ రెండు ఎన్నికలకు కనీసం రెండేళ్ల వ్యవధి ఉంటోంది. దీంతో ఈ రెండేళ్లలో ప్రభుత్వం అనుసరించిన విధానాలకు అనుగుణంగా ఓటర్లు తీర్పు చెబుతున్నారు. తమిళనాట 2001లో అన్నాడీఎంకే అధికారంలోకి వచ్చింది. 2004 జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమి పార్లమెంటు ఎన్నికల్లో భారీ విజయం సాధించింది. 2006లో డీఎంకే అధికారం చేపట్టింది. కానీ, 2009లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో డీఎంకే-కాంగ్రెస్ కూటమికి 28 స్థానాలను సాధించుకోగలిగింది. 2011లో అన్నాడీఎంకే తమిళపీఠాన్ని కైవసం చేసుకుంది. అయినా.. 2014లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీ ఏకంగా 37 స్థానాలను సాధించుకుంది. మళ్లీ 2016లో అన్నాడీఎంకే వరుసగా రెండోమారు అధికారం చేపట్టగా, 2019లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో విపక్ష డీఎంకే-కాంగ్రెస్ కూటమి 38 స్థానాలను సాధించడం విశేషం. ఆ తరువాత 2021లో డీఎంకే ప్రభుత్వం అధికారం చేపట్టింది. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు ఎన్నికల్లో తమిళ ఓటరు ఎలాంటి తీర్పునిస్తాడోననే ఆసక్తి పెరిగింది. అన్నాడీఎంకే, బీజేపీ సైతం సంప్రదాయంపైనే గంపెడాశలు పెట్టుకున్నాయి. స్టాలిన్ ప్రభుత్వం వచ్చి మూడేళ్లు కావస్తున్నందున ఓటర్లు తమకే పట్టం కడతారని ఆ రెండు పార్టీలు భావిస్తున్నాయి.





మహారాష్ట్రలో కుదిరిన ఒప్పందం

» కాంగ్రెస్‌కు 17, శివసేనకు 21, ఎన్‌సీపీకి 10 సీట్లు

ముంబయి, ఏప్రిల్ 9: లోక్‌సభ ఎన్నికలకు మహారాష్ట్రలో ప్రతిపక్ష పార్టీల కూటమి(మహా వికాస్ అఘాడీ)లో సీట్ల పంపకానికి ఒప్పందం కుదిరింది. శివసేనకు అత్యధికంగా 21 సీట్లు కేటాయించగా... కాంగ్రెస్‌కు 17, ఎన్‌సీపీ(ఎస్‌పీ)కి 10 సీట్లు కేటాయించారు. సాంగ్లి, భివాండి సీట్ల కోసం మూడు పార్టీల మధ్య పోటీ నెలకొనగా చివరకు కాంగ్రెస్ పట్టువీడింది. సాంగ్లి నుంచి శివసేన(యూబీటీ), భివాండి నుంచి ఎన్‌సీపీ(ఎస్‌పీ) పోటీ చేయనున్నాయి. ఎన్‌సీపీ(ఎస్‌పీ) చీఫ్ శరద్ పవార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ... సీట్ల పంపకంపై కూటమిలో ఎలాంటి విభేదాలు లేవన్నారు. మొత్తం 48 సీట్ల పంపకం ఏకగ్రీవంగా జరిగిందన్నారు. శివసేన(యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాకరే మాట్లాడుతూ... బీజేపీని ఓడించడమే కూటమి ప్రధాన లక్ష్యమని ప్రకటించారు. మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే మాట్లాడుతూ... బీజేపీని ఓడించేందుకు మూడు పార్టీలు విశాల హృదయంతో ముందుకుపోవాలని నిర్ణయించినట్లు చెప్పారు.

సీఈసీ రాజీవ్‌కుమార్‌కు జెడ్ కేటగిరీ భద్రత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భారత ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) రాజీవ్‌కుమార్‌కు ప్రభుత్వం జెడ్ కేటగిరీ భద్రత కల్పించింది. ఆయనకు రక్షణగా ఉండేందుకు సీఆర్‌పీఎఫ్‌కు చెందిన దాదాపు 45 మంది సాయుధ కమాండోలను కేంద్ర హోంశాఖ నియమించింది. ఎన్నికల తరుణంలో సీఈసీకి ముప్పు ఉందని కేంద్ర ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు ఇచ్చిన రిపోర్టుల మేరకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది.

మా అబ్బాయి ఓడిపోవాలి: ఏకే ఆంటోనీ

తిరువనంతపురం, ఏప్రిల్ 9: "బీజేపీ టికెట్‌పై పోటీ చేస్తున్న మా అబ్బాయి ఓడిపోవాలి. ఎన్నికల్లో ఎట్టి పరిస్థితిలోనూ గెలవకూడదని కోరుకుంటున్నా" అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి ఏకే ఆంటోనీ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేరళలోని పతనంతిట్ట లోక్‌సభ స్థానం నుంచి ఆంటోనీ కుమారుడు అనిల్ బీజేపీ టికెట్‌పై పోటీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఏకే ఆంటోనీ మీడియాతో మాట్లాడుతూ.. పతనంతిట్టలో కాంగ్రెస్ అభ్యర్థి విజయం తథ్యమని చెప్పారు. "కాంగ్రెస్ నా మతం" అని ఆంటోనీ వ్యాఖ్యానించారు. తన తండ్రి చేసిన వ్యాఖ్యలపై అనిల్ తీవ్రంగా స్పందించారు. "మా నాన్న సానుభూతి కోసం ప్రయత్నిస్తున్నారు. వీరంతా కాలం చెల్లిన నాయకులు" అని అన్నారు.

ప్రజలు కోరితే రాజకీయాల్లోకి: రాబర్ట్ వాద్రా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: ప్రజలు కోరుకుంటే ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చేందుకే తాను సిద్ధంగా ఉన్నానని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ భర్త రాబర్ట్ వాద్రా ప్రకటించారు. పార్టీ అవసరమని భావిస్తే అమేఠీ నుంచి సైతం తాను పోటీ చేసేందుకు సిద్ధమేనన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల నుంచే కాకుండా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల ప్రజలు కూడా తాను రాజకీయాల్లోకి రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. "నేను అమేఠీ నుంచి పోటీ చేస్తే పార్టీలో మరింత ఊపు వస్తుంది" అని వాద్రా అన్నారు.

సుర్జేవాలాకు ఈసీ షోకాజ్ నోటీసులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: బీజేపీ ఎంపీ హేమ మాలినిపై అసభ్యకర వ్యాఖ్యలు చేశారంటూ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ ఎంపీ సుర్జేవాలాకు ఎన్నికల సంఘం(ఈసీ) మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఏప్రిల్ 11వ తేదీ సాయంత్రం లోపు వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఇదే అంశంపై కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు కూడా ఈసీ నోటీసులు జారీ చేసింది. పార్టీ నేతలు సభల్లో మాట్లాడేటప్పుడు మహిళలను అగౌరవపర్చకుండా తీసుకున్న చర్యలను చెప్పాలని ఆదేశించింది.

ఫోన్ ట్యాపింగ్ కేసులో..

10 మందికి పైగా బీఆర్ఎస్ నేతలు!

(మొదటి పేజీ తరువాయి)

సిబ్బంది/అధికారుల పాత్ర ఏమిటి? టాస్క్‌ఫోర్స్ రోల్ ఏంటి? అనే అంశాలతోపాటు.. బెదిరింపులు, నగదు తరలింపు, బెదిరింపు వసూళ్లపైనా దర్యాప్తు అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. మూడో రోజు నుంచి తెరవెనక ఉండి ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారాన్ని నడిపించిన గత ప్రభుత్వ పెద్దలెవరు? వారి పాత్ర ఏమిటి? అనే ప్రశ్నలను సంధించినట్లు సమాచారం. కేసులో రాధాకిషన్‌రావు వాంగ్మూలం అత్యంత కీలకం కావడంతో.. తొలిరోజు కస్టడీలోకి తీసుకోవడానికి ముందే దర్యాప్తు అధికారులు న్యాయనిపుణుల సలహాలను తీసుకున్నారు. కోర్టులో కేసు ఎక్కడా వీగిపోకుండా ఉండేలా బలమైన ఆధారాలను సేకరించేందుకు.. 200 ప్రశ్నలను సిద్ధం చేసుకున్నారు. రాజకీయ కోణానికి సంబంధించిన ప్రశ్నలను సంధించి, సమాధానాలను రాబట్టుకున్నారు. గత ప్రభుత్వ పెద్దల్లో.. 10 మందికి పైగా నాయకులు ఈ వ్యవహారంలో ఉన్నట్లు రాధాకిషన్ వెల్లడించారని తెలుస్తోంది. ఓ దశలో రాధాకిషన్‌రావు నోరు మెదపకపోవడం.. సమాధానాలను దాటవేసే యత్నం చేయడంతో.. అధికారులు తమదైన శైలిలో విచారించినట్లు సమాచారం. దాంతో.. తాను 2017లో కీలకమైన టాస్క్‌ఫోర్స్ డీసీపీగా పోస్టింగ్ పొందడం దగ్గరి నుంచి.. 2020 ఆగస్టులో రిటైరైనా.. కొనసాగడం.. గతేడాది ఆగస్టులో 3సార్లు పొడిగింపులు పూర్తయినా.. మరో మూడేళ్లపాటు టర్మ్‌ను పెంచడం వెనక గత ప్రభుత్వ హయాంలో ఎవరు సహకరించింది చెప్పినట్లు తెలుస్తోంది.ప్రతిగా తాను వారికి ఎలా సహకరించింది వివరించినట్లు సమాచారం.

ముందస్తు బెయిల్ యోచనలో ప్రభాకర్‌రావు

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు పోలీస్ అరెస్టు నుంచి తప్పించుకునేందుకు యత్నిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఓ సీనియర్ అధికారితో ఫోన్‌లో మాట్లాడిన ప్రభాకర్‌రావు పోలీస్ నుంచి తనకు ఎలాంటి సహాయం అందే పరిస్థితి లేదని అర్థం చేసుకున్నారు. ఇప్పటి వరకు ఈ కేసులో అరెస్టయిన అధికారులంతా నెపాన్ని ప్రభాకర్ రావుపైనే వేయడంతో ఈ కేసులో ఆయనే కీలకంగా మారారు. దీంతో.. ప్రస్తుతం క్యాన్సర్ చికిత్స కోసం అమెరికా వెళ్లిన ప్రభాకర్‌రావు.. వయోభారం, అనారోగ్యం వంటి కారణాలను చూపించి, అరెస్టు నుంచి తప్పించుకునేందుకు న్యాయపరంగా ఉన్న మార్గాలపై దృష్టి సారించినట్లు తెలిసింది. అందులో భాగంగానే హైదరాబాద్‌లో తన పరిచయస్తులైన న్యాయవాదులతో టచ్‌లోకి వచ్చినట్లు సమాచారం. మరోవైపు ప్రభాకర్ రావును విచారించడం వల్ల చిక్కుముడులన్నీ వీడే అవకాశం ఉండటంతో ఆ దిశగా దర్యాప్తు అధికారులు ముందుకు సాగుతున్నారు.

వచ్చేవారం కీలక మలుపులు!

రాధాకిషన్‌రావు విచారణ సందర్భంగా పది మందికి పైగా రాజకీయ నాయకుల పాత్రను గుర్తించిన దర్యాప్తు అధికారులు.. వచ్చేవారం వారిపై ఫోకస్ చేసే అవకాశాలున్నాయి. బుధవారంతో రాధాకిషన్‌రావు కస్టడీ ముగియనుంది. అరెస్టయిన పోలీసుల విచారణ పూర్తయింది. ఈ నేపథ్యంలో.. వీరందరి విచారణల సారాంశానికి సంబంధించి పేపర్‌వర్క్ పూర్తయ్యాక.. రాజకీయ నాయకులకు కూడా నోటీసులు జారీ చేసి, వారిని ప్రశ్నించే సూచనలు కనిపిస్తున్నాయి. దీంతో.. వచ్చేవారం ఈ కేసు కీలక మలుపులు తిరిగే అవకాశాలున్నాయి.

నేను బాధితురాలిని

- సాక్షులను బెదిరిస్తున్నాననడం అబద్ధం
- దర్యాప్తు సంస్థలు నిందలు మోపుతున్నాయి
- నన్నెంతో వేధించారు.. ప్రతిష్ఠను దెబ్బతీశారు
- బీఆర్ఎస్ అధికారంలో ఉండగా అరెస్టు చేయలేదేం?
- తెలంగాణలో బీజేపీకి ఓటు వేయొద్దు
- తిహాడ్ జైలు నుంచి ఎమ్మెల్సీ కవిత లేఖ
- మరో 14 రోజులు రిమాండ్ పొడిగింపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం పాలసీ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఈ కేసులో అరెస్టయి తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఈ కేసులో తాను బాధితురాలినని, దర్యాప్తు సంస్థలు ఉద్దేశపూర్వకంగానే తనపై నిందలు మోపుతున్నాయని ఆరోపించారు. ఆధారాలు ధ్వంసం చేశానని, సాక్షులను బెదిరిస్తున్నానని చేస్తున్న ఆరోపణల్లో ఎంతమాత్రం నిజం లేదని అన్నారు. విచారణ పేరుతో తనను ఎంతగానో వేధించారని, తన ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కవిత నాలుగు పేజీల లేఖను విడుదల చేశారు. తిహాడ్ జైలులో ఉన్న కవిత కస్టడీ ముగియడంతో మంగళవారం ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ఆమెను హాజరుపరిచారు. ఈ సందర్భంగా కోర్టులో కవిత మాట్లాడాలనుకుంటున్నారని, అవకాశం ఇవ్వాలని ఆమె తరఫు న్యాయవాది కోరగా.. అందుకు జడ్జి నిరాకరించారు. కవిత జ్యుడీషియల్ కస్టడీని మరో 14 రోజులపాటు పొడిగించారు. కాగా, మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకపోవడంతో కవిత లేఖను విడుదల చేశారు. ఈ లేఖలో, "ఢిల్లీ మద్యం కేసుతో నాకు ఎలాంటి సంబంధం లేదు. నేను తప్పు చేశానని చెప్పడానికి ఎటువంటి ఆధారాల్లేవు. ఈ కేసులో నేను బాధితురాలిని మాత్రమే. దర్యాప్తు సంస్థలు చెబుతున్నట్టు ఈ విషయంలో నాకు ఎలాంటి ఆర్థిక లబ్ధి చేకూరలేదు. ఈ కేసు పేరుతో నన్నెంతో వేధింపులకు గురిచేశారు. మానసికంగా ఇబ్బందులు పెట్టారు. నా మొబైల్ నంబర్‌ను మీడియాలో ప్రసారం చేసి నా ప్రైవసీని దెబ్బతీశారు. గడిచిన రెండున్నరేళ్లుగా సీబీఐ, ఈడీ దర్యాప్తు సంస్థల కంటే మీడియాలోనే విచారణ ఎక్కువగా సాగింది. దర్యాప్తు సంస్థల ముందు నాలుగుసార్లు విచారణకు హాజరయ్యాను. అన్నివిధాలా సహకరించాను. బ్యాంకు వివరాలతోపాటు అడిగిన సమాచారాన్నంతా ఇచ్చాను. నా మొబైల్ ఫోన్లన్నీ అందజేశాను. కానీ, వాటిని ధ్వంసం చేశానని నాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. రెండున్నరేళ్లుగా విచారణ పేరుతో మానసికంగా వేధిస్తున్నారు" అని కవిత పేర్కొన్నారు.



కోర్టు నుంచి బయటకు వస్తున్న కవిత

ఈడీ నన్ను ఇరికించాలని చూస్తోంది..

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో దర్యాప్తు సంస్థ.. సహ నిందితుల వాంగ్మూలాలను తరచూ మారుస్తూ కేసును సాగదీస్తోందని కవిత ఆరోపించారు. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ ఖన్నా కూడా విచారణ సందర్భంగా ప్రస్తావించారని గుర్తు చేశారు. "సుప్రీంకోర్టులో కఠిన చర్యలు తీసుకోబోమని చెప్పి, కీలకమైన లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈడీ నన్ను అరెస్టు చేసింది. దేశంలో 95 శాతం కేసులు ప్రతిపక్ష పార్టీల నేతలకు సంబంధించినవే. బీజేపీలో చేరిన వెంటనే ఆ కేసుల్లో విచారణ ఆగిపోతోంది. ఈడీ నన్ను ఇందులో ఇరికించాలని చూస్తోంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నంతకాలం నన్ను ఎందుకు అరెస్టు చేయలేదు? నోరు మూసుకోకపోతే ఈడీని పంపుతామని లోక్‌సభ సాక్షిగానే బీజేపీ నేతలు బెదిరిస్తున్నారు. ఇటువంటి స్థితిలో దేశంలోని విపక్ష పార్టీలన్నీ న్యాయవ్యవస్థ వైపు ఆశగా చూస్తున్నాయి. గత రెండున్నరేళ్లుగా కేసు దర్యాప్తునకు సహకరించాను. ఇకపైనా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నాను. నా చిన్నకుమారుడి బోర్డు ఎగ్జామ్స్ ఉన్నాయి. ఈ సమయంలో తల్లిగా నేను తనతో ఉండాల్సిన అవసరం ఉంది. తల్లి పాత్రను ఎవరూ భర్తీ చేయలేరు. అందుకే నాకు బెయిల్ మంజూరు చేయండి" అని కవిత లేఖలో విజ్ఞప్తి చేశారు.

ఈ కేసు అంతా కల్పితం..

కవిత జ్యుడీషియల్ కస్టడీని మరో 14 రోజులు రౌస్ ఎవెన్యూ కోర్టు పొడిగించింది. అంతకుముందు ఈడీ తరఫు న్యాయవాది జోహెబ్ హుస్సేన్ వర్చువల్‌గా వినిపిస్తూ.. కవిత బయటికి వస్తే సాక్షులను ప్రభావితం చేస్తారని, కేసుపై ప్రభావం పడుతుందని అన్నారు. దీనిపై కవిత తరఫు న్యాయవాది నితేష్ రాణా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కేసులో దర్యాప్తు సంస్థలు ఇప్పటివరకు సరైన ఆధారాలే చూపలేదన్నారు. జ్యుడీషియల్ కస్టడీ పొడిగించడానికి ఈడీ వద్ద కొత్తగా ఏమీ లేవన్నారు. 2022 నుంచి కేసు దర్యాప్తు సాగుతోందని, కవిత ప్రభావితం చేసే వ్యక్తి అని మొదటి నుంచి ఈడీ ఆరోపిస్తోందని, అదే నిజమైతే కేసు విచారణలో ఇంత పురోగతి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఇరువురి వాదనలు విన్న న్యాయమూర్తి.. తీర్పును కొంతసేపు రిజర్వ్ చేశారు. ఆ తర్వాత కవితకు మరో 14 రోజులు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తున్నట్టు తెలిపారు. ఆ తర్వాత కవిత కోర్టు హాలు నుంచి బయటికి వెళుతూ, "జై తెలంగాణ.. జైజై తెలంగాణ" అంటూ నినాదాలు చేశారు. మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. ఇది కుట్రపూరితమైన కేసు అని, కేవలం కొంతమంది స్టేట్‌మెంట్ల ఆధారంగా ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. ఈ కేసులో ఏమీ లేదని, కల్పితమని అన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీకి ఓటు వేయొద్దని కోరారు.

రాతపూర్వకంగా చెప్పమనండి...

కవిత తన అభిప్రాయాన్ని కోర్టుకు తెలపాలనుకుంటున్నారని ఆమె తరఫు న్యాయవాది నితేష్ రాణా తెలిపారు. తన అభిప్రాయాలను తెలిపే హక్కును రాజ్యాంగం కల్పించిందని అన్నారు. అయితే.. ఈ అంశంపై ఎందుకు అంతలా పట్టుబడుతున్నారని న్యాయమూర్తి కావేరి భవేజా ప్రశ్నించారు. ఏమైనా ఉంటే రాతపూర్వకంగా కోర్టుకు ఇవ్వాలని, ఇందుకోసం కవిత తరఫున వకాలత్ వేయాలని సూచించారు. ఈ క్రమంలోనే ఈడీ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్‌కే మట్టా కలుగజేసుకుని.. నిందితులు ఏమైనా కోర్టు దృష్టికి తీసుకురావాలనుకుంటే రాతపూర్వకంగా అభిప్రాయాలను వ్యక్తం చేయవచ్చని పేర్కొన్నారు. దీంతో ఏకీభవించిన న్యాయమూర్తి.. కవిత అభిప్రాయాలను రాతపూర్వకంగా సమర్పించవచ్చని తెలిపారు. ఇందుకు కవిత తరఫు న్యాయవాది నితేష్ రాణా అంగీకరించారు.

శనివారం కవితతో కేటీఆర్ ములాఖత్!

తిహాడ్ జైలులో ఉన్న కవితను ఆమె సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం కలవనున్నట్లు సమాచారం. కవితను ఈడీ అరెస్టు చేసినప్పటి నుంచి ఇప్పటిదాకా కేటీఆర్ ఆమెను కలవలేదు. కవిత అరెస్టు తరువాత ఆయన ఢిల్లీకి వచ్చినప్పటికీ ఈడీ కార్యాలయానికిగానీ, కోర్టుకుగానీ రాలేదు. కాగా, మంగళవారం కోర్టు హాలులో కవితను ఆమె భర్త అనిల్, మామ రాంకిషన్ రావు (అనిల్ తండ్రి) కలిశారు. కవితతో 10 నిమిషాలు మాట్లాడేందుకు న్యాయమూర్తి అనుమతి ఇవ్వడంతో కొద్దిసేపు మాట్లాడారు. ఇదిలా ఉండగా.. కవితను సీబీఐ విచారించేందుకు కోర్టు అనుమతి ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం రౌస్ అవెన్యూ కోర్టులో విచారణ జరగనుంది.

అమెరికాలో కిడ్నాపైన..

హైదరాబాదీ విద్యార్థి మృతి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో అపహరణకు గురైన హైదరాబాదీ విద్యార్థి మహమ్మద్ అబ్దుల్ అర్ఫాత్(25) మృతిచెందినట్లు న్యూయార్క్‌లోని భారత దౌత్య కార్యాలయం మంగళవారం నిర్ధారించింది. ఈ మేరకు ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టింది. "మేము కొంత కాలంగా వెతుకుతున్న మహమ్మద్ అబ్దుల్ అర్ఫాత్ మృతదేహాన్ని ఓహైయోలోని క్లేవ్‌ల్యాండ్‌లో గుర్తించాం. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాం. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసేందుకు స్థానిక పోలీసులతో సంప్రదింపులు జరుపుతున్నాం" అని ఆ పోస్టులో పేర్కొంది. మృతదేహాన్ని హైదరాబాద్ తరలించడానికి సహాయం చేస్తామని ప్రకటించింది. హైదరాబాద్‌లోని నాచారం ప్రాంతానికి చెందిన అబ్దుల్ క్లేవ్‌ల్యాండ్ వర్సిటీలో ఐటీలో మాస్టర్స్ చేయడానికి అమెరికా వెళ్లారు. గతనెల 7న ఆయన కిడ్నాప్ అయ్యారు. కిడ్నాపర్లు నాచారంలోని అబ్దుల్ తండ్రి మహమ్మద్ సలీంకు ఫోన్ చేసి, 1,200 డాలర్లు డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వని పక్షంలో అబ్దుల్ కిడ్నీని విక్రయిస్తామని బెదిరించారు. దాంతో సలీం తన కుమారుడితో మాట్లాడించాలని, అతను అక్కడే ఉన్నట్లు ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. దీంతో కిడ్నాపర్లు ఫోన్ కట్ చేశారు. కిడ్నాపర్ల ఫోన్ నంబర్‌ను అమెరికాలోని తమ బంధువులకు పంపామని, వారు గత నెల 8న క్లేవ్‌ల్యాండ్ పోలీసులకు ఫిర్యాదు చేశారని అప్పట్లో సలీం వెల్లడించారు. మంగళవారం క్లేవ్‌ల్యాండ్‌లోనే అబ్దుల్ మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. కాగా.. అబ్దుల్ తండ్రి సలీం నాచారంలో సెంట్రింగ్ కాంట్రాక్టు పనులు చేస్తుంటారు. ఆయనకు సలీంతోపాటు.. మరో కుమార్తె ఉన్నారు. కుమార్తె లండన్‌లో ఉంటున్నారు.

షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి

నగరంలో రూ.12.87 కోట్ల నగదు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలయిన నాటి నుంచి ఇప్పటివరకు హైదరాబాద్ నగరంలో పలు ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో రూ.12.87 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ వెల్లడించారు. అలాగే రూ.1.86 కోట్ల విలువైన వస్తువులు, 20 వేల లీటర్ల మద్యం సీజ్ చేశామని వారు తెలిపారు. వీటికి సంబంధించి 146 మందిపై కేసులు నమోదు కాగా 140 మందిని పోలీసులు అరెస్ట్ చేశారని చెప్పారు. సరైన పత్రాలు చూపిస్తే స్వాధీనం చేసుకున్న నగదును తిరిగి ఇస్తామని, ఇందుకోసం జీహెచ్ఎంసీ కేంద్ర కార్యాలయంలో జిల్లా ఫిర్యాదుల కేంద్రం (డీజీసీ) ఏర్పాటు చేశామని తెలిపారు.

విజిలెన్స్ డీజీ రాజీవ్ రతన్ ఆకస్మిక మృతి

(మొదటి పేజీ తరువాయి)

అదనపు ఎస్పీగా, ఎస్పీగా, కరీంనగర్ ఎస్పీగా, హైదరాబాద్ రీజియన్ ఐజీగా, అగ్నిమాపక శాఖ డీజీగా సేవలందించారు. ఆ తర్వాత డీజీపీ కార్యాలయంలో ఆర్గనైజేషన్ విభాగం అదనపు డీజీగా, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా, ఐటీబీపీ కమాండింగ్ ఆఫీసర్‌గా పనిచేశారు. ఆయన గోల్ఫ్ పోటీల్లో పాల్గొనేవారు. పోలీసు శాఖలో ఆయన చేసిన సేవలకు గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పలు పతకాలను అందుకున్నారు. అక్టోబరు(అక్టోబరు)లో ఆయన పదవీ విరమణ చేయాల్సి ఉంది. ఇంతలోనే గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. మహాప్రస్థానంలో బుధవారం ఆయన అంత్యక్రియలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

రాజీవ్‌రతన్ మృతి సమాచారం అందుకున్న వెంటనే డీజీపీ రవిగుప్తా, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి, అదనపు డీజీపీ మహేశ్ భగవత్, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఇతర సీనియర్ అధికారులు ఆస్పత్రికి చేరుకున్నారు. రాజీవ్‌రతన్ భౌతికకాయాన్ని సందర్శించారు. తన బ్యాచ్‌మేట్ రాజీవ్‌రతన్ మృతిపట్ల ఏసీబీ చీఫ్ సీవీ ఆనంద్ సంతాపం వ్యక్తం చేశారు. ఇటీవల తామిద్దరం కలిసి ఆల్ ఇండియా పోలీస్ గోల్ఫ్ టోర్నమెంట్‌లో పాల్గొన్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.



మంత్రి ఉత్తమ్ కుమార్ దిగ్భ్రాంతి

విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ రాజీవ్‌రతన్ అకాల మరణం పట్ల సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మేడిగడ్డపైన ఇటీవల ఆయన విజిలెన్స్ విచారణ నిర్వహించి నివేదికను ఇచ్చిన సంగతి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

గవర్నర్, సీఎం సంతాపం

విజిలెన్స్ డీజీ రాజీవ్ రతన్ ఆకస్మిక మృతిపట్ల గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సుదీర్ఘకాలంగా పోలీస్ విభాగానికి ఆయన అందించిన విశిష్ట సేవలను వారు గుర్తు చేసుకున్నారు. సమర్థంగా, నిజాయితీగా విధులు నిర్వహించిన అధికారులను తెలంగాణ సమాజం ఎప్పటికీ మరిచిపోదని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా అన్నారు. రాజీవ్‌రతన్ మృతిపట్ల సంతాపం వ్యక్తం చేస్తూ.. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కాళేశ్వరం విచారణలో జాప్యం!

- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ అకాల మరణం ప్రభావం
- కొత్త డీజీ నియామకం తర్వాతే ప్రభుత్వానికి నివేదిక

హైదరాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్(వీ అండ్ ఈ) డైరెక్టర్ జనరల్(డీజీ) రాజీవ్ రతన్ అకాల మరణం కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న విచారణపై ప్రభావం చూపనుంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై చేపట్టిన విచారణ బాధ్యతను ప్రభుత్వం విజిలెన్స్‌కు అప్పగించింది. రాజీవ్ రతన్ ఆధ్వర్యంలో ఈ విచారణ జరుగుతోంది. ప్రభుత్వం విచారణ బాధ్యతను అప్పగించగానే ఏకకాలంలో రాష్ట్రవ్యాప్తంగా నీటిపారుదల శాఖ కార్యాలయాలపై విజిలెన్స్ సోదాలు జరిపించింది. కీలక పత్రాలు స్వాధీనం చేసుకోవడమే కాకుండా బ్యారేజీల నిర్మాణంలో పాల్గొన్న అధికారులందరినీ విచారించింది. ఇందుకు సంబంధించి విజిలెన్స్ విభాగం కొద్ది రోజుల క్రితం ప్రభుత్వానికి మధ్యంతర నివేదిక కూడా అందించింది. ప్రస్తుతం పూర్తి నివేదికకు కసరత్తు జరుగుతుండగా డీజీ రాజీవ్ రతన్ మరణించారు. దీంతో కొత్త డీజీ నియామకం అయ్యేదాకా పూర్తి నివేదిక ప్రభుత్వానికి అందే అవకాశాల్లేవు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాతే పూర్తిస్థాయి డీజీని ప్రభుత్వం నియమిస్తుంది. దీంతో అప్పటిదాకా విచారణ ప్రక్రియకు బ్రేక్ పడినట్లయింది.

వలంటీర్లకు 10 వేల పారితోషికమిస్తాం

- వారికి మెరుగైన భవిష్యత్ కల్పిస్తాం
- జగన్ వైపో.. రాష్ట్రం వైపో తేల్చుకోవాలి
- టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు
- పార్టీ విరాళాలకు వెబ్‌సైట్ ప్రారంభం



అమరావతి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఏపీలో తమ కూటమి అధికారంలోకి వచ్చాక వలంటీర్లకు ఇప్పుడు ఇస్తున్న రూ.5 వేల పారితోషికాన్ని రూ.10 వేలకు పెంచుతామని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. సిట్ కార్యాలయ ఆవరణలో కొన్ని పత్రాలను అధికారులు తగలబెట్టించడంపై స్పందిస్తూ.. అధికార పార్టీ ఎన్నికల్లో ఓడిపోతుందనే భయంతోనే పేపర్లు తగలబెడుతున్నారని ధ్వజమెత్తారు. అలాగే, తెలుగు దేశం పార్టీకి విరాళాల కోసం 'టీడీపీ ఫర్ ఆంధ్ర.కామ్' వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఉగాదివేడుకల్లో చంద్రబాబు ప్రసం గించారు. వలంటీర్లకు నైపుణ్య శిక్షణ ఇచ్చి వారికి మరింత మంచి ఉద్యోగాలు రావడానికి అవకాశాలు కల్పించి మెరుగైన భవిష్యత్తు కల్పిస్తామని తెలిపారు. జగన్ వైపు ఉండాలో.. రాష్ట్రం కోసం పనిచేయాలో వలంటీర్లు తేల్చుకోవాలని స్పష్టం చేశారు. వైసీపీ శవ రాజకీయాలు చేస్తోందని, పేదల పింఛన్లను జగన్ తన జేబులో నుంచి ఇవ్వడం లేదని అన్నారు. తమ పరిస్థితి బాగుందని చెప్పుకోవడానికి చరిత్రలో లేని విధంగా 1500 బస్సులు పెట్టి జగన్ సభలు జరుపుతున్నారని చంద్రబాబు ఆక్షేపించారు. ఒక్కో సభకు కనీసం రూ.15 కోట్లు ఖర్చు చేస్తున్నారని, జగన్‌కు ఇంత డబ్బు ఎక్కడి నుంచి వస్తుందని ప్రశ్నించారు. టీవీ9, ఎన్‌టీవీ వంటి చానళ్లు రాష్ట్రాన్ని లూటీ చేస్తున్న వారికి మద్దతిస్తున్నాయని విమ ర్శించారు. ఐ-ప్యాక్ టీం పోగు చేసి తెచ్చిన వారి పక్కన జగన్ కూర్చుని వల్లమాలిన ఆప్యాయత వలకబోస్తూ ఫొటోలు దిగి ప్రచారం చేసుకుంటున్నారని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ విశృంఖలంగా జరుగుతోందని ఆరోపించారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి.. వైసీపీ వ్యతిరేక ఓటు చీలిపోకుండా ఉండడం కోసమే పొత్తులు కుదుర్చుకున్నామని చెప్పారు. తాము ప్రకటించిన అభ్యర్థుల విషయంలో మార్పులు ఉండవని, ఎక్కడైనా తప్పకపోతే ఒక సీటు పరస్పర మార్పిడితో మారుస్తామని తెలిపారు. ఇక, టీడీపీ అభిమా నులు, పౌరులు ఎవరైనా 'టీడీపీ ఫర్ ఆంధ్ర.కామ్' వెబ్‌సైట్‌లోకి వెళ్లి.. రూ.99నుంచి ఎంతైనా పార్టీకి విరాళంగా ఇవ్వొచ్చు (మొదటి విరాళంగా ఆయన రూ.99 వేలు ఇచ్చారు) అని తెలిపారు. టీడీపీ విధానాల వల్ల బాగుపడ్డామని అనుకున్న వారు పార్టీకి ఆర్థికంగా సహకరించాలని చంద్రబాబు కోరారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చైనాతో జాగ్రత్త!

అరుణాచల్ ప్రదేశ్ పర్యటనలో కేంద్రరక్షణమంత్రి రాజనాథ్‌సింగ్ మంగళవారం చైనాను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు అత్యధికులకు అంతగా ఆనలేదు. ఇటీవల ఆరుణాచల్‌లోని ముప్పై ప్రాంతాలకు చైనా తన పేర్లు పెట్టుకున్న విషయం తెలిసిందే. 11నివాసప్రాంతాలు, 12పర్వతాలు, నాలుగు నదులు, ఒక మార్గం, కొంత భూభాగానికి చైనా క్యాబినెట్ నిర్ణయం మేరకు నామకరణం జరిగిందని, మే 1వతేదీనుంచి కొత్తపేర్లు అమల్లోకి వస్తాయని గ్లోబల్ టైమ్స్ పదిరోజుల క్రితం ప్రకటించింది. అరుణాచల్ ప్రదేశ్‌లో ఎన్నికల ప్రచారంలో ఉన్న రాజ్‌నాథ్ సింగ్ దీనిమీద స్పందించారు. 'ఇటీవల చైనా మన భూభాగంలోని కొన్ని ప్రాంతాలకు తన పేర్లు పెట్టుకుంది. ఒకవేళ మనం కూడా ఆ దేశంలోని ప్రాంతాలకు మన పేర్లు పెడితే, కేవలం పేరుమార్పిడితే ఆ ప్రాంతాలు మనవైపోతాయా? అని ఆయన ప్రశ్నించారు. బహిరంగసభ కాబట్టి ఆయన జాగ్రత్తగా మాట్లాడి ఉండవచ్చును కానీ, పాకిస్థాన్ విషయంలో ఇటీవల ఎంతో ఘాటుగా, తీవ్రంగా మాట్లాడిన ఆయన చైనావరకూ వచ్చేసరికి మరీ మెత్తగా స్పందించినట్టు చాలామందికి అనిపించింది.

అరుణాచల్ ప్రదేశ్ తనదని ఎప్పటినుంచో అంటున్న చైనా, దానిని జాంగ్‌నన్ అని పిలుచుకుంటూ, భారత్ మీద అలిగినప్పుడో, ఆగ్రహం కలిగినప్పుడో అక్కడి కొండలూ కోనలకు తన భాషలో పేర్లు ప్రకటిస్తూండటం తెలిసిన విషయమే. నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్ళలోనే ఈ నామకరణోత్సవాన్ని ఆరంభించి, ఇప్పటికి నాలుగుసార్లు ఆ పని చేసింది. చైనా ఇలా కొత్తగా పేర్లుపెడుతున్నప్పుడల్లా, పేర్లుమార్చినంత మాత్రాన నిజాలు మారిపోవని భారతదేశం అంటూ వస్తున్నది. మనలను ఎవరైనా అవమానించినా, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినా సహించేది లేదన్న రాజ్‌నాథ్ వ్యాఖ్య బాగున్నది కానీ, నిజానికి చైనా చర్యలు ఎప్పటినుంచో అదేరీతిలో ఉంటున్నాయి.

2014వరకూ ఒక్కబుల్లెట్ కూడా పేలని ఉభయదేశాల సరిహద్దులు అనంతరకాలంలో నిత్య ఉద్రిక్త ప్రాంతాలుగా మారిపోవడం తెలిసిందే. చొరబాట్లు, దురాక్రమణలు, దాడులతో అది మనని ప్రశాంతంగా ఉండనివ్వడం లేదు. అరుణాచల్‌లో మన నాయకులు కాలూనగానే చైనా ఖండిస్తుంది, కొన్ని ప్రాంతాలకు కొత్తగా పేర్లుపెడుతుంది. ఇందుకు ప్రతిగా అరుణాచల్ ఎప్పటికీ భారత్ అంతర్భాగమేనని మన నాయకులు ప్రకటిస్తారు, ట్వీట్లు చేస్తారు. తన అసమర్థతతో కాంగ్రెస్ దేశభద్రతకు ఎంత నష్టాన్ని తెచ్చిపెట్టిందో, మోదీ ప్రభుత్వం ఆ తప్పుల్ని చక్కదిద్ది దేశాన్ని ఎంత భద్రంగా ఉంచుతోందో ఎన్నికల సభల్లో పాలకులు చెప్పుకొస్తుంటారు.

కానీ, చైనా పేర్లమార్పు వెనుక అంతర్జాతీయస్థాయి ఎత్తుగడలు, న్యాయపరమైన వ్యూహాలున్నాయని కొందరి వాదన. దీనికి తోడు ఇప్పుడు చైనా అరుణాచల్‌ప్రదేశ్‌కు ఎదురుగా, వాస్తవాధీనరేఖ (ఎల్‌ఏసీ) వెంట తనవైపున 175గ్రామాలను నిర్మిస్తోందట. ఇప్పటికే ఎల్‌ఏసీగుండా చైనా నిర్మించిన ఆరువందల గ్రామాలకు ఇవి అదనం. అరుణాచల్ నుంచి లద్దాఖ్‌వరకూ చైనా గ్రామాలకుగ్రామాలు కడుతూపోతున్నందున రాబోయే రోజుల్లో సరిహద్దులు మరింత ప్రమాదకరం కాకతప్పదు. సరిగ్గా నిర్వచించని, సరిహద్దులుగా భావిస్తున్న ప్రాంతాన్ని తన గుప్పిట్లోకి తెచ్చుకోవడానికి చైనాకు ఈ చర్య ఉపకరిస్తుంది. సరిహద్దుల్లో కడుతున్న ఈ గ్రామాలన్నీ ఇకపై గస్తీకి, ఒకవేళ ఘర్షణతలెత్తితే సైనికస్థావరాలుగా ఉపయోగపడతాయి. భవిష్యత్తులో ఎల్‌ఏసీని కచ్చితంగా నిర్ణయించే సందర్భంలో ఈ గ్రామాల ఉనికి చైనాకు తోడ్పడుతుంది. వాస్తవాధీనరేఖకు అత్యంత సమీపంలో రహదారులు, రైల్వేలైన్లు ఇత్యాది మౌలిక సదుపాయాల విస్తరణతో చైనా మనకు చెక్‌పెడుతున్నది. లద్దాఖ్‌కు అతిసమీపంలో, సరిహద్దులకు ఆవల హోతాన్ ఎయిర్‌బేస్‌లో ఇటీవల రెండవ రన్‌వే కూడా సిద్ధమైంది. చైనా మన భూభాగాల్లోకి చొరబడుతూ క్రమపద్ధతిలో గస్తీలేని ప్రాంతాలను సృష్టిస్తున్నదని, అలా ఇప్పటికే చాలా భూభాగాన్ని తన వశం చేసుకున్నదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. మోదీ అధికారంలో ఉన్నంతకాలం ఒక్క అంగుళం కూడా ఎక్కడికీ పోదని బీజేపీ నాయకులు మరోపక్క హామీ ఇస్తున్నారు. సరిహద్దులు, దురాక్రమణలకు సంబంధించిన వాస్తవాలను ఇప్పటికైనా ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం ఉన్నది.

కాంగ్రెస్ మేనిఫెస్టో మేజిక్ చేయగలదా?



> కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగా సామాజిక న్యాయం విషయంలో బీజేపీకి భిన్నంగా తాను ఏ విధంగా ఆలోచిస్తుందో చెప్పేందుకే తన మేనిఫెస్టో డాక్యుమెంట్‌ను రూపొందించింది. కాని ఈ మేనిఫెస్టోను కాంగ్రెస్ ప్రజల్లోకి తీసుకువెళ్లగలుగుతుందా? దేశ ప్రజలు ఈ మేనిఫెస్టోను సీరియస్‌గా తీసుకుంటారా? కాంగ్రెస్ మాత్రమే అన్ని రంగాల్లో అభివృద్ధిని, సమానత్వాన్ని, స్వేచ్ఛను, న్యాయాన్ని సాధించగలదని ప్రజలు విశ్వసిస్తారా? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

"పదేళ్ల బీజేపీ పాలనలో ఊకదంపుడు ప్రచారమే తప్ప జరిగిందేమీ లేదు. అంతటా నిరుద్యోగం, అధిక ధరలు, పడిపోతున్న వినియోగం వల్ల అభివృద్ధి కుంటుపడింది. పేద, మధ్యతరగతి వర్గాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అంతటా విద్వేషపూరిత విచ్ఛిన్న వాతావరణం కొనసాగుతోంది. రాజ్యాంగ విలువలను పక్కనపెట్టి మెజారిటీవాదాన్ని ముందుకు తీసుకువచ్చారు. అసమానతలు పెరిగిపోయాయి. సమాజంలో ప్రతి వర్గం భయంతో జీవిస్తోంది. అన్ని రంగాల్లో అభివృద్ధి, సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం సాధించగల సామర్థ్యం కాంగ్రెస్ పార్టీకే ఉన్నది. 1965, 1971 యుద్ధాల్లో విజయం సాధించి దేశ సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉన్నది. 1991లో కాంగ్రెస్ ప్రభుత్వమే దేశంలో చెప్పుకోదగ్గ మార్పులను తీసుకువచ్చింది. "కాంగ్రెస్‌పై మరోసారి విశ్వాసం చూపండి" అంటూ గత వారం కాంగ్రెస్ పార్టీ 'న్యాయపత్రం' పేరుతో విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోలో పిలుపునిచ్చింది.

ఒకరకంగా ఈ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీ భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికలు. రెండుసార్లు పార్టీకి సారథ్యం వహించి విఫలమైన రాహుల్ గాంధీ ఇప్పుడు పార్టీ అధ్యక్షుడు కానప్పటికీ ఆయనే రథసారథి. అందువల్ల ఈ ఎన్నికల తర్వాత ఆయన పాత్ర ఎలా ఉంటుంది, కాంగ్రెస్ నాయకత్వం తీరుతెన్నులు, సంస్థ స్వరూపం ఎలా మారుతాయి అన్న వాటిపై అంతర్గత చర్చ జరుగుతోంది. ఈ విషయాలు తెలిసినప్పటికీ ఇదే ఆఖరి పోరాటం లాగా కాంగ్రెస్ నేతలు పోరాడుతున్నారు. వందలాది సభలు, సమావేశాలు, వార్ రూమ్ సమాలోచనలు, రాష్ట్ర నేతలతో చర్చలు, యాత్రలు నిర్వహిస్తున్నారు. అక్బర్ రోడ్‌లో ఏఐసీసీ కార్యాలయం ఎప్పుడు చూసినా కిటకిటలాడుతూ కనిపిస్తోంది.

"మా పార్టీ ఒక థర్డ్ క్లాస్ కంపార్ట్‌మెంట్ లాంటిది. పోయేవారు పోతున్నా, వచ్చేవారు వస్తూనే ఉంటారు. జాగా లేదని చెప్పినా తోసుకుని వచ్చేవారు ఉండనే ఉంటారు" అని ఒకప్పటి ఏఐసీసీ అధికార ప్రతినిధి వి.ఎన్. గాడ్గిల్ చాలా కాలం క్రితమే వ్యాఖ్యానించారు. స్పష్టంగా చెప్పాలంటే ఒక రాజకీయ పార్టీ వాతావరణం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తప్ప మరెక్కడా కనపడదు. ముఖ్యమంత్రులైనా, బడా నేతలైనా ఢిల్లీ వచ్చేసరికి పార్టీ ప్రధాన కార్యదర్శులను కలుసుకునేందుకు వేచి చూడాల్సిందే. పార్టీ కార్యాలయంలో పనిచేసే పీఏలను, ప్యూన్‌లను ప్రసన్నం చేసుకునే నేతలు కూడా కనపడతారు. ఒక రకంగా అక్బర్ రోడ్ కార్యాలయం మినీ ఇండియాను తలపిస్తుంది. పార్టీకి మూల కేంద్రాలైన సోనియా, రాహుల్ ఒక కుటుంబానికి చెందిన వారైనా ఒక పార్టీగా కాంగ్రెస్ సంస్కృతి భిన్నమైంది. వ్యక్తి కంటే పార్టీ ముఖ్యమైనదనే భావన ఆ పార్టీ కార్యాలయంలోకి వచ్చాక కలుగుతుంది.

"కాంగ్రెస్‌లో గాంధీ కుటుంబం ఆధిపత్యం కొనసాగడం లేదా?" అని టైమ్స్ ఆఫ్ ఇండియా సంపాదకుడు దిలీప్ పడగోంకర్ 1991 జూన్ 9న అప్పటి ప్రధాని పి.వి. నరసింహారావును చేసిన ఇంటర్వ్యూలో ప్రశ్నించారు. ఇందుకు పి.వి. సమాధానమిస్తూ "కుటుంబం అనే ఈ అంశంపై నాకు స్పష్టమైన అభిప్రాయాలున్నాయి. నేను రాజకీయాల్లోకి ప్రవేశించినప్పుడు నాకు జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీలతో వ్యక్తిగత పరిచయం లేదు. కాని కాంగ్రెస్ పార్టీయే ఒక సైద్ధాంతిక కుటుంబంగా నాకు అనిపించింది. మీరంటున్న ఒకరిద్దరు కుటుంబ సభ్యులు కూడా ఒక పెద్ద కుటుంబంలో భాగం. వారూ ఈ దేశ ప్రజల మనోభావాలు, ఆకాంక్షలకు తగినట్లుండాల్సిన వారే. అందువల్ల కాంగ్రెస్‌ను ఒకరిద్దరి వారసత్వానికి పరిమితం చేయవద్దు" అని చెప్పారు. అందువల్ల వారసత్వానికి చెందిన కుటుంబ నేతలే కాంగ్రెస్ పార్టీ అనుకోవడానికి వీల్లేదు. పార్టీ గతిశీలతకు వారు ఇరుసులా పనిచేస్తున్నప్పటికీ ఆ గతిశీలతకు వారే కారణాలు కానేకాదు. ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజశేఖర్ రెడ్డి 33 లోక్‌సభ సీట్లు సాధించినా; కర్ణాటక, తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ విజయాలు సాధించినా అక్కడి సామాజిక, రాజకీయ పరిస్థితుల్లో తలెత్తిన నేతలు ప్రజల్లో పార్టీ బలంగా ఉన్నదనే విశ్వాసం కలిగించారు. స్థానికంగా బలోపేతమైన నాయకులే కాంగ్రెస్ పార్టీకి బలం. అంతేకాదు, కాంగ్రెస్ పార్టీలో ఒక మేధో వలయం స్పష్టంగా కనిపిస్తుంది. పివి నరసింహారావు, ప్రణబ్ ముఖర్జీ, శంకర్ రావు చవాన్, జగజీవన్ రామ్, కమలాపతి త్రిపాఠీ, శివశంకర్, కోట్ల విజయ భాస్కర్ రెడ్డి, గాడ్గిల్, జైపాల్ రెడ్డి, హెచ్.ఆర్. భరద్వాజ నుంచి మన్మోహన్ సింగ్, వీరప్ప మొయిలీ, చిదంబరం, సల్మాన్ ఖుర్షీద్, జైరాం రమేశ్, కె.రాజు, శశిథరూర్, అభిషేక్ సింఘ్వీ తదితరుల వరకు కాంగ్రెస్‌లో మేధో సంపద కనిపిస్తూనే ఉంటుంది. వీరు కాక మాజీ అధ్యాపకులు, వైస్ చాన్స్‌లర్లు, జర్నలిస్టులు, న్యాయవేత్తలు, శాస్త్రవేత్తలు కాంగ్రెస్‌కు భావజాలపరంగా మద్దతునిస్తూనే కనపడతారు. వీరంతా ఒక టీమ్‌గా పనిచేస్తూ కాంగ్రెస్‌కు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మార్గదర్శకత్వం అందించేందుకు ప్రయత్నిస్తారు.

ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ తాజాగా ప్రకటించిన మేనిఫెస్టోకు ప్రాధాన్యత ఉన్నది. ఇది ఒక్కరు రూపొందించిన పత్రం కానే కాదని, ఎంతో మథనం తర్వాత రూపొందించిన పత్రమని చదివిన వారికి అర్థమవుతుంది. ఈ మేనిఫెస్టో ఓబీసీ, దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, మహిళలు, రైతులకు సామాజిక న్యాయం అందించే దిశగా తమ ఆలోచనలను, కార్యాచరణను ప్రకటించింది. నిరుద్యోగులకు, మహిళలకు, రైతులకు పెద్ద ఎత్తున నిధులను ప్రకటించింది. తమ హయాంలోనే గ్రామీణ ఉపాధి పథకం, ఆహార భద్రత వంటివి ప్రవేశపెట్టిన విషయాలను గుర్తు చేసింది. రైతుల గిట్టుబాటు ధరకు చట్టబద్ధత కల్పించడం, నిరుద్యోగ యువకులకు నైపుణ్యాభివృద్ధితో పాటు ఉపకార వేతనం, ప్రతి పేద కుటుంబానికి రూ. లక్ష నగదు, లక్షలాది ఉద్యోగాల భర్తీ, ప్రభుత్వోద్యోగాల్లో కాంట్రాక్టు పద్ధతిని రద్దు చేయడం, పేదలకు అదనపు భూమిని బదిలీ చేయడం, అగ్నిపథ్‌ను రద్దు చేయడం వంటి అనేక హామీలను కాంగ్రెస్ గుప్పించింది. ఒక రకంగా ఇది పేదలకు అనుకూలంగా, వివిధ అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం అందించే దిశగా రూపొందించిన పత్రం. కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగా సామాజిక న్యాయం విషయంలో బీజేపీకి భిన్నంగా తాను ఏ విధంగా ఆలోచిస్తుందో చెప్పేందుకే తన మేనిఫెస్టో డాక్యుమెంట్‌ను రూపొందించింది.

కాని ఈ మేనిఫెస్టోను కాంగ్రెస్ ప్రజల్లోకి తీసుకువెళ్లగలుగుతుందా? దేశ ప్రజలు ఈ మేనిఫెస్టోను సీరియస్‌గా తీసుకుంటారా? కాంగ్రెస్ మాత్రమే అన్ని రంగాల్లో అభివృద్ధిని, సమానత్వాన్ని, స్వేచ్ఛను, న్యాయాన్ని సాధించగలదని ప్రజలు విశ్వసిస్తారా? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. బీజేపీకి భిన్నమైన ఆలోచనా విధానం గల పార్టీగా కాంగ్రెస్ తనను తాను ఎంత రూపుదిద్దుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ ఈ ఎన్నికల్లో ఆ పార్టీ జనాన్ని ఆ దిశన ఎంత మేరకు ఆలోచింప చేయగలదనేది చర్చనీయాంశం. కాంగ్రెస్ పార్టీని ఎప్పుడూ గతంలో చేసిన తప్పులు వెంటాడుతుంటాయి. బీజేపీపై ఇప్పుడు చేసే ప్రతి విమర్శ ఎప్పుడో ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎదుర్కొన్నదే. ఒకప్పుడు కాంగ్రెస్‌ను తిరస్కరించినట్లే బీజేపీని కూడా తిరస్కరించే క్రమం రాకపోదు కాని కాంగ్రెస్‌లో మార్పు వచ్చిందని, అది తమ కోసం నిలబడుతుందని ప్రజలు గ్రహించే వరకూ మళ్లీ ఆ పార్టీ జనాదరణ కోసం వేచి చూడాల్సి ఉంటుంది.

విచిత్రమేమంటే కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉన్న అంశాల గురించి చర్చించి అవి ఎలా ఆచరణసాధ్యం కావో వివరించేందుకు బీజేపీ నేతలు పూనుకోవడం లేదు. కాంగ్రెస్ మేనిఫెస్టోను ముస్లింలీగ్ మేనిఫెస్టో గానో, పాకిస్థాన్ మేనిఫెస్టో గానో చిత్రించి కొట్టి పారేస్తున్నారు. నిజానికి కాంగ్రెస్ మేనిఫెస్టోను ఎండగట్టి తాము ఏ విధంగా సామాజిక న్యాయం చేస్తున్నామో, అభివృద్ధిపై తమ దృక్కోణం ఏమిటో ప్రజలకు వివరించే అవకాశం బీజేపీకి ఉంది. కాని బీజేపీ నేతల దారి వేరు. కాంగ్రెస్‌ను హిందూ వ్యతిరేక పార్టీగా చిత్రిస్తే మిగతా అంశాలను ప్రజలు విస్మరిస్తారనేదే ఆ పార్టీ నేతల అభిప్రాయం.

మరో పది రోజుల్లో లోక్‌సభ ఎన్నికలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రజలు తీసుకునే నిర్ణయం అత్యంత కీలకమైనది. ఈ రెండు పార్టీల భావజాలాలకు, వ్యవహార శైలికి, మేనిఫెస్టోలకూ వారెంత ప్రాధాన్యతనిస్తారో చెప్పలేము. బీజేపీయే మళ్లీ గెలుస్తుంది అన్న అభిప్రాయాన్ని మధ్యతరగతి వర్గాల్లో మానసికంగా కల్పించడంలో ఆ పార్టీ ఇప్పటికే విజయం సాధించింది. గుజరాత్, కర్ణాటక, తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, హిమాచల్, హర్యానా, అస్సాం తదితర రాష్ట్రాల్లోని దాదాపు 180 సీట్లలో బీజేపీని కాంగ్రెస్ ముఖాముఖి ఎంతమేరకు ఢీకొనగలదన్న ప్రశ్నపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ సీట్లలో కనీసం సగం సీట్లు కాంగ్రెస్ గెలుచుకున్నా ఆ పార్టీ వంద సీట్లను సులభంగా సాధించే అవకాశం ఉన్నది. అప్పుడు రాజకీయ సమీకరణలు భిన్నంగా ఉంటాయి. కాని ఈ మేనిఫెస్టో కాంగ్రెస్ పార్టీకి ఎంతవరకు ఉపయోగపడుతుందో చెప్పలేము.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)



కలవరపెట్టిన మొరార్జీ భద్రాచల యాత్ర

మారుమూల గిరిజన ప్రాంతమైన భద్రాచలంలో కొలువైన రాముణ్ణి దర్శించుకోవడానికి 1968లో అప్పటి ఉపప్రధానమంత్రి మొరార్జీ దేశాయి ఒక ప్రత్యేక సందర్భంలో విచ్చేశారు. అప్పటికి ఆయన వయస్సు 72 సంవత్సరాలు. నేనప్పుడు ఆలయంలో సైటు ఇంజనీరుగా పని చేస్తున్నాను. దేవాలయ పునర్నిర్మాణం, గోవిందరాజుల గుట్టమీద రామదాసు ధ్యానమందిరం, దేవునితోటలో సత్రాల నిర్మాణం పనులు 400 మంది శిల్పులతో చాలా హడావిడిగా సాగుతున్నాయి. అప్పటికింకా దేవాలయ సంప్రోక్షణ జరగలేదు. ఆ దశలో మొరార్జీ దేశాయి వస్తున్నారని, ఆయన వెంట అప్పటి ముఖ్యమంత్రి కాసుబ్రహ్మానందరెడ్డి, ఆయన సతీమణి రాఘవమ్మ, మంత్రులు మర్రి చెన్నారెడ్డి, రుద్రంరాజు రామలింగరాజు, దేవాదాయశాఖ కమిషనర్ నారాయణ చెట్టి కూడ వస్తున్నట్లు సమాచారం అందింది.

కృష్ణాజిల్లా మచిలీపట్నం సమీపంలోని చిట్టిగూడూరుకు చెందిన ఉద్దండ సంస్కృత పండితుడైన వరదాచారి భద్రాచల దేవాలయ పునరుద్ధరణ సంఘానికి ఉపాధ్యక్షుడు. ఆయనకు స్వస్థలంలో సంస్కృత కళాశాల ఉండేది. మన రెండో రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణకు ఆయన బాల్యంలో సహాధ్యాయి. ఆవిధంగా వరదాచారికి మొరార్జీ దేశాయితో పరిచయం ఏర్పడింది. భద్రాచల రాముడి ఆలయ ప్రాంగణంలో చిత్రకూట మంటపం నిర్మించాలని వరదాచారి సంకల్పం, అవసరమైన ఆర్థిక వనరులను కూడా సమకూర్చుకున్నారు. మొరార్జీ దేశాయితో ఆ మంటపానికి శంకుస్థాపన చేయించాలన్న లక్ష్యంతో ఢిల్లీ వెళ్ళి ఆయనకు భద్రాచల ప్రాశస్త్యాన్ని వివరించి ఆహ్వానించారు, మొరార్జీ ఒప్పుకున్నారు.

వచ్చేవ్యక్తి సామాన్యుడు కానందున భద్రాచలంకు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగమంతా కదలివచ్చింది. ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి, హేమాహేమీలతో పాటు గణపతి స్థపతి, కాంగ్రెసు నాయకులు నీలంరాజు వేంకటశేషయ్య, దేవాలయ ఉద్ధరణ సంఘం అధ్యక్షుడు అక్కినేని నర్సయ్య, దేవాలయ అధికారి మాదిరెడ్డి మాధవరావు, అనేకమంది పురప్రముఖులతో ఆలయ ప్రాంగణమంతా సందడి నెలకొంది. ఇక వరదాచారి హడావిడి చెప్పనలవికాదు. మొరార్జీని ఆలయమర్యాదలతో, అర్చకుల మంత్రోచ్చరణలతో రాజగోపురం నుంచి, సాదరంగా గర్భగుడిలోకి తీసుకెళ్లి సీతారామచంద్ర లక్ష్మణ సమేత మూలవిరాట్టు దగ్గర పూజలు చేయించారు. తర్వాత గణపతి స్థపతి ఉపప్రధానిని దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేయిస్తూ, శిల్పకళ గురించి వివరిస్తుంటే మర్రి చెన్నారెడ్డి దానిని హిందీలోకి తర్జుమాచేసి చెప్పారు.

భద్రాచల రామాలయం శిఖరాన ప్రతిష్ఠించిన సుదర్శనచక్రం సుమారు 8 అడుగుల ఎత్తు ఉంటుంది. ఆలయ రికార్డుల ప్రకారం, భక్తరామదాసు గోదావరిలో స్నానం చేస్తుండగా ఈ సుదర్శనచక్రం ఆయన పాదాలకు తగిలింది. దానిని బయటకు తీసి పూజలు చేయించి ఆలయ శిఖరాన ఆయన అమర్చారు. ఇప్పటికీ అదే సుదర్శనచక్రాన్ని శిఖరభాగాన చూడవచ్చు. మొరార్జీ దేశాయిని ఆ సుదర్శనచక్రం వరకు ఎక్కించే బాధ్యత నాపైన పడింది. రామాలయం ఎత్తు 32 అడుగులు. అప్పటికింకా ఆలయ సంప్రోక్షణ పూర్తికాకపోవడంతో కిందనుంచి పైకి తాటిమట్టలతో మెట్లు ఏర్పాటు చేశాం. మొరార్జీని నేను, గణపతి స్థపతి అతిజాగ్రత్తగా శిఖరంపైకి ఎక్కించాం. అక్కడ వేదపండితులు ఆయనతో సుదర్శనచక్రం మీద మంత్రజలం చల్లించి వేదోక్తంగా పూజ చేయించారు. తర్వాత మళ్లీ అంతే జాగ్రత్తగా ఆయనను కిందికి దించాం. అప్పటికిగాని పెద్దగండం గడిచినట్లు ఊపిరి పీల్చుకోలేకపోయాం. ఎంతైనా ఆయన దేశ ఉపప్రధానమంత్రి. ఏమాత్రం తేడా జరిగినా మేం ఏమైపోయి ఉండేవాళ్లమో.

> మొరార్జీ దేశాయిని రామాలయం పైనున్న సుదర్శనచక్రం వరకు ఎక్కించే బాధ్యత నాపైన పడింది. ఆలయం ఎత్తు 32 అడుగులు. అప్పటికింకా ఆలయ సంప్రోక్షణ పూర్తికాకపోవడంతో కిందనుంచి పైకి తాటిమట్టలతో మెట్లు ఏర్పాటు చేశాం. మొరార్జీని నేను, గణపతి స్థపతి అతిజాగ్రత్తగా శిఖరంపైకి ఎక్కించాం. అక్కడ వేదపండితులు ఆయనతో సుదర్శనచక్రం మీద మంత్రజలం చల్లించి వేదోక్తంగా పూజ చేయించారు. తర్వాత మళ్లీ అంతే జాగ్రత్తగా ఆయనను కిందికి దించాం. అప్పటికిగాని గట్టిగా ఊపిరి పీల్చుకోలేకపోయాం. ఎంతైనా ఆయన దేశ ఉపప్రధానమంత్రి. ఏమాత్రం తేడా జరిగినా మేం ఏమైపోయి ఉండేవాళ్లమో!

తదుపరి మొరార్జీ కళ్యాణమంటపాన్ని సందర్శించారు. 1961లో గణపతి స్థపతి ఆధ్వర్యంలో మొదలైన దీని నిర్మాణం 1965లో పూర్తయింది. ఆరోజుల్లోనే దీనికి 40 లక్షలు ఖర్చయ్యాయని అంచనా. మంటప నిర్మాణానికి ఉపయోగించిన శిలలను మద్రాసు సమీపంలోని తిండివనం క్వారీనుంచి తెప్పించారు. ఈ శిలలు మైనంలాగా శిల్పుల చేతుల్లో కరిగిపోయి అద్భుతమైన శిల్పశోభను సంతరించుకున్నాయి. చుట్టూ రామాయణఘట్టాలు, వాటిపైన నాలుగు మూలల్లో నాలుగు స్తంభాలు. మధ్యలో అతిరమ్యంగా చెక్కిన కళ్యాణ పీఠం. ఈ పీఠంపైనే ప్రతి సంవత్సరం శ్రీసీతారాముల కళ్యాణం అతివైభవంగా జరుగుతుంది. పీఠం పైభాగంలో అందమైన కప్పు, ఆపై విమానం. మహత్తరమైన శిల్పకళతో విరాజిల్లే ఇంత అందమైన కళ్యాణమంటపం దేశంలోనే ఎక్కడా లేదంటే అతిశయోక్తి కాదు. మొరార్జీదేశాయి కళ్యాణమంటపంలో నిక్షిప్తమైన శిల్పకళను చూసి చాలా అబ్బురపడి గణపతి స్థపతిని అభినందించారు. ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి కోరికపైన, ఆ మంటపం వద్ద అంతా గ్రూపు ఫొటో దిగారు (చిత్రంలో రాఘవమ్మగారి తలపైన కన్పడుతున్నది ఈ రచయిత).

ఆ సందర్భంగా మొరార్జీ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే చిన్న సంఘటన జరిగింది. భద్రాచల గ్రామ పంచాయతీ అధ్యక్షుడి కుమార్తె శైలజ పదకొండేళ్ల బాలిక. ఏడవ తరగతి చదువుతోంది. నేతలందరూ గ్రూపు ఫొటో దిగుతున్న చోటకు ఆ బాలిక పాఠశాల యూనిఫాంలో వచ్చి మొరార్జీని ఆటోగ్రాఫ్ అడిగింది. కానీ ఆయన ఖద్దరు ధరించిన వాళ్లకు తప్ప ఇంకెవరికీ ఆటోగ్రాఫ్ ఇవ్వరట. శైలజ వేసుకున్న స్కూలుడ్రెస్సును చూసి ఆటోగ్రాఫ్ ఇవ్వడానికి నిరాకరించారు. దాంతో అక్కడే ఉన్న ఆ బాలిక తండ్రి వెంటనే ఇవతలకు వచ్చి, 'అయ్యా ఈ అమ్మాయి నా కూతురు. నేను కాంగ్రెసు కార్యకర్తను. ఖాదీ చొక్కా వేసుకున్నాను కదా. మా అమ్మాయికి ఆటోగ్రాఫ్ ఇవ్వండ'ని అభ్యర్థించాడు. అతడిని తేరిపార చూసిన మొరార్జీ, 'నీ చొక్కా ఖాదీయే, కాని ప్యాంటు ఖాదీ కాదు. అందుకే ఆటోగ్రాఫ్ ఇవ్వను' అని నిర్మొహమాటంగా చెప్పేశారు. ముఖ్యమంత్రి, మంత్రులతో సహా అక్కడున్న అందరూ ఆ నిక్కచ్చితనానికి నివ్వెరపోయారు. అదీ మొరార్జీ దేశాయి! నాటి నేతలు నమ్మిన సిద్ధాంతానికి ఏవిధంగా కట్టుబడి ఉండేవాళ్లో చెప్పడానికి ఇదో మచ్చుతునక. ఆలయ పునరుద్ధరణ పనులు పూర్తికాని దశలో జరిగిన మొరార్జీ దేశాయి భద్రాచల యాత్ర ఎలాంటి ఒడుదుడుకులు లేకుండా సాగిపోయినందుకు అందరం తేలికగా ఊపిరి పీల్చుకున్నాం.

■ కొప్పుల ప్రకాశం (రిటైర్డు ఇంజనీరు, హైదరాబాద్)

(నేడు మొరార్జీ దేశాయ్ వర్ధంతి)

సామాజిక సంస్కర్తల దార్శనికుడు

మహాత్మా జ్యోతీరావ్ గోవింద్ ఫూలే 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్ర లోని సతారా గ్రామంలో ఒక మాలి కుటుంబంలో గోవిందరావు, చిన్నాబాయి దంపతులకు జన్మించాడు. వీరి వృత్తి ఆనాటి పీష్వా కుటుంబానికి పువ్వులు సరఫరా చేయడం. ఆ కాలం నాటి సమాజంలోని అసమానతలు, అవిద్య అజ్ఞానాలకు కులవైషమ్యాలు కారణమని, ముఖ్యంగా ఆనాటి సమాజంలో స్త్రీ వెనుకబాటుతనానికి, అణచివేతకు విద్యా జ్ఞానం లేకపోవడం ప్రధాన కారణం అని గ్రహించి స్త్రీ విద్య కోసం కృషి చేశారు జ్యోతీరావు ఫూలే. సమాజంలోని అసమానతలను పోగొట్టడానికి, అలాగే స్త్రీ, పురుషుల మధ్య లింగ వివక్షతను తొలగించడానికి ఆయన విశేషంగా కృషి చేశారు.



అమెరికాకు చెందిన థామస్ పైన్ రచించిన "ద రైట్స్ ఆఫ్ మ్యాన్" అనే గ్రంథం వల్ల ప్రభావితుడైన ఫూలే, ప్రపంచాన్ని మార్చగల సాధనం విద్య ఒక్కటే అని, సమాజంలోని రుగ్మతలను తొలగించడానికి ప్రజలు జ్ఞానవంతులు కావాలని ప్రగాఢంగా నమ్మాడు. మొదటగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి గానూ బాల, బాలికలకు పాఠశాలలను ప్రారంభించాడు. ఆనాటి బ్రిటీష్ ఇండియా ప్రభుత్వం ఫూలేని పూనా మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యుడిగా నియమించడంతో అణగారిన వర్గాల వారి హక్కుల కోసం, స్త్రీల సమానత్వం కోసం, అలాగే రైతుల సమస్యల కోసం ప్రభుత్వ పెద్దలతో రాజీలేని పోరాటం జరిపి, రాజకీయ పాలనా సమావేశాలలో ప్రజా సమస్యలపై గళమెత్తాడు.

జ్యోతిబా ఫూలే సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలలో అక్షర చైతన్యం నింపడానికి చేస్తున్న కృషిని గౌరవిస్తూ 1888లో ముంబాయికి చెందిన సామాజిక సంస్కర్త రావ్ బహదూర్ విఠల్ రావు కృష్ణాజీ వాండేకర్, కొంతమంది ప్రజలు కలసి 'మహాత్మా' అను బిరుదును జ్యోతీబా ఫూలేకి ప్రదానం చేశారు. 19వ శతాబ్దంలో జ్యోతిబా ఫూలే ప్రారంభించిన "అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడం" అనే మహోన్నత ఆశయాన్ని 20వ శతాబ్దంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ సైతం స్ఫూర్తిగా తీసుకొని కొనసాగించారు. ఆశాజనకమైన సమసమాజ నిర్మాణం జరగాలంటే ప్రతి వ్యక్తికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కల్పించాలి అని ఫూలే విశ్వసించాడు. బానిసత్వాన్ని, కుల వివక్షతను నిశితంగా విమర్శిస్తూ ఫూలే రాసిన 'గులాంగిరి', 'సేద్యగాడిపై ఛర్నాకోలా' వంటి రచనల అధ్యయనం బడుగు, బలహీన వర్గాల సమాజాన్ని చైతన్యపరచి వారి ఆలోచనా విధానాన్ని ఈనాటికీ ప్రభావితం చేస్తూనే ఉన్నాయి.

విశాల మానవ ధర్మానికి సంబంధించిన అవగాహనను ఆనాటి సమాజంలో కలిగించడానికి 'సత్య శోధక్ సమాజం' అనే సంస్థను ఏర్పాటు చేసి "మనమంతా దేవుని సంతానం, దేవుని దృష్టిలో మనందరం సమానం. ఈ భేద భావాలు మనం సృష్టించుకొన్నవే" అని పేర్కొంటూ నిర్బంధ విద్య, స్వదేశీ భావన, నిరాడంబరతని అలవర్చేందుకు సత్యశోధక సమాజం ఎంతో అవసరమని... ఇవే ఈ సంస్థ లక్ష్యాలు అని ఫూలే ప్రకటించాడు. ధనుంజయ్ కీర్ రచించిన ఫూలే జీవితచరిత్రలో "సామాజిక విప్లవాల పితామహుడిగా" మహాత్మా జ్యోతీరావ్ ఫూలేను అభివర్ణించాడు. ఫూలే ప్రజాస్వామిక వ్యవస్థను అభిలషించాడు. మూఢవిశ్వాసాలను వ్యతిరేకించాడు. వైదిక హిందూ ఆధిక్యతావాదాన్ని విమర్శించాడు. ఫూలేయిజం లోని ప్రాథమిక అంశం మానవతావాదం. ఫూలే ప్రపంచ పౌరహక్కుల, మానవ హక్కుల ఉద్యమ నిర్మాతల్లో, సిద్ధాంతకర్తల్లో ఒకరు. తన జీవితాన్నే ప్రజాసేవకై అర్పించిన యోధుడు మహాత్మా జ్యోతీబా ఫూలే... 1890 నవంబర్ 28న పూణేలో మరణించాడు. సామాజిక సమానత్వం, సమరసత కోసం కృషి చేసిన మహాత్మా జ్యోతీబా ఫూలే ఆలోచనలను ఆచరిస్తూ, ఆయన ఆశయాలను సాధించడమే మనం ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి.

– గోవిందు సురేంద్ర
చరిత్ర అధ్యాపకులు

(రేపు జ్యోతీబా ఫూలే జయంతి)

సామాజిక న్యాయానికి సమాధి కడుతున్నదెవరు?

రాజ్యాధికారంలో వాటా అయినా సంక్షేమంలో భాగస్వామ్యమైనా ఆఖరున, అట్టడుగున ఉన్నవారికి అందినప్పుడే ప్రజాస్వామ్యానికి సార్థకత అంటారు బాబా సాహెబ్ డా. బి.ఆర్ అంబేడ్కర్. ఇవాళ తెలంగాణ రాష్ట్రంలో మాత్రం అది దరిదాపుల్లో కూడా కనిపించడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నాయి, పాలకులూ మారుతున్నారు. అట్టడుగున ఉన్న దళితుల్లో మరింత అట్టడుగున ఉన్న మాదిగలకు మాత్రం కనీస ప్రాతినిధ్యం లేకుండా పోతున్నది. తాజాగా పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కూడా ఈ రకమైన అన్యాయం మాదిగలకు జరుగుతోంది. తెలంగాణలో కొత్తగా అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీ సైతం మాదిగలకు వారి జనాభాకు అనుగుణంగా సీట్లు కేటాయించకపోవడం ఆశ్చర్యకరం. తెలంగాణలో అతిపెద్ద సామాజిక సమూహమైన మాదిగలను విస్మరించడం చారిత్రక ద్రోహమే అవుతుంది.

తెలంగాణ రాష్ట్ర సాధన అనంతరం కేసీఆర్ నేతృత్వంలో అధికారంలోకి వచ్చిన గులాబీ సర్కార్ హయాంలో మాదిగలకు అన్ని రంగాల్లో అన్యాయమే జరిగింది. మూడు దశాబ్దాలుగా మాదిగల వర్గీకరణ సమస్యను ఈ పాలకులు ఏ మాత్రం పట్టించుకోలేదనేది జగద్విదితం. పైగా దానిని వీలైనంత దాటివేసేందుకు అది మా చేతిలో లేదు, కేంద్రం చేతుల్లో ఉందని కేసీఆర్ ముఖం చాటేశారు. మరి వీరి చేతిలో ఉన్న ఎమ్మెల్యే ఎంపీ సీట్లల్లోనే కాదు ఆఖరికి నామినేటెడ్ పోస్టుల్లో సైతం మాదిగలకు అన్యాయమే చేశారు. తెలంగాణ వచ్చిన తరువాత యూనివర్సిటీలకు వీసీల నియామకం చేపట్టి పదిమంది వీసీలను నియమించారు. ఇందులో ఆరుగురు వీసీలకు ఓసీ సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్లకే అవకాశం కల్పించారు. మిగిలిన నాలుగింటిలో రెండు బీసీలకు, ఒకటి ఎస్టీకి, ఒకటి ఎస్సీకి కేటాయించారు. ఆ ఒక్కటి కూడా మాల సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్‌కు అవకాశం కల్పించారు. అలాగే టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా, ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ఇట్లా చెప్పుకుంటూపోతే మాదిగల కంటే మాలలకే కేసీఆర్ సర్కార్ పెద్దపీట వేసింది. మాదిగల నుండి తాటికొండ రాజయ్యకు డిప్యూటీ సీఎం ఇచ్చినట్టే ఇచ్చి దానిని మూన్నాళ్ల ముచ్చట చేసింది. ఇక మంత్రివర్గంలో కూడా కొప్పుల ఈశ్వర్ వంటి మాల సామాజికవర్గ వ్యక్తులనే ప్రోత్సహించి మంత్రి పదవులు కట్టబెట్టింది. అంతేకాదు ఆఖరికి 'దళిత బంధు' పథకంలో కూడా మాదిగలకు అన్యాయమే జరిగింది. అందుకు కారణం ప్రభుత్వానికి దగ్గరగా ఉండే మాల మేధావులు, రాజకీయవేత్తలు చక్రం తిప్పడమే.

నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం మొదలుకొని నిన్నటి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం దాకా మాదిగల భాగస్వామ్యం లేని ఉద్యమం లేదంటే అతిశయోక్తి కాదు. మరోవైపు చదువుకుని ఉద్యోగాల్లో స్థిరపడిన మాలలు సహజంగానే అధికారం రుచి చూడగలిగారు. గల్లీ నుండి ఢిల్లీ దాకా లాబీయింగ్‌లు చేయగలుగుతున్నారు. మాదిగల వెనుకబాటుతనం, అనైక్యత, అమాయకత్వం మాలలకు వరంగా మారింది. దీంతో చూస్తుండగానే అన్ని పార్టీల్లో మాలల నాయకత్వం ఎదిగి వచ్చింది. వ్యాపార వాణిజ్య రంగాల్లో సైతం మాల బిజినెస్‌మెన్‌లు ఎదిగి వచ్చి, సొంత కులాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లగలుగుతున్నారు. దళితుల్లోని రెండు ప్రధాన కులాల మధ్య ఉన్న ఈ ఆర్థిక అంతరాలు, అభివృద్ధి నేపథ్యాల వైరుధ్యం మన పాలకులకు తెలియంది కాదు.

> డబ్బు, పలుకుబడి ఉన్న మాలలు ఒక్కింట్లోనే రెండు, మూడు టిక్కెట్లు తెచ్చుకొని మాదిగలను రాజ్యాధికారానికి శాశ్వతంగా దూరం చేస్తున్నారు. అగ్రవర్ణ పార్టీల నేతలు సైతం వారికే వంత పాడుతున్నారు. మాలలు రాజకీయంగా ఎదగకూడదని ఏ మాదిగా కోరుకోడు. కాకుంటే మాదిగలకు న్యాయంగా దక్కాల్సిన నోటికాడి బుక్కను విద్యా, ఉద్యోగాల్లో కొల్లగొట్టినట్టు, మాలలు రాజకీయాల్లో కూడా కొల్లగొట్టడం సామాజిక న్యాయం అనిపించుకోదు.



అయినా సరే అభివృద్ధి చెందిన మాలలకే పెద్దపీటను వేయడం నాటి బీఆర్ఎస్ నుంచి నేటి కాంగ్రెస్ దాకా నిరంతరం కొనసాగుతూనే ఉంది. జనాభా పరంగా చూసుకుంటే 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణలో అధికారికంగా నమోదైన మాదిగల జనాభా 32 లక్షల 33వేల 642, అలాగే మాలల జనాభా 15లక్షల 27వేల 143. మరి 2021 జనాభా లెక్కల వివరాలు వెల్లడిస్తే మాదిగల జనాభా మరో పది పదిహేను లక్షలు పెరిగితే సుమారు అరకోటికి చేరువలో ఉంటుంది. అరకోటి జనాభా కలిగిన సామాజిక సమూహమైన మాదిగలకు అన్యాయం చేయడం ఏ పాలకులకైనా తగదు.

మాదిగలను ఎంత విస్మరణకు గురిచేస్తున్నారంటే బాబూ జగ్జీవన్‌రామ్ దగ్గరి నుంచి తొలిదశ తెలంగాణ ఉద్యమంలో రాష్ట్ర సాధన కోసం తన మంత్రి పదవిని సైతం త్యాగం చేసిన సదాలక్ష్మి నుండి డా. కొల్లూరి చిరంజీవి దాకా అందరికీ అన్యాయమే చేస్తున్నారు. కేసీఆర్ చేసిన పొరపాట్లను మేం చేయబోం అన్నట్టు సంస్కరణను మొదలుపెట్టిన రేవంత్ సర్కార్ కూడా ఈసారి మాదిగలకు తీరని అన్యాయం చేసింది. పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగల అడ్రస్‌ను గల్లంతు చేసింది.

తెలంగాణలో ఉన్న ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలైన పెద్దపల్లి, వరంగల్, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల్లో ఒక్కటంటే ఒక్క స్థానం కూడా కాంగ్రెస్ మాదిగలకు కేటాయించకపోవడం వెనక కుట్ర ఎవరిది? ఏ సామాజిక సమీకరణాలు పని చేశాయి? అసలు తెలంగాణలో మాలలు ప్రజాప్రతినిధులుగా ఎన్నికవుతున్న నియోజకవర్గాల్లో సింహభాగం జనాభా మాదిగలదే. అంటే ఓట్లు మాదిగలవి, సీట్లు మాత్రం మాలలవి. తెలంగాణలో చాలా గ్రామాల్లో మాలల ఇండ్లు ఒక్కటి అర కూడా లేనివి వందల ఊర్లు ఉన్నాయి. మరి రాజకీయ పార్టీలు మాత్రం మాదిగలకు అన్యాయం చేస్తూ తమ పబ్బం గడుపుకుంటున్నాయి. దీనికి తోడు మాదిగల్లో నాయకులు ఎక్కువగా ఉండడం, ఐక్యత లేకపోవడం, అగ్రవర్ణ నేతల చేతుల్లో పావులుగా మారడం కూడా మరో బలహీనతగా కనిపిస్తున్నది. దీంతో మాదిగలు అధికంగా ఉన్న నియోజకవర్గాల్లో సైతం మాలలు ఆయా పార్టీ అధిష్ఠానాలను ఒప్పించి, మెప్పించి సీట్లు తెచ్చుకోగలుగుతున్నారు. ఈ పరిణామం ఇలాగే కొనసాగితే మాదిగల నుంచి మరిన్ని ఉద్యమాలు పుట్టుకురావడం తథ్యం.

ఒకానొక సందర్భంలో కొప్పుల రాజు ఐఏఎస్‌ను తెలంగాణలో ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేయమని కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశిస్తే, అది మాదిగల నియోజకవర్గం, అక్కడ నేను పోటీ చేయడం సరికాదని స్వచ్ఛందంగా తప్పుకున్న స్ఫూర్తి ఇవాళ కొరవడుతోంది. డబ్బు, పలుకుబడి ఉన్న మాలలు ఒక్కింట్లోనే రెండు, మూడు టిక్కెట్లు తెచ్చుకొని మాదిగలను రాజ్యాధికారానికి శాశ్వతంగా దూరం చేస్తున్నారు. మాలలు రాజకీయంగా ఎదగకూడదని ఏ మాదిగా కోరుకోడు. కాకుంటే మాదిగలకు న్యాయంగా దక్కాల్సిన నోటికాడి బుక్కను విద్యా, ఉద్యోగాల్లో కొల్లగొట్టినట్టు, మాలలు రాజకీయాల్లో కూడా కొల్లగొట్టడం సామాజిక న్యాయం అనిపించుకోదు. ఇది అన్నదమ్ముల మధ్య మరింత అగాధాన్ని పెంచుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకోవాల్సిన బాధ్యత పాలకులది. కీలకమైన ఈ విషయాన్ని విస్మరిస్తే మాదిగలకు అన్యాయం చేస్తున్న ఏ పార్టీకైనా ఈ దగాపడిన బిడ్డలు ఎందుకు ఓటేస్తారు?

● డా. పసునూరి రవీందర్
రాష్ట్ర ఉపాధ్యక్షులు, తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల సంఘం

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

మంగళవారం ఉష్ణోగ్రత | గరిష్ఠం : 37.0° C | కనిష్ఠం : 25.0° C

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : బుధవారం సా : 6.36 గం..
సహర్ : గురువారం -

ఉగాది.. వైభవం..

వేడుకగా తెలుగు సంవత్సరాది కార్యక్రమాలు

ఆలయాల్లో ప్రత్యేకపూజలు, పంచాంగ శ్రవణాలు, కవి సమ్మేళనాలు


వేయిస్తంభాల ఆలయంలో శ్రీరామ నవమి నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

చైత్రశుద్ధ పాడ్యమి మంగళవారం తెలుగువారి తొలిపర్వదినమైన శ్రీ క్రోధి నామ ఉగాది పండుగను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. ఇళ్లను మామిడి తోరణాలతో అలంకరించుకుని ప్రత్యేక పూజలు చేసి.. షడ్రుచుల పచ్చడిని సేవించి భక్షాలను ఆరగించారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరగ్గా.. సాయంత్రం వేళ సంప్రదాయబద్ధంగా పంచాంగ శ్రవణాలు, కవిసమ్మేళనాలన నిర్వహించారు. అలాగే ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో పది రోజుల పాటు జరిగే శ్రీ రామనవమి వేడుకలను ప్రారంభించారు. ఈ క్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని ఆలయాల్లో జరిగిన పూజల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హైదరాబాద్ బంజారాహిల్స్ మినిస్టర్ క్వార్టర్‌లోకి అడుగు పెట్టారు. ఈ సందర్భంగా సురేఖ, మురళీధర్‌రావు దంపతులు, కూతురు, అల్లుడు, మనువడు, మనవరాలుతో గృహప్రవేశ పూజాకార్యక్రమాన్ని నిర్వహించారు.

- హనుమకొండ కల్చరల్

వివరాలు : 8లో..


భద్రకాళి అమ్మవారికి లక్ష గులాబీలతో అర్చన


హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్‌లోకి గృహ ప్రవేశం చేస్తున్న మంత్రి కొండా సురేఖ దంపతులు



భద్రాద్రి రాములోరి తలంబ్రాలు

ఇళ్ల వద్దకే..

- కార్గో ద్వారా పంపిణీకి ఆర్టీసీ చర్యలు
- ఈనెల 17 వరకు బుకింగ్‌కు అవకాశం
- రూ.151 చెల్లించి వివరాలు నమోదు చేసుకోవాలి



వివరాలు : 7లో..



బ్లడ్‌బ్యాంకులు ఖాళీ..!

- ఉమ్మడి జిల్లాలో రక్తానికి తీవ్ర కొరత
- ఎంజీఎంలో అందుబాటులో వంద యూనిట్లే!
- తగ్గుతున్న రక్తదాతల సంఖ్య
- నెగిటివ్ గ్రూపుల రోగులకు మరిన్ని ఇబ్బందులు
- రక్తదాతలు చొరవ చూపాలంటున్న వైద్యులు

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 9: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తం అందించేందుకు వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ఎంజీఎం, తదితర ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన బ్లడ్‌బ్యాంకులు ఖాళీగా కనిపిస్తున్నాయి. సరిపడా రక్త నిల్వలు లేకపోవడంతో అత్యవసర వైద్యసేవలు అవసరమైన రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా నెగెటివ్ బ్లడ్ గ్రూప్ వారైతే మరిన్ని అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం వేసవి కాలం కావడం వల్ల రక్తం దానం చేసేందుకు ఎవరూ ముందుకు రావడంలేదని తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో పలు ఏరియా ఆస్పత్రుల్లో బ్లడ్ స్టోరేజీ సెంటర్లున్నా, ఉమ్మడి జిల్లా కేంద్రంలోని ఎంజీఎం ఆస్పత్రి నుంచే రక్తం యూనిట్లను సరఫరా చేయాల్సి ఉంటుంది. వేసవి కారణంగా రక్త నిల్వల కొరత పెరుగుతుండటం కలవరపరుస్తోంది.

అందుబాటులో వంద యూనిట్లే...

వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలోని బ్లడ్‌బ్యాంకు అధికారులు నిత్యం రక్తాన్ని సేకరించి దానిని నిల్వ చేసి ఆపదలో ఉన్నవారికి అందిస్తారు. ఎంజీఎం ఆస్పత్రిలోని రోగులతో పాటు, బ్లడ్‌బ్యాంకు స్టోరేజీలున్నా సీకేఎం, జీఎంహెచ్ మెటర్నటీ ఆస్పత్రులతో పాటు ఉమ్మడి జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, భూపాలపల్లి, పరకాల తదితర ప్రభుత్వ ఆస్పత్రులకు కూడా అత్యవసర సమయాల్లో రక్తాన్ని అందిస్తారు. ఎంజీఎం బ్లడ్‌బ్యాంకు సిబ్బంది ప్రతీనెల సుమారు వెయ్యి నుంచి 1,200 యూనిట్ల వరకు రక్తాన్ని సేకరిస్తారు. కాగా వేసవి కారణంగా రక్తదాతల ముందుకు రాకపోవడంతో సుమారు 300 యూనిట్ల వరకే లభిస్తోందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎంజీఎంలో సుమారు వంద యూనిట్ల రక్తం మాత్రమే అందుబాటులో ఉంది. ఈ క్రమంలో నెగెటివ్ బ్లడ్ గ్రూప్‌లకు తీవ్ర కొరత ఏర్పడుతోంది. అంతేకాక పాజిటివ్ బ్లడ్‌గ్రూప్‌ల వారికి కొంత ఉపశమనం ఉన్నా.. మున్ముందు ఈ రక్త నిల్వలు కూడా తగ్గే అవకాశాలున్నాయని తెలుస్తోంది. కేవలం ఎంజీఎం ఆస్పత్రి బ్లడ్‌బ్యాంకులోనే కాకుండా రెడ్‌క్రాస్, ఇతర ప్రైవేటు బ్లడ్ బ్యాంకుల్లోనూ రక్తనిల్వలు తగ్గినట్లు చెబుతున్నారు.

తగ్గుతున్న రక్తదాతలు.. చొరవ చూపాలంటున్న వైద్యులు

వేసవిలో రక్తదాతలు తగ్గుతున్నట్లు బ్లడ్‌బ్యాంకు నిర్వాహకులు చెబుతున్నారు. ప్రతీ నెల బ్లడ్‌బ్యాంకు అధికారులు జిల్లాలోని పలు కళాశాలలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్వచ్ఛంద సంస్థల నేతృత్వంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి రక్తన్ని సేకరిస్తుంటారు. కానీ ప్రస్తుతం వేసవి కారణంగా దాతలు ముందుకు రాకపోవడం, పరీక్షల సమయం కావడం, విద్యా సంస్థలకు సెలవులు రావడంతో రక్తసేకరణ శాతం తగ్గుతుంది. సుమారు 35 రోజుల వరకే రక్తాన్ని నిల్వ చేసే అవకాశముంటడంతో సేకరణ తగ్గి నిల్వల కొరత అధికమవుతుంది. అయితే రక్తసేకరణ విషయంలో జిల్లా యంత్రాంగం, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు

మిగతా 8వ పేజీలో..


స్వచ్ఛందంగా రక్తదానం చేయాలి

- డాక్టర్ ఆశాదేవి, బ్లడ్‌బ్యాంకు మెడికల్ ఆఫీసర్, ఎంజీఎం



ఒకరి రక్తదానం మరొకరికి ప్రాణదానమవుతుంది. రక్తదానానికి మించిన దానం మరొకటి లేదు. రక్తదానం పై అపోహలు వీడి ప్రజలు స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలి. స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగులు, యువత స్పందించి రక్తదానం చేస్తేనే ఆపదలో ఉన్నవారికి అవసరమైయ్యే రక్తనిల్వలను అందుబాటులో ఉంటాయి. వీలైనంత మేరకు రక్తాన్ని సేకరించేందుకు ప్రయత్నిస్తున్నాం.

ఆలయాలపై పట్టింపేదీ?


కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయం


అయినవోలు మల్లికార్జున స్వామి దేవాలయం


మెట్టురామలింగేశ్వరాలయం

- పాలకమండళ్లు లేక నిర్వహణ అస్తవ్యస్తం
- ఆదాయ, వ్యయాలపై కొరవడిన పర్యవేక్షణ
- పట్టింపు లేక ఆలయ ఆస్తులు అన్యాక్రాంతం
- ఇష్టారాజ్యంగా దేవాదాయ శాఖ అధికారుల తీరు

హనుమకొండ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పాలక మండళ్ల లేకపోవడంతో ఉమ్మడి జిల్లాలోని ఆలయాల నిర్వహణపై పట్టింపులేకుండా పోతోంది. పర్యవేక్షణ లేకపోవడంతో ఆలయాల ఆదాయ, వ్యయాలపై పారదర్శకత, నియంత్రణ కొరవడుతోంది. మరోవైపు ఆలయాల ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయి. దీంతో దేవాదాయశాఖ అధికారులది ఆడిందే ఆట.. పాడిందే పాటగా సాగుతోంది. ఉమ్మడి జిల్లాలో పలు చిన్న, పెద్ద ఆలయాలకు చాలా సంవత్సరాలుగా ధర్మకర్తల మండళ్ల లేవు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఆలయాలకు ధర్మకర్తల మండళ్లను నియమించడం మరిచిపోయింది. కొన్ని ఆలయాలకు తప్ప చాలా గుడులకు పదేళ్లుగా ధర్మకర్తల మండళ్లను నియమించలేదు.

మూడంచెల వ్యవస్థ

దేవాదాయ, ధర్మాదాయ చట్టం ప్రకారం దేవాలయాల పరిపాలనకు మూడంచెల వ్యవస్థ ఉంటుంది. అవి 6ఏ, 6బీ, 6సీ దేవాలయాలు. దేవాలయాల ఆదాయాన్ని బట్టి ఈ వర్గీకరణ జరుగుతుంది. 6ఏ ఆలయాలకు దేవాదాయ శాఖ కమిషనర్, 6బీ ఆలయాలకు డిప్యూటీ కమిషనర్, 6సీ దేవాలయాలకు అసిస్టెంట్ కమిషనర్ పరిపాలనా నియంత్రణలో ఉంటాయి. ఈ ఆలయాలకు ధర్మకర్తల మండళ్లను ఏడాది కాలపరిమితితో ప్రభుత్వం నియమించాల్సి ఉంటుంది. ఈ ధర్మకర్తల మండళ్ల తీర్మానం ప్రకారం ఆలయాల పరిపాలన నిర్వహించడానికి ప్రతీ దేవాలయానికి ఒక కార్యనిర్వహణాధికారి ఉంటాడు.

ఈవోలే దిక్కు

ఏళ్ల తరబడి ఆలయాలకు ధర్మకర్తల మండళ్లను నియమించకుండా ఈవోల ద్వారానే చట్టవిరుద్ధంగా ఆలయాల నిర్వహణను కొనసాగిస్తున్నారు. ఆలయాల ఆదాయాన్ని నిబంధనలకు విరుద్ధంగా ఆలయేతర కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. నగరంలోని మూడు దేవాలయాల నుంచి రూ 3.50 కోట్లకుపైగా నిధులను అధికారులు వాడుకోవడం ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. ఒకవేళ ధర్మకర్తల మండళ్ల ఉంటే ఇలాంటివాటిని అడ్డుకునేవారు. అధికారుల తీరును నిలదీసేవారు. 1966లో కాసు బ్రహ్మానంద రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దేవాదాయ శాఖ మంత్రిగా పీవీ నర్సింహారావు దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఒక చట్టాన్ని తీసుకువచ్చారు. 1987 వరకు దేవాలయాల పరిపాలన ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సజావుగా సాగింది. 1987లో ఎన్‌టీఆర్ ప్రభుత్వం ఆలయాలలో అర్చకులు , ఇతర వంశపారంపర్య హక్కులను రద్దు చేస్తూ చట్టాన్ని తీసుకువచ్చింది. అప్పటి నుంచి ఆలయాలు అనేక ఒడిదుడుకులకు లోనుకావడమే కాకుండా ఆలయాలపై అధికారులది ఇష్టారాజ్యంగా మారింది. ఆలయ నిధులు దుర్వినియోగం మితిమీరిపోయింది. ఆ తర్వాతల ఒకరిద్దరు తప్ప దేవాదాయ శాఖ మంత్రులుగా వచ్చినవారు కూడా ఆలయాల అభివృద్ధిని పెద్దగా పట్టించుకోలేదు. వాటి నిర్వహణను పటిష్టపరచలేదు. మంత్రులు కూడా ఆలయాలను అధికారులకే వదిలేసారు. దీనితో చాలా ఆలయాలు ప్రభుత్వ కార్యాలయాలుగా మారిపోయాయి.

ఉత్సవ కమిటీలకే పరిమితం..

ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన దేవాలయాలు అనేకం ఉన్నాయి. భద్రకాళి దేవాలయం, మెట్టు రామలింగేశ్వరాలయం, భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ వీరభద్ర స్వామి దేవాలయం, అయినవోలులోని మల్లికార్జున స్వామి దేవాలయం, పాలకుర్తిలోని సోమేశ్వర స్వామి దేవాలయం, జీడికల్లులోని సీతారామ చంద్రస్వామి దేవాలయం, చిలుపూరు వెంకటేశ్వర స్వామి ఆలయం, కొడవటూరు సిద్దేశ్వరాలయం తదితర దేవాలయాలు వీటిలో ఉన్నాయి. ఈ ఆలయాలకు భారీ ఎత్తున భక్తులు వస్తుంటారు. ఇక పర్వదినాల్లో వేలాదిగా దర్శించుకుంటారు. ఈ ఆలయాల్లో కొన్నిటిలో సంక్రాంతి మొదలు ఉగాది వరకు జాతరలు పెద్ద ఎత్తున జరుగుతుంటాయి. ఏటా బ్రహ్మోత్సవాలు, ఇతర ఉత్సవాలను కూడా నిర్వహిస్తారు. భద్రకాళి దేవాలయంలో ఏడాదిలో నాలుగు సార్లు నవరాత్రి ఉత్సవాలతో పాటు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. శివాలయాల్లో శివరాత్రి మహోత్సవాలు ఉంటాయి. ఇక ప్రతీ రెండేళ్లకు ఒక సారి సమ్మక్క సారలమ్మ జాతర జరుగుతంది. ఈ జాతరకు కోటిన్నరమందికిపైగా భక్తులు హాజరవతారు. జాతరప్పుడే కాకుండా మిగతా రోజుల్లోనూ నిత్యం వేలాది మంది భక్తులు వనదేవతలను దర్శించుకొని మొక్కులను చెల్లించుకుంటున్నారు. ఒక్క మేడారం జాతర ఆదాయం రూ.12 కోట్లపైనే ఉంటుండగా.. మిగతా ఆలయాల ద్వారా ఏటా రూ.100కోట్లకుపైగా ఆదాయం సమకూరుతోంది.

టెండర్లలో గోల్‌మాల్

దేవాలయాల్లో నిత్యపూజా కైంకర్యాలకు అవసరమయ్యే పూజాసామగ్రి, నిత్యావసర వస్తువుల సరఫరాలో కాంట్రాక్టర్లు పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడడానికి

మిగతా 8వ పేజీలో..

గాడితప్పుతున్న పాలన

ఆలయాలకు ధర్మకర్తలను నియమించకపోవడం వల్ల వాటి పాలన గాడితప్పుతోంది. చిన్న ఆలయాలను అటుంచితే పెద్ద ఆలయాలకు పాలక మండళ్లను నియమించే విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్న డిమాండ్ వినిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ప్రధాన ఆలయాల్లో ఒకటీ రెండింటికి మినహా మిగతా వాటికి చాలా కాలంగా ధర్మకర్తల మండళ్ల లేవు. శివరాత్రి, సంక్రాంతి తదతర పర్వదినాల సందర్భంగా ప్రధాన ఆలయాల్లో ఉత్సవాలు, జాతరలను పెద్ద ఎత్తున నిర్వహించే సమయాల్లో మాత్రం ఉత్సవ కమిటీలు, ఆలయ పునరుద్ధరణ కమిటీల పేరుతో పది, పదకొండు రోజులకు గాను వీటిని తాత్కాలికంగా ప్రభుత్వం నియమిస్తోంది. ఇటీవల జరిగిన మేడారం సమ్మక్క సాలరమ్మ జాతరకు కూడా పూర్తి స్థాయి ధర్మకర్తల మండలిని వేయకుండా పునరుద్ధరణ కమిటీని వేయడంతో నిధుల వ్యయం. జాతర పనులపై నిఘా లేకుండా పోయింది. ఆ తర్వాత అసలు పట్టించుకున్న వారే లేరు. పూర్తిస్థాయి పాలకవర్గాలు లేకపోవడంతో ఆలయాల నిర్వహణపై నియంత్రణ కొరవడుతోంది. వాటి ఆదాయ, వ్యయాలపై పారదర్శకత లోపిస్తోంది. జవాబుదారీ తనం లోపించి.. ఆలయాల అభివృద్ధి కుంటుపడుతోంది.

పండగ పూట విషాదం

- వాటర్ ట్యాంకు శిథిలాలకింద పడి కూలీ దుర్మరణం
- వరంగల్ పాతబస్టాండ్ కూల్చివేత పనులు చేస్తుండగా ఘటన


శిథిలాల కింద రవి మృతదేహం (ఇన్‌సెట్‌లో ఫైల్)


కూలుతున్న వాటర్ ట్యాంక్

గిర్మాజీపేట్, ఏప్రిల్ 9: ఓ వైపు అందరూ ఉగాది పండుగ వేడుకల్లో ఉత్సాహంగా ఉన్న వేళ.. వరంగల్ ఆర్టీసీ పాత బస్టాండ్ కూల్చివేత పనుల్లో విషాదకర సంఘటన జరిగింది. కొత్త బస్టాండ్ నిర్మించనున్న నేపథ్యంలో పాత భవనాన్ని కూల్చే పనుల్లో భాగంగా మంగళవారం సాయంత్రం వాటర్ ట్యాంక్ కూల్చివేస్తుండగా ఆ శిథిలాల కింద పడి ఓ కూలీ మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రూ.76కోట్ల అంచనా వ్యయంతో వరంగల్‌లో కొత్త ఆర్టీసీ కొత్త బస్లాండ్‌ను అధునాతన సౌకర్యాలతో నిర్మించేందుకు పూనుకున్నారు. ఈ క్రమంలో పాతబస్టాండ్‌తో పాటు ఆవరణలో ఉన్న భవనాలను కూల్చివేసే పనులను ఓ ప్రైవేటు కాంట్రాక్టర్‌కు అప్పగించారు. కాగా నలుగురు కూలీలు మంగళవారం మధ్యాహ్నం నుంచి బస్‌స్టేషన్ ఆవరణలోని వాటర్ ట్యాంకును కూల్చివేసే పనులు ప్రారంభించారు. అయితే వారు యంత్రాల సాయంతో ట్యాంకు పిల్లర్లను కింద నుంచి కట్ చేయడంతో ఒక్కసారిగా ఆ వాటర్ ట్యాంక్ కుప్పకూలింది. దీంతో అక్కడ పనిచేస్తున్న కూలీలు పరిగెత్తే ప్రయత్నం చేయగా.. ముగ్గురు మాత్రం స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మరో కూలి బొంతు రవి(49)పై శిథిలాలు పడటంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రవి కుమారుడు, కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని, శిథిలాల కింద కూరుకు పోయిన రవి మృతదేహాన్ని చూసి గుండెలవిసేలా రోదించారు. అయితే కూల్చివేతల్లో ఎలాం టి భద్రత చర్యలు తీసుకోకుండానే కాం ట్రాక్టర్ నిర్లక్ష్యంగా పనులు చేపట్టడం వల్లే ఈ ఘటన జరిగిందని కుటుంబ సభ్యులు కాంట్రాక్టర్‌తో పాటు ఇంతే జార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌తో వా గ్వాదానికి దిగారు.


అనంతరం శిథిలాల కింద నుంచి మృతదేహాన్ని బయటకు తీసి ఎంజీఎం మార్చురీకి తరలించారు. వరంగల్ జిల్లా ఖానా పురం మండలం మనుబోతు గడ్డకు చెందిన రవి కూలీ పనుల కోసం కొంతకాలం క్రితం నగరానికి వచ్చి గరీబ్‌నగర్‌లో కుటుంబంతో నివాసముంటున్నట్లు తెలిసింది. సంఘటన స్థలాన్ని వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ సందర్శించారు. రవి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని పోలీసులు తెలిపారు. అతడి భార్య, ఇద్దరు కుమారులున్నారు.


మనబోతులగడ్డలోని రవి ఇల్లు

మనుబోతులగడ్డలో విషాదం

ఖానాపురం: వరంగల్ బస్టాండ్ కూల్చివేత క్రమంలో నీళ్ల ట్యాంకు శిథిలాల కింద పడి కూలీ బొంత రవి చెందడంతో ఆయన స్వగ్రామం మనుబోతులగడ్డలో విషాదం అలుముకుంది. బొంత మల్లయ్య-బుచ్చమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు కాగా, రవి పెద్దవడు. కూలి పనుల నిమిత్తం కరీంనగర్, వరంగల్ తదితర ప్రాంతా లకు వలస వెళ్లేవాడు. అందరితో కలివిడిగా ఉండే రవి మృతి చెందడంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

SUMMER FAMILY ENTERTAINER నేడే చూడండి




సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.30,6.00,9.30

SVC ఈశ్వర్ 70ఎంఎం - అత్తాపూర్ 11.00,2.30,6.00,9.30 | SVC శ్రీలక్ష్మి/ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్ 11.30,2.30,6.30,9.30
SVC సంగీత 70ఎంఎం - ఆర్.సి.పురం 11.00,2.30,6.00,9.15 | SVC శివశక్తి 70ఎంఎం ఎ/సి - కాప్రా 11.15,2.30,6.00,9.30
రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15 | శ్రీసాయిరాం 70 - మల్కాజ్‌గిరి 11.15,2.30,6.15,9.30

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 8.00,8.00,8.00,8.00,8.00,11.00, 11.45,12.45,2.00,2.45,3.45, 5.00,7.35,8.00,10.35,11.00
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి 9.15,9.35,10.15,12.30,12.50, 3.45,4.05,7.00,7.20,10.15,10.35
జిఎస్ఎమ్ - మదీనగూడ 9.00,9.20,11.45,12.25,12.45,3.10, 3.50,4.10,6.35,7.15,7.35,10.40,11.00
నెక్లెస్ సత్వ - కవాడిగూడ 9.20,10.00,11.40,12.45,1.25, 4.10,7.00,7.35,10.30,11.00
శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 9.40,1.00,4.20,7.40,11.00
సినిమాస్ - బాలానగర్ 9.40,1.00,2.00,4.20,7.40,11.00
సినిమాస్ - చందానగర్ 9.40,1.00,4.20,7.40,11.00
సినీటౌన్ - మియాపూర్ 9.55,1.20,4.05,7.45,11.00

రేపే బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.15
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

SVC శ్రీలక్ష్మి/ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్ 11.15,2.30,6.30,9.30 | SVC శివశక్తి 70ఎంఎం - కాప్రా 11.15,2.30,6.00,9.30
అర్జున్ 70ఎంఎం - కూకట్‌పల్లి 11.30,2.30,6.30,9.30 | మెగా 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 12.50,8.35
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి 10.15,4.20,7.20,10.25
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 10.25,4.05,10.35
జిఎస్ఎమ్ - మదీనగూడ 10.10,1.15,7.45,10.50
నెక్లెస్ సత్వ - కవాడిగూడ 10.30,4.30,7.40
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ 10.00,4.45,10.40
శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 1.30,7.50
సినిమాస్ - బాలానగర్ 1.30,7.50
సినిమాస్ - చందానగర్ 1.30,7.50

ADVENTUROUS BLOCKBUSTER నేడే చూడండి



సంధ్య 70 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.15,6.00,9.15
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
MYTHRI THEATRES జగదాంబ 70 - ఘట్‌కేసర్ 11.30,2.30,6.30,9.30
First Air Conditioned theatre with Dolby atmos in hyderabad (Single Screen)

రాజధాని 70 ఎ/సి - దిల్ సుఖ్ నగర్ 11.15,2.15,6.15,9.15 | ఇంద్ర పద్మావతి 70 - కాచిగూడ 9.15 pm
సినీటౌన్ ఇంద్ర నాగేంద్ర - కర్మన్‌ఘాట్ 2.15,9.15 | అంజలి 70 ఎ/సి - సికింద్రాబాద్
కుమార్ 70 ఎ/సి - కాచిగూడ

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 11.00,3.50,8.40
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి 10.30,4.25,7.20,10.20
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 11.30,7.50,10.50
ఫోరం మాల్ - కూకట్‌పల్లి 11.30,2.30,8.05,11.00
ఆర్.కె. - బంజారాహిల్స్ 2.35,11.00
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ 11.25,8.00,11.00
గలేరియా - పంజాగుట్ట 10.45,8.00,11.00
బికాన్ - హైటెక్‌సిటీ 2.10,7.50,10.50
ఎం.పి మాల్ - కాచిగూడ 11.15,7.15
జిఎస్ఎమ్ - మదీనగూడ 11.20,8.00,10.50
నెక్లెస్ సత్వ - కవాడిగూడ 1.35,7.55,10.50
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ 10.50,5.00,10.40
మంజీరామాల్ - కూకట్‌పల్లి 2.10,8.20,11.20
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి 2.10,8.20,11.10
మంత్రామాల్ - అత్తాపూర్ 11.20,8.20,11.10
సుధా - శాలిబండ 2.10,8.20,11.10
ఏసియన్ మాల్ - అత్తాపూర్ 11.00,1.50,7.45,10.30
ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 4.25,7.30,10.30
శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 11.00,7.30,10.30
సినిమాస్ - బాలానగర్ 11.00,7.50,10.40
సినిమాస్ - చందానగర్ 11.00,7.50,10.40
సినీటౌన్ - మియాపూర్ 2.35,11.00
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి 2.35,11.00
జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి 1.45,10.45
మూవీటైమ్ - అమీర్‌పేట 7.15 pm

MYTHRI MOVIE DISTRIBUTORS LLP

ఈనెల 12న బ్రహ్మాండమైన విడుదల



ఆర్తి 70ఎంఎం ఎ/సి - సంఘీనగర్
లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
SVC జెమిని 70ఎంఎం - మంచిర్యాల

PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట | PVR పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ | జిఎస్ఎమ్ - మదీనగూడ
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి | PVR పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్ | సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి
PVR ఆర్.కె. - బంజారాహిల్స్ | PVR ప్రెస్టీజ్‌మాల్ - గచ్చిబౌలి | డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ | PVR ఆట్రియమ్ - గచ్చిబౌలి | సినీ ప్లానెట్ - కొంపల్లి
PVR గలేరియా - పంజాగుట్ట | PVR ఎస్2 నోవా - మల్లాపూర్ | ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
PVR బికాన్ - హైటెక్‌సిటీ | జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్

SRI LAKSHMI GAYATRI FILMS 9391176659

ఈనెల 12న బ్రహ్మాండమైన విడుదల



లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్ | మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట

SHIVA SAI FILMS 9030161717

విజయవంతమైన 2వ వారం



దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.15,2.30,6.00,9.15

SVC శ్రీలక్ష్మిఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్ 11.15,2.30,6.15,9.30 | విశ్వనాథ్ 70 - కూకట్‌పల్లి 11.45,2.45,6.45,9.45
మల్లిఖార్జున 70 - కూకట్‌పల్లి 11.15,2.30,6.15,9.30 | కోణార్క్ 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 11.00,1.30,4.00,6.30,9.00,11.30
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి 10.55,1.40,4.10,7.55,10.45
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 10.00,1.00,4.25,7.25,10.25
ఫోరం మాల్ - కూకట్‌పల్లి 10.30,11.00,2.00,5.00,8.00,11.00
ఆర్.కె. - బంజారాహిల్స్ 10.05,1.05,4.45,7.30,11.10
జిఎస్ఎమ్ - మదీనగూడ 10.00,11.05,1.00,2.05, 4.00,7.00,8.00,10.00
నెక్లెస్ సత్వ - కవాడిగూడ 10.05,1.05,4.05,4.50,7.50,10.50
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ 10.15,1.15,4.15,4.50,7.50,10.50
మంజీరామాల్ - కూకట్‌పల్లి 11.00,1.40,2.00,8.10,11.15
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి 11.00,1.40,1.55,4.50,7.40,11.15
సినిమాస్ - బాలానగర్ 10.30,1.30,4.30,7.30,10.30
సినిమాస్ - చందానగర్ 10.30,1.30,4.30,7.30,10.30
సినీటౌన్ - మియాపూర్ 10.05,1.05,4.45,7.30,10.30
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి 10.10,1.00,4.45,7.20,10.30
జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి 1.45,4.45,7.30,10.30

ఈనెల 12న బ్రహ్మాండమైన విడుదల



శాంతి 70 ఎంఎం - నారాయణగూడ

ఎ.ఎం.బి. సినిమాస్ - గచ్చిబౌలి | లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ | ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట | ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి | సినీ ప్లానెట్ - కొంపల్లి
PVR ఆర్.కె. - బంజారాహిల్స్ | ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ | ఏషియన్ రాధిక - కాప్రా
PVR గలేరియా - పంజాగుట్ట | ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
PVR బికాన్ - హైటెక్‌సిటీ | ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
PVR పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ | శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
PVR పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్ | సినిమాస్ - బాలానగర్
PVR ప్రెస్టీజ్ మాల్ - గచ్చిబౌలి | సినిమాస్ - చందానగర్
PVR ఆట్రియమ్ - గచ్చిబౌలి | సినీటౌన్ - మియాపూర్
PVR ఎస్2 నోవా - మల్లాపూర్ | రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి

GLOBAL CINEMAS RELEASE

A NEW AGE CRIME COMEDY నేడే చూడండి



సప్తగిరి 70ఎంఎం - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.00,2.00,6.00,9.00

మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట 11.00am | తారకరామ - ఇసిఐఎల్ 11.00,2.00,6.00,9.00
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి 10.30am | లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్ 2.40pm
సత్యం - అమీర్‌పేట్ 4.15pm | ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 11.00am

PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 4.20,10.30 | ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం 4.30pm
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 2.05,10.05 | సినీ ప్లానెట్ - కొంపల్లి 10.45am
PVR ఆర్.కె. - బంజారాహిల్స్ 5.35pm | ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 7.30pm
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ 11.15,4.50 | ఏషియన్ రాధిక - కాప్రా 7.30pm
PVR గలేరియా - పంజాగుట్ట 10.35,8.15 | ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్ 10.30am
PVR బికాన్ - హైటెక్‌సిటీ 1.55,8.05 | ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 1.30pm
PVR పివిఆర్ - ఎర్రమంజిల్ 1.40,10.50 | శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 1.00,8.00
PVR పివిఆర్ - ముసారాంబాగ్ 11.05,4.50 | సినిమాస్ - బాలానగర్ 1.00,8.00
PVR ప్రెస్టీజ్‌మాల్ - గచ్చిబౌలి 5.15pm | సినిమాస్ - చందానగర్ 1.00,8.00
PVR ఆట్రియమ్ - గచ్చిబౌలి 1.55,8.05 | సినీటౌన్ - మియాపూర్ 5.35pm
PVR ఎస్2 నోవా - మల్లాపూర్ 5.15pm | రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి 5.35pm
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ | జిపిఆర్ - కూకట్‌పల్లి 10.45am
ఎం.పి మాల్ - కాచిగూడ | మూవీటైమ్ - అమీర్‌పేట 4.00pm
జిఎస్ఎమ్ - మదీనగూడ | ఎస్ఎల్ఎస్ - గచ్చిబౌలి 1.30pm
నెక్లెస్ సత్వ - కవాడిగూడ | ప్రైమ్‌మాల్ - సనత్‌నగర్ 4.30pm
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ | టివోలి - సికింద్రాబాద్
మంజీరామాల్ - కూకట్‌పల్లి 10.15pm | విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి 9.15pm | శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
మంత్రామాల్ - అత్తాపూర్ 5.10pm | షా షహెన్‌షా - చింతల్
సుధా - శాలిబండ 8.00pm | మూవీమ్యాక్స్ - మౌలాలి
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్ 5.00pm | జెపి సినిమాస్ - చందానగర్ 10.20pm

ఎస్2 - వరంగల్ | గోల్డ్ - మంచిర్యాల | నటరాజ్ - నిజామాబాద్ | శ్రీరామ ఎ/సి - జగిత్యాల
శ్రీదేవి - హన్మకొండ | మల్టీప్లెక్స్ - గద్వాల్ | జెఆర్ మాల్ - ఆర్మూర్ | శాంతమహల్ - ఆందూర్
శ్రీనివాస 70 - ఖమ్మం | శ్రీనివాస ఎ/సి - మిర్యాలగూడ | తిరుమల - మహబూబ్‌నగర్ | శ్రీనివాస 70 - సిద్దిపేట
శ్రీనివాస - కరీంనగర్ | గీతా - నిజామాబాద్ | GHR సినిమా - కోదాడ | ఊర్వశి - గోదావరిఖని
శివ 70 - కరీంనగర్ | వేణు - నిజామాబాద్ | తిరుమల - సూర్యాపేట్ | విష్ణురూప - కొత్తగూడెం
పరిజ్ఞ సినిమాస్ - రాయచూర్

GLOBAL CINEMAS RELEASE

అడవులను రక్షించుకుందాం

నివారణకు అటవీశాఖ చర్యలు

- ఫైర్‌లైన్లు ఏర్పాటు చేస్తున్న అధికారులు
- ప్రజలకు చైతన్య కార్యక్రమాలు
- జిల్లాలో లక్షా 40వేల హెక్టార్ల అడవులు

అగ్ని ప్రమాదాలతో అటవిసంపదకు ముప్పు




బ్లోయర్‌తో మంటలను ఆర్పుతున్న అటవీ సిబ్బంది

గూడూరు, ఏప్రిల్ 9 : వేసవి వచ్చిందంటే చాలు.. అగ్ని ప్రమాదాలతో అటవీ సంపద కాలి బూడిదవుతోంది. ఏటా ఈ ప్రమాదాల వల్ల వేలాది వృక్షాలు దగ్ధమవుతున్నాయి. అడవుల్లో జరుగుతున్న అగ్నిప్రమాదాలపై ప్రజలకు పూర్తిగా అవగాహన కరువైంది. సమీప ఊళ్ల ప్రజలు వంటచెరుకు, పశువుల మేతకోసం వెళ్లిన సమయంలో నిప్పు పెడుతుండడం తోనూ అడవులు కాలిపోతున్నాయని అధికారులు గుర్తించారు. తునికాకు సేకరణలో భాగంగా ప్రూనింగ్ (కొమ్మకొట్టె కార్యక్రమం) చేస్తున్న సమయంలో ఏటా అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వాటి నివారణకు అటవీశాఖ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నా.. అటవీ సంపదకు నష్టం జరుగుతూనే ఉంది.

ముందు జాగ్రత్త చర్యలు..

వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో అడవుల్లో అగ్ని రాజుకొని వన సంపద కాలిపోతుండగా అటవీశాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా అటవీ ప్రాంతంలో ఫైర్‌లైన్లు ఏర్పాటు చేసి వృక్షాలు కాలకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మహబూబాబాద్ జిల్లాలోని గంగారం, కొత్తగూడ, గూడూరు, బయ్యారం, డోర్నకల్, తొర్రూరు, మహబూబాబాద్ రేంజ్ పరిధిలో విస్తరించి ఉన్న అడవిలో చెట్ల నుంచి నేలరాలిన ఆకులను సుమారు 300 కిమీ.. దూరం వరకు పేర్చి నిప్పంటిస్తున్నారు.

దీంతో ఫైర్‌లైన్ ఏర్పాటవుతుంది. ఒక వేళ ఆకస్మాత్తుగా అడవిలో మంటలు చెలరేగినా ఫైర్‌లైన్ వరకు మంటలు వ్యాపిస్తాయి. మిగిలిన అటవీప్రాంతం మొత్తం సంరక్షిచబడుతుంది.

వచ్చేది వేసవి కావడంతో..

వచ్చేది వేసవి కావడంతో అడవులకు నిప్పంటుకుంటే నష్టం ఎక్కువగా ఉంటుందని భావిస్తున్న అటవీ శాఖ అధికారులు ఫైర్‌లైన్లను ఏర్పాటు చేసి అడవులను సంరక్షించే పనిలో నిమగ్నమయ్యారు. త్వరలో తునికాకు సేకరణ కూడా జరగనుంది. దీంతో అడవిలోకి వెళ్లే కూలీలు, రోడ్డు మార్గం ద్వారా ప్రయాణికులు ధూమపానం చేస్తూ నిప్పును ఆర్పకుండా పడేస్తారు. ఈ క్రమంలో అడవులకు నిప్పంటుకునే ప్రమాదాలు ఎక్కువగా ఉంటాయి. ఫైర్‌లైన్ల ద్వారా నిప్పంటుకునే ప్రమాదాలు చాలా తక్కువగా ఉండటంతో పాటు ఒకవేళ నిప్పంటుకున్న మంటలను ఆర్పేందుకు ఫైర్‌లైన్లు దోహదం చేస్తాయి. గతనెల రోజులుగా వివిధ రేంజ్‌ల పరిధిలో ఎఫ్‌డీవోలు, రేంజ్ అధికారుల ఆధ్వర్యంలో ఈ పనులు చురుగ్గా జరుగుతున్నా యి. ఇందుకోసం ప్రతి అటవీ శాఖ రేంజ్ పరిధిలో ఇప్పటికే 8 మందిని టీంగా ఏర్పాటు చేసి నిరంతరం అడవుల్లో గస్తీ ఏర్పాటు చేశారు. వీరు ప్రాంతంలో మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకుంటారు. సిబ్బంది ఫైర్‌లైన్లు ఏర్పాటు చేయడం, లైను ఏర్పడే వరకు రక్షణగా అక్కడే కాపలా ఉంటారు.

అటవీ సంపద రక్షణకు..

ముందస్తు ఫైర్‌లైన్ల ద్వారా అడవిలో ఉండే వృక్షాలు, ఇతర అడవీ సంపద, జంతు రక్షణకు సైతం చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇక్కడి అటవీ ప్రాంతంలో జంతువుల సంచారం అధికంగా ఉండటంతో, ఫైర్‌లైన్లు ఏర్పాటు చేస్తే అడవిలో వేసవిలో సైతం జంతువులు స్వేచ్ఛగా సంచరిచేందు కు వీలు ఏర్పడుతుందని అటవీ శాఖ అధికారులు తెలుపు తున్నారు.

జిల్లాలో అడవుల విస్తీర్ణం లక్షా40 వేల హెక్టార్లు

మహబూబాబాద్ జిల్లాలో అడవుల విస్తీర్ణం లక్షా 40 వేల హెక్టార్లు వ్యాపించి ఉంది. అడవుల శాతం 45 కాగా, 80 సెక్షన్లు, 150 బీట్లు ఉన్నాయి. ఏటా ఈ ఫైర్‌లైన్లు ఏర్పాటుతో అడవులు అగ్నికి ఆహుతి కాకుం డా ఉండేందుకు దోహదం చేస్తాయి. దీంతో అటవీ సంపదకు నష్టం వాటిల్లకుండా ఉంటుంది. అటవీ ప్రాంతంలో మంటలు అంటుకున్న వెంటనే అధికారులు సిబ్బందిని అప్రమత్తం చేసి మంటలను అదుపులోకి తెస్తున్నారు. అంతే కాకుండా మంటలు అంటుకున్న విషయం ఫారెస్టు సర్వే ఆఫ్ ఇండియా వారు కూడా డెహ్రాడూన్‌లో ఉన్న ఉపగ్రహం ద్వారా గుర్తించి ఏరియా అటవీ అధికారులకు సమాచారాన్ని అందచేస్తుంది.

ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేసేది ఇలా..

అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణలో భాగంగా అటవీశాఖ అధికారులు అటవీప్రాంతంలో ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తారు. అటవీప్రాంతంలోని కాలిబాటలో ఐదుమీటర్ల వెడల్పుతో వీటినిఏర్పాటు చేయడం జరుగుతుంది. చుట్టుపక్కల ఉన్న ఎండిన ఆకులను కాలిబాటలో పరిచి నిప్పంటిస్తారు. ఒకవేళ ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించి మంటలు చేలరేగిన ఈ దారి వరకే మంటలు వ్యాప్తి చెంది ఆరిపోతాయి. మిగతా ప్రాంతానికి మంటలు వ్యాప్తి చెందకుండ ఫైర్‌లైన్స్ అరికడతాయి. అడవుల రక్షణకు ప్రతియేట అటవీశాఖ అధికారుల ఆధ్వర్యంలో వేసవి ప్రారంభంలో ముందస్తు చర్యలు చేపడతారు. ఫైర్‌లైన్స్ ద్వార దాదాపు రెండు కిలోమీటర్ల మేర ఏర్పాటు చేయడం ద్వార అగ్నిప్రమాదాలు చోటు చేసుకోకుండ అరికట్టవచ్చని అధికారులు చెబుతున్నారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈసారి ఫైర్‌లైన్స్ టార్గెట్‌ను తగ్గించడం గమనార్హం.

జిల్లాలో అడవుల విస్తీర్ణం లక్షా 40 వేల హెక్టార్లు

మహబూబాబాద్ జిల్లాలో అడవుల విస్తీర్ణం లక్షా 40 వేల హెక్టార్లు వ్యాపించి ఉంది. అడవుల శాతం 45 కాగా, 80 సెక్షన్లు, 150 బీట్లు ఉన్నాయి. ఏటా ఈ ఫైర్‌లైన్లు ఏర్పాటుతో అడవులు అగ్నికి ఆహుతి కాకుండా ఉండేందుకు దోహదం చేస్తాయి. దీంతో అటవీ సంపదకు నష్టం వాటిల్లకుండా ఉంటుంది. అటవీ ప్రాం తంలో మంటలు అంటుకున్న వెంటనే అధికారులు సిబ్బందిని అప్రమత్తం చేసి మంటలను అదుపులోకి తెస్తున్నారు. అంతే కాకుండా మంటలు అంటుకున్న విషయం ఫారెస్టు సర్వే ఆఫ్ ఇండియా వారు కూడా డెహ్రాడూన్‌లో ఉన్న ఉపగ్రహం ద్వారా గుర్తించి ఏరియా అటవీ అధికారులకు సమాచారాన్ని అందచేస్తుంది.

శాటిలైట్ ద్వారా సమాచారం..

అటవీ ప్రాంతంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంటే వెంటనే సమాచారం అందించేందుకు అటవీ శాఖ ప్రధాన కార్యాలయంలో ఫైర్ కంట్రోల్ రూం ఏర్పాటుచేశారు. శాటిలైట్ ద్వారా వచ్చే సమాచారాన్ని చేరవేస్తుంది. జిల్లాలో ఎక్క డైనా అటవీప్రాంతంలో అగ్నిప్రమాదం సంభవించి మంటలు చేలరేగితే ఆ ప్రాంతానికి తక్షణమే సమాచారం అందించే వీలు ఉంటుంది. దీంతో ఫారెస్టు అధికారులు అప్రమత్తమై ఆయా ప్రాంతాలకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువస్తారు.

చైతన్య కార్యక్రమాలు..



అటవీశాఖ ఆధ్వర్యంలో అటవికి నిప్పంటించవద్దంటూ చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న కళాకారులు, అధికారులు

వేసవి కాలంలో అడవుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ఉండేందుకు గ్రామంల్లో ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందుకోసం ఇప్పటికే గ్రామాల్లో అగ్ని ప్రమాదాలపై అడవికి నిప్పు-పర్యావరణానికి ముప్పు పేరిట కార్యక్రమాలు చేపడుతున్నారు. అడవులు దగ్ధం అయితే మానవాళికి ఏ విధంగా నష్టం జరుగుతందనే దానిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. అడవుల్లో మంటలు వ్యాపించినట్లయితే తక్షణమే మంటలు ఆర్పేలా చర్యలు తీసుకుంటున్నారు.

అడవికి నిప్పంటించొద్దు ..

చంద్రశేఖర్, ఎఫ్‌డీవో, గూడూరు



అటవీ ప్రాంతంలోకి వెళ్లే పశువుల కాపర్లు, రోడ్డు మార్గం ద్వారా వెళ్లే ప్రయాణీకులు ఉద్దేశ పూర్వకంగా లేదా ఆదమరిచి కానీ అడవిలో నిప్పు పెట్టొద్దు. మంటలు వ్యాప్తి చెందేందుకు కారణమైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. అడవుల్లో నిప్పు పెట్టినట్లయితే శిక్షగా పరిగణించి చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా అటవీ ప్రాంతం వెళ్లేవారు ఎట్టి పరిస్థితుల్లోను మంటలు పెట్టవద్దు. అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు ఏర్పడకుండా ఉండేందుకు ఫైర్‌లైన్లు ఏర్పాటు చేశాం. వీటి ద్వారా అడవుల్లో ఉన్న వృక్ష సంపదకు నష్టం వాటిల్లకుండా ఉంటుంది.

భద్రాద్రి రాములోరి తలంబ్రాలు

ఇళ్లవద్దకే..



- కార్గో ద్వారా పంపిణీకి ఆర్టీసీ చర్యలు
- ఈనెల 17 వరకు బుకింగ్‌కు అవకాశం
- రూ.151 చెల్లించి వివరాలు నమోదు చేసుకోవాలి

న్యూశాయంపేట, ఏప్రిల్ 9 : శ్రీరామ నవమి సందర్భంగా దక్షిణ అయోధ్య భద్రాచలంలో నిర్వహించే సీతారామచంద్రస్వామి తిరుకల్యాణానికి వెళ్లలేని భక్తులు ఇళ్ల వద్దే తలంబ్రాలను పొందేలా ఆర్టీసీ ప్రణాళిక రూపొందించింది. దేవాదాయ శాఖ సహకారంతో రాములోరి తలంబ్రాలను కార్గో ద్వారా పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టింది. గతేడాది కూడా ఆర్టీసీ యాజమాన్యం ఇదే తరహాలో రాములవారి కల్యాణ తలంబ్రాలను భక్తుల ఇళ్ల వద్దకే అందించంగా.. నాడు ప్రజల నుంచి అనూహ్య స్పందన రావడంతో ఈ ఏడాది కూడా పంపిణీ చేసేందుకు ముందుకువచ్చింది.

రూ.151 చెల్లించి వివరాలు నమోదు చేసుకోవాలి

రాములవారి తలంబ్రాలు కావాలనుకునే భక్తులు టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్ కేంద్రాల్లో రూ.151 చెల్లించి వివరాలు నమోదు చేసుకోవాలి. సీతా రాముల కల్యాణం అనంతరం ఆర్టీసీ కార్గో సర్వీస్ ద్వారా వివరాలు నమోదు చేసుకున్న భక్తుల ఇంటివద్దకు నేరుగా కల్యాణ తలంబ్రాలను తీసుకువస్తుంది. భద్రాచలంలో రాములవారి కల్యాణాన్ని తిలకించేందుకు వెళ్లడానికి వీలు కాని దూర ప్రాంత భక్తులు తమ తమ పరిధిలోని డిపోలను సంప్రదించి.. రూ.151 చెల్లిస్తే నేరుగా ఇళ్లకే తలంబ్రాలు వస్తుండడంతో ఎక్కువ సంఖ్యలో భక్తులు మొగ్గు చూపే అవకాశం ఉంది. గత సంవత్సరం ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల పరిధిలో 7,888 మంది బుక్ చేసుకోగా ఆర్టీసీకి రూ. 9,15,008 ఆదాయం వచ్చింది. ఈ సంవత్సరం రూ.15లక్షల ఆదాయం వస్తుందని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు. తలంబ్రాలు కావాలనుకునే భక్తులు ఈనెల 17వ తేదీ వరకు ఆర్టీసీ లాజిస్టిక్ కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది.

తలంబ్రాల కోసం డిపోల వారీగా సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు

వరంగల్ రీజియన్	93913 20465
వరంగల్-1డిపో	91542 98759
హనుమకొండ	91542 98761
పరకాల	91542 98764
భూపాలపల్లి	91542 98764
నర్సంపేట	91542 98763
జనగామ	91542 98762
తొర్రూరు	91542 98766
మహబూబాబాద్	91542 98768

భక్తులకు మంచి అవకాశం

టి. పవన్ కుమార్, వరంగల్ ఆర్టీసీ లాజిస్టిక్ ఏటీఎం మేనేజర్



దూర ప్రాంతాల్లో ఉండి భద్రాచలంలో జరిగే రాముల వారి కల్యాణానికి వెళ్లలేని భక్తులకు ఇది మంచి అవకాశం. రాములవారి కల్యాణ తలంబ్రాలను తెప్పించుకుని తమతమ కుటుంబసభ్యులు, బంధువుల పెళ్లి తలంబ్రాల్లో కలిపితే అంతా శుభమే జరుగుతుందని నమ్ముతారు. ఎంతో పవిత్రమైన ఈ తలంబ్రాలను ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. వరంగల్ ఆర్టీసీ రీజియన్ పరిధిలోని తొమ్మిది డిపోలలో ఉన్న లాజిస్టిక్ కేంద్రాలలో పేరు నమోదు చేసుకోవచ్చు.

ఇంటిపై దాడిచేసి... భార్యను కిడ్నాప్ చేశారు..

పోలీసులకు భర్త ఫిర్యాదు

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 9 : భార్య బంధవులు తన కుటుంబసభ్యులపై దాడి చేసి తన భార్యను కిడ్నాప్ చేశారని మహిళ భర్త అరవింద్ హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. పరకాల మండలం పోచారంకు చెందిన అబ్బోజ్ అరవింద్ భూపాలపల్లి జిల్లా బుద్దారంకు చెందిన మాల స్వప్న గత రెండేళ్లుగా ప్రేమించుకున్నారు. పెద్దలను ఒప్పించడానికి ప్రయత్నం చేయగా ఒప్పుకోకపోవడంతో జనవరి 26న కొత్తగట్టు ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత అరవింద్ వాళ్ల అమ్మమ్మతో కలిసి రెడ్డికాలనీలో కాపురం పెట్టారు. ఈ క్రమంలోనే స్వప్న కుటుంబసభ్యులు అరవింద్‌ను బెదిరింపులకు పాల్పడుతూ వస్తున్నారు. సోమవారం సాయంత్రం రెడ్డికాలనీలోని అరవింద్ ఉంటున్న ఇంటిపై స్వప్న కుటుంబసభ్యులు దాడి చేసి స్వప్నను బలవంతంగా లాక్కెళ్లి ఫోన్ స్విచ్చాప్ చేశారు. దీంతో తనతో పాటు తన భార్యపై దాడిచేసి భార్యను కిడ్నాప్ చేశారని అరవింద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ముగ్గురు వ్యక్తులపై వివిధ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వ్యవసాయంలో ఆధునికత..!

- మందుల పిచికారీకి డ్రోన్ల వినియోగం
- పల్లెలకు విస్తరించిన హైటెక్ పద్ధతులు
- సమయం ఆదా అవుతుందంటున్న రైతన్నలు



డ్రోన్‌తో పురుగుమందును పిచికారి చేస్తున్న యువరైతు నగేష్

మహదేవపూర్ రూరల్, ఏప్రిల్ 9 : వ్యవసాయంలో రాణించేందుకు రైతన్నలు కొత్త పుంతలు తొక్కుతున్నారు. రోజు రోజుకు ఆధునిక పద్ధతులను అవలంభిస్తూ వ్యవసాయంలో నూతన ఒరవడిని సృష్టిస్తున్నారు. సమయం ఆదా చేయడంతో పాటు కూలీకూడ తక్కువేనని చెబుతున్నారు. ఎడ్ల నాగలి దుక్కులతో ప్రారంభమైన వ్యవసాయం ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, వరినాటు యంత్రాల వరకు విస్తరించాయి. తాజాగా వరి, పత్తి, మిరప చేలల్లో పురుగు మందులతో పాటు యూరియా, డీఏపీ తదిర మందులను పిచికారి చేసేందుకు డ్రోన్లను సైతం రైతులు వినియోగించుకుంటున్నారు. పట్టణాలకు మాత్రమే పరిమితమైన ఆధునికత పల్లెలకు విస్తరించడంతో రైతన్నలు సంబురపడుతున్నారు.

డ్రోన్‌తో ఉపాధి.. రైతుకు సమయం ఆదా!

మహదేవపూర్ మండలంలోని అంబట్‌పల్లి, మేడిగడ్డ, సూరారం గ్రామాల్లో వరి పొలాల్లో పురుగు మందుల పిచికారికి రైతులు డ్రోన్లను వినియోగిస్తున్నారు. సూరారం గ్రామానికి చెందిన గంగారపు నగేష్ అను యువ రైతు రూ.5.80లక్షల వ్యయంతో డ్రోన్‌ను కొనుగోలు చేసి స్థానికంగా ఉపాధీ పొందుతున్నాడు. డ్రోన్ చార్జేబుల్ బ్యాటరీతో పనిచేస్తుండటంతో ఖర్చుకూడ తక్కువేనని చెబుతున్నాడు. ఒక్కో ఎకరాకు రూ.500వరకు పిచికారి చేసినందుకు చార్జీలు తీసుకుంటున్నాడు. ఒక్కో ఎకరాకు మందును పిచికారి చేసేందుకు కేవలం 5 నుండి 10నిమిషాల సమయం పడుతుందని, రిమోట్‌తో డ్రోన్‌ను ఆపరేట్ చెయ్యొచ్చని చెబుతున్నారు. దీంతో రైతులు కూలీల కొరతను అధిగమించడంతో పాటు సమయం కూడ ఆదా అవుతుందని చెబుతున్నారు.

మొత్తానికి పల్లెల్లోనూ వ్యవసాయానికి డ్రోన్ వినియోగం అందుబాటులోకి రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రైతులు ఆధునిక పద్ధతులవైపు మొగ్గు చూపితే మంచి లాభాలు పొందొచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సైతం రైతులకు సూచిస్తున్నారు. కాని పల్లెల్లో డ్రోన్ల వినియోగంపై అవగాహన లేకపోవడంతో డ్రోన్‌వ్యవసాయంపై అపోహ పడుతున్నారు. అధికారులు దీనిపై అవగాహన కల్పిస్తే డ్రోన్ వినియోగం మరింత పెరిగే అవకాశం ఉంది.



పట్టుబడిన బైక్‌లను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

కోడి పందాల స్థావరంపై పోలీసుల దాడులు

- 29 బైకులు, 4 కార్లు, 33 కోళ్లు స్వాధీనం
- పది మందిపై కేసు నమోదు

నెల్లికుదురు, ఏప్రిల్ 9 : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని కాచికల్ శివారు ఆకేరువాగు ఒడ్డున కొంత మంది కోడిపందెంల ఆడుతోండగా ఆ స్థావరంపై మంగళవారం సాయంత్రం పోలీస్‌లు దాడులు చేశారు. ఎస్సై క్రాంతికిరణ్ కథనం ప్రకారం. ఖమ్మం, నల్లగొండ, తొర్రూరు, మహబూబాబాద్‌కు చెందిన 10 మంది ఆకేరువాగు ఒడ్డున కొడిపందెంలు ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆ స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. 33 కోళ్లు, 29 బైక్‌లు 4కార్లు, రూ. 48,200 నగదును సీజ్ చేశారు. పది మందిపై కేసులు నమోదు చేసి, విచారణ చేస్తున్నట్లు వివరించారు.

ఓటరు నమోదు శాతం పెంచడమే లక్ష్యం



- ఏప్రిల్ 15 దరఖాస్తు గడువు
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌ల ద్వారా దరఖాస్తులు
- గతంలో పలుమార్లు అవకాశం
- యువతలో కానరాని స్పందన
- అవగాహనకు కాలేజీల్లో చైతన్య కార్యక్రమాలు
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 33.43లక్షల ఓటర్లు నమోదు

హనుమకొండ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం ఏప్రిల్ 15 వరకు అవకాశం కల్పించింది. పోలింగ్ శాతాన్ని పెంచడమే లక్ష్యంగా యువ ఓటర్ల నమోదుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని చేపట్టింది. ఇంతకుముందు కూడా పలుమార్లు ఓటరు నమోదు చేపట్టినప్పటికీ ఆశించిన స్పందన రాలేదు. విద్య, ఉద్యోగాల నిమిత్తం వివిధ ప్రాంతాల్లో ఉంటున్నవారికి ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి వీలు కావడం లేదు. దీంతో వారు ఎక్కడ ఉన్నా.. ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవడానికి ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చింది. ఈసీ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహించినప్పటికీ ఇంకా చాలామంది తమ ఓటును నమోదు చేసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

మరో అవకాశం

లోక్‌సభ ఎన్నికల్లో అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటర్లుగా పేరు నమోదు చేసుకొని ఓటు హక్కు వినియోగించుకునేకునేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటివరకు పేర్లు నమోదు చేసుకోని వారికి మరో అవకాశం కల్పించింది. ఈఏడాది ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు కొత్తగా ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోడానికి అవకాశం కల్పించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. త్వరలో నిర్వహించే లోక్‌సభ ఎన్నికల పోలింగ్ శాతాన్ని పెంచడంపై ప్రత్యేక దృష్టిని సారించింది. 2023 నవంబర్ 30న నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్‌శాతం తగ్గడంతో ఈసారి అర్హులైన ప్రతీ ఒక్కరిని గుర్తించి పేర్లు నమోదు చేసుకునేలా జాగృతం చేస్తున్నారు. కొత్త ఓటర్ల పేర్ల నమోదుతోపాటు జాబితాల్లో మార్పులు, చేర్పులు, అనర్హుల పేర్ల తొలగింపునకు అవకాశం కల్పించారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌తోపాటు సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లో ఫారాలను పూర్తి చేసి అందజేసేలా బీఎల్‌వోలు శ్రద్ధ తీసుకుంటున్నారు.

అవగాహన

యువతను చైతన్యం చేసి ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేసుకునేలా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఎన్నికల అధికారులు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్వీప్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ, ఇంజనీరింగ్, వైద్య కళాశాలల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఓటు ఆవశ్యకత, దాని వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. ఓటు హక్కు ప్రాముఖ్యతను యువతకు వివరించి పేర్లు నమోదు చేసుకునేలా ప్రోత్సహించేందుకు కార్యాచరణను రూపొందించి అమలు చేస్తున్నారు. 2024 ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు కళాశాలల్లో నిర్వహిస్తున్న అవగాహన సదస్సుల్లో పేర్లు నమోదు చేసుకునేలా దరఖాస్తులు అందచేయనున్నారు. మరోసారి పేర్ల నమోదుకు అవకాశం కల్పించినందు వల్ల అర్హులైన వారంతా పేర్లు నమోదు చేసుకునేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు.

సాధారణంగా నామినేషన్ల గడువు చివరి రోజు వరకు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు. పరిశీలన, నోటీసుల జారీ, దరఖాస్తుదారుల సమాదానాల కోసం కనీసం వారం రోజులు గడువు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 15 వరకు గడువు ఇచ్చారు.

ఆన్‌లైన్‌లో ఓటు నమోదు

ఓటు హక్కు నమోదు కోసం ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ఓటు కావాల్సిన వ్యక్తి ఫోన్ నెంబరుతో రిజిస్టర్ చేసుకొని లాగిన్ కావాల్సి ఉంటుంది. రిజిస్టర్ యూజ్ ఏ న్యూ ఓటర్ విభాగంపై క్లిక్ చేస్తే ఫారం-6 అప్లికేషన్ ఫాం ఫర్ న్యూ ఓటర్స్ అనే భాగం కనిపిస్తుంది. అందులో పేర్కొన్న వివరాలన్నీ నింపి సబ్మిట్ చేయాలి. వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఏ దశలో ఉందో తెలుసుకోవచ్చు.

ఆఫ్‌లైన్ ద్వారా..

ఓటు హక్కు నమోదు కోసం ఆఫ్‌లైన్ (దరఖాస్తు చేసుకోవడం) ద్వారా ఫాం-6 బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వో)లకు ఇవ్వొచ్చు. ప్రతీ నియోజకవర్గానికి డివిజన్‌స్థాయి అధికారిని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్‌వో)ని ఎన్నికల సంఘం నియమించింది. వారి కార్యాలయాల్లోనూ దరఖాస్తులు అందజేయవచ్చు. ప్రతీ మండలంలో తహసీల్దార్ లేదా డిప్యూటీ తహసీల్దార్లకు ఓటు నమోదు కోసం దరఖాస్తు ఇచ్చేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది.

అనుబంధ జాబితా

ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే లోక్‌సభ ఎన్నికలకు తుది జాబితా విడుదలైంది. కొత్తగా పొందే వారు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవచ్చా? లేదా సందేహాలున్నాయి. ఏప్రిల్ 1వ తేదీ నాటికి ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరిని ఓటరు జాబితాలో చేర్చి అదనంగా కొత్త అనుబంధ జాబితాను విడుదల చేస్తారు.

ఓటర్లు

ఉమ్మడి జిల్లాలో రెండు లోక్‌సభ నియోజకవర్గాలు ఉన్నాయి. హనుమకొండ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో కలిపి మొత్తం 18,16,500 మంది ఓటర్లు ఉన్నారు. మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లను కలుపుకొని 15,26,998 ఓటర్లు ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 33,43,498 మంది ఓటర్లు ఇప్పటికే నమోదు చేసుకొని ఉన్నారు.

ఆంధ్రజ్యోతి HANUMAKONDA CITY
బుధవారం 10 ఏప్రిల్ 2024
హనుమకొండ సిటీ
• హనుమకొండ • కాజీపేట • హసన్‌పర్తి • ఐనవోలు • ధర్మసాగర్ • వేలేరు



నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో..

గీసుగొండ, ఏప్రిల్ 9: ఊకల్ నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు పంచాంగశ్రవణం చేశారు. నాగేంద్రుడిని మామిడి తోరణాలు, పూలలో అలంకరించి ఉగాది పచ్చడి తయారుచేసి భక్తులకు అందించారు.

శ్రీక్రోధి నామసంవత్సరంలో కోపాతాపాలకు పోకుండా ప్రజలు ప్రశాంతంగా ఉండాలన్నారు. గీసుగొండ శివాలయంలో ఆచార్య బెజ్జెంకి భిక్షపతి పంచాంగశ్రవణాన్ని వినిపంచారు. ప్రతి ఇంటిని మామిడితోరణలతో అలంకరించి షడ్రుచులతో మేళవించిన ఉగాది పచ్చడిని సేవించారు.



సేవ చేయడానికి పదవులు అవసరం లేదు



మాట్లాడుతున్న సాయి అశ్రిత్

న్యూశాయంపేట, ఏప్రిల్ 9: సేవ చేయడానికి పదవులు అవసరం లేదని ధృడమైన సంకల్పం ఉంటే సరిపోతుందని నగరానికి చెందిన ఉత్తరప్రదేశ్ క్యాడర్ ఐఏఎస్ అధికారి శాఖమూరి సాయి అశ్రిత్ అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని శ్రీవ్యాస ఆవాసంలో మంగళవారం సులక్ష్య సేవా సమితి 11వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సాయి అశ్రిత్ హాజరై మాట్లాడారు. సమాజ హితం కోసం పనిచేసే యువత మన దేశానికి చాలా అవసరం అన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ నవలా రచయిత అంపశయ్య నవీన్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం పిల్లలకు బక్ష్యాలు, పులిహోర, ఉగాది పచ్చడితో కూడిన భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సులక్ష్య సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మండువ సంతోష్, కిరణ్, వినయ్,సిదార్థ, శాఖమూరి చరణ్, కాజీపేట పురుషోత్తం, వ్యాస ఆవాస ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రవాసి రెడ్డి పేరెంట్స్ సేవలు ప్రశంసనీయం

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

న్యూశాయంపేట, ఏప్రిల్ 9: ప్రవాసి రెడ్డి పేరెంట్స్ సేవలు ప్రశంసనీయమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కొనియాడారు. ప్రవాసిరెడ్డి పేరెంట్స్ అసోసియేషన్ తెలంగాణ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం హనుమకొండలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరై ఉగాది క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. ప్రవాసిరెడ్డి పేరెంట్స్ అసోసియేషన్ నాయకులు వివిధ సామాజిక కార్యక్రమాలు చేస్తున్నారని, భవిష్యత్‌లో కూడా ఇలాంటి సామాజిక కార్యక్రమాలు చేయాలన్నారు. వివిధ దేశాలలో ఉన్న ప్రవాసిరెడ్డి విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే తనవంతు సహాయసహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. అనంతరం పౌరోహితులు మోగు శంకర్ శర్మ పంచాగ శ్రవణం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రవాసిరెడ్డి పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు నూకల అంజివర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకట రంగారెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రసాద్ రెడ్డి, కోశాధికారి పింగిళి వీరారెడ్డి, నేతాని శ్రీనివాస్ రెడ్డి, భరత్ కుమార్ రెడ్డి, మల్లారెడ్డి, గంటా రమాదేవి, శ్రీనివాస్‌రెడ్డితో పాటు అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.



రంజన్లకు ఫుల్ డిమాండ్

జూలైవాడ, ఏప్రిల్ 9 : వేసవికాలంలో మట్టి కుండలలో నీళ్ల తాగితే చల్లదనంతోపాటు ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుందనే విషయం తెలిసిందే. కాలానుగుణంగా ప్రతీ ఇంట్లో ఫ్రిజ్‌లు ఉన్నా మట్టితో తయారైన రంజన్లకు, కుండలకు డిమాండ్ తగ్గడం లేదు. ప్రస్తుతం ఎండలు తీవ్ర రూపం దాల్చడంతో మట్టికుండలు, రంజన్లకు గిరాకీ పెరిగింది. రాజస్థాన్ తదితర ప్రాంతాల నుంచి తెప్పించిన రంజన్లు నగరంలోని పలు ప్రాంతాల్లో లభిస్తున్నాయి. వివిధ సైజుల్లో తయారైన మట్టి కుండలు, వాటర్ బాటిళ్లు, కూజాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఒక్కో రంజన్‌కు రూ. 150 నుంచి రూ. 400 వరకు ధర పలుకుతోంది. అలాగే మట్టితో తయారైన వాటర్ బాటిళ్లు, కుండలు, కూజాలను సైజ్‌లను బట్టి రూ. 100 నుంచి రూ. 250 వరకు విక్రయిస్తున్నారు.

ఉగాది వైభవం

జోరుగా పంచాంగ శ్రవణాలు, కవి సమ్మేళనాలు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు..నగరమంతా పర్వదిన శోభ



కవులను సత్కరిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 9 : చైత్రశుద్ధ పాడ్యమి మంగళవారం హనుమకొండ జిల్లా వ్యాప్తంగా తెలుగువారి తొలి పర్వమైన శ్రీ క్రోధి నామ ఉగాది పర్వాన్ని సంప్రదాయంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారుజామున్నే లేచి అభ్యంగన స్నానాలు చేసి నూతన వస్త్రాలు ధరించి షడ్రుచుల పచ్చడి సేవించి భక్షాలను ఆరగించారు. ఇంటిని మామిడి తోరణాలతో అలంకరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పంచాంగ శ్రవణాలు వినేందుకు ఆలయాలకు తరలివెళ్లారు. ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో పది రోజులపాటు జరిగే శ్రీ రామనవమి వేడుకలను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు ఉగాది పర్వదిన వేళ ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి సన్నిధిలో అగ్ని ప్రతిష్ఠించి లోకకల్యాణార్థం ప్రత్యేక హోమం, శ్రీరామరక్ష హోమాన్ని నిర్వహించారు. సాయంత్రం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో కవి సమ్మేళనం నిర్వహించారు. పొట్లపల్లి శ్రీనివాస రావు, చేపూరి శ్రీరామరావు, వల్సపైడి, చక్రవర్తుల శ్రీనివాస్, మల్యాల మనోహర్‌రావు, నెల్లుట్ల రమాదేవి, మాదారపు వాణిశ్రీ, గట్టు రాధిక తదితర అనేక మంది కవులు శ్రీక్రోధి నామ సంవత్సర విశేషాలపై కవితాగానం చేశారు. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ముఖ్య అతిథిగా పాల్గొని కవులందరికి దేవాదాయ పక్షాన సముచిత సత్కారం చేశారు.

ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు గట్టు మహేశ్‌బాబు, ఈవో వెంకటయ్య, ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు. అంతకుముందు శ్వేతార్క మూల ఆలయ అర్చకులు ఐయినవోలు సాయిక్రిష్ణశర్మ ఆధ్వర్యంలో పంచాంగ పఠనం నిర్వహించారు. వడ్డేపల్లిలోని పీఆర్ భవన్‌లో సహృదయ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు వైభవంగా జరిగాయి. నమిలిగొండ విశ్వేశ్వరశర్మచే పంచాంగ పఠనం అనంతరం ఎన్‌వీఎన్ చారి అధ్యక్షతన యువ కవితారుచి కవి సమ్మేళనం వైభవంగా జరిగింది. సమ్మేళనంలో పాల్గొన్న కవులను సంస్థ అధ్యక్షులు గిరిజా మనోహర్‌బాబు, కుందావజ్ఝల క్రిష్ణమూర్తి తదితరులు సత్కరించారు.

ఉగాది వేడుకలను వరంగల్ జిల్లా వాసులు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లను మామిడి తోరణాలను కట్టి కొత్తగా మట్టితో తయారు చేసిన కుండలో ఉగాది పచ్చడిని తయారు చేసుకొని పప్పు పదార్థంతో కూడిన పిండి వంట భక్షాలను తయారు చేసి దేవుడికి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం వేళ ఆలయాలకు చేరుకుని కొత్త పంచాగ శ్రవణాన్ని విన్నారు. కాగా, ఉగాది అంటే చేదు పండుగ అని కొత్త అల్లుళ్లను అత్తారింటికి పిలువరు. అల్లుళ్ల లేకుండానే ఉగాది పండుగను నిర్వహించుకున్నారు. ఎన్నికల కోడ్ ఉండటంతో ఈ ఏడాది అధికారికంగా



వడ్డెపల్లి శ్రీసీతారామాంజనేయ స్వామి దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ దంపతులకు హారతి ఇస్తున్న రుత్వికుడు



మల్లికాంబ మనోవికాస కేంద్రంలో మానసికవికలాంగులతో కలిసి ఉగాది పచ్చడి తీసుకుంటున్న అదనపు కలెక్టర్ రాధిక గుప్తా

పంచాంగ శ్రవణం, కవి సమ్మేళన కార్యక్రమాలను నిర్వహించలేదు.

అధికార నివాస గృహంలో మంత్రి కొండా సురేఖ పూజలు

రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కుటుంబసమేతంగా మంగళవారం క్రోధి నామ సంవత్సరం ఉగాది పండుగను పరస్కరించుకొని హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ మినిస్టర్ క్వార్టర్‌లోకి అడుగు పెట్టారు. అధికార నివాస గృహంలో మంత్రి కొండా సురేఖ, కొండా మురళీధర్‌రావు దంపతులు, కూతురు, అల్లుడు, మనువడు, మనవరాలుతో గృహ ప్రవేశ పూజ కార్యక్రమాన్ని అర్చకులు నిర్వహించారు.

భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు

వరంగల్ మహా నగరంలోని భద్రకాళి అమ్మవారి ఆలయంలో ఉగాది సందర్భంగా మంగళవారం వసంత నవరాత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం పూర్ణాభిషేకంతో నవరాత్రి వ్రతాన్ని ప్రారంభించారు. ఉగాది రోజున బ్రహ్మను పూజించిన వారికి ఏడాదంతా శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. బ్రహ్మకు ఆలయాలు లేవని, భద్రకాళి అమ్మవారే బ్రహ్మ స్వరూపమని నమ్ముతారు. వసంత రుతువు ప్రారంభంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు. ఈ తొమ్మిది రోజుల్లో భాగంగా మొదటి రోజు అమ్మవారిని విశేషంగా అలంకరించి, లక్ష గులాబీ పుష్పాలతో అర్చన చేశారు.

ఆలయాల్లో సందడి..

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని వరంగల్‌లోని ఆలయాలు కిటకిటలాడాయి. కాశిబుగ్గ కాశీ విశ్వేశ్వరాలయం, రంగనాథస్వామి ఆలయం, బట్టల బజార్‌లోని వేంకటేశ్వరస్వామి, వేణుగోపాల స్వామి, శ్రీసీతారామ చంద్ర స్వామితోపాటు జేపీఎన్‌రోడ్డులోని దాసాంజనేయంలో హనుమాన్ చాలీసా పారాయణం, పూజలు, శ్రీవరద దత్తక్షేత్రం, శ్రీశృంగేరి శంకర మఠం, శ్రీరాజరాజేశ్వరాలయంతోపాటు శ్రీభద్రకాళి రోడ్డులోని శ్రీమార్వాడీ సమాజ్ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

కాళోజీ జంక్షన్ : పండగ అంటే మనం మాత్రమే సంతోషంగా ఉండటం కాదని, పది మందిని కలుపుకొని ఆనందాన్ని పంచడమే నిజమైన పండగ అని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ, ది నేషనల్ కన్జ్యూమర్ రైట్స్ కమిషన్ రాష్ట్ర వైస్ చైర్మన్ డాక్టర్ కె.అనితారెడ్డి అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం హనుమకొండలోని స్వధార్ ఆశ్రమం, ఆనంద నిలయంలో పిల్లల మధ్య వేడుకలను నిర్వహించారు.

● న్యూశాయంపేట : హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో రోడ్లు, బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో ఉన్న అనాథలు, వృద్ధులకు ఉగాది పండగను పురస్కరించుకుని కరుణామయ సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదానం చేశారు.



మెట్టురామలింగేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న చైర్మన్ రఘుచందర్, ధర్మకర్తలు, భక్తులు



ఐనవోలు దేవస్థానంలో పంచంగా శ్రావణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

మల్లికాంబ మనోవికాస కేంద్రంలో...

న్యూశాయంపేట అనాథ పిల్లలతో ఉగాది వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాధిక గుప్తా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఆమె అనాథ, వికలాంగ పిల్లల మధ్య కూర్చుని ఉగాది పచ్చడి స్వీకరించారు. ఈ వేడుకలలో మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకురాలు బండా రామలీల, బండా సదనందం, కార్యవర్గ సభ్యులు కళ్యాణ్, ప్రొఫెసర్ పద్మ, రాధికారెడ్డి పాల్గొన్నారు.

వడ్డెపల్లిలో...

వడ్డెపల్లి : వడ్డెపల్లిలోని శ్రీసీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ఉగాది పర్వదినోత్సవాన్ని పురస్కరించుకొని ఉదయం వసంత నవరాత్రి ఉత్సవాలను ఆలయ ప్రధానార్చకులు మణికొండ వామన్‌కుమార్ శర్మ, ఆలయ చైర్మన్ కటకం ప్రసాద్‌ల ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ - రేవతి దంపతులు హాజరై ఆలయంలో అంజన్న ఆశీస్సులను అందుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయ అర్చకులు మణికొండ వామన్‌కుమార్ శర్మ పంచాంగ శ్రవణాన్ని పఠించారు. గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లోని మహాలక్ష్మి ఆలయంలో స్థానిక కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్, విష్ణుపురి కాలనీలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కొంక హరిబాబు, జవహర్ కాలనీలో బీజేపీ నేత బండి హరీష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఉగాది పర్వదిన వేడుకలు నయనానందకరంగా జరిగాయి. వివిధ కాలనీలలో బంధు మిత్రులకు షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడితో పాటు భక్షాలను పంపిణీ చేసుకున్నారు. టీచర్స్ కాలనీ ఫేస్ -1 కమ్యూనిటీ హాల్‌లో కాలనీ అధ్యక్షుడు పింగిళి రామిరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు పంచాంగాన్ని పఠించారు.

● ఐనవోలు : ఐనవోలు మల్లికార్జున స్వామి దేవస్థానంలో క్రోధి నామ సంవత్సర ఉగాది పంచాంగ శ్రావణాన్ని నిర్వహించారు. ఆలయ ముఖ్య అర్చుకులు ఐనవోలు మధుకర్ శర్మ ఆధ్వర్యంలో పంచాంగం చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఈవో నాగేశ్వర్‌రావు, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాకర్లపాటి రవిందర్, అర్చకులు పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై

మడికొండ : మడికొండలోని మెట్టుగుట్టపై గల మెట్టురాలింగేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు మహాన్యాస రుద్రాభిషేకం జరిపి భక్తులకు దర్శనం కలిగించారు. ఆలయ చైర్మన్ పైడిపాల రఘుచందర్, ఈవో శేషు భారతి, ధర్మకర్తలు స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అర్చనలు చేశారు. సాయంత్రం అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ పంచాంగ పఠనం చేయగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు భైరి రాజు, రొడ్డ దయాకర్, దండిగం శ్రీనివాస్, వస్కుల ఉమ, బోగి కేదారి, ఆలయ సిబ్బంది బాస్కర్, రణధీర్, అనిల్, కుమార్, సురేష్, రాజేశ్వరి, వెంకటలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.

మడికొండలోని అయోధ్యాపురం రోడ్, టీఎస్‌జీవోస్ కాలనీలో మంగళవారం ఉగాది పండుగ, శ్రీకోధి నామ నూతన సంవత్సర వేడుకలను కాలనీవాసులు ఘనంగా జరుపుకున్నారు.

బీఆర్ఎస్ కార్యాలయంలో పంచాంగ శ్రవణం

రాంనగర్ : ప్రజలందరు క్రోధి నామ సంవత్సరంలో సుఖసంతోషాలతో జీవించాలని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్ అన్నారు. మంగళవారం సాయంత్రం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. పండితులు శ్రీ జగన్ అయ్యగారు రాశి ఫలాలను తెలిపారు. వివిధ రాశులకు సంబంధించి ఆదాయ వ్యయాలు, రాజ్య పూజ్యం, అవమానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వినయభాస్కర్ దంపతులతో పాటు మాజీ 'కుడా' చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్, మర్రి యాదవరెడ్డి, తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు దాస్యం విజయభాస్కర్, పులి రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలపై పట్టింపేదీ?

(5వ పేజీ తరువాయి)

కారణం భక్తుల పక్షాన నిలదీసేవారు లేకపోవడమే కారణం. ధర్మకర్తల మండళ్లు లేకపోవడంతో అధికారులు చేసిందే చట్టం, చెప్పిందే వేదమవుతోంది. కమీషన్లకు అలవాటు పడిన అధికారులు ఆలయ నిబంధన ప్రకారం టెండర్లలో కోట్ చేసిన విధంగా సరుకులు పంపిణీ జరకపోయినా పెద్దగా పట్టించుకోవడం లేదు. నాణ్యమైన వస్తువులు సరఫరా చేస్తామని టెండర్లు దక్కించుకుని నాసిరకం వస్తువులు పంపిణీ చేస్తున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాసిరకం వస్తువులకు కూడా మార్కెట్ దరల కన్నా రెట్టింపు రేట్లు వసూలు చేస్తూ దేవస్థానాల సొమ్మును లూటీ చేస్తున్నా అడిగేవారు లేని పరిస్థితి ఏర్పడింది. కొన్ని చోట్ల అధికారులే బినామీ కాంట్రాక్టర్ అవతారమెత్తి దేవాలయాలకు సరుకులను పూర్తిగా సరఫరా చేయకుండానే బిల్లులుపెట్టి డబ్బులు డ్రా చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. స్వామివారి బ్రహ్మోత్సవాలతో పాటు విఎగిలిన రోజుల్లో లడ్డూ, పులిహోర, నిత్యాన్నదానం, స్వామివారికి నిత్యనివేదన, వీఐపీలు, భక్తులకు అన్నదానం తదితర వాటి కోసం ఏటా ఆలయానికి నిత్యావసర వస్తువులు అవసరం అవుతాయి. ఆలయ అధికారులు వస్తువులను నేరుగా కొనుగోలు చేయకుండా సరుకులు కొనేందుకు ఆన్‌లైన్‌లో టెండర్లను పిలుస్తారు. తక్కువ దరలకు సరుకులను పంపిణీ చేస్తామని పలు వ్యాపార సంస్థలు, ట్రేడర్స్ ధరలను కోట్ చేసి ఆన్‌లైన్‌లో టెండర్ దాఖలు చేస్తారు. పంపిణీదారులు ఏపీసీ, హెచ్ఆర్ఐ ఎండోమెంట్ యాక్ట్ 30/87 ప్రకారం నిబంధనలకు లోబడి సరుకులు పంపిణీ చేయాలి. కానీ ఇవేం జరగడం లేదు. అధికారుల అండదండలతో కొందరు బడా కాంట్రాక్టర్లే ఏళ్ల తరబడి టెండర్లను దక్కించుకుంటున్నారు. సరుకుల సరఫరాను వారే కొనసాగిస్తున్నారు. ధర్మకర్తల మండళ్లు ఉంటే ఈ అక్రమాలకు కొంత మేరకైనా అడ్డుకట్టపడేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆలయాల ధర్మకర్తల మండళ్లలో రాజకీయ అధికార పార్టీల నేతలే సభ్యులుగా ఉండడం వల్ల అవి రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారతాయన్న అభిప్రాయం ఉందని, కానీ ఆ కారణంతో నియమించకపోతే ఆలయాలు అధికారుల ఆదాయార్జన కేంద్రాలుగా మారుతాయన్న వాస్తవాన్ని కూడా ప్రభుత్వం గుర్తించాలని భక్తులు కోరుతున్నారు.

మే 6 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 9 : కాకతీయ యూనివర్సిటీ రెగ్యులర్ బీఏ, బీకామ్, బీఎస్సీ ఇతర డిగ్రీ కోర్సుల 2, 4, 6వ సెమిస్టర్ పరీక్షలు మే 6 నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం. తిరుమలదేవిలు షెడ్యూల్‌ను విడుదల చేశారు. రెండో సెమిస్టర్ పరీక్షలు మే 6, 8, 10, 16, 18, 21, 23, 25 తేదీల్లో మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు అలాగే నాల్గవ సెమిస్టర్ పరీక్షలు మే 7, 9, 15, 17, 20, 22, 24, 27 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. 6వ సెమిస్టర్ పరీక్షలు 7, 9, 15, 17, 20, 22, 24,27 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. వీటితో పాటు బీసీఏ, బీ వొకేషనల్, బీహెచ్‌ఎం-సీటీ, పీడీసీ సెమిస్టర్ కోర్సుల పరీక్షలను కూడా నిర్వహిస్తామని షెడ్యుల్‌లో పేర్కొన్నారు. పరీక్షల తేదీల్లో విద్యార్థుల నుంచి ఏమైన అభ్యంతరాలుంటే షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు ఉంటాయని పరీక్షల నియంత్రణాధికారులు తెలిపారు.

'మట్టి తవ్వకాలు తక్షణమే నిలిపివేయాలి'

శాయంపేట, ఏప్రిల్ 9: మండలంలోని చలివాగు ప్రాజెక్టు మత్తడి కింద గత కొద్ది రోజులుగా మట్టి తవ్వకాలు చేస్తూ, కట్టకు మరమ్మతులు చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారంకాంగ్రెస్ కొప్పుల గ్రామ శాఖ అధ్యక్షుడు ఏరుగొండ శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామస్థులు తవ్వకాలు జరిపిన ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ మత్తడి కింద భారీగా తవ్వకాలు జరపడంతో లోతుగా గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉన్నాయని అన్నారు. దీంతో పశువులు, మత్స్యకారులు ప్రమాదాలబారిన పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా మత్తడి ఎక్కువగా పోస్తే గ్రామానికి నీరు రాకుండా ఉన్న కట్టలను ధ్వంసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తవ్వకాలు జరిపేచోట పైన సీసీతో భూగర్భంలో దేవాదుల పైప్‌లైన్ ధ్వంసం చేస్తున్నారని అన్నారు. ఈ విషయాన్ని ఇరిగేషన్ డీఈ గిరిధర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన బాధ్యతారాహిత్యంగా సమాధానమిచ్చారని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి తవ్వకాలు నిలిపివేయాలని లేకుంటే ఆందోళన చేపడతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పిట్టల నరేష్, శానబోయిన మల్లేష్, గండి రాజు. రాంరెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

బ్లడ్‌బ్యాంకులు ఖాళీ..

(5వ పేజీ తరువాయి)

వెల్లువెత్తుతున్నాయి. ఏటా వేసవిలో రక్తనిల్వల కొరత ఏర్పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, ముందస్తు ప్రణాళిక రూపొందించి రక్తాన్ని సేకరించడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రక్తదాన చైతన్య కార్యక్రమాలను కూడా పూర్తి స్థాయిలో నిర్వహించడం లేదని ఈ క్రమంలోనే రక్తనిల్వల కొరత ఏర్పడుతోందని వాపోతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి రక్తం దొరకని పరిస్థితులు ఏర్పడకుండా ఉండాలంటే రక్తదాతలు చొరవచూపాల్సిన అవసరం ఉందని వైద్యులు చెబుతున్నారు. జిల్లాలోని పలు సేవా సంస్థలు, స్వచ్ఛంధ సంస్థలు, యువజన, ఉద్యోగ సంఘాలు స్పందించి బాధ్యతాయుతంగా రక్తసేకరణ శిబిరాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. తద్వారా ఉమ్మడి జిల్లాలో రక్తనిల్వల సమస్య తలెత్తకుండా ఉంటుందని బ్లడ్‌బ్యాంకుల నిర్వాహకులు చెబుతున్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు



వడ్డెపల్లి మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డెపల్లి, ఏప్రిల్ 9: పవిత్ర రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ వడ్డెపల్లిలోని మసీదులో స్థానిక మసీదు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇఫ్తార్ విందులు హిందూ, ముస్లింల మధ్య స్నేహ భావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎనుకొంటి నాగరాజు,60వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎనుకొంటి పున్నంచందర్, కాంగ్రెస్ శ్రేణులు తాళ్లపెల్లి సుధాకర్,తాళ్లపెల్లి రవీందర్(జేకే), తాళ్లపెల్లి విజయ్, మండల సమ్మయ్య పాల్గొన్నారు.

ఖుస్రూపాషా, సునిత ఆనంద్‌ను కలిసిన కడియం

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 9 : స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ లోకసభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కడియం కావ్య మంగళవారం కాజీపేట దర్గా పీఠాధిపతి, హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూపాషా, టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు మోజెస్ ఆనంద్, బొడ్డు సునితా ఆనంద్‌ను వేర్వేరుగా కలిశారు. కాజీపేట దర్గాలోని ఖుస్రూపాషాను కలిసిన శ్రీహరి ఆయనకు రంజాన్ శుభాకాంక్షలు తెలియచేశారు. డాక్టరు కడియం కావ్య గెలుపునకు సహకరించాలని కోరారు. ఆ తరువాత హనుమకొండలోని మోజెస్ ఆనంద్ కుమార్ ఇంటికి వెళ్లారు. ఆనంద్, సునితలతో కాసేపు చర్చించారు. కావ్యకు మద్దతుగా నిలువాలిన కోరారు.



కాజీపేట దర్గా పీఠాధిపతితో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ లోకసభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య

ఫ్యాషన్ ప్రపంచంలో ఏ ట్రెండ్ కూడా స్థిరంగా ఉండదు. కొత్త కొత్త ట్రెండ్స్ నిరంతరంగా పుట్టుకొస్తూనే ఉంటాయి. అలా మహిళల మనసులను దోచుకున్న సరికొత్త ట్రెండ్ 'షరారా'! మరీ ముఖ్యంగా రంజాన్ ఈద్ నాటి జిలుగు వెలుగుల వేడుకల్లో తళుక్కున మెరవడం కోసం అమ్మాయిలు ఎంచుకోవలసిన డ్రస్సులు షరారాలే!

రంజాన్ షరారా



అలంకరణ ఇలా..

చాంద్ బాలీ, కడా లాంటి భారీ పోల్కి లేదా కుందన్ జ్యువెలరీ షరారాలకు చక్కగా సూటవుతుంది. ఏ నగ ధరించినా అవి రాళ్ల పొదిగినవి అయి ఉండేలా చూసుకోవాలి. అలాగే చెవులకు పొడవాటి ఝుంకాలు పెట్టుకోవాలి. హై హీల్స్, పాయింటెడ్ షూస్ వేసుకుంటే, షరారా అందం రెట్టింపవుతుంది.

నచ్చిన స్టైల్‌లో

పొడవాటి కుర్తీ, దుపట్టాలతో కలిపి ధరిస్తే షరారా అందం ద్విగుణీకృతం అవుతుంది. అనార్కలి, షార్ట్ కుర్తీలతో కూడా కలిపి ధరించవచ్చు. సౌకర్యం, స్టైల్ ఆధారంగా ఎవరికి వారు షరారాలను నచ్చినట్టు ధరించవచ్చు. ఆధునికం, సంప్రదాయం.. ఇలా రెండు పోకడలూ కలగలసినట్టు కనిపించే షరారాలు నిండుగా, హుందాగా ఉంటాయి. పండుగ కోసం గులాబీ, ఎరుపు, నీలం.. ఇలా ముదురు రంగుల శాటిన్ లేదా జార్జెట్ షరారాలు ఎంచుకోవాలి.

లెహంగా ప్యాంట్స్

జత ఫ్లేర్డ్ ప్యాంట్స్ కలగలిస్తే ఒక షరారా రూపొందుతుంది. కాళ్ల దగ్గర వదులుగా ఉండడంతో ఈ డ్రస్‌ను లెహంగా ప్యాంట్స్ అని కూడా సంబోధిస్తూ ఉంటారు. ముత్యాలు, జరీ, సెక్విన్లు, గోటా పట్టీ ఇలా అదనపు హంగులు జోడించుకున్న షరారాలు ప్రత్యేకించి రంజాన్ వేడుకల్లో ధరించడానికి అనువుగా ఉంటాయి.

స్ఫూర్తి

19 ఏళ్లకే సర్టిఫైడ్ బుల్లెట్ మెకానిక్‌గా ఎదిగింది కేరళకు చెందిన 21 ఏళ్ల **దియా జోసెఫ్**. గోళ్లకు రంగులు వేసుకోవలసిన వయసులో, వాటికి గ్రీజు జిడ్డు అంటించుకుంటూ, టీనేజీ వయసును బుల్లెట్ల మరమ్మతుకే అంకితం చేసింది దియా. అతి పిన్న వయస్కురాలైన బుల్లెట్ మెకానిక్‌గా గుర్తింపు పొందిన దియా గురించి మరిన్ని ఆసక్తికరమైన విశేషాలివి.

డుగ్ డుగ్ బండి.. రిపేర్ చేస్తా రండి



ఎవరైనా బైక్ నడపడం మొదలుపెట్టిన తర్వాతే, దాన్ని రిపేర్ చేయడమెలాగో నేర్చుకుంటారు. కానీ కేరళలోని పులిక్కపరంబిల్‌కు చెందిన దియా జోసెఫ్, మొదట రిపేర్లు చేయడం నేర్చుకుని తర్వాత బైక్ నడపడం మొదలుపెట్టింది. 2007లో దియా తండ్రి జోసెఫ్ డొమినిక్, ఇంట్లోనే సొంత బుల్లెట్ వర్క్‌షాప్‌ను నెలకొల్పి, రిపేర్లు చేయడం మొదలుపెట్టాడు. అప్పట్లో ఇంట్లో ఉన్న కుటుంబసభ్యుల కంటే ఇంటి ముందు బుల్లెట్లే ఎక్కువ ఉండేవి. వాటి మధ్య పరుగులు తీస్తూ, బుల్లెట్ల డుగ్ డుగ్ శబ్దాలు వింటూ పెరిగిన దియా, ఖాళీ సమయాల్లో రిపేర్ పనుల్లో మునిగిపోయిన నాన్నను గమనిస్తూ ఉండిపోయేది. అలా దియాలో బుల్లెట్ల పట్ల తెలియని ఆసక్తి చిన్నప్పుడే నాటుకుపోయింది.

నాన్నకు సహాయపడుతూ...

కొట్టాయం రైల్వే స్టేషన్‌కు దగ్గర్లో ఉన్న జోసెఫ్ వర్క్‌షాప్ వస్తూ, పోతూ ఉండే బుల్లెట్లతో ఎప్పుడూ బిజీగానే ఉంటూ ఉంటుంది. పదో తరగతి పరీక్షలు రాసి, ఇంటి పట్టున సెలవు రోజులు గడుపుతున్న దియా, మొబైల్ ఫోన్‌తో కాలక్షేపం చేస్తూ ఉండేది. కానీ కూతురు మొబైల్ ఫోన్‌తో కాలక్షేపం చేయడం నచ్చని దియా తల్లి, ఆ అలవాటు మానుకోమని చెప్పడంతో, దియా తన తండ్రి వర్క్‌షాప్‌కు వెళ్లి, మెకానిక్ పనుల్లో ఆయనకు సహాయపడడం మొదలుపెట్టింది. దియా కనబరుస్తున్న ఆసక్తికి ముచ్చటపడిన జోసెఫ్, క్రమేపీ కూతురికి చిన్నా చితకా రిపేర్ పనులను అప్పగించడం మొదలుపెట్టాడు. అలా రెండేళ్ల వ్యవధిలో దియా బుల్లెట్ రిపేర్ల మీద పట్టును పెంచుకుంది. ఒక పక్క ఇంటర్ చదువుతూనే, మరో పక్క ఖాళీ సమయాలను రిపేర్ల కోసం కేటాయించడం కొనసాగించింది. కూతురి ఆసక్తిని గమనించిన తల్లి, బిడ్డ చదువు గురించి ఒకింత కంగారు పడడం మొదలుపెట్టింది. కానీ ఇంటర్ పరీక్షల్లో దియాకు 98% మార్కులు రావడంతో ఆవిడ ఊపిరి పీల్చుకుంది. వర్క్‌షాప్‌లో కస్టమర్ల కంప్లైంట్స్ రాసుకోవడంతో మొదలుపెట్టి, ఎయిర్ ఫిల్టర్ క్లీనింగ్, ఆయిల్, కేబుల్ ఛేంజ్‌తో పాటు పూర్తి బుల్లెట్ సర్వీసింగ్ వరకూ దియా నైపుణ్యం సాధించేసింది.

థండర్‌బర్డ్ బహుమతిగా...

దియా ఇప్పుడు రోజుకు రెండు నుంచి మూడు బుల్లెట్లను సర్వీస్ వర్క్ చేయగలుగుతోంది. అలా ఈ 21 ఏళ్ల అమ్మాయి రోజుకు రెండు వేల రూపాయలను కూడా సంపాదిస్తోంది. ప్రస్తుతం అమల్ జ్యోతి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ చదువుతున్న దియా, తాజాగా బుల్లెట్ డ్రైవింగ్ లైసెన్స్‌ను పొందింది. అయితే అంతకంటే రెండేళ్ల ముందే బుల్లెట్ రిపేర్లకు సంబంధించిన లైసెన్స్‌ను సొంతం చేసుకోవడం విశేషం. అయితే రిపేర్లతో తనకొచ్చిన డబ్బును కుటుంబానికే ఇచ్చేసి, పాకెట్ మనీగా కొంత మొత్తాన్నే తల్లిదండ్రుల నుంచి తీసుకునే దియాకు, బుల్లెట్ నడపాలనే ఆసక్తి కూడా ఎక్కువే! నిజానికి బాల్యం నుంచే బుల్లెట్లతో అనుబంధం ఉన్నప్పటికీ, ఆ బైక్‌ను నడిపే అవకాశం దియాకు ఎప్పుడూ రాలేదు. కానీ సొంత బుల్లెట్ ఉంటే, దాని కొచ్చే రిపేర్లు, వాటిని సరి చేయడంలో ఉండే కిటుకులు ఒంటపడతాయి. ఆ దిశగా ఆలోచించిన దియా తండ్రి జోసెఫ్, దియాకు థండర్‌బర్డ్ వేరియెంట్‌ను బహూకరించాడు. డ్రైవింగ్ లైసెన్స్ కూడా దక్కడంతో, దియా ఇప్పుడు కొట్టాయం రోడ్ల మీద రయ్యిమంటూ దూసుకుపోతోంది.

రాయల్ ఎన్‌ఫీల్డ్ ఆఫర్

కేరళలోని పిన్న వయసు సర్టిఫైడ్ విమెన్ బుల్లెట్ మెకానిక్‌గా పేరు తెచ్చుకున్న దియా గురించి తెలుసుకున్న రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీ, చెన్నైలోని ఫ్యాక్టరీలో పని చేసే అవకాశాన్ని దియాకు కల్పించింది. "అదొక పెద్ద సర్‌ప్రైజ్ నాకు. వాళ్లు మా ఇంటికొచ్చి నా గురించి ఒక ఫీచర్ ఫిల్మ్ నిర్మించారు. నేనిప్పటివరకూ పొందిన అమూల్యమైన గుర్తింపు అది. ఈ విషయం తెలిసిన మా కాలేజీ టీచర్లు, విద్యార్థులు నన్ను అభినందించి, ప్రోత్సహించారు. రిపేర్ పనుల్లో నేను ప్రతి రోజూ నాన్నకు సహాయపడుతూ ఉంటాను. ఆయిల్స్, కేబుల్స్ మార్చడంతో పాటు, చైన్లను బిగించడం, ఇతర విడిభాగాలను మార్చడం చేస్తూ ఉంటాను. కానీ ఇంజన్ బరువు ఎక్కువ కాబట్టి దాన్ని ఊడదీసి బిగించడం నా ఒక్క దాని వల్లా కాదు. కాబట్టి ఆ పనిలో నాన్న సహాయం తీసుకుంటూ ఉంటాను" అంటూ తన బుల్లెట్ జర్నీ గురించి వివరించింది దియా.

> ఈ పనిలో నేనెదుర్కొన్న ఒకే ఒక ఇబ్బంది నా వయసు, శరీర బరువు. రిపేర్ నేర్చుకుంటున్న సమయంలో బుల్లెట్, దాని విడిభాగాలను నేను మోయలేకపోయేదాన్ని. కానీ రెండేళ్ల వ్యవధిలో బుల్లెట్ బరువును ఎలా ఆపాలో, దాన్నెలా హ్యాండిల్ చేయాలో నేర్చుకోగలిగాను.

కొత్త నైపుణ్యం లాభదాయకం

"కొత్త నైపుణ్యాన్ని నేర్చుకోవడం ఎప్పటికీ లాభదాయకమే! దియా వర్క్‌షాప్‌లో ఉంటే ఆ సందడే వేరు. అందర్నీ నవ్విస్తూ, చలాకీగా రిపేర్లు చేసే దియాతో మా వర్క్‌షాప్ ప్రతి రోజూ కళకళలాడుతూ ఉంటుంది. ఒకసారి ఇంజన్ లోడ్ చేస్తూ చేతికి గాయమవడంతో, దియా కళ్లు తిరిగి పడిపోయింది. అయినా కొద్ది క్షణాల్లోనే తేరుకుని, వెనకంజ వేయకుండా రిపేర్ ముగించింది. పనిలో దియాకు ఉన్న శ్రద్ధకు ఈ సంఘటనే ఉదాహరణ" అంటూ దియా తండ్రి, జోసెఫ్, కూతురిని కొనియాడుతున్నాడు. ప్రస్తుతం కాలేజీ హాస్టల్‌లో ఉంటూ ఇంజనీరింగ్ చదువుతున్న దియా, సెలవు రోజుల్లో ఇంటికొచ్చినప్పుడు, బుల్లెట్ రిపేర్ పనుల్లో మునిగిపోతూ ఉంటుంది. "ఈ పనిలో నేనెదుర్కొన్న ఒకే ఒక ఇబ్బంది నా వయసు, శరీర బరువు. రిపేర్ నేర్చుకుంటున్న సమయంలో బుల్లెట్, దాని విడిభాగాలను నేను మోయలేకపోయేదాన్ని. కానీ రెండేళ్ల వ్యవధిలో బుల్లెట్ బరువును ఎలా ఆపాలో, దాన్నెలా హ్యాండిల్ చేయాలో నేర్చుకోగలిగాను. ఇప్పుడు నాన్న సహాయం లేకుండా రిపేర్ పనులన్నీ చేయగలుగుతున్నాను. స్వయంగా బుల్లెట్ కూడా నడుపుతున్నాను కాబట్టి, రిపేర్ మీద మరింత అవగాహన పెరిగింది. ఎంతో మంది ఆడపిల్లల తల్లిదండ్రులు నన్ను ప్రేరణగా తీసుకుని, నచ్చిన కెరీర్ ఎంచుకునే అవకాశాన్ని వాళ్ల పిల్లలకు కల్పిస్తూ ఉండడం నాకెంతో సంతోషంగా ఉంది" అంటూ చెప్పుకొచ్చింది దియా.



అమోఘంగా... గెలుపు సారథిగా...

కన్న బిడ్డ కోసం నలభై మూడేళ్ళ వయసులో ఫుట్‌బాల్ కోచ్‌గా మారారు **గిరిజా కుమారి మధు**. సెరిబ్రల్ పాల్సీకి గురైన బాలలకు శిక్షణ ఇచ్చి... ప్రతిష్ఠాత్మకమైన పోటీల్లో పతకాలు గెలిచేలా తీర్చిదిద్దారు. "వైకల్యాలున్న పిల్లల అండగా నిలవడం కన్నా గొప్ప సేవ మరేదీ ఉండదు" అంటున్న యాభయ్యేళ్ళ గిరిజ కథ...



"మాది కేరళలోని తామరకుళం గ్రామానికి చెందిన మధ్యతరగతి రైతు కుటుంబం. అయిదుగురు సోదరులు, ఇద్దరు అక్కాచెల్లెళ్ళ మధ్య పెరిగాను. కుటుంబం గడవడమే అంతంతమాత్రం కావడంతో.. అందరికీ ఉన్నత విద్య చెప్పించే స్తోమత మా అమ్మానాన్నలకి లేదు. ఇంటర్ వరకూ చదివాను. నాన్న మరణించడంతో... ఇంటి బాధ్యతలు అమ్మ మీద పడ్డాయి. ఆమెకు అండగా ఉండాలనుకున్నాను. కొట్టాయంలో నర్సింగ్ కోర్సు పూర్తి చేసి, ఒక ఆసుపత్రిలో నర్సుగా రెండేళ్ళు పని చేశాను. ఆ తరువాత ఎలక్ట్రిక్ కాంట్రాక్టర్ మధుసూదనన్‌తో నాకు వివాహమయింది. మాకు ఇద్దరు పిల్లలు. వాళ్ళు కాస్త పెరిగాక.. డిజైనింగ్ నేర్చుకొని, టైలరింగ్ ప్రారంభించాను. ముగ్గురు మహిళలను పనిలో పెట్టుకొని... పదేళ్ళ పాటు టైలరింగ్ షాపు నడిపాను.

ఇంగ్లీష్ రాకపోవడంతో...

నాకు బాల్యం నుంచి క్రీడలంటే ఇష్టం. బడిలో ఏ స్పోర్ట్స్ ఈవెంట్ జరిగినా ఉత్సాహంగా పాల్గొనేదాన్ని. కానీ కుటుంబ పరిస్థితుల వల్ల అంతకన్నా ముందుకు కొనసాగలేకపోయాను. మా చిన్నబ్బాయికి ఫుట్‌బాల్ అంటే ఆసక్తి. వాడిని స్థానిక ఫుట్‌బాల్ అకాడమీలో చేర్చాను. వీలైనప్పుడల్లా వాడితో మైదానానికి వెళ్ళేదాన్ని. ఆ అకాడమీలో మంచి కోచ్‌లు ఉండేవారు. కానీ ఏవేవో కారణాలతో తరచూ మానేసేవారు.. దాంతో పిల్లల శిక్షణకు అంతరాయం కలిగేది. మా అబ్బాయిలో నిరాశ గమనించాక... నేనే కోచ్ అయితే ఎలా ఉంటుందనిపించింది. దానికి సంబంధించిన వివరాలు తెలుసుకున్నాను. అలెప్పీలో ఆరు రోజుల పాటు ఫుట్‌బాల్ కోచింగ్ కోర్సులో చేరాను. తొలి ప్రయత్నంలో... థియరీలో 72 శాతం మార్కులు సంపాదించినా... ప్రాక్టికల్స్‌లో ఫెయిలయ్యాను. కొచ్చీలో మరోసారి అదే కోర్సు చేసి.. సర్టిఫికెట్ సంపాదించాను. స్థానికంగా పిల్లలకు శిక్షణ మొదలుపెట్టాను. అప్పుడే ముంబాయిలోని పిళ్ళై గ్రూప్ వాళ్ళు స్పోర్ట్స్ మేనేజిమెంట్‌లో నిర్వహిస్తున్న ఎఫ్ఐఎఫ్ఎ/సిఐఈఎస్ ఇండియా ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ గురించి తెలిసింది. ముంబాయిలోని వాళ్ళ కార్యాలయానికి వెళ్ళినప్పుడు... నాకు ఇంగ్లీష్ బాగా రాకపోవడంతో ఇబ్బందిపడ్డాను. వెనక్కి తిరిగి వెళ్ళిపోదామనుకున్నాను. అక్కడ ఉన్న డాక్టర్ సెలీనా జోయ్ అనే మలయాళీ మహిళ నా పరిస్థితి అర్థం చేసుకున్నారు. "ఒత్తిడి పడకండి. మీకు తెలిసినవన్నీ మలయాళంలోనే చెప్పండి" అని ప్రోత్సహించారు. ఆమె సాయంతో కోర్సుకు అప్లై చేశాను. ఇంటర్వ్యూ సమయానికి నా ఇంగ్లీష్ మెరుగుపరుచుకున్నాను. నా ఉత్సాహాన్ని గమనించిన ఇంటర్వ్యూ బోర్డు సభ్యులు నాకు అడ్మిషన్ ఇచ్చారు. ఈలోగా కోవిడ్ రావడంతో... బోధన ఆన్‌లైన్‌లో సాగింది. 2021లో... ఏడాది వ్యవధి ఉండే ఆ కోర్సు పూర్తి చేసిన.. కేరళ సీనియర్ గర్ల్స్ ఫుట్‌బాల్ జట్టుకు మేనేజర్‌గా బాధ్యతలు తీసుకున్నాను. అలాగే ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ 'గోల్డెన్ బేబీ లీగ్'లోనూ కోచ్‌గా చేరాను. ఆ లీగ్‌లో ప్రతి సంవత్సరం 500 మంది గ్రామీణ బాలలకు ఫుట్‌బాల్‌లో శిక్షణ ఇస్తారు. 'సెరిబ్రల్ పాల్సీ (సీపీ) స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా'ను నడిపిస్తున్న కవితా సురేశ్‌ను అక్కడే కలుసుకున్నాను. ఆ పరిచయం నా జీవితాన్ని సరికొత్త మలుపు తిప్పింది.

> ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ 'గోల్డెన్ బేబీ లీగ్'లోనూ కోచ్‌గా చేరాను. ఆ లీగ్‌లో ప్రతి సంవత్సరం 500 మంది గ్రామీణ బాలలకు ఫుట్‌బాల్‌లో శిక్షణ ఇస్తారు. 'సెరిబ్రల్ పాల్సీ (సీపీ) స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా'ను నడిపిస్తున్న కవితా సురేశ్‌ను అక్కడే కలుసుకున్నాను. ఆ పరిచయం నా జీవితాన్ని సరికొత్త మలుపు తిప్పింది.

దేవునికి కృతజ్ఞతగా...

సెరిబ్రల్ పాల్సీకి గురైన పిల్లల కోసం పలు కార్యక్రమాలను కవిత నిర్వహిస్తున్నారు. కేరళలో వారికోసం ఒక ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రారంభించాలని ఆమె చేసిన ప్రతిపాదన నాకు ఎంతగానో నచ్చింది. ఈ విషయం మా ఇంట్లో చర్చించినప్పుడు... అందరూ మద్దతునిచ్చారు. ముందుగా కేరళ రాష్ట్రంలో 'సెరిబ్రల్ పాల్సీ' బాధితులైన పిల్లల వివరాలు సేకరించాం. వారి తల్లిదండ్రులను కలిసి... ఆ పిల్లల స్థితిగతుల గురించి తెలుసుకున్నాం. రోజువారీ జీవనంలో వారు ఎదుర్కొనే సమస్యలను అవగాహన చేసుకున్నాం. ఆహారాన్ని తినడానికి సైతం వాళ్ళు పడుతున్న ఇబ్బందులు చూసి... నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. సమాజం వారిని జాలిగానో, నిర్లక్ష్యంగానో చూస్తుంది. తల్లితండ్రులకు వారి భవిష్యత్తు గురించి తీవ్రమైన ఆందోళన, భయం ఉంటాయి. నా వంతు చేయూత అందించి... వారి సామర్థ్యాన్ని నిరూపించుకొనే అవకాశం కల్పించాలని నిర్ణయించుకున్నాను. 2021లో 'సెరిబ్రల్ పాల్సీ ఫుట్‌బాల్ అసోసియేషన్' ఏర్పాటు చేశాను. మొదటి విడతగా... నా సొంత ఊరైన తామరకుళంలో శిక్షణ శిబిరం నిర్వహించాం. పిల్లలకు రోజువారీ పనుల్లో సాయం అందించడానికి కొందరు తల్లితండ్రుల సహకారం తీసుకున్నాం. ఆ శిబిరానికి మంచి స్పందన వచ్చింది. శిక్షణ పొందిన పిల్లలు వివిధ పోటీల్లో విజయాలు సాధించారు. ఇది మాకు మరింత ఉత్సాహాన్నివ్వడంతో... శిబిరాలను రెగ్యులర్‌గా కొనసాగిస్తున్నాం. మూడేళ్ళలో 250 మందికి పైగా... సెరిబ్రల్ పాల్సీ బాధిత పిల్లలు శిక్షణ పొందారు. కిందటి ఏడాది డిసెంబర్‌లో జరిగిన 'ఖేలో ఇండియా పారా గేమ్స్'తో సహా... పాల్గొన్న అయిదు జాతీయ స్థాయి ఈవెంట్లలోనూ వాళ్ళు పతకాలు సాధించారు. రాబోయే నెలల్లో జరగబోయే మరిన్ని ఈవెంట్లలో తమ సత్తా చూపడానికి సిద్ధమవుతున్నారు. అలాగే... వైకల్యాలున్న, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల్లోని పిల్లలకు క్రీడలతో పాటు ఇతర అంశాల్లో నైపుణ్యాలు కల్పించడానికి 'అమోఘా ఫౌండేషన్' పేరిట ఒక సంస్థను 2023లో స్థాపించాను. దానిద్వారా ఇప్పటికి ఇరవై మంది పిల్లలకు స్కూటర్లను, ల్యాప్‌టాప్‌లనూ అందజేశాను. వివిధ ఫుట్‌బాల్ అకాడమీలకు కోచ్‌గా నేను సంపాదించే డబ్బులో ఎక్కువ భాగం నా సంస్థ కోసమే ఖర్చు చేస్తున్నాను. మా పిల్లలు, బంధువులు, స్నేహితులు... ప్రతి ఒక్కరూ నేను చేసే పనులకు అండగా నిలుస్తున్నారు. వైకల్యాలున్న పిల్లలకు సాయం చెయ్యడం కన్నా గొప్ప సేవ మరేదీ ఉండదు. ఆరోగ్యవంతమైన పిల్లలను నాకు ఇచ్చిన దేవుడికి కృతజ్ఞతగా... నాకు ఓపిక ఉన్నంతకాలం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాను."



పిల్లలో చురుకుదనం...

పిల్లలు చురుగ్గా ఉండాలంటే మంచి ఆహారం తీసుకోవాల్సిందే. ఇంతకీ చిన్నపిల్లల మెదడు ఎదుగుదల కోసం ఇవ్వాల్సిన పోషకాహారాలేంటో తెలుసుకుందాం...

- కోడిగుడ్లలో న్యూట్రిన్లుతో పాటు బి12 విటమిన్ ఉంటుంది. వీటి వల్ల మెదడు అభివృద్ధికి ఉపయోగపడతాయి. దీంతో పాటు ప్రతిరోజూ కోడిగుడ్డు తింటే పిల్లల్లో బలం వస్తుంది.
- పాలు, పెరుగు, నెయ్యి లాంటి పాల ఉత్పత్తుల్లో ప్రొటీన్లు, కార్బొహైడ్రేట్లు విరివిగా లభిస్తాయి. ఇవి మెదడుకు శక్తినిస్తాయి. అందువల్ల పిల్లల్లో చురుకుదనం వస్తుంది.
- బీన్స్‌లో జింక్ శాతం ఉంటుంది. మెదడుకు ఎనర్జీని ఇస్తుంది. దీనివల్ల మెదడు ఆరోగ్యంగా ఉంటుంది.
- కంది, పెసలు, అలచందలు, మినుములు, శనగలు.. లాంటి పప్పు ధాన్యాలతో చేసిన ఆహారం తినిపించాలి. వీటిల్లోని బి-విటమిన్ వల్ల మెదడు కణజాలం అభివృద్ధి చెందుతుంది. ముఖ్యంగా పిల్లల చర్మం మీద నొప్పులు తగ్గిపోతాయి.
- చిలగడదుంపలు, ఆలు, టొమాటోలు, క్యారెట్‌తో చేసిన ఆహారంతో పాటు.. ద్రాక్ష, బొప్పాయి.. లాంటి తాజా పండ్లను తినటం వల్ల సులువుగా జీర్ణ అవుతుంది. అంతేనా వీటిలోని యాంటీ ఆక్సిడెంట్స్ వల్ల పిల్లల్లో ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి. ప్రధానంగా మెదడు కణాల్లో శక్తి కలుగుతుంది. తద్వారా మెదడు ఆరోగ్యంగా ఉంటుంది.
- జీడిపప్పు, పిస్తా, బాదం, పొద్దు తిరుగుడు విత్తనాలు లాంటివి తినటం వల్ల ప్రొటీన్లు, ఫ్యాటీ యాసిడ్స్‌తో పాటు అధికంగా ఎ, బి విటమిన్లు లభ్యమవుతాయి. దీనివల్ల బ్రెయిన్ ఫంక్షనింగ్‌కు మంచిది.
- కూరల్లోకి శుద్ధమైన పసుపు వాడటం వల్ల పిల్లల మెదడు కణజాలం ఆరోగ్యంగా ఉంటుంది. ముఖ్యంగా వారిలో వేగంగా నేర్చుకున స్కిల్స్ పెరుగుతాయి.
- తాజా ఆకుకూరలతో పాటు ఓట్స్‌తో చేసిన ఆహారం తినటం వల్ల పిల్లల్లో చురుకుతనం వస్తుంది.
- చేపలు తినటం వల్ల ఇందులోని న్యూట్రిన్లు మెదడును చురుగ్గా ఉంచుతాయి. అంతేనా సీఫుడ్ తింటే పిల్లల ఆరోగ్యానికెంతో మంచిది. దీంతో పాటు పిల్లలు మంచి నీళ్లు బాగా తాగాలి. దీని వల్ల డీహైడ్రేషన్ ఉండదు. రక్తం సాఫీగా ప్రవహిస్తుంది. శరీరంలోని అన్ని అవయవాలకు ఆక్సిజన్ అందుతుంది.



ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
బుధవారం • 10 ఏప్రిల్ 2024
cinema@andhrajyothy.com

టిల్లు మన మనిషి అయిపోయాడు

ఎన్టీఆర్

సిద్ధు జొన్నలగడ్డ నటించిన 'డీజే టిల్లు' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన 'టిల్లుస్క్వేర్' మార్చి 29న విడుదలై ఘనవిజయం అందుకుంది. విడుదలైన తొమ్మిది రోజుల్లోనే రూ. 100 కోట్ల గ్రాస్ సాధించిన 'టిలు స్క్వేర్' సక్సెస్ మీట్‌ను సోమవారం నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జూనియర్ ఎన్టీఆర్ మాట్లాడుతూ "సిద్ధూకి సినిమా తప్ప వేరే ఏమీ తెలియదు. నిరంతరం వర్క్ గురించే ఆలోచిస్తుంటారు. ఈ సినిమాతో సిద్ధు కేవలం



విజయాన్ని అందుకోవడమే కాకుండా మన జీవితంలో కలకాలం మిగిలిపోయే ఒక పాత్రను ఇచ్చారు. ఈ రోజు టిల్లు... మన ఇంట్లో, మన చుట్టూ తిరిగే మనిషి అయిపోయాడు. నేనింక నవ్వలేను బాబోయ్ అనేంతలా సిద్ధూ నవ్వించారు" అని చెప్పారు. దర్శకుడు త్రివిక్రమ్ మాట్లాడుతూ "ఈ సినిమా 'టిల్లు స్క్వేర్' మాత్రమే కాదు, రాధిక స్క్వేర్ కూడా. ఈ సినిమా కోసం చిత్ర బృందం ఎంత కష్టపడ్డారో ప్రత్యక్షంగా చూశాను. అందుకే ఈ రేంజ్ సక్సెస్ వారికి దక్కింది" అని అన్నారు. కథానాయకుడు విశ్వక్‌సేన్ మాట్లాడుతూ "ఈ సినిమా కోసం సిద్ధు ఎంతగా ఎఫోర్ట్ పెట్టారో నాకు తెలుసు. టిల్లు పాత్ర ఎప్పటికీ నిలిచిపోతుంది" అని తెలిపారు. చిత్ర కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ "ఈ సినిమాను ఇంతలా ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. నేను చెప్పిన డైలాగ్ తారక్ అన్న నోటి నుంచి రావడం కంటే పెద్ద అవార్డ్ ఇంకోటి ఉండదు" అని చెప్పారు. దర్శకుడు రామ్ మల్లిక్ మాట్లాడుతూ "ఈ సినిమా విజయంలో చిత్ర బృందం సమష్టి కృషి ఉంది" అని చెప్పారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు విచ్చేశారు.

ఫన్ ఫిల్డ్ అడ్వెంచర్



వరుస బ్లాక్‌బస్టర్స్‌తో దూసుకుపోతున్నారు హీరో శ్రీవిష్ణు. ఉగాది సందర్భంగా మంగళవారం ఆయన తన 19వ చిత్రాన్ని ప్రారంభించారు. దిల్‌రాజు క్లాప్ కొట్టగా, అనిల్ రావిపూడి కెమెరా స్విచ్చాన్ చేశారు. తొలి షాట్‌కి వీవీ వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. ఫన్ ఫిల్డ్ అడ్వెంచర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి జానకిరామ్ మారెళ్ల దర్శత్వం వహిస్తున్నారు. అనూష ద్రోణవల్లి, సీతాకుమారి కొత, గోపాలం లక్ష్మీదీపక్ నిర్మిస్తున్నారు. కోన వెంకట్, బాబీ కొల్లి సమర్పిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటింగ్: చోటా కె ప్రసాద్, సంగీతం: విజయ్ బులగానిన్, డీఓపీ: సాయి శ్రీరామ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్:వై నాగు.

హ్యాట్రిక్ హిట్ కోసం..



విక్టరీ వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వచ్చిన 'ఎఫ్ 2', 'ఎఫ్ 3' చిత్రాలు ఘన విజయం సాధించాయి. హ్యాట్రిక్ హిట్ కోసం వీరిద్దరూ మళ్లీ జత కట్టారు. దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మించే ఈ సినిమా వివరాలను ఉగాది సందర్భంగా మంగళవారం వెల్లడించారు. బ్యాక్ టు బ్యాక్ ఏడు హిట్స్ అందించిన అనిల్ రావిపూడికి దిల్ రాజు నిర్మాణ సంస్థలో ఇది ఆరో సినిమా కావడం గమనార్హం.

హీరో, అతని మాజీ ప్రేయసి, భార్య.. ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే ట్రయాంగిల్ క్రైమ్ లవ్ స్టోరీ ఇదని దర్శకనిర్మాతలు చెప్పారు. హై బడ్జెట్‌తో రూపుదిద్దుకొనే ఈ చిత్రం వినోదభరితంగా ఉంటుందని తెలిపారు. వచ్చే ఏడాది సంక్రాంతికి చిత్రాన్ని విడుదల చేస్తామని వెల్లడించారు. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తున్నారు.

రవన్న దావత్ ఇస్తుండు.. రెడీ అయిపోండ్రి



రవితేజ తన కెరీర్‌లో 75వ చిత్రం మైలు రాయిని చేరుకోవడానికి సిద్ధమయ్యారు. తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన ల్యాండ్ మార్క్ ఫిల్మ్‌ను ప్రకటించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించే ఈ చిత్రం వివరాలు వెల్లడిస్తూ ఓ పోస్టర్ విడుదల చేశారు. దాని మీద 'రవన్న దావత్ ఇస్తుండు.. రెడీ అయిపోండ్రి' అని రాసి ఉంది. దీనిని బట్టి చూస్తే తెలంగాణ నేపథ్యంలో సాగే చిత్రమిదని అర్థమవుతుంది. ఇందులో రవితేజ పేరు లక్ష్మణ భేరి. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో రూపుదిద్దుకొనే ఈ చిత్రానికి భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. వచ్చే సంక్రాంతికి ఈ చిత్రం 'ధూమ్ ధామ్ మాస్ దావత్' అని నిర్మాతలు పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఫొటోగ్రఫీ: కార్తిక్ ఘట్టమనేని, ఎడిటింగ్: నవీన్ నూలి.

ఈ జర్నీని ఎంజాయ్ చేశా



అంజలి నటించిన హారర్ కామెడీ చిత్రం 'గీతాంజలి' 2014లో విడుదలై సెన్సేషనల్ హిట్‌గా నిలిచింది. హారర్ కామెడీ మూవీస్‌లో కొత్త ఒరవడిని సృష్టించిన ఈ చిత్రానికి కొనసాగింపుగా వస్తోన్న 'గీతాంజలి మళ్లీ వచ్చింది' లోనూ అంజలి నటించింది. ఈ సినిమా ఆమెకు 50వ చిత్రం కావడం విశేషం. ఈ నెల 11న హారర్ కామెడీగా తెరకెక్కిన 'గీతాంజలి మళ్లీ వచ్చింది' విడుదలవుతోంది. ఈ సందర్భంగా అంజలి మీడియాతో ముచ్చటించారు.

నా సినిమాలన్నీ దాదాపు జీ అక్షరంతో మొదలవడం యాధృచ్ఛికం. గీతాంజలి సినిమాకు సీక్వెల్‌ను తీసుకురావాలనే ఆలోచన ఇప్పటిది కాదు. ఈ సినిమా కథను కోన వెంకట్ నాలుగేళ్ల క్రితమే చెప్పారు. కొన్ని అడ్డంకుల వల్ల ఈ ప్రాజెక్ట్ తెరకెక్కడం ఆలస్యమైంది. అన్ని అడ్డంకులను దాటుకొని అద్భుతమైన అవుట్‌పుట్‌తో ఈ సినిమాను పూర్తిచేసినందుకు సంతోషంగా ఉంది. ఈ సినిమా సీక్వెల్ కాబట్టి పాత క్యారెక్టర్స్‌ను మార్చలేం. కాబట్టి కొత్త క్యారెక్టర్స్‌ను స్టోరీలోకి తీసుకువచ్చాం. ఈ సినిమాలో హారర్, కామెడీతో పాటు విగిలిన అన్ని ఎమోషన్స్ ఉన్నాయి. ఈ చిత్రం నా 50వ చిత్రం కావడం ఎంతో సంతోషాన్ని ఇస్తుంది. అప్పుడే ఇన్ని సినిమాలు చేసేశానా అనిపిస్తుంది. ఒక నటిగా ఈ జర్నీని ఎంజాయ్ చేస్తున్నాను" అని చెప్పారు.

ప్రతి ఒక్కరు రిలేట్ అవుతారు



నవదీప్ నటిస్తున్న తాజా చిత్రం 'లవ్ మౌళి'. తనను ఇప్పటివరకు చూడని విధంగా ఆవిష్కరించే చిత్రమిదని నవదీప్ విజయంపై ఎంతో ధీమాగా ఉన్నారు. అందుకే ఈ సినిమాకు నవదీప్ 2.0గా తనని ప్రేక్షకులకు పరిచయం చేసుకుంటున్నారు. పంఖురి గిద్వాని, భావన సాగి హీరోయిన్లుగా నటిస్తున్నారు. అవనీంద్ర దర్శకత్వం వహిస్తున్నారు. సి స్పేస్, నైరా క్రియేషన్స్, శ్రీకర స్టూడియోస్ నిర్మిస్తున్నారు. ఉగాది సందర్భంగా మంగళవారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసిన విశ్వక్‌సేన్ మాట్లాడుతూ "సినీ ఇండస్ట్రీలో అజాతశత్రువు ఎవరైనా ఉన్నారంటే అది నవదీప్ మాత్రమే. ఈ సినిమాలోని విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. హీరో క్యారెక్టరైజేషన్‌ను చాలా బాగా తీర్చిదిద్దారు" అని చెప్పారు. హీరో నవదీప్ మాట్లాడుతూ "ఇది చాలా కొత్త కథ. సంవత్సరం పాటు ఈ సినిమాలోని నా లుక్ కోసమే కష్టపడ్డాను" అని చెప్పారు. డైరెక్టర్ అవనీంద్ర మాట్లాడుతూ "ఈ సినిమాలో నవదీప్ క్యారెక్టర్‌లో చాలా విభిన్నమైన షేడ్స్ ఉంటాయి. ఇది ఒక చిత్రకారుడి ఎమోషనల్ జర్నీ. ప్రతి ఒక్కరు ఈ సినిమాకు రిలేట్ అవుతారు" అని చెప్పారు.

'రాజారాణి' ఫీల్ కలిగింది



జీవీ ప్రకాశ్‌కుమార్, ఐశ్వర్యా రాజేశ్ నటించిన ఫ్యామిలీ డ్రామా 'డియర్'. ఆనంద్ రవిచంద్రన్ దర్శకత్వం వహించారు. వరుణ్ త్రిపురనేని, అభిషేక్ రామిశెట్టి, జి పృథ్వీరాజ్ నిర్మించారు. ఈ చిత్రం తమిళంలో ఈ నెల11న, తెలుగులో 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ప్రీ రిలీజ్ ఫంక్షన్ నిర్వహించింది. ఈ సందర్భంగా హీరో జీవీ ప్రకాశ్ మాట్లాడుతూ "డియర్ అందరూ రిలేట్ చేసుకునే సినిమా. ఇందులో అన్ని రకాల ఎమోషన్స్ ఉన్నాయి. ఈ సినిమా కథ విన్నప్పుడు 'రాజారాణి' మూవీ ఫీల్ కలిగింది" అని చెప్పారు. దర్శకుడు ఆనంద్‌రవిచంద్రన్ మాట్లాడుతూ "గురక పెట్టడం ప్రతీ ఇంట్లో ఉండే సమస్య. దీనిపై కథ రాయడం చాలా కొత్తగా అనిపించింది. ఈ సినిమాలో జీవీ ప్రకాశ్, ఐశ్వర్య కెమిస్ట్రీ అద్భుతంగా పండింది" అని అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ "ఈ సినిమా గ్రాండ్ సక్సెస్ అవుతుంది" అని ఆకాంక్షించారు. నటి ఐశ్వర్య మాట్లాడుతూ "ఈ సినిమాలో అందరినీ ఆకట్టుకునే కంటెంట్ ఉంది" అని చెప్పారు.

డిఫరెంట్ కథతో 'షణ్ముఖ'



ఆది సాయికుమార్, అవికా గోర్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'షణ్ముఖ'. షణ్ముగం సాప్పని దర్శకత్వం వహిస్తున్నారు. రమేశ్‌యాదవ్, తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని నిర్మిస్తున్నారు. ఉగాది సందర్భంగా మంగళవారం ఈ చిత్రం టైటిల్ లోగోను లాంచ్ చేశారు. ఆది సాయికుమార్ మాట్లాడుతూ "కంటెంట్‌ను నమ్మి చేసిన సినిమా ఇది. అందరినీ తప్పక ఆకట్టుకుంటుంది" అన్నారు. దర్శకుడు షణ్ముఖం మాట్లాడుతూ "డిఫరెంట్ కథతో 'షణ్ముఖ' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ప్రస్తుతం 70 శాతం షూటింగ్ పూర్తయ్యింది" అని చెప్పారు. నిర్మాత రమేశ్ యాదవ్ మాట్లాడుతూ "ఈ చిత్రంలో ఆది చాలా కొత్తగా కనిపిస్తారు" అని తెలిపారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా...



రవికిరణ్, త్రిషల, రక్ష హీరోహీరోయిన్లుగా నటిస్తున్న 'ఆర్ కె పురంలో' చిత్రం షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. శ్రీకర్ ప్రసాద్ కట్టా దర్శకత్వంలో గుబ్బల రవికిరణ్ నిర్మించిన ఈ చిత్రం మే నెలలో విడుదలవుతుంది. చిత్రం గురించి దర్శకుడు మాట్లాడుతూ 'నేటి యువత డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాల్ని నాశనం చేసుకుంటోంది. వీరి వల్ల సమాజంలో ఎటువంటి ప్రతికూల పరిస్థితుల్ని మహిళలు ఎదుర్కొంటున్నారన్నది ఈ చిత్ర కథాంశం' అని చెప్పారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా, సమాజానికి ఉపయోగపడే ఓ పవర్‌ఫుల్ పాత్రను హీరో చేశాడని నిర్మాత చెప్పారు.

నిహారిక కమిటీ కుర్రోళ్లు



మెగా డాటర్ నిహారిక కొణిదెల సమర్పణలో రూపుదిద్దుకుంటున్న చిత్రానికి 'కమిటీ కుర్రోళ్లు' అనే టైటిల్ ఖరారు చేశారు. ఉగాది సందర్భంగా ఈ చిత్రం పోస్టర్‌ను హీరో సాయిదుర్గా తేజ్ విడుదల చేసి యూనిట్‌కు అభినందనలు తెలిపారు. నిహారిక మాట్లాడుతూ 'మా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న తొలి చిత్రం 'కమిటీ కుర్రోళ్లు', దామోదర్ స్టూడియోస్ సంస్థతో కలసి నిర్మిస్తున్నా. కొత్తవాళ్లతో ఈ సినిమా చేయడం బాధ్యతగా భావిస్తున్నా' అన్నారు. ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్న యదు వంశీ మాట్లాడుతూ 'పదకొండు మంది హీరోలు, నలుగురు హీరోయిన్లను పరిచయం చేస్తున్నాం. వినోదభరితంగా ఈ సినిమా ఉంటుంది' అని చెప్పారు. కొత్త నటీనటులతో పాటు సాయికుమార్, గోపరాజు రమణ, బలగం జయరామ్ తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనుదీప్ దేవ్, ఫొటోగ్రఫీ: రాజు ఎదురోలు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మన్యం రమేశ్, నిర్మాతలు: పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక.

ఫ్యామిలీతో చూసి ఎంజాయ్ చేస్తారు



సరికొత్త కాన్సెప్ట్‌తో సినిమాలు చేస్తూ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు విజయ్ ఆంటోనీ తాజా చిత్రం 'లవ్ గురు' ఈ గురువారం విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'నేను ఎక్కువగా వర్తమానంలోనే ఉంటాను. భవిష్యత్ గురించి ఆలోచించను. మనకు ఏది కావాలో, ఏది ఇవ్వాలో విధి నిర్ణయించే ఉంటుంది. ఈ సినిమా విషయానికి వస్తే కథ బాగా నచ్చింది. సినిమా తీస్తే హిట్ అవుతుందనే నమ్మకం కలిగింది. కామెడీ బాగా కుదిరింది. ఫ్యామిలీతో చూసి మీరంతా ఎంజాయ్ చేస్తారు. 'లవ్ గురు' సినిమా చూసిన తర్వాత మీ భార్యను ప్రేమించడం నేర్చుకుంటారు. ఇందులో ఒక ఎమోషనల్ ఫ్లాష్‌బ్యాక్ ఉంది. దాన్ని ఇప్పుడు రివీల్ చేయను. దర్శకుడు వినాయక్ తన జీవితంలో చూసిన అనుభవాలతో ఈ చిత్రకథ రెడీ చేశాడు' అని చెప్పారు.

'బిచ్చగాడు 3' చిత్రాన్ని తీస్తున్నట్లు విజయ్ ఆంటోనీ చెబుతూ 'నా కెరీర్‌లోనే అది బిగ్ బడ్జెట్ ఫిల్మ్ అవుతుంది. దానికి నేనే దర్శకత్వం వహిస్తా. ప్రస్తుతం మా ప్రొడక్షన్‌లో మూడు సినిమాలు ఉన్నాయి. ఒకటి అక్టోబర్‌లో, మరొకటి సంక్రాంతికి, ఇంకొకటి వచ్చే వేసవికి విడుదలవుతాయి' అన్నారు.

తెలుగోడి సత్తా

● అదరగొట్టిన నితీశ్ కుమార్ ● సన్‌రైజర్స్ ఉత్కంఠ విజయం ● పోరాడిన పంజాబ్



నితీశ్ కుమార్ (37 బంతుల్లో 64)

ముల్లాన్‌పూర్ (చండీగఢ్): ఉత్కంఠ పోరులో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆఖరి బంతికి ఊపిరిపీల్చుకుంది. రైజర్స్ తరఫున తొలిసారి ఓ తెలుగు క్రికెటర్ అదరగొట్టాడు. జట్టు కష్టాల్లో ఉన్న వేళ నితీశ్ కుమార్ రెడ్డి (37 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 64) అర్ధసెంచరీతో సత్తా చూపగా, బౌలర్లు సైతం మెరుగ్గా రాణించారు. దీంతో మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌ను 2 పరుగులతో ఓడించింది. అయితే పంజాబ్‌కు ఆరు బంతుల్లో 29 పరుగులు కావాల్సిన వేళ శశాంక్ సింగ్ (25 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 46 నాటౌట్), అషుతోష్ శర్మ (15 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 33 నాటౌట్) సిక్సర్లతో రైజర్స్‌కు వణుకు పుట్టించారు. కానీ జట్టు 26 పరుగులకే పరిమితం కావడంతో చేసేదేమీలేకపోయింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 182 పరుగులు చేసింది. సమద్ (25), హెడ్ (21) పర్వాలేదనిపించారు. అర్ష్‌దీప్‌నకు 4.. హర్షల్, కర్రాన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో పంజాబ్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 180 పరుగులు చేసి ఓడింది. భువనేశ్వర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నితీశ్ నిలిచాడు.

చివర్లో జోరు చూపినా..: ఈ పిచ్‌పై ఓ మాదిరి ఛేదనే అయినా పంజాబ్ బ్యాటర్ల ఆటతీరు భిన్నంగా సాగింది. ఆఖర్లో శశాంక్, అషుతోశ్ బ్యాట్లు ఝుళిపించినా నిరాశే మిగిలింది. పేసర్లు భువనేశ్వర్, కమిన్స్ పదునైన బంతులతో ఇబ్బందిపెట్టడమే కాకుండా తొలి నాలుగు ఓవర్లలోనే ఓపెనర్ బెయిర్‌స్టో (0), ప్రభ్‌సిమ్రన్ (4), కెప్టెన్ ధవన్ (14)లను పెవిలియన్‌కు చేర్చారు. దీంతో పవర్‌ప్లేలో జట్టు కేవలం 27 పరుగులతో నిలిచింది. ఏ జట్టుకైనా ఈ సీజన్‌లో ఇదే అత్యల్పం. ఇక నితీశ్ తొలి ఓవర్‌లోనే సికిందర్ రజా(28) రెండు ఫోర్లు, కర్రాన్ (29) ఓ ఫోర్‌తో 13 పరుగులు వచ్చాయి. ఆ తర్వాత కూడా కర్రాన్ భారీ సిక్సర్లతో జోరు చూపాడు. కానీ పదో ఓవర్‌లోనే అతడి దూకుడును నటరాజన్ ముగించాడు. కమిన్స్ సూపర్ క్యాచ్‌తో నాలుగో వికెట్‌కు 38 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే రజాను ఉనాద్కట్ అవుట్ చేయడంతో 91/5 స్కోరుతో పంజాబ్ ఓటమి ఖాయమనిపించింది. అటు జితేశ్ (19) వేగంగా ఆడే యత్నంలో నితీశ్‌కు దొరికాడు. నితీశ్‌కు ఇది టీ20 కెరీర్‌లో తొలి వికెట్. ఈ దశలో 17వ ఓవర్‌లో శశాంక్ 3 ఫోర్లు, తర్వాతి ఓవర్‌లో అషుతోశ్ 2 ఫోర్లతో జోరు చూపారు. ఇక ఆఖరి ఓవర్‌లో 29 రన్స్ అవసరపడగా.. అషుతోశ్ 2 సిక్సర్లు బాది ఉత్కంఠ పెంచాడు. అయితే ఆఖరి బంతికి 9 రన్స్ కావాల్సిన వేళ శశాంక్ సిక్సర్ కొట్టినా ఫలితం లేకపోయింది.

నితీశ్ అండతో..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్‌ను పంజాబ్ పేసర్లు ఆరంభంలోనే కట్టడి చేశారు. పేసర్లు అర్ష్‌దీప్, హర్షల్ ధాటికి వికెట్లు కోల్పోతున్న దశలో.. నాలుగో ఓవర్‌లో క్రీజులోకి వచ్చిన ఆంధ్ర క్రికెటర్ నితీశ్ కుమార్ మాత్రం అదరగొట్టాడు. పరిస్థితులకు తగ్గట్టుగా ఆడి తొలి 18 బంతుల్లో 14 పరుగులే చేసినా.. చివరి 19 బంతుల్లో 50 పరుగులతో చెలరేగి జట్టు సవాల్ విసిరే స్కోరుకు దోహదపడ్డాడు. మొదట ట్రావిస్ హెడ్, మార్‌క్రమ్ (0), అభిషేక్ (16) 39 పరుగుల వద్దే పెవిలియన్‌కు చేరడంతో రైజర్స్‌కు షాక్ తగిలింది. ఇన్నింగ్స్ తొలి బంతికే హెడ్ క్యాచ్ అవుటైనా పంజాబ్ రివ్యూ కోరలేదు. కానీ నాలుగో ఓవర్‌లో హెడ్, మార్‌క్రమ్ (0) వికెట్లను పేసర్ అర్ష్‌దీప్ పడగొట్టాడు. తర్వాతి ఓవర్‌లోనే అభిషేక్‌ను కర్రాన్ అవుట్ చేయడంతో పవర్‌ప్లేలో జట్టు 40/3 స్కోరుతో కష్టాల్లో పడింది. ఈ స్థితిలో 140 పరుగులు కూడా కష్టమే అనిపించింది. అటు ఇంపాక్ట్ సబ్‌గా వచ్చిన రాహుల్ త్రిపాఠి (11) కూడా నిరాశపరిచాడు. 11వ ఓవర్‌లో నితీశ్ 4,6తో బ్యాట్‌కు పనిజెప్పాడు. రబాడ, కర్రాన్ ఓవర్లలోనూ తను ఒక్కో సిక్సర్‌తో ఆకట్టుకున్నాడు. అయితే 14వ ఓవర్‌లో ప్రమాదకర క్లాసెన్ (9)ను హర్షల్ అవుట్ చేయడంతో పంజాబ్ సంబరాలు చేసుకుంది. కానీ నితీశ్ వారికి ఝలక్ ఇస్తూ గేరు మార్చాడు. 15వ ఓవర్‌లో వరుసగా 4,6,4,6తో 22 పరుగులు రాబట్టడమే కాకుండా తన టీ20 కెరీర్‌లోనే తొలి అర్ధసెంచరీ పూర్తి చేశాడు. అటు అబ్దుల్ సమద్ కూడా వేగం కనబర్చడంతో పంజాబ్ బౌలర్లు లయ తప్పారు. కానీ అత్యంత ప్రమాదకరంగా మారిన ఈ జోడీని అర్ష్‌దీప్ విడదీశాడు. 16వ ఓవర్‌లో ఇద్దరినీ అవుట్ చేయడంతో ఆరో వికెట్‌కు 20 బంతుల్లోనే 50 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. 19వ ఓవర్‌లో షాబాజ్ (14 నాటౌట్) 4,6తో 15 రన్స్ రాగా.. ఆఖరి ఓవర్‌లోనూ 11 పరుగులు రాబట్టడంతో స్కోరు 180 దాటగలిగింది.



అర్ష్‌దీప్ (4-0-29-4)

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	4	4	0	0	8	1.120
కోల్‌కతా	4	3	1	0	6	1.528
లఖ్‌నవూ	4	3	1	0	6	0.775
చెన్నై	5	3	2	0	6	0.666
హైదరాబాద్	5	3	2	0	6	0.344
పంజాబ్	5	2	3	0	4	-0.196
గుజరాత్	5	2	3	0	4	-0.797
ముంబై	4	1	3	0	2	-0.704
బెంగళూరు	5	1	4	0	2	-0.843
ఢిల్లీ	5	1	4	0	2	-1.370

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

నేటి మ్యాచ్
రాజస్థాన్ X గుజరాత్
వేదిక: జైపూర్-రా.7.30 గం.

విశాఖ కెరటం

నితీశ్ రెడ్డి స్వస్థలం విశాఖపట్నం. నితీశ్ 2020లో కేరళపై రంజీల్లో అరంగేట్రం చేశాడు. ఆ తర్వాత అనతి కాలంలోనే ఆంధ్ర రంజీ జట్టులో కీలక ఆటగాడిగా మారాడు. ఈ బ్యాటింగ్ ఆల్‌రౌండర్ ఇప్పటివరకు 17 రంజీ మ్యాచుల్లో 566 పరుగులు, 52 వికెట్లు తీశాడు. నిరుడు ఐపీఎల్‌లోనే సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున అరంగేట్రం చేసిన 20 ఏళ్ల నితీశ్‌కు రెండే మ్యాచ్‌ల్లో చాన్స్ దక్కింది. ఈ రెండింట్లోనూ బౌలింగ్ తప్ప, బ్యాటింగ్ చేసే చాన్స్ దక్కలేదు. ఇక ఈ ఐపీఎల్‌లో గతవారం హైదరాబాద్ వేదికగా చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో ఆఖర్లో బ్యాటింగ్‌కు వచ్చి 8 బంతుల్లో 14 (నాటౌట్) పరుగులు సాధించాడు. ఇక, పంజాబ్‌తో మ్యాచ్‌లో అద్భుత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకుంటూ తన ఐపీఎల్ కెరీర్‌లో తొలి అర్ధ శతకం నమోదు చేశాడు. నితీశ్ బ్యాట్‌తోనే కాకుండా బంతితోనూ ఆంధ్ర జట్టుకు ఎన్నో విజయాలు అందించాడు. బ్యాటర్‌గా కెరీర్ మొదలు పెట్టిన నితీశ్ అనంతరం పేస్ బౌలింగ్‌లోనూ ప్రావీణ్యం సంపాదించాడు. హార్దిక్ పాండ్యా, బెన్ స్టోక్స్‌ను అభిమానించే నితీశ్, ఐపీఎల్‌లో సత్తా చాటితే భవిష్యత్‌లో టీమిండియా తలుపు తట్టే అవకాశాలున్నాయి.

స్కోరుబోర్డు

హైదరాబాద్: హెడ్ (సి) ధవన్ (బి) అర్ష్‌దీప్ 21, అభిషేక్ (సి) శశాంక్ (బి) కర్రాన్ 16, మార్‌క్రమ్ (సి) జితేశ్ (బి) అర్ష్‌దీప్ 0, నితీశ్ కుమార్ రెడ్డి (సి) రబాడ (బి) అర్ష్‌దీప్ 64, త్రిపాఠి (సి) జితేశ్ (బి) హర్షల్ 11, క్లాసెన్ (సి) కర్రాన్ (బి) హర్షల్ 9, సమద్ (సి) హర్షల్ (బి) అర్ష్‌దీప్ 25, షాబాజ్ (నాటౌట్) 14, కమిన్స్ (బి) రబాడ 3, భువనేశ్వర్ (సి) బెయిర్‌స్టో (బి) కర్రాన్ 6, ఉనాద్కట్ (నాటౌట్) 6, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 182/9; వికెట్ల పతనం:** 1-27, 2-27, 3-39, 4-64, 5-100, 6-150, 7-151, 8-155, 9-176; **బౌలింగ్:** రబాడ 4-0-32-1, అర్ష్‌దీప్ సింగ్ 4-0-29-4, కర్రాన్ 4-0-41-2, హర్షల్ పటేల్ 4-0-30-2, హర్‌ప్రీత్ బ్రార్ 4-0-48-0.

పంజాబ్: ధవన్ (స్టంప్డ్) క్లాసెన్ (బి) భువనేశ్వర్ 14, బెయిర్‌స్టో (బి) కమిన్స్ 0, ప్రభ్‌సిమ్రన్ (సి) నితీశ్ (బి) భువనేశ్వర్ 4, కర్రాన్ (సి) కమిన్స్ (బి) నటరాజన్ 29, సికందర్ (సి) క్లాసెన్ (బి) ఉనాద్కట్ 28, శశాంక్ (నాటౌట్) 46, జితేశ్ (సి) అభిషేక్ (బి) నితీశ్ 19, అశుతోష్ (నాటౌట్) 33, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 180/6; వికెట్ల పతనం:** 1-2, 2-11, 3-20, 4-58, 5-91, 6-114; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-1-32-2, కమిన్స్ 4-0-22-1, నటరాజన్ 4-0-33-1, నితీశ్ కుమార్ రెడ్డి 3-0-33-1, ఉనాద్కట్ 4-0-49-1, షాబాజ్ 1-0-10-0.

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు)	ముస్తాఫిజుర్ (చెన్నై)
316 పరుగులు	9 వికెట్లు




మెయిన్ డ్రాకు మాళవిక



ఆసియా బ్యాడ్మింటన్

నింగ్బో (చైనా): ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత షట్లర్లు మాళవిక బన్సోద్, రీతుపర్ణ, శ్వేతపర్ణ మెయిన్ డ్రాకు అర్హత సాధించారు. మంగళవారం ముగిసిన క్వాలిఫయర్స్‌లో సింగిల్స్ తొలి మ్యాచ్‌లో 21-18, 21-10తో నురాణి అజ్రహ్ (యూఏఈ)పై గెలిచిన మాళవిక.. రెండో మ్యాచ్‌లో 21-4, 21-5తో సోఫియా జకిరోవా (ఉజ్బెకిస్థాన్)ను ఓడించి మెయిన్ డ్రాలో ప్రవేశించింది. మహిళల డబుల్స్ క్వాలిఫయింగ్ ఆఖరి మ్యాచ్‌లో రీతుపర్ణ-శ్వేతపర్ణ జోడీ 21-6, 21-6తో వెంగ్ చి ఎన్‌జి-ఫుయి చి వా (మకావు) జంటపై నెగ్గి మెయిన్ డ్రాకు చేరుకుంది. ఇక, బుధవారం నుంచి జరిగే మెయిన్ డ్రా పోటీల్లో సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్, పీవీ సింధు, ప్రియాన్షు రజావత్, లక్ష్యసేన్, హెచ్‌ఎస్ ప్రణయ్, ఆకర్షి కశ్యప్, డబుల్స్‌లో కృష్ణ ప్రసాద్-సాయి ప్రతీక్, గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ, మిక్స్‌డ్ డబుల్స్‌లో అర్జున్-ధ్రువ్ కపిల బరిలోకి దిగుతున్నారు.

పాక్ జట్టులోకి మళ్లీ ఆమిర్

కరాచీ: నాలుగేళ్ల తర్వాత పేసర్ మహ్మద్ ఆమిర్ తిరిగి పాకిస్థాన్ జట్టులో ఆడనున్నాడు. న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో తలపడే పాక్ జట్టును మంగళవారం ప్రకటించారు. బాబర్ ఆజమ్ నేతృత్వంలోని 17 మంది సభ్యుల ఈ జట్టుకు మాజీ క్రికెటర్ అజర్ మెహమూద్‌ను కోచ్‌గా ఎంపిక చేశారు. ఈనెల 18 నుంచి 27 వరకు జరిగే ఈ సిరీస్‌లోని తొలి మూడు మ్యాచ్‌లకు రావల్పిండి, చివరి రెండు మ్యాచ్‌లకు లాహోర్ ఆతిథ్యమివ్వనున్నాయి. కాగా జట్టుకు ఎంపికైన ఆమిర్ 2020, ఆగస్టులో తన చివరి మ్యాచ్ ఆడాడు. అలాగే ఆల్‌రౌండర్ ఇమాద్ వసీమ్‌ను సైతం ఎంపిక చేశారు. ఈ ఇద్దరూ ఇటీవలే తమ రిటైర్మెంట్‌ను ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. ఇర్ఫాన్ ఖాన్, ఉస్మాన్ ఖాన్‌లకు కొత్తగా జట్టులో చోటు దక్కింది.

ఐశ్వర్య కాంస్యం.. రజతమయ్యే అవకాశం



న్యూఢిల్లీ: గతేడాది ఆసియా చాంపియన్‌షిప్స్‌లో 400 మీ. రేస్‌లో భారత అథ్లెట్ ఐశ్వర్య మిశ్రా సాధించిన కాంస్యం.. రజతమయ్యే అవకాశాలున్నాయి. ఆ రేస్‌లో రెండో స్థానంలో నిలిచిన ఫరీదా సొలియేవా (ఉజ్బెకిస్థాన్) డోపింగ్‌లో పట్టుబడింది. దీంతో 2023, జూలై 13 తర్వాత పాల్గొన్న రేసుల నుంచి ఆమెను డిస్‌క్వాలిఫై చేశారు. ఫరీదా సాధించిన పతకాలను వెనక్కు తీసుకోనున్నారు. దీంతో ఐశ్వర్యకు రజతం లభించవచ్చు.

బిల్లీ జీన్ కప్‌లో భారత్ శుభారంభం

చాంగ్షా (చైనా): బిల్లీ జీన్ కింగ్ కప్ తొలి రౌండ్‌లో భారత టెన్నిస్ జట్టు శుభారంభం చేసింది. మంగళవారం ప్రారంభమైన ఈ పోటీల్లో భారత్ 3-0తో పసిఫిక్ ఓసియానియాపై విజయం సాధించింది. తొలుత జరిగిన సింగిల్స్ పోరులో అంకిత రైనా 6-1, 6-3తో సావోయిర్స్ ట్రీస్‌పై, రుతుజా భోస్లే 6-0, 6-0తో తరణి కామోపై, డబుల్స్‌లో హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మిక-ప్రార్థన తొంబరే జోడీ 6-1, 6-1తో మెహెటియా బూసి-రూబీ కాఫిన్ ద్వయంపై నెగ్గింది. బుధవారం జరిగే రెండో రౌండ్‌లో ఆతిథ్య చైనాతో భారత్ తలపడనుంది.

మేం ఓల్డ్.. కానీ గోల్డ్



లండన్: ప్రపంచ టెన్నిస్ పురుషుల సింగిల్స్, డబుల్స్‌లో నెంబర్ వన్ ర్యాంకర్లుగా కొనసాగుతున్న సెర్బియా స్టార్ జొకోవిచ్ (36), భారత ఏస్ రోహన్ బోపన్న (44) మాంటే కార్లో మాస్టర్స్ టోర్నీ సందర్భంగా సరదాగా మాట్లాడుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను పురుషుల టెన్నిస్ సమాఖ్య సోషల్ మీడియాలో పోస్టు చేసింది. 'టెన్నిస్ మనకు ఎన్నో అద్భుత విషయాలను నేర్పుతుంది. అనుభవం ఎప్పుడూ గెలుస్తుందనేది నాకు బోధపడింది' అని బోపన్న వ్యాఖ్యానించగా.. 'అనుభవం ఒక్కటే కాదు.. తగిన నిబద్ధత, అంకిత భావం కూడా అవసరం' అని నొవాక్ చెప్పాడు. బోపన్న ఇప్పుడు కూడా జిమ్‌లో ఎంతో శ్రమిస్తాడని జొకో కొనియాడాడు. ఇక, అవకాశం దొరికితే భారత్‌లో ఆడాలనుకొంటున్నట్టు జొకోవిచ్ చెప్పాడు. చివరగా 'మేం ఓల్డ్.. కానీ గోల్డ్' అని అన్న నొవాక్.. నమస్తే అంటూ ముగించాడు. పెద్ద వయసులో టాప్ ర్యాంక్‌లో నిలిచిన టెన్నిస్ ఆటగాళ్లుగా వీరిద్దరూ రికార్డుకెక్కిన సంగతి తెలిసిందే.

బిజినెస్

విమాన చార్జీలకు రెక్కలు

20- 25% వరకు పెరిగిన రేట్లు
విస్తారా సర్వీసుల రద్దు, వేసవి గిరాకీయే కారణం



న్యూఢిల్లీ: ఈ వేసవిలో విమాన చార్జీలు మరింత ప్రియమయ్యాయి. కొన్ని మార్గాల్లో ఎయిర్ టికెట్ ధరలు 20-25 శాతం వరకు పెరిగాయి. విస్తారా ఎయిర్‌లైన్స్ సర్వీసుల రద్దుతో పాటు వేసవి కావడంతో విమానయాన సేవలకు డిమాండ్ ఒక్క సారిగా పెరగడం ఇందుకు ప్రధాన కారణమని ;పరిశ్రమ నిపుణులు పేర్కొన్నారు. పైలట్ల సంక్షోభం కారణంగా విస్తారా రోజుకు 25-30 విమాన సర్వీసులు లేదా రోజువారీ షెడ్యూలులో 10 శాతం సర్వీసులను తగ్గించుకుంది. దివాలా తీసిన గోఫస్ట్ ఎయిర్‌లైన్స్ గతంలోనే సేవలను నిలిపివేయడంతో పాటు ఇంజన్ సమస్యల కారణంగా ఇండిగోకు చెందిన 70 విమానాలు మూలనపడటంతో పరిశ్రమ సేవల సామర్థ్యం ఇప్పటికే తగ్గింది. దీనికి విస్తారా పైలట్ల సంక్షోభం జోడై ఈ సమస్య మరింత తీవ్రమయింది. పర్యాటక సేవల పోర్టల్ ఇక్సిగో విశ్లేషణ ప్రకారం.. ఈనెల 1-7 తేదీల్లో కొన్ని దేశీయ మార్గాల్లో విమాన సర్వీసుల స్పాట్ చార్జీలు గత నెల ఇదే కాలంతో పోలిస్తే 39 శాతం వరకు పెరిగాయి. గత వారం ఢిల్లీ-బెంగళూరు సర్వీసు స్పాట్ టికెట్ రేటు 39 శాతం ఎగబాకగా.. ఢిల్లీ-శ్రీనగర్ చార్జీ 30 శాతం, ఢిల్లీ-ముంబై చార్జీ 12 శాతం, ముంబై-ఢిల్లీ రూట్లో 8 శాతం పెరిగాయి. దేశీయ, అంతర్జాతీయ మార్గాల్లో కలిపి ఎయిర్ టికెట్ చార్జీల పెరుగుదల 20-25 శాతంగా ఉండవచ్చని ప్రముఖ ట్రావెల్ పోర్టల్ యాత్రా. కామ్ ఎయిర్ అండ్ హోటల్ బిజినెస్ విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ భరత్ మాలిక్ అన్నారు. విస్తారా సర్వీసుల రద్దు కీలక దేశీయ మార్గాల్లో విమాన చార్జీలపై గణనీయ ప్రభావం చూపిందన్నారు. ఢిల్లీ నుంచి గోవా, కొచి, జమ్ము, శ్రీనగర్‌కు నడిచే విమానాలకు అధిక డిమాండ్ నెలకొనడంతో ఈ మార్గాల్లో టికెట్ ధరలు అధికంగా పెరిగాయన్నారు.


నాట్కో ఫార్మాకు ఎఫ్‌డీఏ హెచ్చరిక లేఖ

న్యూఢిల్లీ: తెలంగాణలోని కొత్తూరులో ఉన్న నాట్కో ఫార్మా యూనిట్‌కు అమెరికన్ డ్రగ్ రెగ్యులేటర్ ఎఫ్‌డీఏ హెచ్చరిక లేఖ జారీ చేసింది. ఫారం 483 కింద తమకు ఈ లేఖ అందినట్టు కంపెనీ ప్రకటించింది. ఈ యూనిట్లో ఎఫ్‌డీఏ గత ఏడాది అక్టోబరు 9-18 తేదీల మధ్యలో ఇన్‌స్పెక్షన్ నిర్వహించింది. సోమవారం నాడు ఎఫ్‌డీఏ నుంచి తమకు ఈ లేఖ అందినట్టు రెగ్యులేటరీ సమాచారంలో నాట్కో ఫార్మా ప్రకటించింది. నిర్దేశిత గడువు లోగా దానికి స్పందించి అవసరమైన చర్యలు చేపడతామని స్పష్టం చేసింది. తమ సరఫరాలపై గాని, ఆదాయాలపై గాని ఈ లేఖ ప్రభావం ఏమీ ఉండబోదని తెలిపింది.

సెన్సెక్స్ @ 75,000

ఇంట్రాడేలో సరికొత్త శిఖరాలకు

చివరికి స్వల్ప నష్టాల్లో ముగింపు



ముంబై: భారత స్టాక్ మార్కెట్‌లో వరుసగా రెండో రోజూ రికార్డుల ర్యాలీ కొనసాగింది. ఈక్విటీ సూచీలు మంగళవారం సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. ఇంట్రాడే ట్రేడింగ్‌లో సెన్సెక్స్ తొలిసారిగా 75,000 మైలురాయిని తాకింది. నిఫ్టీ 22,750 మార్క్‌ను దాటింది. ఆల్ టైం రికార్డు గరిష్ఠ స్థాయిల వద్ద ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడటంతో సూచీలు చివరికి స్వల్ప నష్టాలతో ముగిశాయి.

మరిన్ని విషయాలు..

- ఒకదశలో సెన్సెక్స్ 381.78 పాయింట్ల వృద్ధితో 75,124.28 వద్ద, నిఫ్టీ 102.1 పాయింట్ల లాభంతో 22,768.40 వద్ద సరికొత్త జీవనకాల ఇంట్రాడే రికార్డులను నమోదు చేశాయి. మధ్యాహ్నం నుంచి అమ్మకాలు పెరగడంతో సూచీలు క్రమంగా కిందికి జారాయి. చివరికి సెన్సెక్స్ 58.80 పాయింట్ల నష్టంతో 74,683.70 వద్ద, నిఫ్టీ 23.55 పాయింట్లు కోల్పోయి 22,642.75 వద్ద స్థిరపడ్డాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.47 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.15 శాతం తగ్గాయి.
- సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 12 లాభపడగా.. 18 నష్టపోయాయి. ఐసీఐసీఐ బ్యాంక్ 1.87 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది.
- పసిడి ధరలు ఢిల్లీలో సరికొత్త రికార్డు స్థాయికి చేరాయి. 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం మరో రూ.140 పెరిగి రూ.71,840కి ఎగబాకింది. కిలో వెండి సైతం రూ.500 పెరుగుదలతో రూ.84,500 ధర పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 2,350 డాలర్లు, వెండి 28 డాలర్ల ఎగువకు చేరాయి.

పదేళ్లలో మూడింతలు

2014 మేలో తొలిసారిగా 25,000 మైలురాయిని చేరిన సెన్సెక్స్.. గడిచిన పదేళ్లలో మూడింతలై 75,000 స్థాయికి ఎగబాకింది. 2021లో సూచీ 50,000 మైలురాయిని తాకింది. అంటే, 25,000 నుంచి 50,000కు చేరుకునేందుకు దాదాపు ఆరున్నరేళ్లు పట్టింది. ఆ తర్వాత 25,000 పాయింట్ల (50,000 నుంచి 75,000కు) పరుగును 3 సంవత్సరాల 3 నెలల్లోనే పూర్తి చేసింది. గడిచిన ఏడాది కాలంలో సెన్సెక్స్ 25 శాతం వృద్ధిని కనబరిచింది. 2023 ఏప్రిల్ 21న నమోదైన సూచీ 52 వారాల కనిష్ఠ స్థాయి 59,412.81 వద్ద నుంచి 26 శాతానికి పైగా పెరిగింది. అంతేకాదు, ఈ మార్చి 6న 74,000 మైలురాయికి చేరిన సెన్సెక్స్.. కేవలం 24 ట్రేడింగ్ సెషన్లలోనే మరో 1,000 పాయింట్లు పెరిగి 75వేలకు చేరుకోవడం విశేషం. గత ఏడాది డిసెంబరులో నైతే సూచీ ఏకంగా 5,000 పాయింట్లు (68,000 నుంచి 72,000కు)పుంజుకుంది.

యూనికార్న్‌లలో భారత్ నం.3

2023 చివరినాటికి దేశంలో 67 యూనికార్న్‌లు • అంతక్రితం సంవత్సరంతో పోలిస్తే తగ్గిన సంఖ్య



న్యూఢిల్లీ: ప్రపంచంలో అత్యధిక యూనికార్న్‌లు కలిగిన దేశాల్లో భారత్ మూడో స్థానంలో నిలిచింది. గత ఏడాది చివరినాటికి దేశంలోని యూనికార్న్‌ల నికర సంఖ్య 67గా నమోదైందని 'హురున్ గ్లోబల్ యూనికార్న్ ఇండెక్స్ 2024' వెల్లడించింది. 703 యూనికార్న్‌లతో అమెరికా అగ్రస్థానంలో ఉండగా.. చైనా (340 యూనికార్న్‌లు) రెండో స్థానాన్ని దక్కించుకుంది. భారత్ తర్వాత యునైటెడ్ కింగ్‌డమ్ (53), జర్మనీ (36) వరుసగా 4, 5 స్థానాల్లో నిలిచాయి. కనీసం బిలియన్ డాలర్ల (రూ.8,300 కోట్లు) మార్కెట్ విలువ కలిగిన స్టార్టప్‌ను యూనికార్న్‌గా పిలుస్తారు. ప్రపంచ యూనికార్న్‌ల మొత్తం మార్కెట్ విలువ 5 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ఇది గత ఏడాది జపాన్ జీడీపీతో సమానం. నివేదిక ముఖ్యాంశాలు..

- 2022లో దేశంలో 68 యూనికార్న్‌లుండగా.. 2023లో సంఖ్య 67 తగ్గింది. 2017 నుంచి హురున్ ప్రపంచ యూనికార్న్‌ల సూచీని విడుదల చేస్తూ వస్తోంది. అప్పటి నుంచి భారత్‌లో వీటి సంఖ్య తగ్గడం ఇదే మొదటిసారి. అంతర్జాతీయ అనిశ్చితులు, ఆర్థిక మందగమనం నేపథ్యంలో స్టార్టప్‌ల రంగంలోకి పెట్టుబడులు భారీగా తగ్గడం ఇందుకు ప్రధాన కారణం.
- భారతీయులు స్వదేశంలో కంటే విదేశాల్లోనే అధిక యూనికార్న్‌లను ఏర్పాటు చేయగలిగారు. భారతీయులు సహ వ్యవస్థాపకులుగా ఉన్న స్టార్టప్‌లలో ఇప్పటికే 109 యూనికార్న్ హోదాను సాధించాయి. అందులో 95 అమెరికాలోనే ఉన్నాయి.
- అత్యధిక యూనికార్న్‌లకు వేదికైన ప్రపంచ నగరాల జాబితాలో బెంగళూరు 6 నుంచి 7 స్థానానికి జారుకుంది. దేశంలోని 67 యూనికార్న్‌లలో 32 బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. కాగా, 14 యూనికార్న్‌లతో ముంబై 20 నుంచి 19వ స్థానానికి ఎగబాకింది.
- దేశంలో అతిపెద్ద ఎడ్యుటెక్ స్టార్టప్ బైజూస్‌తోపాటు ఫార్మ్ ఈజీ మార్కెట్ విలువ భారీ క్షీణత కారణంగా ఈ సారి యూనికార్న్‌ల జాబితాలో స్థానం కోల్పోయాయి.
- చైనాకు చెందిన బైట్‌డ్యాన్స్ 22,000 కోట్ల డాలర్ల మార్కెట్ విలువతో ప్రపంచంలోనే అత్యంత విలువైన యూనికార్న్‌గా నిలిచింది. ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ (18,000 కోట్ల డాలర్లు) రెండో స్థానంలో ఉంది. కాగా, జనరేటివ్ ఏఐ అప్లికేషన్ 'చాట్‌జీపీటీ'ని అభివృద్ధి చేసిన ఓపెన్‌ఏఐ 10,000 కోట్ల డాలర్ల మార్కెట్ వేల్యూతో మూడో స్థానానికి ఎగబాకింది.
- ప్రపంచంలోని అత్యంత విలువైన 100 యూనికార్న్‌లలో భారత్ నుంచి స్విగ్గీ (83వ స్థానం), డ్రీమ్11 (83), రేజర్ పే (94), ఓలా (100) ఉన్నాయి.

గ్లాండ్ ఫార్మాలో రూ.1,411 కోట్ల బ్లాక్ డీల్

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న గ్లాండ్ ఫార్మా కౌంటర్‌లో మంగళవారం రూ.1,4,11 కోట్ల విలువైన బ్లాక్ డీల్ చోటు చేసుకుంది. కంపెనీ మాజీ ప్రమోటర్ డాక్టర్ పెన్మత్సకు చెందిన లకుమి ట్రస్టు, నికోమాక్ మెషినరీ సంస్థలు, కంపెనీ ఈక్విటీలో 4.9 శాతానికి సమానమైన 81.20 లక్షల షేర్లను ఈ బ్లాక్ డీల్ ద్వారా విక్రయించాయి. ఈ రెండు సంస్థలు ఈ షేర్లను ఒక్కోటి రూ.1,735.31 నుంచి 1,739.10 మధ్య విక్రయించాయి. ఈ రెండు సంస్థల నుంచి ఈ షేర్లను ఎవరు కొన్నదీ ఇంకా వెల్లడికాలేదు. దీంతో ఎన్‌ఎస్‌ఈలో గ్లాండ్ ఫార్మా షేర్లు 2.83 శాతం నష్టంతో రూ.1,807 వద్ద క్లోజయ్యాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

10వ తేదీ

హైదరాబాద్	375
చిత్తూరు	458
గోదావరి	390
విజయవాడ	390
విశాఖపట్నం	405
వరంగల్	377

డజను గుడ్లు రూ.60



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	156
వరంగల్	156
కరీంనగర్	156
మహబూబ్‌నగర్	156
కర్నూలు	156
విశాఖపట్నం	134
గోదావరి	152
విజయవాడ	152
గుంటూరు	152
ఒంగోలు	152
చిత్తూరు	151



పేటీఎం బ్యాంక్ ఎండీ రాజీనామా

న్యూఢిల్లీ: పేటీఎం పేమెంట్ బ్యాంక్ (పీపీబీఎల్) ఎండీ, సీఈఓ సురీందర్ చావ్లా రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలు, మరింత మంచి అవకాశాల అన్వేషణ కోసం ఆయన రాజీనామా చేసినట్టు పేటీఎం మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. ఆయన రాజీనామా ఈ ఏడాది జూన్ 26 నుంచి అమల్లోకి వస్తుందని ప్రకటించింది. గత ఏడాది జనవరిలోనే చావ్లా బ్యాంక్ సీఈఓగా బాధ్యతలు స్వీకరించారు.



భీమా జువెలర్స్ బ్రాండ్ అంబాసిడర్ రామ్‌చరణ్

హైదరాబాద్: ఆభరణాల రిటైలింగ్‌లోని భీమా జువెలర్స్ ప్రముఖ నటుడు రామ్‌చరణ్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది. ఇది భీమా జువెలర్స్ చరిత్రలో ఒక అద్భుత ఘట్టాన్ని ఆవిష్కరిస్తుందని కంపెనీ ఈ సందర్భంగా తెలిపింది. తమ బ్రాండ్ ప్రయాణంలో ఇది ఒక మహోజ్వల ఘట్టంగా నిలుస్తుందని భావిస్తున్నామని, ఇది సినిమా ఆకర్షణకు, కళా నైపుణ్యానికి మధ్య అనుబంధమని కంపెనీ చైర్మన్ బీ బిందుమాధవ్ అన్నారు. శతాబ్ది చరిత్ర కలిగిన, సాంప్రదాయం-నైపుణ్యాల మేలి కలయిక అయిన బ్రాండ్‌కు తాను ప్రచారకర్తగా వ్యవహరించడం ఆనందదాయకంగా ఉన్నదని రామ్‌చరణ్ ఈ సందర్భంగా అన్నారు.

మారుతి మనేసార్ ప్లాంట్ సామర్థ్యం విస్తరణ

న్యూఢిల్లీ: మనేసార్‌లోని తమ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని లక్ష యూనిట్ల మేరకు పెంచినట్టు మారుతి సుజుకీ ప్రకటించింది. మనేసార్‌లో పని చేస్తున్న మూడు తయారీ ప్లాంట్లలో ప్లాంట్-ఎలో ఒక అదనపు అసెంబ్లీ లైన్ జోడించినట్టు తెలిపింది. ఈ లైన్ తయారీ సామర్థ్యం లక్ష యూనిట్లని, దీంతో మనేసార్ ప్లాంట్ మొత్తం తయారీ సామర్థ్యం 9 లక్షలకు పెరిగిందని తెలియచేసింది.

సచివాలయంలో పార్కింగ్ ఏం చేద్దాం?

'ఆంధ్రజ్యోతి' కథనంపై ఉన్నతాధికారుల ఆరా

- ఆర్అండ్‌బీ శాఖ అధికారులతో సుదీర్ఘ చర్చ
- సోలార్ రూఫ్ టాపేనా? అండర్‌గ్రౌండ్‌లోనా?
- రెండు లేదా మూడు భవనాలు.. మరో ఆప్షన్

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందుల్లేకుండా ఏం చేద్దాం? రెండు, మూడు చోట్ల భవనాలు నిర్మిద్దామా? సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేద్దామా? లేక మరేదైనా మార్గాన్ని అనుసరిద్దామా? అని ఆర్అండ్‌బీ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. గత బీఆర్ఎస్ సర్కారు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నూతన సచివాలయాన్ని నిర్మించినా.. ఎండలోనే వాహనాలు పార్కింగ్ చేయాల్సి రావడం, డ్రైవర్లకు విశ్రాంతి గది లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ అంశాలను ప్రస్తావిస్తూ "వాహనాలు నిలువ నీడ లేకపాయే.!" శీర్షికన శనివారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో పలువురు ఉన్నతాధికారులు.. పార్కింగ్ సౌకర్యంపై ఆర్ అండ్ బీ శాఖ అధికారులతో చర్చించినట్టు సమాచారం. ప్రస్తుతం సచివాలయంలో ఏ వైపు ఎంతమేర ఖాళీ స్థలం ఉంది? ఎంత స్థలంలో పార్కింగ్ సౌకర్యాన్ని కల్పిస్తే ఇబ్బందులు లేకుండా ఉంటాయి? అనే అంశాలపై చర్చించినట్టు తెలిసింది. ఈ మేరకు సెక్రటేరియట్ ప్రాంగణంలో రెండు, మూడు చోట్ల రెండు అంతస్తుల మేర భవనాలు నిర్మించి, మల్టీ లెవల్ పార్కింగ్ విధానాన్ని అమలు చేస్తే బాగుంటుందని అధికారులు అభిప్రాయపడినట్టు తెలుస్తోంది. అదే సమయంలో అండర్‌గ్రౌండ్ పార్కింగ్‌కు ఏమైనా అవకాశం ఉంటుందా? సచివాలయం ముందున్న పచ్చిక బయళ్ల కింద ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుంది? అనే అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ప్రస్తుతం వాహనాలు నిలుపుతున్న చోట సోలార్ రూఫ్ టాప్ నిర్మించినా ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నారు. ఎమ్మెల్యేలు, సందర్శకులు వెళ్లే సౌత్ ఈస్ట్ గేటు నుంచి దక్షిణం వైపు తిరిగే మూల వరకు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేస్తే ఎలాంటి ఇబ్బందీ ఉండదని భావిస్తున్నట్టు సమాచారం. తద్వారా విద్యుత్తు బిల్లును గణనీయంగా తగ్గించుకోవచ్చని అంచనా వేస్తున్నారు. కాగా, ఇంత పెద్ద భవనం నిర్మిస్తున్నప్పుడు సెల్లార్ నుంచి రెండు ఫ్లోర్ల వరకు పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కావని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. వాస్తవానికి సచివాలయ నిర్మాణం సమయంలోనే పార్కింగ్ స్థలంలో సోలార్ రూఫ్ నిర్మించాలని అధికారులు ప్రతిపాదించినట్టు తెలిసింది.

తెరపైకి మరో సమస్య..

మంత్రులు, అధికారులను కలిసేందుకు వచ్చే సందర్శకులు సచివాలయం లోపలికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పాసులు జారీ చేసే కౌంటర్ నుంచి సచివాలయం ఎంట్రీ పాయింట్ కిలోమీటరు పైగా దూరం ఉండడంతో వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాత సచివాలయంలో పాసులు ఇచ్చే కౌంటర్ నుంచే నేరుగా లోపలికి వెళ్లేందుకు అవకాశం ఉండేది. అక్కడే సెక్యూరిటీ చెకింగ్ కూడా జరిగేది. కొత్త సచివాలయంలో మాత్రం అలాంటి అవకాశం లేకుండా పోయింది. ఇప్పటికైనా సచివాలయం ఎంట్రీ గేటు వద్దే పాసుల కౌంటర్ ఏర్పాటు చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.





నల్లమలలో చెలరేగుతున్న మంటలు



నల్లమలలో కార్చిచ్చును బ్లోయర్లతో ఆర్పుతున్న ఫైర్ వాచర్లు

కార్చిచ్చులను ఆపేదెలా?

నల్లమల అడవిలో నాలుగు నెలల్లో 1300 చోట్ల మంటలు

- సుమారు 2 వేల హెక్టార్ల పరిధిలోని అడవి దగ్ధం

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జనవరి 31న.. నల్లమల అడవుల్లోని దోమల పెంట రేంజ్‌లో చెలరేగిన కార్చిచ్చు మూడు రోజులవరకూ చల్లారలేదు! ఈలోగా 35 ఎకరాల అటవీ ప్రాంతం మంటల్లో కాలి బూడిదయింది! అదే ప్రాంతంలో ఫిబ్రవరి మొదటివారం, రెండోవారంలో మూడు సార్లు దావానలం రాజుకుంది. ఏటా ఎండాకాలంలో చెలరేగే దావాగ్నుల సంగతి సరేసరి! అటవీశాఖ తన వద్ద ఉన్న వనరులతో ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నా.. ఎక్కడో ఒకచోట దావాగ్నులు చెలరేగి అటవీ ప్రాంతాలకు, అక్కడ ఉండే జీవజాలానికి తీవ్ర నష్టం జరుగుతోంది. ఏటా డిసెంబరు నుంచి వర్షాకాలం ప్రారంభమయ్యే వరకు ఎక్కడో ఒకచోట మంటలు చెలరేగుతూనే ఉన్నాయి. 2023 డిసెంబరు నుంచి ఇప్పటివరకు దాదాపు నాలుగు నెలల సమయంలోనే నాగర్‌కర్నూలు జిల్లా పరిధిలో ఉన్న నల్లమల అడవుల్లో 1300 చోట్ల కార్చిచ్చు చెలరేగి సుమారు 2 వేల హెక్టార్ల అడవి దగ్ధమైంది. కొండలు, గట్లు, ఎత్తైన ప్రాంతాలు ఉన్న అటవీ ప్రాంతం కావడంతో.. ఇక్కడ కార్చిచ్చును ఆర్పడం చాలా ఇబ్బందిగా మారుతోంది. దీనికితోడు.. అటవీశాఖ సిబ్బంది వద్ద ఫైర్ ఫైటింగ్‌కు సరిపడా పరికరాలు లేకపోవడం, విదేశాల్లో కార్చిచ్చును ఆపడానికి ఉపయోగించే అత్యంత అధునాతన పరికరాలు మనవారి వద్ద అందుబాటులో లేకపోవడంతో.. దావాగ్నుల కట్టడి వారికి తలకుమించిన భారంగా మారుతోంది.

ప్రమాదాలకు కారణాలివే..

సాధారణంగా కార్చిచ్చు రెండు రకాలుగా చెలరేగుతుంది. మానవ తప్పిదాలతో, ప్రకృతి సహజంగా. నల్లమలలో చెలరేగుతున్న మంటలకు.. నూటికి 99 సందర్భాల్లో మానవ తప్పిదాలే కారణం కావడం గమనార్హం.



అడవిలో మంటలను ఆర్పడానికి వినియోగించే ఎయిర్ బ్లోయర్

ఎందుకంటే.. వేలాది హెక్టార్ల మేర విస్తరించిన నల్లమల అడవులపై ఆధారపడి.. చెంచులు, గిరిజనులు ఇలా పలు వర్గాల ప్రజలు జీవిస్తున్నారు. చాలా మంది అటవీ ప్రాంతాల మధ్యలోనే ఉంటున్నారు. వారు అటవీ ఉత్పత్తుల సేకరణకు వెళ్లినప్పుడు మంటలు చెలరేగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా.. ఇప్ప పువ్వు సేకరణకు వెళ్లే చెంచులు, గిరిజనులు ఆ పూలను సేకరించడం కోసం, ఇప్ప చెట్టు చుట్టూ గుబురుగా పెరిగిన గడ్డిని కాల్చేస్తారు. ఆ నిప్పు.. అప్పటికే ఎండిన ఆకులకు అంటుకుని మంటలు చెలరేగుతాయి. అలాగే పశువుల కాపర్లు బీడీలు, చుట్టలు కాల్చి అలాగే పడేయడం కూడా కార్చిచ్చుకు కారణమవుతోందని అధికారులు చెబుతున్నారు. ఇక.. అడవుల్లో తిరిగే చెంచులు, గిరిజనులు వన్యప్రాణుల నుంచి రక్షించుకోవడానికి మంటలు పెట్టుకోవడం కూడా మరో కారణంగా చెప్పవచ్చు. ఈ ప్రాంతంలో భైరాపూర్, సలేశ్వరం జాతరలతో పాటు జాతీయ రహదారి గుండా శివరాత్రి సమయంలో ఎక్కువ మంది భక్తులు శ్రీశైలం వెళ్తుంటారు. ఆ సమయంలో భక్తులు రోడ్డు పక్క నుంచి అడవి లోపలకు వెళ్లి.. అక్కడ వంటలు చేసుకుని మంటలు చెలరేగడానికి కారణమవుతున్నారు. మొత్తమ్మీద.. నల్లమల అడవిలో ప్రకృతి వల్ల జరిగే అగ్ని ప్రమాదాలు చాలా తక్కువగా ఉంటాయని ఫారెస్టు అధికారులు చెబుతున్నారు.

ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నా..

నల్లమల ఆకురాల్చే అడవి. శీతాకాలం ముగిసిన వెంటనే చెట్లు ఆకులు రాలుస్తాయి. ఎండలు పెరగడంతో ఆ ఆకుల్లో తేమ పోతుంది. ఆ ఎండిన ఆకులకు ఏ చిన్న నిప్పురవ్వ తగిలినా అది మంటగా మారి.. దావానలమై చెలరేగి శరవేగంగా విస్తరిస్తుంది. ఒకసారి దావాగ్ని చెలరేగితే ఆర్పడం అంత సులభం కాదు. అందుకే.. అసలు కార్చిచ్చు చెలరేగకుండా చూడడానికి అటవీశాఖముందు జాగ్రత్తచర్యలు తీసుకుంటోంది. అయినా ఫలితం అంతంతమాత్రంగానే ఉంటోంది. ప్రస్తుతం నల్లమల ప్రాంతంలో కార్చిచ్చును ఆర్పేందుకు 8 ప్రత్యేక తాత్కాలిక బేస్ క్యాంపులను ఏర్పాటు చేశారు. ఒక్కో బేస్ క్యాంపునకూ ఐదుగురు ఫైర్ వాచర్లను నియమిస్తారు. వారికి సహకారంగా ఫారెస్ట్ ప్రొటెక్షన్ సిబ్బంది ఉంటారు. అడవిలో మంటలు చెలరేగినప్పుడు ఆపడానికి క్విక్ రెస్పాన్స్ టీమ్ ఉంటుంది. ఆ సమయంలో అధికారులు కార్చిచ్చు చెలరేగిన గంట వ్యవధిలోనే ఆ ప్రాంతానికి వెళ్లగలుగుతున్నారు. అలా వెళ్తేనే ఎక్కువ నష్టం జరగకుండా ఆపవచ్చు. కానీ.. నల్లమలలో కొండలు, గుట్టలు, ఎత్తైన ప్రదేశాలు ఉన్న నేపథ్యంలో తొందరగా చేరుకోవడమనేది కష్టతరంగా ఉంటోంది.

ఏం అవసరం..

కార్చిచ్చు ఆర్పడానికి నల్లమలలో ప్రధాన పాత్ర ఫైర్ వాచర్లతో పాటు ఏయిర్ బ్లోయర్లదే నని చెప్పవచ్చు. అయితే.. ఏటా తమకున్న బడ్జెట్‌కు అనుగుణంగా మాత్రమే అటవీ అధికారులు ఫైర్ వాచర్లను నియమించుకుంటున్నారు. బడ్జెట్ తక్కువగా ఉండటం, అటవీప్రాంత విస్తీర్ణం ఎక్కువగా ఉండడం వల్ల చాలామంది ఫైర్ వాచర్లు, సిబ్బంది కావాలి. కానీ.. ప్రస్తుతం నల్లమలలో 8 తాత్కాలిక బేస్ క్యాంపులు ఉండగా, వాటిలో ఒక్కోదాంట్లో అయిదుగురు చొప్పున 40 మంది మాత్రమే ఫైర్ వాచర్లున్నారు. వారితో పాటు ఫారెస్ట్ ప్రొటెక్షన్ సిబ్బంది, బీట్ ఆఫీసర్లను ఇతోధికంగా నియమించుకోవాల్సిన అవసరం ఉంది. అందుకు అనుగుణంగా ప్రభుత్వాలు బడ్జెట్‌ను కేటాయించాలి. అలాగే నల్లమలలో దాదాపు 160 బీట్లు ఉండగా ఒక్కో బీట్‌కు ఒక్కో ఏయిర్ బ్లోయర్ అందుబాటులో ఉండాలి. ప్రస్తుతం 85 ఏయిర్ బ్లోయర్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. గత సంవత్సరం ఐసీఐసీఐ బ్యాంకు నుంచి సీఎస్ఆర్ కింద 26 బ్లోయర్లు ఇచ్చిన నేపథ్యంలో.. కార్చిచ్చును వేగంగా కట్టడి చేయగలుగుతున్నామని అధికారులు చెబుతున్నారు. అలాగే విఎసీ ఫైర్ ఇంజన్లు (వీటినే వైల్డ్ ల్యాండ్ ఫైరింజన్లు, బ్రష్ ట్రక్‌లంటారు), బైక్ ఫైర్ ఇంజన్లు (బైక్) కూడా గణనీయమైన సంఖ్యలో కావాలి. కానీ మనదగ్గరు అవసరమైన మేరకు అవేవీలేవు.

ప్రమాదం జరిగితే..

దేశంలో ఏ అటవీ ప్రాంతంలో ఎక్కడ అగ్నిప్రమాదం సంభవించినా ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియాకు శాటిలైట్ ద్వారా సమాచారం అందుతుంది. వెంటనే ఆ ప్రాంత అటవీ శాఖ అధికారులకు సమాచారమిస్తారు. వారు.. అప్పటికే ఏర్పాటు చేసుకున్న ఫైర్ వాచర్ టీమ్‌ల బేస్ క్యాంపులకు వాకీటాకీల ద్వారా తెలియజేసి ఆ ప్రాంతానికి పంపిస్తారు. ప్రస్తుతం నల్లమల అడవిలో మంటలు ఆర్పడానికి ఎయిర్ బ్లోయర్లను వినియోగిస్తున్నారు. ఏయిర్ బ్లోయర్ల ద్వారా గడ్డికి అంటుకున్న మంటలను ఆర్పడంతో పాటు.. ఆ మంటలు వ్యాపించకుండా కొద్ది దూరంలో ఆకులను శుభ్రంగా ఊడ్చేసి.. కార్చిచ్చును కట్టడి చేస్తారు. కార్చిచ్చును నిలువరించడంలో ఫైర్ బ్లోయర్ల పాత్ర చాలా కీలకం. కార్చిచ్చును ఆపేందుకు శ్రమించే ఫైర్ ఫైటర్లకు విదేశాల్లో అత్యంత అధునాతన పరికరాలు ఇస్తారు. మనదేశంలో అలాంటి పరిస్థితి లేదు.

కాంగ్రెస్‌కు కింగ్.. రాహుల్‌గాంధీ

- కింగ్ మేకర్ కూడా ఆయనే
- రేవంత్‌కు నూటికి నూరు మార్కులు వేస్తా
- పీసీసీ పదవిని కోరుకోవడం కొత్త కాదు.. మార్పునకు తొందర లేదు: జగ్గారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో రాహుల్‌గాంధీనే కింగ్ అని, కింగ్ మేకర్ కూడా ఆయనేనని, అధికారం కోసం అడ్డదారులు తొక్కే వ్యక్తి కాదని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. గాంధీల కుటుంబం.. త్యాగాల కుటుంబమని, వారు ప్రజలు ఎప్పుడూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటారని కొనియాడారు. పదవుల కోసమే పుట్టిన పార్టీ బీజేపీ అని, గిమ్మిక్కులతో అధికారంలోకి రావాలన్నదే మోదీ, అమిత్ షాల సిద్ధాంతమని విమర్శించారు. గాంధీ భవన్‌లో మంగళవారం జగ్గారెడ్డి మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. గొప్పలకు పోతున్న బీజేపీకి స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న చరిత్ర ఉన్నదా? అని ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఈ విషయంపై అవగాహన లేదన్నారు.

బీఆర్ఎస్ గెలుస్తదని పీకే చెప్పిండు..ఏమైంది?

రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ (పీకే) అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుస్తుందని చెప్పారని.. మరి ఎందుకు గెలవలేదని జగ్గారెడ్డి ప్రశ్నించారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వమే రానుందంటూ పీకే చేసిన వ్యాఖ్యలపై ఆయన ఈ మేరకు స్పందించారు. టీపీసీసీ చీఫ్ పదవిని కోరుకోవడం తనకు కొత్త కాదని, అందులో తప్పు లేదని జగ్గారెడ్డి పేర్కొన్నారు. అయితే టీపీసీసీ చీఫ్ మార్పునకు ఇప్పుడు తొందర లేదన్నారు. తాను బస్టాండ్‌లో కూర్చుని ఉంటానని, ఎక్కాల్సిన బస్సు వచ్చినప్పుడు ఎక్కుతానన్నారు.

మంద కృష్ణ తటస్థంగా మాట్లాడితే జవాబిస్తా

మంద కృష్ణమాదిగ.. బీజేపీ బౌండరీలో ఉండి మాట్లాడుతున్నారని, అలాగైతే తమ నుంచి రాజకీయ మాటలే వస్తాయని జగ్గారెడ్డి అన్నారు. ఆయన తటస్థంగా ఉంటూ ఏ ప్రశ్న అడిగినా సమాధానం ఇస్తామని చెప్పారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్.. తీవ్ర అసహనంతో అవగాహన లేని మాటలు మాట్లాడుతున్నారన్నారు. వర్షాకాలం ఏ నెలలో వస్తుందన్న తెలివి కూడా బీఆర్ఎస్ నేతలకు లేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలన ఎలా ఉందో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలను అడగాలని సూచించారు. పార్టీ మారి వచ్చిన తాను.. ఫిరాయింపులపై మాట్లాడలేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సంబంధించిన పంచాంగాన్ని జగ్గారెడ్డి చెప్పారు. రేవంత్ పాలనకు నూటికి నూరు మార్కులు వేస్తున్నానన్నారు. ప్రభుత్వానికి అవమానం 2 అని, అది కూడా ప్రతిపక్షాలతోనే జరుగుతోందని పేర్కొన్నారు. రాజ్య పూజ్యం 16 అని, ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. కాగా, రాజ్యసభకు ఎన్నికైన అనిల్‌కుమార్ యాదవ్ గాంధీభవన్‌లో జగ్గారెడ్డిని కలిశారు. జగ్గారెడ్డి తన మెడలో ఉన్న బంగారు గొలుసును అనిల్‌కుమార్‌కు బహుమతిగా మెడలో వేశారు.



గాంధీభవన్‌లో జగ్గారెడ్డిని కలిసిన ఎంపీ అనిల్ కుమార్, మెట్టు సాయికుమార్

ఆర్థిక శాఖ వెబ్ పోర్టల్‌కు లాక్!

- 1వ తేదీ నుంచి పని చేయని ఐఎఫ్ఎంఐఎస్
- కొత్త సప్లిమెంటరీ బిల్లుల అప్‌లోడ్‌కు ఇబ్బందులు
- పాత బిల్లుల 'స్టేటస్' తెలియక ఉద్యోగుల ఆందోళన
- గతంలో ఎప్పుడూ జరగలేదంటున్న ఉద్యోగ సంఘాలు

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సప్లిమెంటరీ బిల్లులకు మోక్షం కలగక ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఇప్పటికే ఇబ్బందులు పడుతుండగా.. తాజాగా మరో సమస్య వారిని అయోమయానికి గురి చేస్తోంది. కొత్తగా బిల్లులు పెట్టుకోవడానికి, పాత బిల్లుల పరిస్థితి ఏంటన్నది తెలుసుకోవడానికీ అవకాశం లేకుండా పోయింది. ఉద్యోగుల సప్లిమెంటరీ బిల్లులను అప్‌లోడ్ చేసే ఆర్థిక శాఖ వెబ్ పోర్టల్ ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టం (ఐఎఫ్ఎంఐఎస్) పని చేయడం లేదు. ఏప్రిల్ 1 నుంచి దీనిని ఆర్థిక శాఖ లాక్ చేసి పెట్టింది. యూజర్లకు యాక్సెస్ లేకుండా చేయడంతో ఉద్యోగుల బిల్లులను అప్‌లోడ్ చేసే అవకాశం లేకుండా పోయింది. ఈ విషయమై ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు సమాధానాన్ని దాట వేస్తున్నారని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. ఆర్థిక శాఖ చాలా కాలంగా ఆన్‌లైన్ పద్ధతిలో ఐఎఫ్ఎంఐఎస్ ద్వారా ఉద్యోగుల బిల్లులను పరిష్కరిస్తోంది. అయితే, ఈ పోర్టల్‌లో డ్రాయింగ్ అండ్ డిస్‌బర్స్‌మెంట్ ఆఫీసర్ల(డీడీవోల)కు మాత్రమే యాక్సెస్ ఉంటుంది. ఈ మేరకు వీరికి ఆర్థిక శాఖ యూజర్ ఐడీలు, పాస్‌వర్డులను అందజేసింది. కానీ, ఈ నెల 1 నుంచి ఎప్పుడు ఓపెన్ చేసినా... 'యూజర్ ఈజ్ కరెంట్లీ ఇన్‌యాక్టివ్' అని చూపిస్తోంది. నిజానికి మార్చి 31న సాయంత్రం 6.30 గంటలకే ఆర్థిక శాఖ ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌ను లాక్ చేసేసింది. ఆర్థిక సంవత్సరం ముగిసినందున పోర్టల్ మెయింటెనెన్స్ పేరిట ఐఎఫ్ఎంఐఎస్‌ను డిజేబుల్ చేసినట్లు ప్రకటించింది. ఆ తర్వాత కూడా దాన్ని పునరుద్ధరించకపోవడంతో ఉద్యోగుల సప్లిమెంటరీ బిల్లులను డీడీవోలు అప్‌లోడ్ చేయలేకపోతున్నారు. సాధారణంగా ఒక బిల్లును అప్‌లోడ్ చేస్తే... దానిని ఏడు స్థాయుల్లో చెక్ చేస్తారు. మొదట ఆడిటర్, ఆ తర్వాత సీనియర్ ఆడిటర్, సబ్ ట్రెజరీ ఆఫీసర్, జిల్లా ట్రెజరీ ఆఫీసర్, డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్, ఈ-కుబేర్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తనిఖీ చేస్తారు. ఈ తతంగమంతా పూర్తయితేనే.. ఈ-కుబేర్ ద్వారా ఉద్యోగుల ఖాతాల్లో సొమ్ము జమ అవుతుంది. ఈ మేరకు ఏ బిల్లు ఏ స్థాయిలో ఉందన్న స్టేటస్‌ను డీడీవోలు తెలుసుకునే వీలుంటుంది. ఆయా బిల్లులను ఆర్థికశాఖ అప్రూవ్ చేసిందా? లేక రిజెక్ట్ చేసిందా? అన్న సమాచారం కూడా తెలుస్తుంది. కానీ... వెబ్‌పోర్టల్ పని చేయకపోవడంతో ఆ అవకాశం లేకుండా పోయింది. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగిసినందున పాత సప్లిమెంటరీ బిల్లులను ఆర్థిక శాఖ రీ-షెడ్యూలు చేసిందా? లేదా? అనేది తెలియడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. అదే క్రమంలో కొన్ని పాత బిల్లులను డీడీవోలు మళ్లీ తయారు చేసి, టోకెన్లను రీ-జనరేట్ చేసుకోవాల్సి ఉంటుంది. అలాంటి బిల్లుల పరిస్థితి కూడా తెలియడం లేదని ఉద్యోగ సంఘాల నేతలు చెబుతున్నారు. మార్చి 31తో ఉద్యోగ విరమణ పొందిన వారి బిల్లులను అప్‌లోడ్ చేయిద్దామన్నా పోర్టల్ ఓపెన్ కాని పరిస్థితి ఉందని, గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదని పేర్కొంటున్నారు.

బిల్లులపై ఆందోళనే కారణమా?

బీఆర్ఎస్ హయాం నాటి నుంచే సప్లిమెంటరీ బిల్లులపై ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటి గురించి ఉద్యోగ సంఘాల నేతలు బాహాటంగానే మాట్లాడుతున్నారు. ఈ పరిస్థితి ఇప్పటికీ కొనసాగుతుండడంతో ఆర్థికశాఖ కాస్త జాగ్రత్త పడిందన్న ఆరోపణలున్నాయి. బిల్లులను క్లియర్ చేయడం లేదన్న అపవాదును ఎదుర్కొనే బదులు 'మెయింటెనెన్స్' పేర పోర్టల్‌ను లాక్ చేసి ఉండొచ్చని తెలుస్తోంది.

వరంగల్ అభ్యర్థి ఎవరో?

బలమైన నేత కోసం బీఆర్ఎస్ అన్వేషణ

- టికెట్ కోసం టి.రాజయ్య ప్రయత్నాలు
- పరిశీలనలో మరో ఐదారుగురి పేర్లు
- ఒకటి, రెండు రోజుల్లో అభ్యర్థిని ఖరారు చేసే అవకాశం

వరంగల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి కోసం బీఆర్ఎస్ అన్వేషణ సాగిస్తోంది. కాంగ్రెస్, బీజేపీలకు దీటుగా నిలబడే బలమైన అభ్యర్థి కావాలంటూ అధిష్ఠానం ఆశావహుల జాబితాను వడపోస్తోంది. బీఆర్ఎస్ అభ్యర్థిగా తొలుత కడియం కావ్య పేరును అధిష్ఠానం ఖరారు చేసినా.. అనూహ్యంగా ఆమె బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగటంతో గులాబీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. దీంతో వరంగల్ ఓటర్లలో గట్టి పట్టున్న నేతను బరిలో దించాలని ఆ పార్టీ యోచిస్తోంది ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేల అభిప్రాయాలను కేటీఆర్, హరీశ్‌రావు సేకరించారు. వీరి నుంచి వచ్చిన అభిప్రాయాల ప్రకారం ఓ నివేదిక తయారు చేసి సోమవారమే పార్టీ అధినేత కేసీఆర్‌కు సమర్పించినట్టు తెలిసింది. దీంతో ఒకటి రెండు రోజుల్లో ఎంపీ అభ్యర్థిని కేసీఆర్ ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇక నాగూర్‌కర్నూల్ సీటు మాదిగ సామాజిక వర్గానికి, పెద్దపల్లి సీటు మాల సామాజిక వర్గానికి బీఆర్ఎస్ కేటాయించింది. దీంతో వరంగల్ సీటును మాదిగ సామాజిక వర్గం నేతకే ఇవ్వాలనే ఆలోచనలో ఆ పార్టీ ఉంది. ఇప్పటికే తనతో టచ్‌లో ఉన్న మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్యను తెరపైకి తీసుకొచ్చేందుకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు.. మాజీ మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్‌లను కూడా కలిసి పోటీకి అవకాశం ఇవ్వాలని రాజయ్య కోరినట్టు ప్రచారం జరుగుతోంది. అయితే పార్టీ అధినేత కేసీఆర్ మాత్రం రాజయ్య విషయంలో వేచి చూద్దామంటూ దాటవేసినట్టు సమాచారం. దీంతో ప్రత్యామ్నాయంగా హనుమకొండ జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, జనగామకు చెందిన ప్రముఖ వైద్యుడు సుగుణాకర్‌రాజు, కేయూ ఉద్యోగి పుల్లా శ్రీను, బోడా డిన్నా తదితర పేర్లను పరిశీలిస్తున్నారు. మాదిగ సామాజిక వర్గం నుంచి బలమైన అభ్యర్థి లేకపోతే మాల సామాజిక వర్గం నుంచి పరిశీలించాలని అధిష్ఠానం భావిస్తోంది. ఈ సామాజిక వర్గానికి చెందిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీమణి పెద్ది స్వప్న పోటీకి సుముఖంగా ఉన్నట్లుగా సమాచారం. మాజీ ఎమ్మెల్యేలు పలువురు పెద్ది స్వప్న పేరును సూచిస్తున్నారు. ఇక తెలంగాణ ఉద్యమకారుల కోటా నుంచి మాల సామాజిక వర్గం నేతలు జోరిక రమేశ్, నటరాజ్, సిరిమిల్ల సదానం తదితరులు కూడా ఎంపీ టికెట్ కోసం క్యూ కడుతున్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులుగా ప్రకటించిన కడియం కావ్య, అరూరి రమేశ్ ఇద్దరు కూడా గులాబీ వలస నేతలే కావటంతో బీఆర్ఎస్‌కు వరంగల్ ఎంపీగా పోటీ చేసేందుకు బలమైన అభ్యర్థి లేకుండా పోయారు.



దొంగలు పోయి.. గజదొంగలు వచ్చారు

(మొదటి పేజీ తరువాయి)

చైతన్యవంతులని, కాంగ్రెస్‌ను నమ్మరని కిషన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం దగ్గర నిధుల్లేవని, హామీల అమలుకు కార్యాచరణ కూడా లేదని విమర్శించారు. కాంగ్రెస్ నెహ్రూ కుటుంబానికి, బీఆర్ఎస్ కేసీఆర్ కుటుంబానికి కొమ్ముకాస్తున్నాయని ఆ రెండు పార్టీల డీఎన్ఏ ఒకటేనని.. గతంలో పొత్తు కూడా పెట్టుకున్నాయని గుర్తు చేశారు. ప్రధానిగా మోదీ జూన్‌లో ప్రమాణస్వీకారం చేయబోతున్నారన్నారని కిషన్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల తర్వాత రాహుల్ ఇటలీకి వెళ్లిపోతారని జోస్యం చెప్పారు.

కుట్రదారులు ఎవరో రేవంత్ చెప్పాలి: ఎన్.వి.సుభాష్

ప్రభుత్వాన్ని దింపేందుకు కుట్ర జరుగుతోందంటూ ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆ కుట్రదారులెవరో బయటపెట్టాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎంను పదవీచ్యుతుడిని చేయడానికి బయటివారు అవసరం లేదు.. రేవంత్‌కు వ్యతిరేకంగా పనిచేసేవాళ్లు ఆ పార్టీలోనే ఉన్నారని పేర్కొన్నారు. రేవంత్‌కు ధైర్యం ఉంటే ఇలాంటివారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. సిరిసిల్ల చేనేత కార్మికుల సమస్యకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ డిమాండ్ చేశారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ బుధవారం దీక్ష చేపట్టనున్నట్లు ప్రకటించగానే ప్రభుత్వం స్పందించిందన్నారు. ఇది బీజేపీ విజయమేనని అభివర్ణించారు. రాష్ట్ర కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ సిరిసిల్ల చేనేత కార్మికులకు రూ.300 కోట్లు బకాయిలు విడుదల చేసే పరిస్థితి లేదా? అని నిలదీశారు. మీరు కొడంగల్‌కే ముఖ్యమంత్రా? సిరిసిల్ల కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. దొంగ హామీలు ఇవ్వడం కాదు.. వాటి అమలుకు తేదీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. 14 ఏళ్లగా ఎమ్మెల్యేగా ఉన్న కేటీఆర్ సిరిసిల్ల చేనేత కార్మికులను మోసం చేశారని మండిపడ్డారు.



హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన హోమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దంపతులు



సహస్రధారతో స్వామివారికి స్నపనం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాద్రి రామయ్య కల్యాణానికి అంకురార్పణ

ఉత్సవాంగ స్నపనంతో తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

భద్రాచలం, ఏప్రిల్ 9: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఉత్సవాంగ స్నపనంతో వసంతపక్ష ప్రయుక్త శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. తొలుత శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం స్వామివారికి ఆరాధన, ఉగాది ప్రసాద నివేదన చేశారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే రుత్వికులకు, సిబ్బందికి భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి దంపతులు దీక్ష వస్త్రాలను అందజేశారు. మూలవరులకు అభిషేకం, బేడా మండపంలో ఉత్సవమూర్తులకు ఉత్సవాంగస్నపనంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం గోవిందరాజస్వామి ఆలయానికి శ్రీ సీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులను తీసుకెళ్లి మృత్సంగ్రహణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు భూ వరాహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మట్టిని సేకరించి కల్యాణ అంకురార్పణకు వినియోగించారు. శ్రీ క్రోధి నామ సంవత్సరంలో భద్రాద్రి రామయ్య ఆదాయం పెరగనుందని వ్యయం తగ్గే అవకాశాలున్నాయని స్థానాచార్యులు కేశ స్థలశాయి తెలిపారు. భద్రాచలంలో మంగళవారం రాత్రి శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని నిత్యకల్యాణ మండపం వద్ద పంచాంగ పఠనం చేశారు.

రూ.1,500 కోట్ల అప్పు తీసుకున్న రాష్ట్రం

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.1,500 కోట్ల అప్పు తీసుకున్నది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మంగళవారం నిర్వహించిన ఈ-వేలం ద్వారా దీనిని సేకరించింది. 27 ఏళ్ల కాలపరిమితి, 7.44 శాతం వార్షిక వడ్డీతో రూ.1000 కోట్లు, 29 ఏళ్ల కాలపరిమితి, 7.44 శాతం వార్షిక వడ్డీతో రూ.500 కోట్లు.. మొత్తం రూ.1,500 కోట్లను రుణంగా తీసుకున్నది. అసోం రూ.1000 కోట్లు, మహారాష్ట్ర రూ.4000 కోట్ల చొప్పున రుణాలు తీసుకున్నాయి. ఇలా మూడు రాష్ట్రాలు .6,500 కోట్ల అప్పులు తీసుకున్నాయి.

సౌత్ ఇండియా రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్

భూములు వెనక్కి తీసుకోవాలి

- హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు.. నోటీసులు జారీ

హైదరాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): సౌత్ ఇండియా రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు కేటాయించిన ప్రభుత్వ భూములను వెనక్కి తీసుకోవాలని పేర్కొంటూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. వనస్థలిపురానికి చెందిన సోషల్ వర్కర్ అశోక్ కుమార్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. నేచురల్ సైన్సెస్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో పరిశోధనలను ప్రోత్సహించే ఉద్దేశంతో 1965లో సరూర్‌నగర్ సర్వేనంబర్ 9/1లో 22.09 ఎకరాలు, బహదూర్‌గూడ సర్వే 49/13లో 14.31 ఎకరాలు ప్రభుత్వం కేటాయించిందని పేర్కొన్నారు. భద్రతా కారణాలు చూపుతూ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆదేశాలు ఇవ్వడంతో కంపెనీ కార్యకలాపాలు నిలిచిపోయాయని తెలిపారు. అనంతరం, 2021లో ఆ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించారని, అప్పటి నుంచి సదరు భూముల నేచర్‌ను నివాస, వాణిజ్య అవసరాలకు మార్చి కంపెనీ డైరెక్టర్‌లు వాటిని విక్రయిస్తున్నారని, భూకేటాయింపు నిబంధనలకు విరుద్ధంగా ఈ వ్యవహారం జరుగుతోందని పేర్కొన్నారు. కాగా ఈ పిటిషన్‌కు రెగ్యులర్ పిల్ నెంబర్ ఇవ్వడానికి రిజిస్ట్రీ నిరాకరించింది. రిజిస్ట్రీ అభ్యంతరాలతో వచ్చిన ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం.. దీనిని రెగ్యులర్ పిల్‌గా నమోదు చేయాలని రిజిస్ట్రీకి ఆదేశాలు జారీచేసింది. సౌత్ ఇండియా రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సహా ఇతర ప్రతివాదులకు కౌంటర్‌లు దాఖలు చేయాలని నోటీసులు జారీచేసింది.

ఊరికి కరెంట్ ఆపేద్దామని.. మృత్యుఒడికి

- ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై రైతు మృతి
- మోటార్ల వల్ల నల్లా నీళ్లు సరిగా రావడం లేదని.. గ్రామానికి విద్యుత్ సరఫరా ఆపేయాలని యత్నం



చింత నర్సింహులు (ఫైల్‌ఫోటో)

తొగుట, ఏప్రిల్ 9: ఇరుగుపొరుగు వారు మోటార్లు పెట్టడంతో తమకు మిషన్ భగీరథ.. నల్లా నీళ్లు సరిగ్గా రాకపోవడంతో గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపివేద్దామని యత్నించిన ఓ రైతు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై మరణించాడు. అతన్ని కాపాడేందుకు యత్నించిన మరో వ్యక్తి గాయపడ్డాడు. సిద్దిపెట్ట జిల్లా తొగుట గ్రామంలో ఉగాది రోజున ఈ విషాదం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తొగుట గ్రామానికి చెందిన చింత నర్సింహులు(38)కు భార్య పద్మ, కొడుకులు చందు(10), సన్నీ (7) ఉన్నారు. మిరుదొడ్డి మండలం లింగుపల్లి శివారులో రెండెకరాల భూమిని కొనుగోలు చేసిన నర్సింహులు దానిని సాగు చేసుకుంటున్నాడు. ఇందుకోసం అత్తగారి ఊరైన వీరారెడ్డిపల్లిలో ఇల్లు అద్దెకు తీసుకుని భార్యా పిల్లలతో కలిసి ఉంటున్నాడు. తన భూమిలో పొద్దుతిరుగుడు సాగు చేసిన నర్సింహులు.. పంటను విక్రయించేందుకు తొగుట మార్కెట్ యార్డుకు తీసుకువచ్చాడు. అయితే, కొనుగోళ్లు నిలిపివేయడంతో 15 రోజులుగా అక్కడే ఉంటున్నాడు. ఈ క్రమంలో భార్య, పిల్లలను కూడా ఉగాదికి స్వగ్రామానికి రప్పించాడు. ఇంటిని శుభ్రం చేసుకునేందుకు మిషన్ భగీరథ నీళ్లు పట్టుకోవడానికి మంగళవారం ప్రయత్నించగా చాలా తక్కువగా వస్తున్నాయి. చుట్టుపక్కల ఇళ్ల వారు నల్లాలకు మోటర్లు పెట్టడమే ఇందుకు కారణమని భావించిన నర్సింహులు నల్లా నీరు బంద్ అయ్యేవరకు గ్రామానికి విద్యుత్ సరఫరా ఆపేయాలని అనుకున్నాడు. ఇందుకోసం ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వచ్చి యత్నించి విద్యుత్‌ఘాతానికి గురై అక్కడికక్కడే మరణించాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న గ్రామానికి చెందిన బొడ్డు మల్లేశం.. నర్సింహులును కాపాడేందుకు యత్నించాడు. కానీ, విద్యుదాఘాతానికి గురై స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

తెలంగాణ హైకోర్టుకు మార్గదర్శి కేసు

- ఆరు నెలల్లో వాదనలు పూర్తిచేయాలని సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మార్గదర్శి డిపాజిట్లపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. డిపాజిట్లపై మరింత సమగ్ర పరిశీలన జరగాల్సి ఉన్నదని అత్యున్నత ధర్మాసనం అభిప్రాయ పడింది. అందుకే కేసును తెలంగాణ హైకోర్టుకు రిఫర్ చేస్తూ తీర్పు ఇచ్చింది. మార్గదర్శి డిపాజిట్ల కేసుపై మంగళవారం సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసును న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. "ఈ కేసులో మెరిట్స్‌లోకి వెళ్లాలని అనుకోవడం లేదు. అయితే డిపాజిట్లపై సమగ్ర పరిశీలన జరగాలి. ఇంకా ఎవరికైనా డబ్బులు ఇవ్వాల్సి ఉన్నదా? అనేది పబ్లిక్ నోటీసు జారీ చేయడం ద్వారా వివరాలు సేకరించాలి. కొన్ని టెక్నికల్ రీజన్స్ నేపథ్యంలో కేసును తెలంగాణ హైకోర్టుకు రిఫర్ చేస్తున్నాం. రెండు, మూడు నెలల్లో డిపాజిట్లపై సమగ్ర పరిశీలన జరపాలి. దీనికోసం హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తిని నియమించాలి. ఉండవల్లి అరుణ్ కుమార్ కూడా హైకోర్టుకు సహకరించాలి. కేసు విచారణ జరుగుతున్న కాలంలో ఉండవల్లి మీడియా ముందుకు వెళ్లకపోవడం మంచిది. ఈ కేసులో ఏపీ ప్రభుత్వం, ఉండవల్లి, ఆర్బీఐ వాదనలు వినిపించాల్సి ఉంటుంది" అని ధర్మాసనం తెలిపింది. ఆరు నెలల్లో వాదనలు పూర్తి చేయాలని తెలంగాణ హైకోర్టును ఆదేశించింది.

67 పట్టణాలు, 2 కార్పొరేషన్లలో నీటి సమస్య

- ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై సర్కారు దృష్టి



హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటి మట్టాలు అడుగంటడం, భూగర్భ జలాలు పడిపోతుండటంతో పలు ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బందులు మొదలయ్యాయి. ప్రస్తుతం 67 పట్టణాలతో పాటు ఖమ్మం, కరీంనగర్ కార్పొరేషన్లలో మంచి నీటి సమస్య తీవ్రంగా ఉంది. దీంతో సర్కారు అప్రమత్తమైంది. ఆయా ప్రాంతాల్లో వేసవి ముగిసే వరకు ప్రత్యామ్నాయ నీటి వనరులను గుర్తించి తాగు నీరు సరఫరా చేయాలని నిర్ణయించింది. నాగార్జునసాగర్ నుంచి పాలేరుకు, ఉదయ సముద్రం రిజర్వాయర్ ద్వారా నల్లగొండ, ఖమ్మం పట్టణాలకు నీటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. మిడ్ మానేరు, ఎల్ఎండీ నుంచి కరీంనగర్ పట్టణానికి నీటిని అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది. తాగునీటికి ఇబ్బంది రాకుండా సర్కారు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. జూన్ వరకు ఎండల తీవ్రత పెరిగినప్పటికీ తాగునీటి ఎద్దడి లేకుండా అన్ని గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపాయి. మరోవైపు ఏ రోజుకారోజు ప్రభుత్వ యంత్రాంగం తాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహిస్తోంది. ఎక్కడన్నా ఇబ్బంది ఉన్నట్లు ఫిర్యాదులు, వార్తలు వస్తే.. వెంటనే తాగునీటిని అందించేందుకు చర్యలు చేపడుతోంది. వేసవిలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను పర్యవేక్షించేందుకు ఇప్పటికే ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలకు పది మంది సీనియర్ ఐఏఎస్‌లను ప్రత్యేక అధికారులుగా నియమించింది. జిల్లా స్థాయిలో అత్యవసరంగా చేపట్టాల్సిన పనుల కోసం కలెక్టర్లకు రూ.100 కోట్లు విడుదల చేసింది. ఒక్కో నియోజకవర్గానికి రూ.కోటి చొప్పున 15వ ఆర్థిక సంఘం నిధులను ఖర్చు చేసే వెసులుబాటు కల్పించింది. పట్టణాలు, గ్రామాల్లో సమీప నీటి వనరులను ఉపయోగించుకోవాలని మునిసిపల్ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సాధారణ రోజులతో పోలిస్తే కేవలం పది శాతంలోపు తాగునీటి సరఫరా తగ్గినప్పటికీ ప్రజల అవసరాలకు సరిపడా నీటిని అందిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

97 ట్యాంకర్లు అద్దెకు..

కృష్ణా, గోదావరి రిజర్వాయర్లలో నీటి మట్టం పడిపోవడంతో మేలో మరింత ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయి. అవసరమైతే కర్ణాటకలోని నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి కొంత నీటిని విడుదల చేయాలని అక్కడి ప్రభుత్వాన్ని కోరాలని ఇప్పటికే ఇరిగేషన్ విభాగం ప్రతిపాదనలు సిద్ధం చేసుకుంది. నారాయణపూర్ నుంచి జూరాలకు వచ్చే నీటితో గద్వాలకు తాగునీటి సరఫరా చేసుకోవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు 131 పట్టణాల్లో అందుబాటులో ఉన్న 294 ప్రభుత్వ ట్యాంకర్లతో పాటు 97 ట్యాంకర్లను అద్దెకు తీసుకుంది. అత్యవసరమైతే ప్రజలకు ఇబ్బంది లేకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చింది.

నీరే బంగారమాయె..

(మొదటిపేజీ తరువాయి)

లీటర్ల నీటిని పుడమి కడుపు నుంచి తోడేసి.. వేలాది ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు! ప్రాంతాన్ని బట్టి.. అక్కడ ఉన్న నీటికొరత తీవ్రతను బట్టి.. పెరిగిన డిమాండ్‌ను బట్టి.. ట్యాంకర్ నీటి ధరను పెంచేసి వసూలు చేస్తున్నారు!! నిరుడు హైదరాబాద్‌తోపాటు ఔటర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో జూలై, సెప్టెంబరు నెలల్లో సగటు కన్నా అధిక వర్షపాతం నమోదుకాగా.. జూన్, ఆగస్టు, అక్టోబరు నెలల్లో మాత్రం సగటు వర్షపాతం కూడా నమోదు కాలేదు. నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారడంతో వర్షపు నీరంతా నాలాలు, డ్రెయినేజీల గుండా మూసీలో కలుస్తోంది. ఫలితంగా ఆశించిన స్థాయిలో భూగర్భ జల మట్టాలు పెరగలేదు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. ఔటర్ పరిధిలోని 35 ప్రాంతాల్లో నిరుడు మార్చిలో భూగర్భ జలమట్టాలు సగటున 9.68 మీటర్ల దిగువన ఉండగా, ఈ ఏడాది మార్చిలో ఆ సగటు 10.89 మీటర్లకు చేరింది. అంటే.. 1.2 మీటర్ల మేర దిగువకు పడిపోయినట్టు. కొన్ని చోట్ల.. మీటరు నుంచి ఏకంగా ఐదు మీటర్ల దిగువకు పడిపోయాయి. దీంతో.. కొన్నిచోట్ల 2 వేల అడుగుల మేర తవ్వించిన బోర్లూ ఎండిపోతున్నాయి. ఈ పరిస్థితి నీటి ట్యాంకర్లు సరఫరా చేసేవారికి వరంగా మారింది.

అడ్డగోలు రేట్లు..

సాధారణంగా హైదరాబాద్‌లో 5000 లీటర్ల వాటర్ ట్యాంకర్‌ను వాటర్‌బోర్డు కస్టమర్ అకౌంట్ నంబర్ (సీఏఎన్) ద్వారా బుక్ చేసినవారికి రూ.500కు పంపిస్తుంది. సీఏఎన్ లేనివారికి అదే ట్యాంకర్‌ను రూ.850కి సరఫరా చేస్తుంది. కానీ.. అదే ట్యాంకర్‌ను ప్రైవేటులో తెప్పించుకోవాలంటే ప్రాంతాన్ని బట్టి, కొనుగోలుదారుల అవసరాన్ని బట్టి రూ.1000 నుంచి రూ.1500, రూ.1800 దాకా అమ్ముతున్నారు. అత్యవసరం ఉన్న ఆతిథ్యరంగ వ్యాపార వర్గాలవారికైతే రూ.3 వేల నుంచి రూ.5 వేల దాకా చెల్లించుకోక తప్పని దారుణమైన పరిస్థితి నెలకొంది. వాటర్‌బోర్డు పరిమిత స్థాయిలో ట్యాంకర్లను



సున్నం చెరువు వద్ద పైపులు

సరఫరా చేస్తుండడంతో.. ప్రైవేట్ వ్యక్తుల వద్ద నీటి కొనుగోలు పెరుగుతోంది. ఇదే అదనుగా వారు అక్రమ నీటి వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. చెరువులు, జలాశయాల పక్కనుండే ఖాళీ స్థలాలు, శివారు ప్రాంతాల్లోని ఖాళీ ప్లాట్లలో బోర్లు వేసి భూగర్భ జలాలను తోడేస్తున్నారు. ప్రభుత్వ విభాగాలు, స్థానిక రాజకీయ నేతల అండదండలుండడంతో పగలు, రాత్రి అన్న తేడా లేకుండా నీటి దందా కొనసాగిస్తున్నారు. నీటి కరువుతో అల్లాడుతున్న అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, ఐటీ కంపెనీలు, ఇతర వ్యాపార సంస్థలనైతే అక్షరాలా నిలువు దోపిడీ చేస్తున్నాయి. నీరు నిత్యావసరం కావడం.. ట్యాంకర్ దొరికితే అదే పదివేలు అనే పరిస్థితి నెలకొనడంతో వారంతా గత్యంతరం లేని పరిస్థితుల్లో ఎంత ధరయినా పెట్టి ట్యాంకర్లు తెప్పించుకుంటున్నారు. అవసరం తీరితే చాలన్నట్టుగా అడిగినంత ఇచ్చేస్తున్నారు. ఈ ప్రభావం సామాన్యులపై పడి.. వారికి నీటి కొనుగోలు ఖరీదైన వ్యవహారంగా మారిపోతోంది.

అనుమానం రాకుండా..

అక్రమ జల దందా చేస్తున్నవారు.. బోరు ఎక్కడుంది? ఎక్కడి నుంచి నీళ్లు వస్తున్నాయన్నది తెలియకుండా అధికారుల కళ్లుగప్పేందుకు రకరకాల ఉపాయాలు పన్నుతున్నారు. ఖాళీ స్థలాల్లో బోర్లు వేసి, వాటి చుట్టూ ఇంటిని తలపించేలా నిర్మాణాలు చేపడుతున్నారు. ఇంకొందరు రేకుల షెడ్లు వేస్తున్నారు. బోర్లను గుర్తించకుండా కొన్ని ప్రాంతాల్లో సిమెంట్, కాంక్రీట్‌తో శ్లాబ్‌లు నిర్మిస్తున్నారు. గండిపేట, నార్సింగ్, మణికొండ, హఫీజ్‌పేట, మియాపూర్, బౌరంపేట, దుండిగల్, మల్లంపేట, ఉప్పల్, రామంతాపూర్, బోయిన్‌పల్లి తదితర ప్రాంతాల్లో చెరువుల పక్కన బోర్లు వేసి నీటి దందా కొనసాగిస్తున్నారు. ఒక్కో బోరు వేయడానికి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చవుతుంది. కానీ.. నాలుగు నెలల్లో ఆ బోరు ద్వారా వచ్చే నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసి, అంతకంటే ఎక్కువ సంపాదిస్తున్నారు. ఉదాహరణకు.. "నాలుగేళ్ల క్రితం రెండు బోర్లు వేశా. ఏటా వేసవిలో ఖర్చులు పోను రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల దాకా గిట్టుబాటు అవుతోంది" అని హఫీజ్‌పేటలో నీటి వ్యాపారం చేసే ఓ వ్యక్తి పేర్కొన్నాడు. అలాగే.. మాదాపూర్‌లోని గుట్టల బేగంపేటలో ఉన్న సున్నం చెరువును పూడ్చి మూడేళ్ల క్రితం 100 అడుగుల రోడ్డు నిర్మించారు. ఆ రోడ్డుకు ఆవలి వైపు చెరువు పక్కన ఉన్న రేకుల షెడ్లులు, చిన్న, చిన్న గుడిసెల్లో అక్రమార్కులు నీటి వ్యాపారం సాగిస్తున్నారు. ఒక్కో షెడ్డులో మూడు, నాలుగు బోర్లు వేసి భూగర్భ జలాలను తోడేస్తున్నారు. చెరువు లోపల గతంలో బోర్లు వేశారని, వాటి నుంచి కూడా సరఫరా జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. అక్కడి నుంచి ఐటీ కారిడార్‌లోని పలు ప్రాంతాలకు.. 5 వేల లీటర్ల ట్యాంకర్ ధర భారీ డిమాండ్ ఉన్న సమయంలో రూ.5 వేలకు, గిరాకీ లేని పక్షంలో రూ.3 వేలకు సరఫరా చేస్తున్నారు. 10 వేల లీటర్ల ట్యాంకర్ ధర రూ.8 వేలకుపైనే. సున్నం చెరువు పక్కన ఎప్పుడు చూసినా 30-40 ట్యాంకర్లు కనిపిస్తుంటాయి. నిత్యం ఇక్కడి నుంచి 1500 నుంచి 2000 ట్రిప్పుల ట్యాంకర్ల సరఫరా జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా.. రెవెన్యూ యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడట్లేదు. స్థానిక నేతల ఒత్తిళ్లు, అధికారులకూ నెల నెలా ముడుతుండడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. పక్కనే ఉన్న అల్లాపూర్ కాముని చెరువు వద్దా నీటి దందా కొన్నాళ్లుగా చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే చొరవతో అక్కడ వ్యాపారం తాత్కాలికంగా నిలిచింది. అలాగే.. పలు ప్రాంతాల్లో చెరువుల్లోని నీటిని ట్యాంకర్లలో నింపి సరఫరా చేస్తున్నారు. నిర్మాణ రంగ అవసరాలకు ఈ నీటిని వినియోగిస్తున్నారు. బోర్ల నీటితో పోలిస్తే వీటి ధర తక్కువే. 5 వేల లీటర్ల ట్యాంకర్ రూ.800-రూ.1000కి సరఫరా చేస్తున్నారు.

వాల్టాకు తూట్లు...

వాటర్ ల్యాండ్ అండ్ ట్రీస్ (వాల్టా) యాక్ట్-2002 ప్రకారం ఇంటి అవసరాల కోసం బోరు వేసినా రెవెన్యూ విభాగం అనుమతి తీసుకోవాలి. ముందుగా తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకుంటే క్షేత్రస్థాయి పరిస్థితులు, దరఖాస్తుదారుడి అవసరం, అక్కడి భూగర్భ జలాల లభ్యతను బట్టి అనుమతినిస్తారు. ఇంటి నిర్మాణం కోసం సామాన్యులు బోరు వేస్తే.. ఈ చట్టాన్ని చూపి నానా ఇబ్బందులూ పెట్టే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది.. అక్రమంగా పదుల సంఖ్యలో బోర్లు వేస్తున్నవారిని మాత్రం పట్టించుకోవట్లేదు. చర్యల సంగతి పక్కన పెడితే.. కనీసం అటువైపు వెళ్లేందుకూ వారికి తీరిక ఉండట్లేదు. దీంతో వారి తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆదుకోలేకపోతున్న వాటర్‌బోర్డు..

ప్రైవేటు ట్యాంకర్ల ధరలను తట్టుకోలేని సామాన్యులు.. తక్కువ ధరకు నీటిని సరఫరా చేసే వాటర్‌బోర్డును ఆశ్రయిస్తున్నారు. కానీ.. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో తాగు నీటిని సరఫరా చేస్తున్న వాటర్‌బోర్డు.. ఈసారి పెరుగుతున్న డిమాండ్‌ను తట్టుకోలేక తడబడుతోంది. సాధారణంగా వాటర్‌బోర్డుకు వేసవిలో రోజుకు ఐదు వేల నుంచి ఆరు వేల వరకు ట్యాంకర్ల డిమాండ్ ఉంటుంది. కానీ, ఈసారి ఆ సంఖ్య పదివేల మార్క్‌ను దాటేసింది. దీంతో.. ట్యాంకర్ బుక్ చేసిన రెండు, మూడు రోజులకు.. ఒక్కోసారి నాలుగైదు రోజులకు కూడా ట్యాంకర్ రాకపోవడంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. దీంతో పెరిగిన గిరాకీకి తగినట్టుగా నీటిని సరఫరా చేసేందుకు బోర్డు చర్యలు చేపట్టింది. వారం రోజుల క్రితం వరకు రోజుకు 6వేల ట్రిప్పులను సరఫరా చేసిన వాటర్‌బోర్డు.. ప్రస్తుతం మూడు షిఫ్టుల్లో రోజుకు 7800ల వరకు సరఫరా చేస్తోంది. అదీ సరిపోక ప్రజలు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో.. బుకింగ్ చేసిన 12గంటల్లోపు ట్యాంకర్ డెలివరీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం వాటర్‌బోర్డుకు ఆదేశాలిచ్చింది. ఈమేరకు ట్యాంకర్ల సంఖ్యను పెంచేందుకు వాటర్‌బోర్డు చర్యలు చేపట్టింది. ఈ నెలాఖరు వరకు 200-300 ట్యాంకర్లను అదనంగా అందుబాటులోకి తెచ్చేందుకు కసరత్తు ప్రారంభించింది. రెండు షిఫ్టుల్లో గాకుండా మూడు షిఫ్టుల్లో 24/7 ట్యాంకర్లు పని చేయడానికి ఆదేశాలిచ్చింది.

ఇళ్లలో బోర్లపై..

అక్రమ నీటి దందా చేసేవారు 1000 అడుగుల నుంచి 2000 అడుగుల లోతు వరకు బోర్లు వేస్తుండడంతో.. పక్కనున్న ఇళ్లలో బోర్లపై ప్రభావం పడుతోంది. మాదాపూర్‌లోని మేడికుంట, తూర్పు కుంట, సున్నం చెరువ పక్కనున్న ప్రాంతాల్లో గతంలో 100-200 అడుగులలోపు నీరు పుష్కలంగా వచ్చేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పుడు 500-1000 అడుగుల వరకు బోర్లు వేయాల్సి వస్తోందని చెబుతున్నారు.



సున్నం చెరువు వద్ద నీటిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న ట్యాంకర్లు

మేడిగడ్డ పునరుద్ధరణ ఇప్పట్లో డౌటే!

ఎన్‌డీఎస్‌ఏ సిఫారసులు చేశాకే మరమ్మతులు

- ప్రశ్నలకు జవాబిస్తేనే సిఫారసులంటున్న కమిటీ
- 50 రోజుల్లో బ్యారేజీకి వరద వచ్చే అవకాశం
- అప్పటివరకు అమల్లో పార్లమెంట్ ఎన్నికల కోడ్
- మరమ్మతు చేయాలంటే ఈసీ అనుమతి తప్పనిసరి
- పునరుద్ధరణకు ఎన్నాళ్లు పట్టేనో తెలియని పరిస్థితి

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుకు గుండెకాయగా చెప్పుకొనే మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ ఇప్పట్లో జరిగే సూచనలు కనిపించడంలేదు. పునరుద్ధరణకు సంబంధించి మధ్యంతర చర్యలు చేపట్టడానికి సూచనలు/సలహాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ)ని కోరినా ఫలితం లేకుండా పోయింది. నెల రోజుల్లోపు మరమ్మతులకు సిఫారసు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరగా.. దాదాపు రెండు నెలలు కావస్తున్నా ఎలాంటి పురోగతి లేదు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై వివిధ విభాగాలకు తాము వేసిన ప్రశ్నలకు జవాబులు వస్తే.. వాటి ఆధారంగా సిఫారసు చేస్తామని ఎన్‌డీఎస్‌ఏ ఇప్పటికే తేల్చి చెప్పింది. దాంతో ఎన్‌డీఎస్‌ఏ ప్రశ్నలపై జవాబులకు తుదిరూపు ఇచ్చే పనిలో నీటిపారుదల శాఖ నిమగ్నమయింది. కానీ, మరో 50 రోజుల్లోనే మేడిగడ్డకు వరద ప్రారంభమయ్యే అవకాశముంది. మే నెలాఖరున లేదా జూన్ మొదటివారంలో మేడిగడ్డ బ్యారేజీకి వరద మొదలవుతుంది. ఈలోగా ఎన్‌డీఎస్‌ఏ సిఫారసులు చేస్తేనే మరమ్మతులకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం బ్యారేజీకి వరద లేకపోయినా.. అందులోని ఏడో బ్లాకు మరింత కుంగిపోతోంది. ఈ పరిస్థితుల్లో వరద ప్రారంభమైతే గేట్లను ఎత్తి నీటిని కిందికి వదలడం తప్ప.. మరే మార్గం లేకుండా పోతుంది.

32 పిల్లర్లను తొలగించాల్సిందే!

గతేడాది అక్టోబరు 21వ తేదీన బ్యారేజీలోని ఏడో బ్లాకు కుంగిన విషయం విదితమే. ఆ తర్వాత రంగంలోకి దిగిన ఎన్‌డీఎస్‌ఏ.. బ్యారేజీల్లోని నీటిని డీ వాటరింగ్ చేసి పరిశీలన జరపాలని, మరమ్మతులు చేసేదాకా బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయరాదని సూచించింది. అయితే తాజాగా కేంద్రం వేసిన ఎన్‌డీఎస్‌ఏ కమిటీ సిఫారసుల ప్రకారం బ్యారేజీని మరమ్మతులు చేయాలని ప్రభుత్వం తొలుత యోచించింది. కానీ, మరమ్మతులు అంత సులువుగా చేసేవి కావని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మేడిగడ్డ బ్యారేజీని మొత్తం 8 బ్లాకులుగా నిర్మించగా.. ఒక్కో బ్లాకులో 10-11 దాకా పియర్లు ఉన్నాయి. బ్యారేజీ మొత్తానికి 85 పియర్లు ఉన్నాయి. వీటిలో ఏ ఒక్క పియర్‌లో సమస్యలు తలెత్తినా.. ఆ బ్లాకులోని మొత్తం పియర్లను తొలగించాల్సి ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం 6, 7, 8వ బ్లాకులు ప్రభావితమైనందున.. వాటికి సంబంధించిన 32 పిల్లర్లపై దీని ప్రభావం ఉంటుందని చెబుతున్నారు. దీంతో 32 పిల్లర్లను తొలగిస్తే తప్ప బ్యారేజీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాదని గుర్తు చేస్తున్నారు. అయితే పిల్లర్ల తొలగింపు చర్య భారీ ఖర్చుతో కూడుకున్నది అయినందున.. దానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు విడుదల చేయాల్సిన అవసరం ఉంటుంది. కానీ, ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున.. ప్రభుత్వం నిధులు విడుదల చేయాలంటే ఎన్నికల కమిషన్ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కోడ్ ముగిసే దాకా ఆగాలనుకుంటే.. ఆలోపే వరద ముంచుకువస్తుంది. దాంతో వచ్చే ఏడాది కూడా బ్యారేజీ పునరుద్ధరణ కష్టమే కానుంది.

మేడిపండైనా మరమ్మతులు చేసుకోవాల్సిందే..!

కాళేశ్వరంలో భాగంగా ఏటా 180 టీఎంసీల నీటిని కేవలం మేడిగడ్డ నుంచే ఎత్తిపోయాలని గత ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2019లో నిర్మాణం పూర్తయిన ఈ బ్యారేజీ నుంచి లెక్కప్రకారం ఐదేళ్లలో 900 టీఎంసీలు ఎత్తిపోయాల్సి ఉండగా.. 162.368 టీఎంసీలు మాత్రమే ఎత్తిపోశారు. ఇందులోనూ సగానికి పైగా మళ్లీ సముద్రంలోకే వదిలారు. మిగిలిన నీరు వివిధ రిజర్వాయర్లలో ఉంది. అయితే భవిష్యత్తులో ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకంలో తుమ్మిడిహెట్టి బ్యారేజీని కట్టుకున్నా.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను మరమ్మతులు చేసుకొని వినియోగించుకుంటామని ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది. కాళేశ్వరంలోని లింక్-1లో ఉన్న సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలతోపాటు పంప్‌హౌస్‌లపై గత ప్రభుత్వం రూ.20 వేల కోట్లకు పైగా వెచ్చించింది. దాంతో వీటిని వినియోగించుకోవడం అనివార్యమని ప్రభుత్వం భావిస్తోంది. ఇదిలా ఉండగా.. కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల్లో తక్కువ లోపాలున్నది సుందిళ్ల బ్యారేజీయే. దీని నీటి నిల్వ సామర్థ్యం తక్కువే అయినా.. మేడిగడ్డతో పోలిస్తే దీనికి ప్రమాదాలు తక్కువ. ప్రధాన గోదావరిపై ఉండటం, వరద తక్కువగా ఉండటంతో సుందిళ్లలో 3 టీఎంసీల దాకా నీటిని నిల్వ చేసుకుంటే ప్రయోజనం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. మేడిగడ్డను పునరుద్ధరించినా.. మూడు టీఎంసీలలోపు నిల్వ ఉంచితేనే బ్యారేజీతో మేలు జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. అయితే వరదల సమయంలో గేట్లు తెరిచి ఉంచి, వరద పూర్తిస్థాయిలో తగ్గిన తర్వాత పరిమిత స్థాయిలో నీటిని నిల్వ చేసుకుంటేనే బ్యారేజీలు బతికి బట్టకడతాయని నిపుణులు సూచిస్తున్నారు.

వేటు పడింది!

- నిబంధనలు అతిక్రమించి బీఆర్ఎస్ సమావేశానికి హాజరైన ఫలితం
- 106 మంది సెర్ప్, ఈజీఎస్ ఉద్యోగుల సస్పెన్షన్

సిద్దిపేట, ఏప్రిల్ 9, (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేటలోని రెడ్డి సంక్షేమ భవన్‌లో మెదక్ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి హాజరైన 106 మంది ఇందిరా క్రాంతి పథం(సెర్ప్), ఉపాధి హామీ పథకం(ఈజీఎస్) ఉద్యోగులపై వేటు పడింది. నిబంధనలకు విరుద్ధంగా సెర్ప్, ఈజీఎస్ ఉద్యోగులతో ఈ సమావేశం జరుగుతుందని పేర్కొంటూ కాంగ్రెస్, బీజేపీ నాయకులు వేర్వేరుగా ఎన్నికల అధికారులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం రెడ్డి సంక్షేమ భవన్‌కు చేరుకొని ఆరా తీశారు. సీసీ కెమెరాల ఆధారంగా ఈ సమావేశానికి ఎవరెవరు హాజరయ్యారనే విషయంపై పూర్తి వివరాలు సేకరించారు. సెర్ప్, ఈజీఎస్ ఉద్యోగులు ఉన్నట్లుగా సీసీ కెమెరాల ద్వారా గుర్తించి వారి పేర్లతో కూడిన జాబితాను కలెక్టర్‌కు అందజేశారు. దీంతో 106 మంది ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి మంగళవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెండైన వారిలో 14 మంది ఏపీఎంలు, 18 మంది సీసీలు, నలుగురు వీవోఏలు, ఒక సీవో, ఒక సీబీ ఆడిటర్, నలుగురు ఏపీవోలు, ఏడుగురు ఈసీలు, 38 మంది టెక్నికల్ అసిస్టెంట్లు, 18 మంది ఈజీఎస్ సీవోలు, ఒక ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగులను సస్పెండ్ చేయడంతో ప్రభుత్వ ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది.

వాన వస్తుందోచ్..!!

- తెలంగాణకు వర్ష సూచన
- రాబోయే ఐదు రోజులు అక్కడక్కడ వర్షాలు

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండుటెండలతో అల్లాడిపోతున్న రాష్ట్ర ప్రజలకు ఓ చల్లటి వార్త. రాబోయే ఐదు రోజులు రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం మంగళవారం తెలిపింది. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మధ్య మహారాష్ట్ర వద్ద కేంద్రీకృతమైన ఆవర్తనం అంతర్గత కర్ణాటక మీదుగా దక్షిణ తమిళనాడు వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతుందని వెల్లడించింది. దీంతో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. మరోవైపు రెండు రోజులుగా తెలంగాణలో పగటి ఉష్ణోగ్రతలు తగ్గాయి. మంగళవారం అన్ని జిల్లాల్లో సగటు ఉష్ణోగ్రతలు 35 నుంచి 37 డిగ్రీల మధ్య నమోదు అయ్యాయి. హైదరాబాద్‌లో అయితే 34.9 డిగ్రీల సాధారణ ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యాయి. బుధ, గురువారాల్లో కూడా దాదాపు అన్ని జిల్లాల్లోనూ 35-39 డిగ్రీల మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని పేర్కొంది.

15న నారాయణపేటకు సీఎం

నారాయణపేట, ఏప్రిల్ 9: రెండు దశాబ్దాల సంవత్సరాల సాగునీటి కళను నెరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 15న నారాయణపేటలో జరిగే జనజాతర సభకు హాజరవుతారని కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి చెప్పారు. మంగళవారం రాత్రి స్థానిక సీవీఆర్ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి శివకుమార్‌రెడ్డిల కృషితో ముఖ్యమంత్రి జీవో 69కు అనుగుణంగా నిధులు మంజూరు చేశారని, దీంతో రాబోయే రోజుల్లో ఈ ప్రాంతానికి శాశ్వత సాగునీటి పరిష్కారం దొరుకుతుందన్నారు. గతంలో ఓట్లు దండుకున్న కొందరు ఉన్నత పదవులు చేపట్టి నారాయణపేటకు చేసింది శూన్యమన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శివకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

13న చేవెళ్లలో బీఆర్‌ఎస్ సభ

- హాజరుకానున్న పార్టీ అధినేత కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల లోక్‌సభ స్థానాన్ని మరోసారి గెలుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న బీఆర్‌ఎస్.. అక్కడ ఈనెల 13న భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించింది. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ పార్టీ నేతలతో మంగళవారం తెలంగాణ భవన్‌లో సమీక్ష నిర్వహించారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, పలువురు నేతలు పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారం, ఇతర అంశాలపై సమీక్షలో చర్చించారు. పార్టీ సిటింగ్ ఎంపీ రంజిత్ రెడ్డి ఇటీవలే బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపేందుకు భారీ బహిరంగసభ నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. సభలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ పాల్గొంటారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

వేసవి దృష్ట్యా ప్రత్యేక రైళ్లు: దక్షిణ మధ్య రైల్వే

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో ప్రయాణికుల డిమాండ్ మేరకు హైదరాబాద్, సికింద్రాబాద్‌స్టేషన్ల నుంచి ప్రత్యేక రైళ్లు ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్-కటక్ మధ్య (07165) ప్రత్యేక రైలు ఏప్రిల్ 16, 23, 30 తేదీల్లో, కటక్-హైదరాబాద్ మధ్య (07166) ప్రత్యేక రైలు ఏప్రిల్ 17, 24, మే1 తేదీల్లో నడుస్తుంది. అలాగే సికింద్రాబాద్-ఉదయ్‌పూర్ మధ్య (07123) ప్రత్యేక రైలు ఏప్రిల్ 16, 23 తేదీల్లో, ఉదయ్‌పూర్-సికింద్రాబాద్ మధ్య (07124) ప్రత్యేక రైలు ఏప్రిల్ 20, 27 తేదీల్లో నడుస్తుందని రైల్వే అధికారులు తెలిపారు.

గాంధీభవన్‌లో ఎన్‌ఎస్‌యూఐ ఆవిర్భావ వేడుక

గాంధీభవన్‌లో మంగళవారంనాడు ఎన్‌ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌యూఐ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నేతలు, ఎన్‌ఎస్‌యూఐ కార్యకర్తలు.. కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, జగ్గారెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

తిరుగులేని సీఎం రేవంత్!

సంవత్సరం దాకా ఆయనకు ఎదురు లేదు.. లోక్‌సభ ఎన్నికల్లోనూ రేవంత్‌కు సత్ఫలితాలు

- తెలుగు రాష్ట్రాల్లో గత ప్రభుత్వాల్లోని స్కాంలు బయటపడతాయి
- ఎన్నికలనాటికి రాహుల్‌కు మంచి రోజులు
- 2026 ఏప్రిల్-ఆగస్టు మధ్యలో ప్రధాని పదవిలో ఆకస్మిక మార్పులు..

గాంధీభవన్‌లో పంచాంగ శ్రవణం



గాంధీభవన్‌లో జరిగిన పంచాంగ పఠనంలో పాల్గొన్న మంత్రి జూపల్లి, జగ్గారెడ్డి, మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాజకీయ ఉన్నతి పరంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తిరుగులేని యోగం ఉందని, తదుపరి విశ్వావసు నామ ఉగాది వరకు ఆయన్ను ఎవరూ ఏమీ చేయలేరని వేదపండితుడు శ్రీనివాస్‌మూర్తి ఉద్ఘాటించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి తాను ఏది చేస్తే అది కరెక్టు అని భావించి.. శ్రమించి పని చేసినందువల్లే కాంగ్రెస్ పార్టీ సర్కారును ఏర్పాటు చేసిందని.. రానున్న లోక్‌సభ ఎన్నికల్లోనూ ఆయనకు పూర్తిగా సహకరిస్తేనే సత్ఫలితాలు ఉంటాయని చెప్పారు. క్రోధి నామ సంవత్సరంలో కోపాలు, ఆవేశాలకు గురవ్వకుండా రేవంత్ నాయకత్వంలో సమష్టిగా పని చేయాలంటూ పార్టీ నేతలకు సూచించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీకి లోక్‌సభ ఎన్నికల నాటికి యోగం కలుగుతుందని, కాంగ్రెస్ పార్టీ కొన్ని చోట్ల అనూహ్యమైన విజయాలు సాధిస్తుందని చెప్పారు. గాంధీభవన్‌లో మంగళవారం జరిగిన ఉగాది వేడుకలో ఆయన పంచాంగ పఠనం చేశారు. అనంతరం మాట్లాడారు. ఈ సంవత్సరం దేశ రాజకీయాల్లో పెను మార్పులు సంభవిస్తాయని, చాలా మంది రాజకీయ నాయకులు కనుమరుగవుతారని పేర్కొన్నారు. నేతల ఆకస్మిక మరణాల వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో మార్పులు అనివార్యమవుతాయని చెప్పారు. ఈ ఏడాది నేర ప్రవృత్తి పెరుగుతుందని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో గత ప్రభుత్వంలోని స్కాములు, భూ కబ్జాలు బయటపడతాయని, కొందరు రాజకీయ నేతలు శిక్షలు అనుభవిస్తారని పేర్కొన్నారు. బ్యాంకింగ్, కమ్యూనికేషన్, పబ్లిక్ సెక్టార్, డీమ్డ్ వర్సిటీ వ్యవస్థల్లో అవకతవకలు బయట పడతాయని చెప్పారు. దేశంలో ప్రముఖ దేవాలయాలు పరిరక్షింపబడతాయని, కాశీ, కేదార్నాథ్, ద్వారక లాంటి పుణ్యక్షేత్రాల అభివృద్ధి జరుగుతుందని, నూతన దేవాలయ స్థాపన జరుగుతుందని చెప్పారు. సుప్రీంకోర్టు న్యాయ వ్యవస్థలలో కొన్ని అనుకోని మార్పులు జరుగుతాయన్నారు. దేశాధిపతి దేశాన్ని అభివృద్ధి పథం వైపునకు నడుపుతాడని, 2029 ఉగాది నాటికి భారత భవితవ్యం చాలా గొప్పగా ఉంటుందని అన్నారు. అయితే ఏప్రిల్ 2026 నుంచి ఆగస్టు 2026 మధ్యలో ప్రధాని పదవిలో ఆకస్మిక మార్పులు జరిగే అవకాశాలున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి, మహేశ్ కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, పార్టీ సీనియర్ నేతలు చిన్నారెడ్డి, హర్కార వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఏడాదిలో అందరికీ మేలు జరుగాలి: జూపల్లి

తెలుగు నూతన సంవత్సరంలో అందరికీ మేలు జరగాలని, అంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. జీవితంలో ఎదురయ్యే ఒడిదొడుకులను అధిగమించాలని షడ్రుచుల సమ్మేళనం అయిన ఉగాది పచ్చడి సూచిస్తుందని పేర్కొన్నారు. రవీంద్రభారతిలో భాషా-సాంస్కృతిక శాఖ, దేవాదాయ శాఖలు నిర్వహించిన ఉగాది వేడుకల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొని రాష్ట్ర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి తెలుగు సంవత్సర పంచాంగ పఠనం చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డికి టీటీడీ అర్చకుల వేద ఆశీర్వచనం



సీఎం రేవంత్‌తో టీటీడీ, కొడంగల్ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ అర్చకులు

కొడంగల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకులు సోమవారం వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని ఆయన నివాసంలో కలిశారు. టీటీడీ అర్చకులతో పాటు కొడంగల్ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ అర్చకులు సీఎంను కలిసి తెలుగు నూతన సంవత్సరం ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అర్చకులు బాలాజీ స్వామి మాట్లాడుతూ సీఎంకు వేద ఆశీర్వచనం, శ్రీ వెంకటేశ్వరస్వామి ఫొటో, ప్రసాదాలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.



పాడిపంటలతో రాష్ట్రం కళకళలాడాలి!

- అభివృద్ధిలో మరింత దూకుడుగా వెళ్లాలి
- మే 13న ఓటు హక్కును వినియోగించుకోవాలి
- ఉగాది వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్
- పూర్తిగా తెలుగులో ప్రసంగించిన గవర్నర్

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఈ క్రోధి నామ సంవత్సరంలో రాష్ట్రంలో, దేశంలో మంచి వర్షాలు పడాలని, తెలంగాణ రాష్ట్రమంతా పాడిపంటలతో కళకళలాడాలని రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఆకాంక్షించారు. రాష్ట్రంలో ఉన్న వర్షాభావ పరిస్థితులు తొలగిపోవాలని, ఈ కొత్త సంవత్సరం మరింత మెరుగ్గా, సానుకూలంగా ఉండాలని అన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా రాజ్‌భవన్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం పూర్తిగా తెలుగులో ప్రసంగించారు. వచ్చే నెల 13 తేదీన పార్లమెంటు ఎన్నికల పోలింగ్ ఉందని, ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ పోలింగ్ బూత్‌కు వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కొత్త సంవత్సరంలో పంచాంగాలు, జ్యోతిష్యాలు ఏమి చెప్పినా కూడా ధృఢ సంకల్పంతో, గట్టి ప్రయత్నంతో పనిచేసి విజయాలు సాధించాలని ప్రజలకు సూచించారు. ఇది తన తొలి తెలుగు ప్రసంగం అని, తప్పులు దొర్లితే క్షమించాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ సిద్ధాంతి దత్తాత్రేయ శర్మ పంచాంగ పఠనం చేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవి గుప్తా, రాజ్ భవన్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, పలువురు న్యాయమూర్తులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, వివిధరంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

నోటిమాటతో ఇబ్బందులు!

మృదువుగా.. ఆచితూచి మాట్లాడాలి .. దెబ్బతీసే ఆలోచనలో సన్నిహితులు.. కొంత నష్టం.. జాగ్రత్తగా ఉండాలి

- కేటీఆర్‌ను ఉద్దేశిస్తూ పంచాగకర్త పఠనం
- సమస్యలు తొలగిపోయేందుకు జ్యోతిర్లింగ దర్శనం చేయాలని సూచన



బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన పంచాంగ పఠనంలో పాల్గొన్న కేటీఆర్, మాజీ స్పీకర్ పోచారం తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి సత్ఫలితాలు ఉంటాయని పంచాగకర్త ఆర్షుల ప్రణీత్ చెప్పారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి సత్ఫలితాలు వస్తాయని చెప్పారు. క్రోధి నామ ఉగాది సందర్భంగా మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో పంచాంగ పఠనం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, పలువురు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్‌ను ఉద్దేశిస్తూ పంచాగకర్త ప్రణీత్ మాట్లాడారు. కేటీఆర్‌ది మకర రాశి అని, అంతా బాగుందని, నోటిమాటతో కొన్ని ఇబ్బందులు వస్తాయని.. మృదువుగా, ఆచితూచి మాట్లాడాలని, మాట కట్టడి చేయాలని సూచించారు. ఈ ఏడాది స్థిరాస్తి వ్యాపార రంగంలో అభివృద్ధి చెందుతారని చెప్పారు. పార్టీలోని దొంగల వల్ల కొంత నష్టం జరిగే అవకాశం ఉందని.. కొందరు నేతలు దగ్గరగా ఉంటూ దెబ్బ తీయాలన్న ఆలోచనతో ఉన్నారని.. వారిపై శ్రద్ధపెట్టి జాగ్రత్తగా ఉంటే ఈ ఏడాది మరింత బాగుంటుందని చెప్పారు. రాజకీయాల్లో తిరుగు ఉండదని.. పార్టీలో, ప్రజల్లో అభిమానం పొందుతారని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల ద్వారా మరింత పట్టు సాధించే అవకాశముందని చెప్పారు. ప్రయాణ సమయంలో ప్రమాదాలకు అవకాశం ఉన్నందున దైవస్మరణ చేస్తూ ఉండాలని సూచించారు.. సమస్యలు తొలగిపోయేందుకు జ్యోతిర్లింగ దర్శనం చేయాలని కేటీఆర్‌కు పంచాగకర్త సూచించారు. కేసీఆర్‌ది కర్కాటక రాశి అని.. ఈ రాశి వారికి ఆదాయం 14, వ్యయం 2గా ఉందని.. రాజపూజ్యం 6, అవమానం 6గా ఉందని తెలిపారు. గురుడు మంచి స్థానంలో ఉన్నాడని.. ఈ సంవత్సరమంతా ఆయనకు బాగుంటుందని, చేసే వ్యవహారాల్లో మంచి విజయం చేకూరే అవకాశాలున్నాయని వివరించారు. క్రోధి నామ సంవత్సరంలో కుజుడు అధిపతిగా ఉండటం వల్ల వాహన, అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయని, ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయన్నారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, నదులన్నీ బాగా ప్రవహిస్తాయని, పాడి పంటలు మంచిగా పండుతాయన్నారు. రాష్ట్రంలో రాజకీయ నాయకులకు రాబోయే ఎన్నికల్లో పాలకపక్షంగా ఉన్న వారికి కొంత కష్టసాధ్యంగా ఉంటుందని తెలిపారు. ప్రతిపక్షంగా ఉన్నవారు ప్రయత్నిస్తే దిగ్విజయ ఫలితాలు ఉండే అవకాశం కనిపిస్తుందని చెప్పారు. కాగా మాజీ సీఎం కేసీఆర్, ఉగాది వేడుకలను సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లి వ్యవసాయక్షేత్రంలో జరుపుకొన్నారు. హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రానికి చేరుకొని కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలు, ప్రజలు రావడంతో వ్యవసాయ క్షేత్రం కిక్కిరిసిపోయింది.

మత కల్లోలాలు లేకుండా శాంతియుతంగా ఉండాలి.. : కేటీఆర్

పంచాగ శ్రవణం అనంతరం కేటీఆర్ మాట్లాడారు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలకు క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంవత్సరం అందరికీ మంచి జరగాలని కాంక్షిస్తున్నట్టు తెలిపారు. మత కల్లోలాలు జరగకుండా ప్రజలంతో శాంతియుతంగా ఉండాలన్నారు.

'రాజు' జాగ్రత్త పడలేదా?

బీఆర్‌ఎస్‌కు ప్రమాద ఘంటికలపై ఏడాది క్రితమే పంచాగకర్త చెప్పిన వైనం
కేసీఆర్‌కు శుభాశుభ ఫలితాలని స్పష్టం
2023 డిసెంబరులో రాజకీయంగా ఆశ్చర్యకర పరిణామాలుంటాయని వెల్లడి
సొంతవర్గ నేతల నుంచే వ్యతిరేకత అని జోస్యం

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): 'సొంత వర్గం నేతల నుంచే కొన్ని వ్యతిరేకతలు ఏర్పడే అవకాశాలు లేకపోలేదు. ఈ విషయంలో రాజు జాగ్రత్తగా ఉండాలి'... ఇదీ సరిగ్గా ఏడాది క్రితం బీఆర్‌ఎస్ ప్రభుత్వం రవీంద్రభారతిలో నిర్వహించిన శోభకృత్ ఉగాది వేడుకల సందర్భంగా పంచాగకర్త, వేదపండితుడు సంతోష్ కుమార్ శాస్త్రి అప్పటి సీఎం కేసీఆర్‌ను ఉద్దేశిస్తూ చేసిన సూచన ఇది! కేసీఆర్‌కు ఆ ఏడాదంతా శుభాశుభాలు మిశ్రమంగా ఉంటాయని, రాష్ట్ర రాజకీయాల్లో ఆశ్చర్యకరమైన ఘటనలూ చోటు చేసుకుంటాయని అప్పట్లో పంచాంగకర్త చెప్పారు. అప్పటికి.. రెండోసారి అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తయి ఎన్నికల హడావుడి మొదలవుతున్న వేళ కేసీఆర్‌ను ఉద్దేశించి పంచాంగ కర్త చేసిన వ్యాఖ్యలను ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. పంచాంగకర్త చెప్పింది చెప్పినట్లే జరిగిందా? అని చర్చించుకుంటున్నారు. 2023 నవంబరు- డిసెంబరులో రాజకీయాల్లో ఆశ్చకరమైన ఘటనలు చోటుచేసుకుంటాయని అప్పట్లో పంచాంగ పఠనం సందర్భంగా సంతోష్ కుమార్ శాస్త్రి చెప్పారు. ఈ క్రమంలో.. నిరుడు నవంబరులో ఎన్నికలు జరగడం.. డిసెంబరులో వెలువడ్డ ఫలితాల్లో అధికార బీఆర్‌ఎస్ ఓటమిపాలవ్వడాన్ని గుర్తుచేసుకుంటున్నారు. సొంత వర్గం నుంచే కొన్ని వ్యతిరేకతలు ఏర్పడే అవకాశం ఉందంటూ పంచాగకర్త చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కొన్నాళ్లుగా బీఆర్‌ఎస్ నుంచి ఇతర పార్టీల్లోకి జరుగుతున్న నేతల వలసలను గుర్తుచేసుకుంటున్నారు!



గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను సన్మానిస్తున్న వెంకయ్యనాయుడు

త్వరలోనే సూపర్ పవర్‌గా భారత్

- 1991లో ప్యారిస్, లండన్‌లతో పోల్చితే మన ఆర్థిక వ్యవస్థ చిన్నది.. పరిస్థితి మారింది
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పదో స్థానంలో భారత్
- 2027 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా దేశం
- మంచి పాలకుల వల్లే సాధ్యమైంది: వెంకయ్య
- స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఉగాది వేడుకలు
- హాజరైన గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాల్లో భారత్ త్వరలోనే సూపర్ పవర్ దేశంగా అవతరిస్తుందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఉద్ఘాటించారు. సూపర్‌పవర్ దేశాలు అనగానే అమెరికా, ఐరోపా సమాఖ్య, చైనాలు స్ఫురణకు వస్తాయని.., ఇవాళ భారత్ కూడా సూపర్‌పవర్‌గా అవతరించే దిశగా వేగంగా అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ శక్తిమంతంగా ఎదుగుతోందని, దేశం ప్రపంచాన్ని శాసించేశక్తిగా ఎదగాలంటే ప్రతి పౌరుడు దేశాభివృద్ధికి పాటు పడాలని సూచించారు. రాష్ట్రాలు అభివృద్ధిలో దూసుకెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని.. ఆర్థిక, పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో భారీగా వృద్ధి సాధించాలని సూచించారు. తెలుగు కొత్త సంవత్సరం వేళ కొత్త సంకల్పాలు తీసుకుందామని ఉద్బోధించారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో మంగళవారం జరిగిన శ్రీ క్రోధి నామ ఉగాది వేడుకలకు వెంకయ్య హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ రాధాకృష్ణన్‌కు ట్రస్ట్ అందిస్తున్న సేవలు, ఇతర విశేషాలను వివరించారు. అంతకు ముందు జ్యోతిని వెలిగించి ఉగాది వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడారు. 1991లో ప్యారిస్, లండన్ నగరాల ఆర్థిక వ్యవస్థల కన్నా మనదేశ ఆర్థిక వ్యవస్థ చాలా చిన్నదని.. ఇప్పుడు పరిస్థితి రివర్స్ అయిందని.. 2014లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పదో స్థానంలో ఉన్న భారత్.. ఇప్పుడు ఐదో స్థానానికి ఎగబాకిందని వివరించారు. మంచి పాలకుల వల్లే ఇది సాధ్యమైందన్నారు. 2027 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించడం తథ్యం అని అన్నారు. నాయకులు రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ సహాయం నేరుగా ప్రజల ఖాతాల్లోకే వెళ్లేలా ప్రధాని మోదీ నూతన వ్యవస్థను తీసుకొచ్చారని ప్రశంసించారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ మాట్లాడారు. తెలుగు వినసొంపైన భాష అని, తెలుగు భాష, సంగీతం రెండూ కలిసిపోయేలా ఉంటాయని గవర్నర్ అన్నారు. తెలుగులోని ఏ కీర్తన విన్నా మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. వెంకయ్యనాయుడి మానసిక స్థైర్యం గొప్పదని, ఆయన సాధించిన విజయాలే ఇందుకు తార్కాణాలని పేర్కొన్నారు. స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో యువతకు ఉచిత శిక్షణిచ్చి ఉపాధి కల్పిస్తున్నారని, ఇది గొప్ప విషయం అని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కొత్త ఏడాది అందరూ సుఖసంతోషాలతో ఉండాలని భగవంతుడిని కోరుకుంటున్నట్లు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. దేశం అభివృద్ధి బాటలో పయనిస్తోందంటే అది ప్రధానమంత్రి మోదీతోనేనని, ఆయన అవినీతి లేని పాలన అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో స్వర్ణ భారత్ హైదరాబాద్ చాప్టర్ ప్రెసిడెంట్ చిగురుపాటి కృష్ణప్రసాద్, గ్రాన్యూల్స్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చిగురుపాటి ఉమ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు అధికార యోగం ఉంది

- కూటమికి 128 అసెంబ్లీ సీట్లు... 24 ఎంపీ సీట్లు
- ఉగాది వేళ పంచాంగ కర్త మాచిరాజు జోస్యం

అమరావతి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికల్లో టీడీపీ కూటమికి 128 అసెంబ్లీ సీట్లు, 24 ఎంపీ సీట్లు దక్కుతాయని పంచాంగ కర్త, ప్రముఖ జ్యోతిషుడు మాచిరాజు వేణుగోపాల్ జోస్యం చెప్పారు. చంద్రబాబుకు అధికార యోగం ఉందని తెలిపారు. ఉగాది పండుగ సందర్భంగా మంగళవారం ఉదయం ఇక్కడి టీడీపీ కేంద్ర కార్యాలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. క్రోధి నామ సంవత్సరం తెలుగు జాతికి, అమరావతికి శుభ సంకేతాలు ఇస్తోందని, తెలుగువారు గర్వించే విధంగా అమరావతి రాజధాని పునర్నిర్మాణం మొదలవుతుందని చెప్పారు. శివానుగ్రహంతో కర్కాటక రాశివారికి ఈ ఏడాది దివ్యంగా ఉంటుందని, చంద్రబాబు కూడా ఈ రాశి ప్రభావంలో ఉంటారని తెలిపారు. ఎంతటి కష్టసాధ్యమైన పనైనా సాధించే శక్తి ఈ ఏడాది వారికి సమకూరుతుందని, అనుకొన్న ఫలితాన్ని రాబడతారని పేర్కొన్నారు. రాష్ట్రం కోసం అమరావతి నిర్మాణం చేపట్టినట్లే సామాన్యులకు సొంత ఇంటి కల నెరవేరుస్తారని, ఆడపడుచులకు దివ్యమైన భవిష్యత్తును నిర్మిస్తారని వివరించారు. టీడీపీ వృశ్చిక రాశికి చెందుతుందని, ఆ రాశి వారికి కూడా ఉత్తమ ఫలితాలు లభిస్తాయని చెప్పారు. పంచాంగ శ్రవణం అనంతరం చంద్రబాబు ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. పెద్దసంఖ్యలో పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. పలువురు మహిళలు పిల్లలతో కలసి రావడంతో టీడీపీ కార్యాలయంలో పండుగ కళ కనిపించింది.

కేంద్రంలో మళ్లీ మోదీ ప్రభుత్వమే!

- పంచాంగకర్త సూర్యనారాయణమూర్తి
- బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పంచాంగ శ్రవణం



హైదరాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మరోసారి నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పాటవుతుందని ప్రముఖ పంచాంగకర్త సూర్యనారాయణమూర్తి అన్నారు. అలాగే, వచ్చే ఎన్నికల తర్వాత దేశంలో సుస్థిర ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని వెల్లడించారు. ఉగాది సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సూర్యానారాయణ మూర్తి పంచాంగ శ్రవణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం మూడో సారి అధికారం చేపట్టబోతుందని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వానికి గురువు అనుగ్రహం ఉందన్నారు. తాను పార్టీపరంగా ఈ విషయం చెప్పడం లేదని వివరించారు. అలాగే, ఈ ఏడాది ప్రకృతి వైద్యం, దేశీయ ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందని చెప్పారు. దానికి అనుగుణంగా దేశ వృద్ధి రేటు కూడా పెరుగుతుందని తెలిపారు. భా అంటే కాంతి అని అందుకే భారతదేశం కాంతివంతమైన దేశంగా పిలవబడుతుందని చెప్పారు. ఈ ఏడాది పంటలకు తగిన వర్షాలు కురుస్తాయని, తెల్లటి పంటలు బాగా పండుతాయని చెప్పారు. ఆహార ధాన్యాల ధరలు నిలకడగా ఉండటంతో పాటు తగ్గుముఖం పట్టే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

SCHOLARSHIP ALERT

Ujjivan Small Finance Bank Transgender Scholarship

Description: Ujjivan Small Finance Bank Limited invites applications from transgender students who are currently studying in Classes 9 to 12 or pursuing UG/PG courses from any government/private open schools or open universities.
Eligibility: Open to transgender students who are currently studying in Classes 9 to 12 or pursuing UG/PG courses from any government/private open schools or open universities. Students must have scored at least 50% marks in the previous academic year. Annual family income of the applicants must not exceed INR 10,00,000.
Prizes & Rewards: Scholarship up to INR 40,000
Last Date to Apply: 30-04-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/USFB1

University of Kent India Women in Leadership Scholarship 2024

Description: University of Kent India Women in Leadership Scholarship 2024 is an opportunity offered by the Uni versity of Kent to female applicants who have received a conditional offer to pursue a postgraduate course at the university.
Eligibility: Open for female students from and domiciled in India. Applicants must have received a conditional or unconditional offer for a full-time taught master's degree programme by the deadline.
Prizes & Rewards: 50% of the tuition fees for one year of study
Last Date to Apply: 24-05-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/LPUK1

Sitaram Jindal Foundation Scholarship Scheme 2024



Description: Sitaram Jindal Foundation Scholarship Scheme 2024 is an initiative by the Sitaram Jindal Foundation (NGO), for students from Class 11 to the postgraduate level. It aims to provide financial assistance to underprivileged students pursuing various degree/diploma courses.
Eligibility: Open to students currently enrolled in Class 11, 12, ITI, diploma, undergraduate, or postgraduate degree programs. Applicants must have met the minimum percentage requirement in their previous qualifying exam.
Prizes & Rewards: Up to 3,200 per month
Last Date to Apply: Round The Year
Application mode: ***By post to:*** The Trustee, Sitaram Jindal Foundation, Jindal Nagar, Tumkur Road, Bengaluru - 560073
Short Url: www.b4s.in/aj/SJS2

buddy4study.com

నిట్ దుర్గాపూర్‌లో ఎంబీఏ, ఎంఎస్‌డబ్ల్యూ



దుర్గాపూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)- మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ (ఎంఎస్‌డబ్ల్యు), మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ) ప్రోగ్రాములలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రతి కోర్సులో సంస్థ నిర్దేశించిన నిబంధనల ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.

ఎంఎస్‌డబ్ల్యూ: ఇది రెండేళ్ల ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. మొత్తం 15 సీట్లు ఉన్నాయి. అకడమిక్ ప్రతిభ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు.
అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే.
రాత పరీక్ష: ఇందులో సోషల్ సైన్స్, ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, కరెంట్ అఫైర్స్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. దీనికి 50 మార్కులు కేటాయించారు. గ్రూప్ డిస్కషన్‌కి 30, పర్సనల్ ఇంటర్వ్యూకి 20 మార్కులు ఉంటాయి.

ఎంబీఏ: కోర్సు వ్యవధి రెండేళ్లు. మొత్తం 44 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 17, ఓబీసీలకు 11, ఎస్టీలకు 3, ఎస్సీలకు 6, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 4, దివ్యాంగులకు 3 సీట్లు ప్రత్యేకించారు. అకడమిక్ ప్రతిభ, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 55 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం చాలు. చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్ 2023/సీమ్యాట్ 2024/ఎక్సాట్ 2024/మ్యాట్ 2023 డిసెంబరు/మ్యాట్ 2024 అర్హత పొంది ఉండాలి.
ఎంపిక: పదోతరగతి మార్కులకు 15 శాతం, ఇంటర్/పన్నెండో తరగతి మార్కులకు 15 శాతం, రైటింగ్ ఎబిలిటీ అసెస్‌మెంట్‌కు 20 శాతం, గ్రూప్ డిస్కషన్‌కు 10 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకి 35 శాతం, అనుభవానికి 5 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 7
- **రాత పరీక్షకు ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** జూన్ 11
- **రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు:** జూన్ 17, 18
- **అడ్మిషన్స్:** జూలై 3
- **ప్రోగ్రామ్‌నకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూన్ 27
- **తరగతులు ప్రారంభం:** జూలై 15 నుంచి
- **వెబ్‌సైట్:** nitdgp.ac.in

ఐఐఎస్సీలో ఎంఈ, ఎంటెక్

రిమైండర్

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ)- మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్(ఎం ఇంజనీరింగ్), జాయింట్ ఎంటెక్ విత్ తైవానీస్ యూనివర్సిటీస్, ఎంటెక్ (సీఎఫ్‌టీఐ మోడ్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన ప్రకారం గేట్ వ్యాలిడ్ స్కోర్/అకడమిక్ మెరిట్, రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఆగస్టు నుంచి అకడమిక్ సెషన్స్ ప్రారంభమౌతాయి.

ఎంటెక్ సీఎఫ్‌టీఐ మోడ్

స్పెషలైజేషన్‌లు: కంప్యూటేషనల్ అండ్ డేటా సైన్సెస్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ ప్రొడక్ట్ డిజైన్, ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, రోబోటిక్స్ అండ్ అటానమస్ సిస్టమ్స్, సెమీకండక్టర్ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్
అర్హత: సీఎఫ్‌టీఐ సంస్థల నుంచి కనీసం 8 సీజీపీఏతో నాలుగేళ్ల డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. గేట్ స్కోర్ అవసరం లేదు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ స్పెషలైజేషన్‌కు రిటెన్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. మిగిలిన అన్ని స్పెషలైజేషన్‌లకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.

మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్

- ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. స్పెషలైజేషన్ సెమీకండక్టర్ టెక్నాలజీ. ఈ ప్రోగ్రామ్‌ని సంస్థకు చెందిన సెంటర్ ఫర్ నానోసైన్స్ అండ్ ఇంజనీరింగ్ నూతనంగా ప్రారంభించింది.

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు గేట్(ఈసీ/ఈఈ/ఐఎన్/ఎంఈ/ఎంటీ/ఎక్స్‌ఈ-సీ) వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు; ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్)/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు గేట్(ఈసీ/ఐఎన్/పీహెచ్) వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. సీఎఫ్‌టీఐ సంస్థల నుంచి కనీసం 8 సీజీపీఏతో నాలుగేళ్ల డిగ్రీ పూర్తిచేసినవారు కూడా అర్హులే. వీరికి గేట్ స్కోర్ అవసరం లేదు.

జాయింట్ ఎంటెక్ విత్ తైవానీస్ యూనివర్సిటీస్

- ఈ నూతన ప్రోగ్రామ్‌ని ప్రస్తుత అకడమిక్ ఇయర్ నుంచి సెంటర్ ఫర్ నానోసైన్స్ అండ్ ఇంజనీరింగ్, తైవానీస్ యూనివర్సిటీస్ ఉమ్మడిగా నిర్వహిస్తున్నాయి. ఈ ప్రోగ్రామ్‌లో ప్రధానంగా ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి.

పార్టిసిపేటింగ్ తైవానీస్ యూనివర్సిటీలు: నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ తైవాన్, నేషనల్ చియో తుంగ్ యాంగ్ మింగ్ యూనివర్సిటీ, నేషనల్ సింగ్ హువా యూనివర్సిటీ, నేషనల్ సన్ యాట్ సెన్ యూనివర్సిటీ
అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు; ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్) పూర్తి చేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. సీఎఫ్‌టీఐ సంస్థల నుంచి 8 సీజీపీఏతో డిగ్రీ ఉత్తీర్ణులు కూడా అర్హులే.
ఎంపిక: గేట్ వ్యాలిడ్ స్కోర్/అకడమిక్ మెరిట్‌కు 70 శాతం, రిటెన్ టెస్ట్ స్కోర్/ఇంటర్వ్యూ స్కోర్‌కు 30 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 29
- **రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూలు:** జూన్ 10 నుంచి 13 వరకు
- **వెబ్‌సైట్:** www.iisc.ac.in

ఇంటర్‌తో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం

ఎస్ఎస్‌సీ సీహెచ్ఎస్ఎల్ ఎగ్జామ్

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సి) నుంచి భారీ నోటిఫికేషన్ వెలువడింది. కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ పరీక్ష తరవాత అత్యంత ఆదరణ కలిగిన కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్ ఎగ్జామినేషన్ (సిహెచ్ఎస్ఎల్)-2024 కోసం ఎస్ఎస్‌సి ప్రకటనను విడుదల చేసింది. ఈ సారి సిహెచ్ఎస్ఎల్ ద్వారా 3,712 పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటికి సంబంధించిన వివరాలను చూద్దాం..

పరీక్ష పేరు: కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్ ఎగ్జామినేషన్-2024

భర్తీ చేసే పోస్టులు

1. లోయర్ డివిజన్ క్లర్క్(ఎల్‌డీసీ), జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్
2. డేటా ఎంట్రీ ఆపరేటర్(డీఈవో)
3. డేటా ఎంట్రీ ఆపరేటర్(గ్రేడ్-ఎ)


అర్హత: ఇంటర్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 2024 ఆగస్టు 1 నాటికి ఇంటర్ ఉత్తీర్ణులయ్యే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కన్జూమర్ అఫైర్స్, ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ మినిస్ట్రీ, కల్చర్ మినిస్ట్రీలో డేటా ఎంట్రీ పోస్టులకు మాత్రం ఇంటర్‌లో సైన్స్ గ్రూప్‌తో మేథ్స్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి.
వయసు: 2024 ఆగస్టు 1 నాటికి 18-27 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు; దివ్యాంగులకు 10-15 ఏళ్లు గరిష్ఠ వయసులో సడలింపులు వర్తిస్తాయి.

జీతభత్యాలు

- ఎల్‌డీసీ, జేఎస్ఏ పోస్టులకు రూ.19,900 - రూ.63,200
- డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు రూ.25,500 - రూ.81,100
- డేటా ఎంట్రీ ఆపరేటర్ గ్రేడ్-ఎకు రూ.29,200 - రూ.92,300

ఎంపిక విధానం: అభ్యర్థులను మూడు దశల్లో పరీక్షలు నిర్వహించి ఎంపిక చేస్తారు. ఈ మూడు దశలను టైర్-1, టైర్-2, స్కిల్ టెస్ట్/టైపింగ్ టెస్ట్‌గా వ్యవహరిస్తారు.
టైర్-1 ఆబ్జెక్టివ్ టెస్ట్: టైర్-1 పరీక్షను ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. వ్యవధి 60 నిమిషాలు. ఈ పరీక్షకు కేటాయించిన మొత్తం మార్కులు 200. ప్రశ్నపత్రం ఇంగ్లీష్/హిందీ భాషల్లో ఉంటుంది. నెగిటివ్ మార్కులు కూడా ఉంటాయి. తప్పుగా గుర్తించిన ప్రతి సమాధానానికి 1/2 మార్కు కోత విధిస్తారు.

విభాగం	ప్రశ్నలు	మార్కులు
ఇంగ్లీష్ లాంగ్వేజ్ (బేసిక్ నాలెడ్జ్)	25	50
జనరల్ ఇంటెలిజెన్స్	25	50
క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (బేసిక్ అర్థమెటిక్ స్కిల్)	25	50
జనరల్ అవేర్‌నెస్	25	50



టైర్-1 సిలబస్: జనరల్ ఇంటెలిజెన్స్ విభాగంలో ప్రశ్నలన్నీ వెర్బల్, నాన్ వెర్బల్ తరహాలో ఉంటాయి. సిమాంటిక్ అనాలజీ, సింబాలిక్ ఆపరేషన్స్ సింబాలిక్ నంబర్ అనాలజీ, ట్రెండ్స్, ఫిగరల్ అనాలజీ, స్పేస్ ఓరియెంటేషన్, సిమాంటిక్ క్లాసిఫికేషన్, వెన్ డయాగ్రమ్స్, సింబాలిక్/ నంబర్ క్లాసిఫికేషన్, డ్రాయింగ్ ఇన్ఫెరెన్సెస్, ఫిగరల్ క్లాసిఫికేషన్, పంచ్‌డ్ హోల్/ ప్యాట్రన్ ఫోల్డింగ్, అన్ ఫోల్డింగ్, సిమాంటిక్ సిరీస్, ఫిగరల్ ప్యాట్రన్, ఫోల్డింగ్ & కంప్లీషన్, నంబర్ సిరీస్, ఎంబెడెడ్ ఫిగర్స్, ఫిగరల్ సిరీస్, క్రిటికల్ థింకింగ్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్ వర్డ్ బిల్డింగ్, సోషల్ ఇంటెలిజెన్స్, కోడింగ్ & డీ కోడింగ్, ఇతర న్యూమరికల్ ఆపరేషన్స్‌కు సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు.

- ఇంగ్లీష్ లాంగ్వేజ్ విభాగంలో స్పాట్ ద ఎర్రర్, ఫిల్ ఇన్ ద బ్లాంక్స్, సినానిమ్స్, హోమోనిమ్స్ ఆంటోనిమ్స్, స్పెల్లింగ్స్ డిటెక్టింగ్ మిస్ స్పెల్ట్ వర్డ్స్, ఇడియమ్స్& ఫ్రేజెస్, ఒన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్స్, సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్, యాక్టివ్ / పాసివ్ వాయిసెస్ ఆఫ్ వర్బ్స్, డైరెక్ట్ / ఇన్‌డైరెక్ట్ నెరేషన్, షఫిలింగ్ ఆఫ్ సెంటెన్స్ పార్ట్స్ / సెంటెన్సెస్ ఇన్ పాసేజ్, కాంప్రహెన్షన్ పాసేజ్ తదితర అంశాలు ఉంటాయి.
- క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ పార్టులో అర్థమెటిక్‌కు సంబంధించిన నెంబర్ సిస్టం, ఫండమెంటల్ అర్థమెటిక్ ఆపరేషన్స్, ఆల్జీబ్రా, జామెట్రీ, మెన్సురేషన్, ట్రిగొనామెట్రీ, స్టాటిస్టికల్ ఛార్ట్స్ వంటి అధ్యాయాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- జనరల్ అవేర్‌నెస్ విభాగంలో అభ్యర్థికి ఉన్న సామాజిక అవగాహనను తెలుసుకొనే ప్రయత్నం చేస్తారు. కరెంట్ అఫైర్స్ మీద ఎక్కువ ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. భారతదేశం సహా పొరుగు దేశాలకు సంబంధించిన చరిత్ర, సంస్కృతి, జాగ్రఫీ, ఎకనామిక్స్, జనరల్ పాలసీ, సైంటిఫిక్ రీసెర్చ్ తదితర అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.

టైర్-2 : టైర్-1లో నిర్దేశించిన అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే ఈ దశకు హాజర్సు కావాల్సి ఉంటుంది. ఈ పరీక్షలో మూడు సెక్షన్లు ఉంటాయి. ప్రతి సెక్షన్‌లో రెండు మాడ్యూల్స్ ఉంటాయి. సెక్షన్-1లో మేథమెటికల్ ఎబిలిటీస్(మాడ్యూల్- 1), రీజనింగ్ అండ్ జనరల్ ఇంటెలిజెన్స్(మాడ్యూల్-2); సెక్షన్-2లో ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్(మాడ్యూల్-1), జనరల్ అవేర్‌నెస్(మాడ్యూల్-2); సెక్షన్-3లో కంప్యూటర్ నాలెడ్జ్ టెస్ట్(మాడ్యూల్-1), స్కిల్ టెస్ట్/టైపింగ్ టెస్ట్(మాడ్యూల్-2) ఉంటాయి. సెక్షన్-3లోని మాడ్యూల్-2 మినహా మిగతా ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ టైప్, మల్టిపుల్ చాయిల్ ప్రశ్నలే ఉంటాయి. ఈ పరీక్షకు మొత్తం 405 మార్కులు(సెక్షన్-1కి 180, సెక్షన్-2కి 180, సెక్షన్-3కి 45) కేటాయించారు. సెక్షన్-1, సెక్షన్-2, సెక్షన్-3లోని మాడ్యూల్-1 ప్రశ్నలకు నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంటుంది. తప్పుగా గుర్తించిన ప్రతి సమాధానానికి ఒక మార్కు కట్ చేస్తారు. టైర్-2 పరీక్షలో అన్ని సెక్షన్లలో తప్పనిసరిగా నిర్దేశిత అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది.
స్కిల్ టెస్ట్/టైపింగ్ టెస్ట్: టైర్-2లో నిర్దేశించిన అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే ఈ దశకు హాజర్సు కావాల్సి ఉంటుంది. ఇది అర్హత పరీక్ష మాత్రమే (మెరిట్ లిస్ట్ ప్రిపరేషన్‌లో దీన్ని పరిగణనలోకి తీసుకోరు).ఇందులో పోస్టును అనుసరించి స్కిల్ టెస్ట్, టైపింగ్ టెస్ట్ నిర్వహిస్తారు.

- డేటా ఎంట్రీ స్పీడ్ టెస్ట్‌లో 60 నిమిషాల్లో 8 వేల పదాల(కీ డిప్రెషన్స్)ను కంప్యూటర్‌లో ఎంటర్ చేసే వేగం ఉండాలి. అయితే ఇంగ్లీష్‌లో ఇచ్చిన ప్యాసేజ్‌ను తప్పులు లేకుండా 15 నిమిషాల్లో 2000-2200 పదాలను టైప్ చేసే సామర్థ్యం ఆధారంగా ఈ విభాగంలో అర్హతను నిర్ణయిస్తారు.
- డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు నిర్వహించే స్పీడ్ టెస్ట్‌లో గంటకు 15 వేల పదాల (కీ డిప్రెషన్స్)ను కంప్యూటర్‌లో ఎంటర్ చేసే వేగం ఉండాలి. అయితే ఇంగ్లీష్‌లో ఇచ్చిన ప్యాసేజ్‌ను తప్పులు లేకుండా 15 నిమిషాల్లో 3700 - 4000 పదాలను టైప్ చేసే సామర్థ్యం ఆధారంగా ఈ విభాగంలో అర్హతను నిర్ణయిస్తారు.
- టైర్ 1, టైర్ 2 టెస్ట్‌లు క్వాలిఫై అయిన ఎల్‌డిసి/జెఎస్ఏ అభ్యర్థులకు టైపింగ్ టెస్ట్ ఉంటుంది. అభ్యర్థులు ఈ పరీక్షకు ఏ మాధ్యమంలో (ఇంగ్లీష్/హిందీ) హాజరవుతారనే విషయాన్ని దరఖాస్తులోనే పేర్కొనాల్సి ఉంటుంది. టైపింగ్ టెస్ట్‌ను కూడా కంప్యూటర్ మీదనే నిర్వహిస్తారు. అభ్యర్థులకు వారు ఎంచుకున్న మాధ్యమాన్ని అనుసరించి నిమిషానికి 35 ఇంగ్లీష్ పదాలు లేదా 30 హిందీ పదాల టైపింగ్ వేగం ఉండాలి. అంటే గంటకు 10500 ఇంగ్లీష్ కీ డిప్రెషన్స్ లేదా 9000 హిందీ డిప్రెషన్స్. ఈ వేగాన్ని 10 నిమిషాల ఆధారంగా లెక్కించి అర్హతను నిర్ణయిస్తారు.

దరఖాస్తు ఫీజు: రూ.100. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు ఫీజు చెల్లించనవసరం లేదు.
తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, రాజమహేంద్రవరం, వరంగల్, కాకినాడ, కరీంనగర్, కర్నూలు, నెల్లూరు, విజయనగరం, చీరాల.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 7
- **ఆన్‌లైన్ దరఖాస్తు ఫీజు చెల్లింపునకు చివరి తేదీ:** మే 8
- **దరఖాస్తు సవరణ తేదీలు:** మే 10 నుంచి 11 వరకు
- **టైర్-1(కంప్యూటర్ ఆధారిత పరీక్ష) నిర్వహణ తేదీలు:** జూన్- జూలైలో నిర్వహిస్తారు
- **టైర్-2(కంప్యూటర్ ఆధారిత పరీక్ష) నిర్వహణ తేదీలు:** వివరాలు తరవాత ప్రకటిస్తారు.
- **వెబ్‌సైట్:** https://ssc.gov.in/

లిటిల్స్



మీకు తెలుసా?

- ఎలుకల ఉండి జుట్టు ఎక్కువగా ఉండే ఈ జంతువును 'హెడ్జ్‌హాగ్' అంటారు.
- ఆసియా, ఆఫ్రికా, యూరప్‌లలో పదిహేడు రకాల హెడ్జ్‌హాగ్స్ ఉంటాయి. రైల్వే ట్రాకుల దగ్గర, పార్కుల్లో, గృహాల దగ్గర ఈ జీవులు ఉంటాయి.
- ఎండుటాకులను తీసుకుని గూడు కట్టుకుంటాయి. వీటికి వేడి అంటే ఇష్టం ఉండదు. దీంతో సూర్యాస్తమం నుంచే ఇవి చురుగ్గా బయటకు వస్తాయి.
- ఇవి పండ్లు, చిన్న కప్పలు, పక్షులు గుడ్లు తింటాయి.
- వీటి కంటిచూపు చాలా తక్కువ. అయితే ముక్కు వాసనతోనే శత్రువులను పసిగట్టగలవు.




- వేగంగా కదలగలవు. చెట్లెక్కగలవు. సులువుగా నీటిలో ఈదుతాయి.
- ఇరవై ఐదు సెం.మీ పొడవు ఉండే ఈ జీవి 1.2 కేజీల బరువు ఉంటుంది.
- ఈ జీవులు రెండు లేదా మూడేళ్ల కంటే బతకవు.
- వీటి శరీరంమీద జుట్టు విచిత్రంగా ఉంటుంది. ఈ స్పైన్స్ కనీసం ఐదు వేల నుంచి ఏడు వేల వరకూ ఉంటాయి. ఇదో బాల్‌లా ముడుచుకుపోతుంది.
- ఒకేసారి నాలుగు నుంచి ఆరు పిల్లలను కంటాయివి.
- 125 మిలియన్ల కిందట ఈ హెడ్జ్‌హాగ్ ఆనవాళ్లు ఈ భూమ్మీద ఉన్నాయని పరిశోధకులు చెబుతున్నారు.
- వాటంతట అవే ఉండలా, బంతిలా చుట్టుకుని పోయి రక్షించుకోగలవు.
- ఈ జీవిని పాము కాటేసినా నష్టం ఉండదు. విషం వీటికి ఎక్కదు.

సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



10 తేడాలు గుర్తించండి



డైలీ సుడోకు - 277

		2		9	5		8	4
						3		7
								5
8		4	5					
2			7		9			3
					1	6		8
9								
7		5						
1	8		6	4		5		

సుడోకు - 276 సమాధానం

2	1	6	3	9	4	8	7	5
5	9	7	8	1	6	2	3	4
8	4	3	7	2	5	6	9	1
1	8	2	6	5	9	3	4	7
7	6	9	1	4	3	5	2	8
4	3	5	2	8	7	1	6	9
6	5	1	4	7	2	9	8	3
9	2	4	5	3	8	7	1	6
3	7	8	9	6	1	4	5	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.